ఈనాడు

విజయవాడ 24-2-2026 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 195
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 12
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

కల్తీ పాలు.. మరో ముగ్గురి మృతి

ఐదుకు చేరిన మృతుల సంఖ్య!

విషమంగానే మరికొందరి ఆరోగ్యం • పాలు పోసే వ్యక్తి అరెస్టు

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే, కంబాలచెరువు: రాజమహేంద్రవరంలో కల్తీ పాల బారినపడి ఆసుపత్రి పాలైన వారి మరణాలు రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టిస్తున్నాయి. ఆదివారం వరకు ఇద్దరు మృతి చెందగా చికిత్స పొందుతూ మరో ముగ్గురు - రాధాకృష్ణమూర్తి (74), ఎన్.శేష గిరిరావు (72), తాడి రమణి(58) సోమవారం కన్నుమూశారు. ఈ ఘటనను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. దర్యాప్తు వేగంగా చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించడంతో పోలీసులు అన్ని కోణాల్లోనూ విచారణ జరిపారు. బాధిత కుటుంబాలకు పాలు పోసిన వ్యక్తిని అరెస్టు చేశారు. ఆయన అనధికారికంగా నిర్వహిస్తున్న పాల కేంద్రంలో ఇథలీన్ గ్లైకాల్ అనే కూలెంట్ రసాయనం పాలలో కలవడం వల్లనే ఈ ఘోరం జరిగినట్లు దాదాపుగా నిర్ధారించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని సీఎం చంద్రబాబు అసెంబ్లీలో ప్రకటించారు. బాధితుల చికిత్స ఖర్చులను పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, వైద్య సిబ్బంది ప్రభావిత ప్రాంతాలకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తున్నారు. ప్రస్తుతం 12 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో 8 మంది పరిస్థితి విషమంగా ఉంది. 20వ తేదీన మృతిచెందిన ఇద్దరిలో భాగిశెట్టి కనకరత్నం (74) పేరు అధికారులు విడుదల చేసిన జాబితాలో లేదు. ఆమె కూడా పాలవ్యాపారి గణేష్ వద్దనే పాలు తీసుకున్నారని, ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చూపించగా ఆమెకు కిడ్నీలు దెబ్బతిన్నట్లు వైద్యులు తెలిపారని కుమారులు తెలిపారు. అయితే, రాజమహేంద్రవరం జీజీహెచ్ సూపరింటెండెంట్ పీవీవీ సత్యనారాయణ మాత్రం... ఆమె కడుపునొప్పితో చేరి, మృతిచెందినట్లు చెప్పారు.

64 కుటుంబాల నుంచి రక్తనమూనాల సేకరణ: సమస్య మూలాలు తెలుసుకునేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి (మిగతా 8లో)



చాడేశ్వరినగర్‌లో బాధితులతో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్, కలెక్టర్ కీర్తి చేకూరి, డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు తదితరులు



తితిదేలో తప్పు చేసిన వారిపై క్రిమినల్ చర్యలు

స్వర్ణ దేవాలయం తరహాలో చట్టం తెచ్చే యోచన

కల్తీ నెయ్యిపై శాసనసభలో నేడు 10.30 నుంచి 2 గంటల వరకు చర్చ

ఈనాడు, అమరావతి: తితిదేలో కల్తీ నెయ్యి సరఫరా వంటి అపచారాలు ఇకపై జరగకుండా, తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించేలా నిబంధనల్ని మరింత తీవ్రతరం చేయాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది. తప్పు చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు అవసరమైతే ప్రత్యేకచట్టం తేవాలన్న యోచనలో ఉంది. అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయానికి ప్రత్యేక చట్టం ఉందని, అదే తరహాలో తితిదేకి చట్టం తెచ్చేందుకు ఉన్న అవకాశాల్ని అధ్యయనం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. సోమవారం (మిగతా 8లో)

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం

శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన

ఈనాడు, అమరావతి: రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటనలో మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. చికిత్స పొందుతున్నవారి ఆరోగ్యం మెరుగుపడే వరకు ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కల్తీపాల ఘటనపై సీఎం చంద్రబాబు సోమవారం అసెంబ్లీలో ప్రకటన చేశారు. 'రాజమహేంద్రవరంలోని లాలాచెరువు పరిసర ప్రాంతాల్లో పలువురు అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చేరారు. వారి రక్తంలో యూరియా, సీరం క్రియాటినైన్ స్థాయిలు పెరిగినట్లు క్లినికల్ పరీక్షల్లో గుర్తించారు. కోరుకొండ మండలం నరసాపురంలోని వరలక్ష్మి మిల్క్ డెయిరీ ద్వారా 106 కుటుంబాలకు పాలు సరఫరా అయ్యాయి. ఘటనకు అవే కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. డెయిరీ నిర్వహించే వ్యక్తిని పోలీసులు (మిగతా 8లో)



కొంపముంచిన కూలెంట్ లీకేజీ



పోలీస్‌స్టేషన్‌లో పాల వ్యాపారి గణేష్‌ను విచారిస్తున్న వైద్యాధికారుల బృందం

- వరలక్ష్మి డెయిరీలో పాలల్లో ఇథలీన్ గ్లైకాల్ కలవడంతోనే ప్రమాదం
- అధికారుల దర్యాప్తులో నిర్ధారించినట్లు సమాచారం

ఈనాడు, రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరంలో ఒక్కసారిగా తీవ్రమైన కిడ్నీ సమస్యలు తలెత్తి ఐదుగురు మృత్యువాతపడటానికి పాల కల్తీనే కారణమని అధికారులు గుర్తించినట్టు విశ్వసనీయ సమాచారం. డెయిరీలోని శీతలీకరణ యంత్రంలో కూలెంట్‌గా వినియోగించిన ఇథలీన్ గ్లైకాల్ లీకై పాలల్లో కలవడం వల్లే వాటిని తాగినవారిలో తీవ్రమైన కిడ్నీ సమస్యలు తలెత్తినట్లు భావిస్తున్నారు. కోరుకొండ మండలం నరసాపురానికి చెందిన పాల వ్యాపారి గణేష్ అనధికారికంగా నిర్వహిస్తున్న వరలక్ష్మి డెయిరీలోని శీతలీకరణ కేంద్రంలో ఈ నెల 15న కూలెంట్ లీకై ఓ క్యాన్‌లోని పాలల్లో కలిసినట్లు గుర్తించారు. అతను రోజూ (మిగతా 8లో)

కొత్తగా బ్యాంకు ఖాతాలు తెరిచేలా అనుమతించొద్దు

- విచారణ ముగిసిన కేసులో, మళ్లీ అభ్యర్థన సరికాదు
- జగతి పబ్లికేషన్స్ పిటిషన్‌పై సీబీఐ వాదన
- తీర్పు వాయిదా వేసిన తెలంగాణ హైకోర్టు

ఏటీఎం కార్డులు మార్చి.. డబ్బు కాజేసి

- వృద్ధులు, మహిళలను మోసం చేస్తున్న యువకుడి అరెస్టు
- రెండు తెలుగు రాష్ట్రాల్లో నిందితుడిపై 20 కేసులు

14 క్రీడాంశాలు.. 156 మంది ప్రజాప్రతినిధులు

నేటి నుంచి విజయవాడ వేదికగా 'లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్-2026'

12లో

కృష్ణా డెల్టాలో స్వల్పకాలిక పంట రకాలా?

- నీటి కేటాయింపులు తగ్గించేందుకు తెలంగాణ ఎత్తుగడ ఇది
- కృష్ణా డెల్టాకు 152.20 టీఎంసీలు కావాల్సిందే
- బ్రిజేష్ ట్రైబ్యునల్ ఎదుట ఏపీ వాదనలు

2లో

తెరపైకి బడే చొక్కారావు పేరు!

- నేడు దేవ్‌జీ లొంగుబాటు
- మరో 40 మంది కూడా...

2లో

రఘురామకృష్ణరాజుపై హత్యాయత్నం కేసు..

అప్పటి సీఐడీ డీఐజీ సునీల్ నాయక్ అరెస్ట్

బిహార్ రాజధాని పట్నాలోని నివాసంలో అదుపులోకి తీసుకున్న ఏపీ పోలీసులు

- ట్రాన్సిట్ వారంట్ ఇవ్వటానికి అక్కడి కోర్టు నిరాకరణ
- దీంతో ఆగిపోయిన ఏపీకి తరలింపు



- అంతర్రాష్ట్ర డిప్యుటేషన్‌పై ఏపీలో పనిచేసిన సునీల్ నాయక్
- ప్రస్తుతం బిహార్ అగ్నిమాపక సేవలు, హోంగార్డు విభాగం ఐజీగా బాధ్యతలు
- ఆయన్ను అరెస్టు చేసేందుకు వెళ్లిన విజయనగరం ఎస్పీ దామోదర్ బృందం
- వాహనాలను కదలనివ్వకుండా అడ్డుకున్న బిహార్ పోలీసులు
- వాటన్నింటినీ అధిగమించి కోర్టులో హాజరుపరిచిన ఏపీ పోలీసులు
- ఉదయం నుంచి సాయంత్రం వరకూ నాటకీయ పరిణామాలు

ఈనాడు, అమరావతి: శాసనసభ ఉపసభాపతి కె.రఘురామకృష్ణరాజు నరసాపురం ఎంపీగా ఉన్న సమయంలో ఆయన్ను సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసి.. హత్యాయత్నానికి పాల్పడ్డారనే ఫిర్యాదుపై నమోదైన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులోని నిందితుల్లో ఒకరైన బిహార్ క్యాడర్ ఐపీఎస్ అధికారి ఎం.సునీల్‌నాయక్‌ను ఆ రాష్ట్ర రాజధాని పట్నాలోని ఆయన అధికారిక నివాసంలో దర్యాప్తు అధికారి, విజయనగరం ఎస్పీ ఏఆర్ దామోదర్ నేతృత్వంలోని బృందం సోమవారం ఉదయం అరెస్టు చేసింది. ఆయన్ను ఆంధ్రప్రదేశ్‌కు తరలించేందుకు ట్రాన్సిట్ వారంట్ నిమిత్తం పట్నాలోని స్థానిక కోర్టులో హాజరుపరిచింది. న్యాయస్థానం ట్రాన్సిట్ వారంట్‌కు నిరాకరించింది. 30 రోజుల వరకూ ఎలాంటి తీవ్రమైన చర్యలు తీసుకోవద్దంటూ (మిగతా 8లో)

వచ్చెయ్యండి.. ఐఐటీకి!

- తిరుపతి ఐఐటీలో ఒకరోజు గడిపేందుకు పాఠశాల విద్యార్థులకు అవకాశం
- మార్చి 8న టాకీయన్ టెక్ ఫెస్ట్

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఐఐటీలో చదవాలని ప్రతి ఒక్కరూ తపిస్తారు. ఆ లక్ష్యాన్ని సాకారం చేసుకునేందుకు ప్రేరణగా నిలిచే విషయమిది. పాఠశాల స్థాయిలో ఉన్నప్పుడే... ఐఐటీ విద్యార్థిగా ఒకరోజు గడిపేందుకు తిరుపతి ఐఐటీ టాకీయన్ టెక్ ఫెస్ట్-2026 అవకాశం కల్పిస్తోంది. ఆసక్తి ఉన్నవారిని మార్చి 8న నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తోంది. ఫెస్ట్‌లో ఐఐటీలోని విద్యావిధానంపై వారికి అవగాహన కల్పిస్తారు. హ్యాక్‌థాన్‌లు, సాంకేతిక పోటీలు నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహిస్తారు. రోబోటిక్స్, లైన్ ఫాలోవర్ రోబో డెమో, క్విజ్, హ్యాండ్స్ ఆన్ రోబో బిల్డింగ్, (మిగతా 8లో)



విచారణ కమిటీ ఏర్పాటు సబబే



- అదేమీ సిట్ దర్యాప్తు పరిధిలోకి రాదు
- కల్తీ నెయ్యి కేసులో సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్ డిస్పోజ్

ఈనాడు - దిల్లీ

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి వాడారన్న ఆరోపణలపై నమోదైన కేసులో పాలనాపరమైన లోపాలు, అందుకు బాధ్యులైనవారిని గుర్తించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విచారణ కమిటీ వేయడం సబబేనని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. అదేమీ సుప్రీంకోర్టు నియమించిన సిట్ దర్యాప్తు పరిధిలోకి రాదు (ఓవర్‌ల్యాప్) అని, చట్టప్రకారం రెండు విచారణ ప్రక్రియలూ కొనసాగవచ్చని పేర్కొంది. కల్తీ నెయ్యి నేరానికి కారణమైన పాలనాపరమైన లోపాలను సరిదిద్దడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్న సిట్ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం మాజీ సీఎస్ దినేశ్‌కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిటీ వేసిన సంగతి తెలిసిందే. దీన్ని సవాల్‌చేస్తూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి దాఖలుచేసిన రిట్ పిటిషన్‌పై సోమవారం విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలిచ్చింది. 'సుప్రీంకోర్టు నిర్దేశించిన సిట్ దర్యాప్తులో ఏపీ ప్రభుత్వం జోక్యం చేసుకోకుండా నియంత్రించాలని కోరుతూ ఆర్టికల్ 32 కింద పిటిషనర్ ఈ వ్యాజ్యం వేశారు. తిరుమల లడ్డూ ప్రసాదానికి ఉపయోగించిన నెయ్యి కల్తీ అయ్యిందన్న ఆరోపణపై 2024 సెప్టెంబరు 25న కేసు నమోదైంది. దీని దర్యాప్తు బాధ్యతలను సీబీఐ, ఏపీ ప్రభుత్వం నుంచి ఇద్దరేసి అధికారులు, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐకి చెందిన ఒక అధికారితో కూడిన బృందానికి అప్పగిస్తూ సుప్రీంకోర్టు 2024 అక్టోబరు 4న ఉత్తర్వులిచ్చింది. ఆ దర్యాప్తు పూర్తై ఛార్జిషీట్లు దాఖలయ్యాయి. ప్రస్తుతం విషయం కోర్టులో ఉంది. ఈలోగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇందులో (మిగతా 8లో)

> ఛార్జిషీట్లు, అనుబంధ ఛార్జిషీట్లు వేయడానికి దారితీసిన క్రిమినల్ ప్రొసీడింగ్స్‌తో ఈ విచారణ ఓవర్‌ల్యాప్ కాదన్నది మా అభిప్రాయం. ఆ రెండింటి మధ్య పరస్పర ప్రయోజన వైరుధ్యం, ఓవర్‌ల్యాపింగ్ లేవు.
> – సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

సాగునీటి సంఘాల ఎన్నికల్లో.. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలున్నా

పోటీకి అర్హులే

సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

ఈనాడు, అమరావతి: ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలుంటే సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్, అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సభ్యుడిగా పోటీకి అనర్హులన్న నిబంధనను ప్రభుత్వం తొలగించింది. పోటీకి, పదవుల్లో కొనసాగేందుకు.. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలున్నా అర్హులని నిర్ణయించింది. ఈ మేరకు ఏపీ రైతుల నీటిపారుదల వ్యవస్థల యాజమాన్య(సవరణ) బిల్లును శాసనసభ సోమవారం ఆమోదించింది. ఈ సందర్భంగా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడారు. '1980-90 మధ్యకాలంలో జనాభా విస్ఫోటం జాతీయ ఆహారభద్రతపై తీవ్ర ప్రభావం చూపింది. జనాభా నియంత్రణకు ఆనాటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినచర్యలు చేపట్టాయి. ఇద్దరి కంటే ఎక్కువమంది పిల్లలుంటే సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీకి అనర్హులన్న నిబంధన తెచ్చారు. కొన్నేళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో సంతానోత్పత్తి పడిపోయింది. భవిష్యత్తు తరాల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలోనూ సంతానోత్పత్తిపై నియంత్రణను తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది' అని వివరించారు.

ఇదీ సంగతి!



దమ్ముంటే సభలో కాదు.. బయట చర్చకు రమ్మని సవాల్ విసిరి సార్!

ముందొస్తాయి.. ముంచేస్తాయి!

- ఆన్‌లైన్‌లో వెతకగానే ఫేక్ వెబ్‌సైట్లు ప్రత్యక్షం
- నకిలీ రివ్యూలు, యాడ్‌లతో సైబర్ నేరగాళ్ల మాయాజాలం
- క్లిక్ చేస్తే.. గాలానికి చిక్కుకున్నట్టే



హైదరాబాద్‌కు చెందిన ఒక వ్యక్తి పెట్రోల్ బంకు డీలర్‌షిప్ కోసం ఆన్‌లైన్‌లో వెతికాడు. మొదట వచ్చిన వెబ్‌సైట్‌లోని కస్టమర్‌కేర్‌ని సంప్రదించాడు. బంకు కేటాయిస్తామన్న వ్యక్తులు.. రకరకాల ఛార్జీల పేరుతో రూ.కోటి వసూలు చేశారు. నిండా మునిగాక ఆ వ్యక్తికి అనుమానమొచ్చి అసలైన కంపెనీ ప్రతినిధుల్ని సంప్రదించగా అది నకిలీ వెబ్‌సైట్ అని తేలింది. ఇలా మోసపోతున్నవాళ్లు ఎందరో... సమాచారం కోసమో, సమస్య పరిష్కారం పొందడానికో.. మనం పలు సంస్థల వివరాల్ని ఆన్‌లైన్‌లో వెతుకుతాం. తెరపై అన్నింటికంటే పైన కనిపించే వెబ్‌సైట్‌పై క్లిక్ చేసి నంబర్లు తీసుకుంటాం.. అడిగిన వివరాలన్నీ ఇచ్చేస్తాం. ఇక్కడి నుంచే మొదలవుతుంది మోసం. తామే ఆ సంస్థ ప్రతినిధులమని నమ్మించిన సైబర్ నేరగాళ్లు మన సమాచారాన్నంతా లాగేసి నట్టేట ముంచేస్తుంటారు. సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, పెయిడ్ అడ్వర్టయిజ్‌మెంట్ విధానాన్ని ఆసరాగా చేసుకుని రూ.కోట్లు కొల్లగొట్టేస్తుంటారు. బ్యాంకులు, ప్రముఖ సంస్థల వెబ్‌సైట్ల తరహాలో నకిలీవి సృష్టించి.. ఆన్‌లైన్‌లో ప్రముఖంగా కనిపించేలా బోల్తా కొట్టిస్తున్నారు.

మోసగాళ్ల గిమ్మిక్కులు

ఏదైనా వెబ్‌సైట్‌ను ఎక్కువమంది చూసేలా, ఆన్‌లైన్‌లో వెతికినప్పుడు ముందు కనిపించేలా చేయడమే.. సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్. ఉదాహరణకు వివిధ అవసరాల కోసం ఏదైనా వెబ్‌సైట్ గురించి సెర్చ్ ఇంజిన్‌లో ఎక్కువ మంది శోధిస్తే... ఆటోమేటిక్‌గా దాని వీక్షణల సంఖ్య పెరుగుతుంది. దీంతోపాటు రివ్యూలు, కీవర్డ్స్, సెర్చ్ ఇంజిన్ అల్గారిథమ్ ఆధారంగా.. ఎక్కువమంది వెతికిన వెబ్‌సైట్ తెరపై ముందుగా కనిపిస్తుంది. మనం 'లోన్' అని వెతికితే ప్రముఖ బ్యాంకుల వెబ్‌సైట్లు కనిపిస్తాయి. 'ఇన్‌స్టంట్ లోన్' అని సెర్చ్ చేస్తే.. ఆర్‌బీఐ గుర్తింపు పొందిన బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలకు బదులు (మిగతా 8లో)

అట్టుడికిన మెక్సికో

- డ్రగ్స్ మాఫియా డాన్ ఎల్ మెంచో హతం
- రెచ్చిపోయిన అతడి అనుచరులు
- 25 మంది నేషనల్ గార్డ్ సభ్యుల హత్య

సైన్యం కాల్పుల్లో 62 మంది డ్రగ్స్ ముఠా సభ్యుల మృతి!





ఎల్ మెంచో మృతితో మెక్సికోలోని జాలిస్కోలో చెలరేగిన హింస కారణంగా మంటల్లో కాలిపోతున్న వాహనాలు (అంతర చిత్రంలో ఎల్ మెంచో)

12లో



విజయవాడలోని ఆంధ్ర లయోలా జూనియర్ కళాశాలలో హాల్‌టికెట్ల ఆధారంగా గదుల నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

సజావుగా ఇంటర్మీడియట్ పరీక్షలు

తొలి రోజు 5.24 లక్షల మంది హాజరు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభం అయ్యాయి. తొలిరోజు మొదటి సంవత్సరం విద్యార్థులకు పార్ట్-II: ద్వితీయ భాష పేపర్-1 నిర్వహించారు. మొత్తం 5,45,028 మంది విద్యార్థులు పరీక్షకు రావాల్సి ఉండగా.. 5,24,905 మంది హాజరయ్యారు. 20,123 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. తొలిరోజు మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, ప్రశాంతంగా పరీక్షలు జరిగాయని ఇంటర్మీడియట్ విద్యామండలి వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా పరీక్షల నిర్వహణను ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి పి.రంజిత్ బాషా కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని కెమెరాల ద్వారా పర్యవేక్షించారు. మంగళగిరిలోని విజయ జ్యోతి, నారాయణ జూనియర్ కళాశాలల్లో పరీక్షల నిర్వహణను స్వయంగా పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తంచేశారు. ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్ల పంపిణీ నిర్దేశించిన స్ట్రాంగ్ పాయింట్లను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు అరగంట ముందే చేరుకోవాలని సూచించారు. కేంద్రాల్లో నిఘా, భద్రత, విద్యార్థుల వసతుల విషయంలో లోపాలకు తావివ్వ వద్దని చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు.

నాగావళి దాటడమే నిత్య పరీక్ష!



పార్వతీపురం మన్యం జిల్లాలో ఇంటర్ పరీక్ష రాసే విద్యార్థుల అవస్థలివి. కొమరాడ-కొట్టు గ్రామానికి మధ్య నాగావళి నది ప్రవహిస్తోంది. ఏడాదంతా అందులో ప్రవాహం ఉంటుంది. నది అవతల కొట్టు, తొడుము, పొదుగువలస, తులసివలస గ్రామాలున్నాయి. ఇక్కడి పిల్లలు కొమరాడ జడ్పీ పాఠశాల, జూనియర్ కళాశాలలకు వెళ్లాలంటే నాగావళి దాటాలి. వర్షాలకు ప్రవాహం ఎక్కువైతే ఆ రోజు బడి, కళాశాల బంద్. ప్రస్తుతం ప్రవాహం మోకాళ్ల పైవరకు వస్తోంది.. కానీ పరీక్షలు ఉండటంతో విద్యార్థులు తప్పనిసరై వెళ్తూ కనిపించారు. ఒక వేళ బస్సుపై వెళ్లాలనుకుంటే కురుపాం, పార్వతీపురం మీదుగా చుట్టూ 45 కి.మీ. ప్రయాణం చేయాలి. అదే నది దాటి 3 కి.మీ. వెళ్తే విద్యాలయాలకు చేరుకోవచ్చని విద్యార్థులు ఈ బాటను నమ్ముకున్నారు. - న్యూస్‌టుడే, కొమరాడ

ఏసీబీ కోర్టు ఉత్తర్వుల దస్త్రాలు ఇప్పించండి

హైకోర్టులో వ్యాజ్యాలు

ఈనాడు, అమరావతి: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నర్ రింగ్‌రోడ్డు వ్యవహారాల్లో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, తదితరులపై వైకాపా ప్రభుత్వ హయాంలో నమోదుచేసిన కేసుల విచారణను ముగిసేస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు, తదితర దస్త్రాలను తనకు ఇప్పించాలంటూ రైల్వే విశ్రాంత ఉద్యోగి కొండలరావు వేసిన పిటిషన్లపై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. ఈ కేసు పూర్వాపరాలు సమర్పించాలని సీఐడీని ఆదేశిస్తూ వారం రోజులకు విచారణ వాయిదా వేసింది. న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. ఈ కేసుల ముగింపు ఫైళ్లు ఇవ్వడానికి ఏసీబీ కోర్టు నిరాకరించడంతో కొండలరావు హైకోర్టును ఆశ్రయించారు. సోమవారం జరిగిన విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ) ఎం.లక్ష్మీనారాయణ వాదిస్తూ 'ఈ వ్యాజ్యాలకు అసలు విచారణార్హతే లేదు. అయినా, మొదటిసారి విచారణకు వచ్చినందున వివరాలు సమర్పించడానికి సమయం కావాలి. ఇప్పటికే దాఖలైన ఇదే తరహా పిటిషన్లు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయ'ని గుర్తుచేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ వాదిస్తూ, ఈ కేసులకు పిటిషనర్ థర్డ్‌పార్టీ అన్న కారణంగా దస్త్రాలు ఇచ్చేందుకు ఏసీబీ కోర్టు నిరాకరించిందన్నారు. ప్రస్తుత పిటిషన్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతివాదిగా ఉన్నందున ఆయనకు నోటీసు ఇవ్వాలని కోరారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ ప్రస్తుతం వ్యాజ్యాల విచారణార్హతపైనే వాదనలు వింటున్నామని, సంతృప్తి చెందిన తర్వాతే పోలీసుల ద్వారా నోటీసులు పంపుతామని స్పష్టతనిచ్చారు.

కృష్ణా డెల్టాలో స్వల్పకాలిక పంట రకాలా?

● బ్రిజేష్ ట్రైబ్యునల్ ఎదుట ఏపీ వాదనలు

ఈనాడు, అమరావతి: 'కృష్ణాడెల్టాలో స్వల్పకాలిక పంటల సాగును సూచించడం ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న నీటి కేటాయింపులు తగ్గించేందుకే. తెలంగాణ చేసిన ఈ ప్రతిపాదన వెనుక ఆ ఉద్దేశం ఉందని స్పష్టంగా తెలుస్తోంది. కృష్ణా డెల్టాలో ఇప్పటికే విజయవంతమైన పంట ఉత్పత్తి విధానం, ఇక్కడి ప్రత్యేక అవసరాలను వారి వాదన పరిగణనలోకి తీసుకోలేదు. కృష్ణా డెల్టాలో తెలంగాణ ప్రతిపాదించిన స్వల్ప పంటకాలిక రకాలు, వారు ప్రతిపాదించిన వాదనలు, అందుకు వారు ప్రతిపాదించిన నీటి కేటాయింపులు సమర్థనీయం కాదు' అని ఆంధ్రప్రదేశ్ వాదనలు వినిపించింది. దిల్లీలో సోమవారం కృష్ణా ట్రైబ్యునల్ ఎదుట వరుసగా తొమ్మిదో రోజు ఈ వాదనలు జరిగాయి. జస్టిస్ బ్రిజేష్ కుమార్, జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ తాళపత్రం ముందు ఏపీ తరఫున సీనియర్ న్యాయవాది జయదీప్ గుప్తా వాదనలు వినిపించారు. సీనియర్ కౌన్సెల్ ఉమాపతి, న్యాయవాదులు శరత్‌చంద్ర, సంజయ్‌లు ఆయనకు సహకరించారు. ఏపీ వాదనల్లోని ముఖ్యాంశాలివీ..

122 రోజులకే చేతికొస్తుందన్నది అబద్ధం

★ కృష్ణా డెల్టాలో పంట 122 రోజులకే చేతికి వస్తుందన్న తెలంగాణ వాదన అసంబద్ధం. బచావత్ ట్రైబ్యునల్ పంట కాలాన్ని 180 రోజులుగా లెక్కించింది. ఆధునికీకరణ తర్వాత ఏపీ దాన్ని 150 రోజులకు కుదించింది.

★ తెలంగాణ సాక్షి అఫిడవిట్‌లో కృష్ణా డెల్టాలో దీర్ఘకాలిక వరి రకాలే ప్రధానంగా ఉంటాయని అంగీకరిస్తూనే స్వల్పకాలిక పంటలను ప్రతిపాదించారు. అది ఇక్కడి నీటి అవసరాలను కృత్రిమంగా తగ్గించి చెప్పడమే.

★ వ్యవసాయ పంచాంగం తెలంగాణ సాక్షి వాదనను పూర్తిగా తిరస్కరిస్తుంది. ఈ పంచాంగం జోనల్ సిఫార్సు చేసిన అన్ని వరి రకాలు 140 నుంచి 155 రోజుల పంట కాలం ఉన్నవే. ఆర్జీఎల్ రకాలకు 115 నుంచి 120 రోజులు అవసరం. కృష్ణా డెల్టాలో 140 రోజుల కన్నా తక్కువ రోజులే పంట వచ్చే రకాలు అందుబాటులోలేవు.

★ కృష్ణా డెల్టాలో ఏ రకాలు పెంచుతారో తనకు తెలియదని తెలంగాణ సాక్షి అంగీకరించారు. 122 రోజుల వరి పంట రకాలను సమర్థించిన ఆయన.. తన పరిశోధనల్లో మాత్రం వరికి 152 రోజుల వ్యవధి కావాలన్నారు. క్రాస్ ఎగ్జామినేషన్‌లో కృష్ణా డెల్టాలో 16కు పైగా వరి రకాలు 140 రోజుల కన్నా ఎక్కువ సమయం కావాల్సినవని అంగీకరించారు.

★ ఆంధ్రప్రదేశ్ సాక్షిగా వచ్చిన వ్యవసాయశాస్త్రవేత్త ఇక్కడ సాగు చేసే వరి రకాలకు 140 నుంచి 155 రోజులు అవసరమన్నారు. 120 రోజుల పంట కాలం లెక్క సరైంది కాదన్నారు.

కావేరి బేసిన్ అధ్యయనం ఇక్కడికా?

★ పంటకు ఎంత నీరు అవసరమో లెక్కింపే ఈ పంట గుణకం. రమణనాథన్ అధ్యయనాన్ని ప్రస్తావిస్తూ తెలంగాణ లెక్కలు కట్టింది. కావేరి పరీవాహక ప్రాంతానికి సంబంధించిన ఆ అధ్యయనం లెక్కలు ఇక్కడ వర్తించవు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం.. పంటకు ఎంత నీరు కావాలో లెక్కించే పద్ధతుల స్థానిక ఐసీఏఆర్ కేంద్రాల నుంచి తీసుకోవాలి. ఈ విషయాన్ని తెలంగాణ సాక్షి కూడా అంగీకరించారు.

★ కృష్ణా డెల్టాలో పంటలకు తక్కువ నీటి కేటాయింపులు ప్రతిపాదించేందుకే తెలంగాణ ఇలా తప్పుడు లెక్కలు కట్టి అంచనాలు రూపొందించింది.

★ అన్ని శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం, కృష్ణా డెల్టా ఆధునికీకరణ సమయంలో లెక్కించిన ప్రకారం కృష్ణా డెల్టాకు 152.20 టీఎంసీలు అవసరమన్న వాదనకు కట్టుబడి ఉన్నాం.

తదుపరి ఉత్తర్వులిచ్చేవరకు.. ఆ ప్రొఫెసర్లను కొనసాగించండి

● రాష్ట్ర ప్రభుత్వం, నాలుగు వర్సిటీలకు హైకోర్టు ఆదేశం

● పదవీవిరమణ వయసును కొందరికి పెంచి, మరికొందరికి నిరాకరించడం వివక్షేనని వ్యాఖ్య

ఈనాడు, అమరావతి: ఉన్నత విద్యాశాఖ పరిధిలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తూ యూజీసీ స్కేల్ పొందుతున్న ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసును 62 నుంచి 65 ఏళ్లకు పెంచి, వ్యవసాయశాఖ పరిధిలోని నాలుగు వర్సిటీల్లో ప్రొఫెసర్లకు పెంచకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. కొందరికి పెంచి, మరికొందరికి నిరాకరించడం వివక్ష చూపడమేనంది. చట్టం ముందు అందరూ సమానులనే అధికరణ 14కు ప్రభుత్వచర్య విరుద్ధంగా ఉందని పేర్కొంది. పిటిషనర్లు/ప్రొఫెసర్లు కొంతమంది త్వరలో పదవీవిరమణ చేయనున్నారని, తాము తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు వారిని సర్వీసులో కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం, ఆయా యూనివర్సిటీ అధికారులను ఆదేశించింది. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ, డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన, శ్రీవెంకటేశ్వర వెటర్నరీ, ఏపీ ఫిషరీస్ విశ్వవిద్యాలయాల్లోని ప్రొఫెసర్ల పదవీవిరమణ వయస్సు పెంచేది లేదంటూ వ్యవసాయశాఖ ప్రత్యేక సీఎస్ ఈ నెల 15న జారీచేసిన లేఖ అమలును సస్పెండ్ చేసింది. కౌంటర్ దాఖలుచేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

విచారణకు హాజరైన వ్యవసాయశాఖ ప్రత్యేక సీఎస్

తమ పదవీవిరమణ వయస్సును 62 నుంచి 65 ఏళ్లకు పెంచాలని కోరుతూ ఆ నాలుగు యూనివర్సిటీలలోని ప్రొఫెసర్లు, డీన్లు, శాఖాధిపతులు హైకోర్టులో వ్యాజ్యాలు వేశారు. విచారణ జరిపిన హైకోర్టు సింగిల్‌జడ్జి పదవీ విరమణ వయసు పెంపు ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమన్నారు. ఉన్నత విద్యాశాఖ పరిధిలోని ప్రొఫెసర్లకు పదవీ విరమణ వయసును 65కు పెంచే విషయంలో 2023 జులై 29న జారీ చేసిన జీవో 39ని వ్యవసాయశాఖ పరిధిలోని వర్సిటీల్లో పనిచేసే ప్రొఫెసర్లు, ఉద్యోగులకు వర్తింపజేసే విషయంపై సమగ్ర నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ గతేడాది నవంబర్ 5న తీర్పు ఇచ్చారు. దీనిపై పిటిషనర్లు వేసిన అప్పీళ్లపై హైకోర్టు ధర్మాసనం ఇటీవల విచారణ జరిపింది. వ్యవసాయశాఖ ప్రత్యేక సీఎస్ బుడితి రాజశేఖర్ హాజరుకు ఆదేశించింది. సోమవారం జరిగిన విచారణకు ఆయన హాజరయ్యారు. పదవీ విరమణ వయసు పెంపు కోసం ఆయా వర్సిటీలు చేసిన ప్రతిపాదనలను కాంపిటెంట్ అథారిటీ నిర్ణయం మేరకు తిరస్కరించామన్నారు. ఈ వాదనను ధర్మాసనం తప్పుపట్టింది. తిరస్కరణకు కారణాలు పేర్కొనలేదంది. వారికి పదవీవిరమణ వయసు పెంపును 2023లో అప్పటి ప్రభుత్వం నిరాకరించిందని, ప్రస్తుత ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని సమర్థిస్తోందని గుర్తుచేసింది. రాజకీయంగా ఉన్నత పదవుల్లో ఉన్నవారి ఆలోచనలేమిటో తెలుసుకోకుండా.. అధికారులెలా నిర్ణయం తీసుకుంటారని వ్యాఖ్యానించింది.

తెరపైకి బడే చొక్కారావు పేరు!

● నేడు దేవ్‌జీ లొంగుబాటు

● మరో 40 మంది కూడా...

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర కమిటీ అగ్రకటిత కార్యదర్శి తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీతో పాటు దాదాపు 40 మంది ఇప్పటికే రాష్ట్ర పోలీసుల కనుసన్నల్లో ఉండగా మంగళవారం వీరు అధికారికంగా లొంగిపోయే అవకాశం ఉంది. తాజాగా తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు ఎలియాస్ దామోదర్ కూడా ఇదే బాట పట్టినట్లు తెలుస్తోంది. లొంగుబాటు షరతులపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఇవి ఫలప్రదం కావచ్చని, మిగతా వారితోపాటు ఆయన కూడా లొంగిపోవచ్చని తెలుస్తోంది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన చొక్కారావు తొలితరం మావోయిస్టుల్లో ఒకరు. ఆయన కూడా లొంగిపోయే పక్షంలో నేపాల్ చేరుకొని ఉండొచ్చని భావిస్తున్న గణపతి.. ఝార్ఖండ్‌లో ఉన్న పసునూరి నరహరి మినహా మావోయిస్టు ఉద్యమంలోని తెలంగాణ క్యాడర్ అంతా లొంగిపోయినట్లే.

గత ఏడాది దేశంలో 2,337 మంది లొంగుబాటు

2026 మార్చి 31లోపు దేశాన్ని వామపక్ష తీవ్రవాద రహితంగా మారుస్తామని ప్రకటించిన కేంద్ర హోంమంత్రి... లొంగిపోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. భద్రతా బలగాలు విరుచుకుపడుతుండటంతో గత ఏడాది రికార్డు స్థాయిలో దేశంలో 2,337 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఉద్యమం మొదలైన తర్వాత ఒక ఏడాదిలో ఇంతమంది లొంగిపోవడం ఇదే ప్రథమం. మొత్తమ్మీద 2019 నుంచి 2026 జనవరి 15 వరకు దేశంలో 7,409 మంది అరెస్టవగా 5,880 మంది లొంగిపోయారు. మావోయిస్టు ఉద్యమాన్ని ముందుండి నడుపుతున్న వారిలో తెలంగాణకు చెందిన వారే అత్యధికం. మావోయిస్టులపై పోరాటంలో తెలుగు రాష్ట్రాల పోలీసులు ఆరితేరడంతో చాలాకాలం క్రితమే ఛత్తీస్‌గఢ్‌కు మకాం మార్చారు. ఇప్పుడు అక్కడ కూడా ఒత్తిడి పెరగడంతో విధిలేని పరిస్థితిల్లో లొంగిపోతున్నారు. రాష్ట్రానికి చెందిన 15 మంది నాయకులతో పాటు మొత్తం 40 మంది వరకు అజ్ఞాతంలోనే ఉన్నారని అంచనా వేసిన తెలంగాణ పోలీసులు వీరంతా లొంగిపోవాలని పదేపదే పిలుపునిచ్చారు. లొంగిపోయిన వారికి మంచి పునరావాసం కూడా కల్పిస్తున్నారు. వీరి ప్రయత్నాలు ఫలించే అగ్రనేతలైన దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి తదితరులు లొంగిపోతున్నారు.

కోచింగ్ సెంటర్ల నియంత్రణపై మార్గదర్శకాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కోచింగ్ సెంటర్ల క్రమబద్ధీకరణ, నియంత్రణకు సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు ముసాయిదా మార్గదర్శకాలు రూపొందించామని కళాశాల విద్య కమిషనర్ కార్యాలయం వెల్లడించింది. ఈ అంశంపై సంప్రదింపులు, ప్రజాభిప్రాయం సేకరణకు ఈ నెల 24 నుంచి 26 వరకు మార్గదర్శకాలను అందుబాటులో ఉంచుతున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ముసాయిదా మార్గదర్శకాలు సీసీఈ పోర్టల్‌లో అందుబాటులో ఉంచామని.. సూచనలు అభిప్రాయాలు https://forms.gle/Y3An9h6Oxb6UXGpb9 ద్వారా తెలియజేయాలని పేర్కొంది.



మొదలు పెట్టడమే ముఖ్యం

ఒక్క పుష్-అప్ చేయడం అసలు వ్యాయామం చేయకపోవడం కంటే మేలు. పుస్తకంలో ఓ పేజీ చదవడం ఫోన్ స్క్రోలింగ్ కంటే ఉత్తమం. ఒక్క నిమిషమైనా పనిచేయడం రేపు మొదలు పెడతాను అనే ప్రతిజ్ఞ కన్నా గొప్ప విషయం. పనిని ఆరంభించడం.. అమలు చేయని పక్కా ప్రణాళిక కంటే మిన్న.
– వారెన్ ఇంగ్లిష్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు

తిరుమల క్యూలైన్‌లో పాముకాటు అవాస్తవం

● తేల్చి చెప్పిన భక్తులు, తితిదే



శరత్‌బాబు, మౌనిక దంపతులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలోని దర్శనం క్యూలైన్‌లో భక్తురాలికి పాముకాటు వేసినట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఆమె కుటుంబం ఓ వీడియోలో ఖండించింది. ఈ ఘటనపై తితిదే సైతం స్పందించింది. క్యూలైన్‌లో పాముకాటు అనేది పూర్తిగా అవాస్తవం అని సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. తెలంగాణలోని వరంగల్ జిల్లాకు చెందిన శరత్‌బాబు, మౌనిక దంపతులు ఆదివారం రాత్రి తిరుమలకు వచ్చారు. ట్యాక్సీలో మ్యూజియం సమీపంలోని ఆర్‌బీ సెంటర్‌లోని పార్కింగ్ ప్రాంతానికి చేరుకోగానే మౌనిక తన పాదాలకు పసుపు రాసుకునేందుకు చీకటిలో పక్కనే ఉన్న స్థలంలోకి వెళ్లారు. ఈ క్రమంలో కాలుపై స్పర్శ తగలడంతో భయానికి లోనై.. ఆ విషయాన్ని భర్తకు చెప్పారు. శరత్‌బాబు ఆ ప్రాంతాన్ని పరిశీలించగా అక్కడో చిన్నపాము కనిపించింది. వెంటనే భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేయగా వారు మౌనికను తిరుమలలోని అశ్విని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి పాము కాటు వేయలేదని నిర్ధారించారు. అయినా భక్తురాలి శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ఆమెను తిరుపతిలోని స్విమ్స్‌కు పంపించి, అక్కడా పరీక్షలు చేయించి, ఎలాంటి సమస్య లేదని తెలుసుకున్నారు. సదరు భక్తులు సోమవారం శ్రీవారిని దర్శించుకొని ఇంటికి పయనమయ్యారు. ఈ సందర్భంగా తితిదే అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. నిర్దేశించిన ప్రాంతాల నుంచే క్యూలైన్‌లోకి వెళ్లాలని, తిరుమల పరిసరాల్లోని నిషేధిత అటవీ ప్రాంతాల్లోకి వెళ్లకూడదని తితిదే భక్తులకు విజ్ఞప్తి చేసింది.

కర్నూలులో అత్యధికంగా 36.2 డిగ్రీల ఉష్ణోగ్రత



ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో వేడి తీవ్రత కొనసాగుతోంది. పలు ప్రాంతాల్లో సోమవారం గరిష్ఠ ఉష్ణోగ్రతలు 1 నుంచి 2 డిగ్రీలు పెరిగాయి. తుని, మచిలీపట్నం, నందిగామ, నంద్యాల, కర్నూలు, కడప, అనంతపురం తదితర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 34 డిగ్రీలు దాటాయి. అత్యధికంగా కర్నూలులో 36.2, అనంతపురంలో 36.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నైరుతి బంగాళాఖాతంలోని తీవ్ర అల్పపీడనం.. సోమవారం అల్పపీడనంగా బలహీనపడింది. ఇది ఈశాన్య దిశగా కదులుతూ మంగళవారం నాటికి బలహీనపడుతుందని భారత వాతావరణ విభాగం అంచనా వేసింది. మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్నిచోట్ల పిడుగులు పడే అవకాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

గ్రహం అనుగ్రహం

24-2-2026 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, శుక్ల పక్షం
సప్తమి: ఉ 7-48 అష్టమి తె. 5-17 తదుపరి నవమి
కృత్తిక: మ. 3-56 తదుపరి రోహిణి
వర్జ్యం: లేదు
అమృత ఘడియలు: మ. 1-14 నుంచి 3-11 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-45 నుంచి 9-31 వరకు తిరిగి రా. 10-59 నుంచి 11-48 వరకు
రాహుకాలం: సా. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.6.26; సూర్యాస్తమయం: సా.6.01

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	17.0	33.0
విజయవాడ	21.6	33.2
అనంతపురం	21.6	36.0
శ్రీకాకుళం	22.0	30.0
కడప	22.0	34.0
రాజమహేంద్రవరం	22.0	36.0
విశాఖపట్నం	22.4	33.0
గుంటూరు	23.0	34.0
కర్నూలు	23.1	36.2
ఒంగోలు	24.5	33.6

తితిదే సేవలపై మీనాక్షి చౌదరి హర్షం



ఇటీవల తిరుమలకు వచ్చిన సందర్భంగా తితిదే ధర్మరథం బస్సులో ప్రయాణిస్తున్న మీనాక్షి చౌదరి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి భక్తులకు తితిదే అందిస్తున్న సౌకర్యాలపై సినీనటి మీనాక్షి చౌదరి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు తితిదే అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలుపుతూ సోమవారం వీడియో విడుదల చేశారు. తిరుమలకు తరచూ వస్తుంటానని, కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవారిని దర్శించుకుంటే మనసు, ఆలోచనలు ప్రశాంతంగా ఉంటాయన్నారు. ఇక్కడి గాలిలోనూ గోవిందనామం మారుమోగుతుంటుందన్నారు. తిరుమలలో భక్తుల కోసం తితిదే అన్నప్రసాదాలు అందించడం నుంచి మెరుగైన దర్శనం కల్పించడం వరకు అన్నిరకాల సేవలు బాగున్నాయన్నారు. ఇటీవల దర్శనానికి వచ్చిన సందర్భంగా తన అనుభూతిని తాజాగా పంచుకున్నారు.

ఉద్యోగ అవకాశాలు



స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీ రిజర్వేషన్ల పెంపు

- ఏకసభ్య కమిషన్ నివేదిక రాగానే చట్టం చేసి అమలు చేస్తాం
- ఇది బలహీనవర్గాల ప్రభుత్వం
- శాసనసభలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీ రిజర్వేషన్లు పెంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. "ఎన్డీయేపై ఎంతో నమ్మకంతో ఓట్లేసి గెలిపించారు. ఆ నమ్మకాన్ని కాపాడుకోవాలి. వైకాపా హయాంలో బీసీ రిజర్వేషన్లు 33% నుంచి తగ్గించారు. మళ్లీ వాటిని పెంచడానికి ఏకసభ్య కమిషన్ వేశాం. నివేదిక రాగానే చట్టం చేసి అమలుచేస్తాం. బీసీల రక్షణకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుచేశాం. వారిచ్చే నివేదికను అమలుచేస్తాం. బీసీ వర్గాల్లోని కొందరు తమను ఎస్సీ, ఎస్టీల్లో చేర్చాలని కోరారు. వాటిని కేంద్రానికి పంపాం" అని తెలిపారు. "బలహీనవర్గాల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తాం. ప్రజాప్రతినిధులు ఏ పనిచేసినా.. దాని ద్వారా బలహీనవర్గాల్ని ఎంతవరకు ఆదుకుంటున్నామన్న సంగతిని దృష్టిలో ఉంచుకోవాలి. ఇది బలహీనవర్గాల ప్రభుత్వం.. వారికి అన్నివిధాలా అండగా ఉంటాం" అని వెల్లడించారు. శాసనసభలో సోమవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలతోపాటు ఆహార పౌరసరఫరాలశాఖకు 2026-27 ఆర్థిక సంవత్సరానికి గ్రాంట్ల కోసం అభ్యర్థనపై చర్చ తర్వాత చంద్రబాబు మాట్లాడారు. "ఎస్సీ వర్గీకరణ 1996-97లో తొలిసారిగా తెదేపా ప్రభుత్వమే తెచ్చింది. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు దాన్ని కాపాడలేకపోయాయి. సుప్రీంకోర్టు అనుమతివ్వడంతో.. మళ్లీ ఎస్సీ వర్గీకరణ అమలు చేసి.. దామాషా ప్రకారం సామాజిక న్యాయం చేశాం" అని వివరించారు.



గిరిజనుల సమస్యకు ఆమోదయోగ్య విధానంలో పరిష్కారం

గిరిజనుల అభ్యున్నతికి జీవో 3 (గిరిజన ప్రాంతాల్లో 100% ఉద్యోగాలు స్థానిక గిరిజనులకే కల్పించేలా) తెచ్చినట్లు చంద్రబాబు తెలిపారు. దానిని వైకాపా వాళ్లు కాపాడలేకపోయారని, సుప్రీంకోర్టులో దీన్ని కొట్టేశారని చెప్పారు. ఆచరణ, ఆమోదయోగ్యమైన విధానంలో ఈ సమస్యకు పరిష్కారం చూపడానికి సిద్ధంగా ఉన్నట్లు స్పష్టంచేశారు. ఈ అంశంపై సమావేశాలు పెట్టాలని అధికారులను ఆదేశించామని, అందులో వచ్చే సూచనల ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. చంద్రబాబు ప్రసంగంలోని ముఖ్యాంశాలు..

సంక్షేమానికి బడ్జెట్ పెంచాం

◆ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు వీలైనంత వరకు బడ్జెట్ పెంచాం. చిత్తశుద్ధితో అమలుచేస్తాం. ◆ బలహీనవర్గాల్లోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యపై ప్రత్యేకదృష్టి పెట్టాం.

పథకం ఏదైనా మహిళలకే ప్రాధాన్యం

◆ కార్యక్రమమైనా, పథకమైనా మహిళలకే ప్రాధాన్యమిస్తున్నాం. ◆ అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనకబడినవారిని ఆదుకుంటాం. పేదలందరికీ అండగా ఉంటాం. ◆ ప్రతి కుటుంబానికీ ఆర్థికభద్రత కల్పిస్తాం. త్వరలో ఫ్యామిలీ కార్డు ఇస్తాం. ◆ కుటుంబం యూనిట్‌గా సాధికారత కల్పిస్తాం ◆ సంజీవని ద్వారా ఆర్థిక వెసులుబాటు లభించే ప్రణాళికలు అమలుచేస్తున్నాం. ◆ ఆర్థిక అసమానతల తగ్గింపే కూటమి ప్రభుత్వ లక్ష్యం.

సూపర్ సిక్స్ సూపర్‌హిట్ చేశాం

◆ ఎన్ని ఇబ్బందులున్నా సూపర్ 6 సూపర్‌హిట్ చేశాం. ఇది మొదటి చర్య మాత్రమే. ◆ రాష్ట్రంలోని అన్నివర్గాలకూ సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నాం.
◆ ఆటోడ్రైవర్లు, మత్స్యకారులు, చేనేత కార్మికులు సహా అందరినీ ఆదుకుంటున్నాం. ◆ ప్రజాపంపిణీ వ్యవస్థకు సాంకేతికత వినియోగిస్తున్నాం. ◆ స్వర్ణాంధ్ర 2047 అమల్లో భాగంగా 2047 నాటికి రాష్ట్రంలో తలసరి ఆదాయాన్ని రూ.3 లక్షల నుంచి రూ.54 లక్షలకు పెంచాలి.
◆ పీ4 కార్యక్రమం కింద 10 లక్షల బంగారు కుటుంబాల్ని లక్షలమంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. ◆ ఏ కార్యక్రమమైనా ఫలితాలు వెంటనే రావు. నిరంతరం పర్యవేక్షిస్తే ఆర్థిక అసమానతల తగ్గింపునకు ఇంతకు మించిన కార్యక్రమం లేదు.

611 ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు రూ.595 కోట్లు

మంత్రి నిమ్మల రామానాయుడు



ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన 611 ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారని, ఆ మేరకు రూ.595 కోట్లతో ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. వీటి నిర్వహణ భారం రైతులపై పడకుండా ఐదేళ్లకు రూ.756 కోట్లు వెచ్చించేందుకు ప్రభుత్వమే సిద్ధంగా ఉందని తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో సోమవారం సభ్యుడు ముప్పిడి వెంకటేశ్వరరావు అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ సమాధానమిచ్చారు. 'వైకాపా హయాంలో రాష్ట్రవ్యాప్తంగా ఎత్తిపోతల పథకాలన్నీ విధ్వంసానికి గురయ్యాయి. రాష్ట్రంలో 1008 ఎత్తిపోతల పథకాలుంటే 350 పనిచేయడంలేదు. మరో 480 పాక్షికంగా పనిచేస్తున్నాయి. ఐదేళ్ల పాలనలో కనీసం మరమ్మతులూ చేయించలేదు. ఎత్తిపోతల పథకాల ద్వారా రాష్ట్రంలో 8.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా... ప్రస్తుతం ఇందులో సగమే అందుతోంది. దీంతో సీఎం చంద్రబాబు వీటిపై ప్రత్యేకదృష్టి సారించి పునరుద్ధరణ చర్యలు చేపట్టారు' అని వివరించారు.

జగన్ వదిలేసిన బకాయిలు మేమొచ్చాక కట్టాం

- శాసనసభలో మంత్రి నాదెండ్ల మనోహర్



ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో పౌరసరఫరాల సంస్థ ద్వారా రూ.40,750 కోట్ల రుణాలు తీసుకుని, రూ.18,900 కోట్లే తిరిగి చెల్లించారని, మిగిలిన సొమ్మును మళ్లించారని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. జగన్ ప్రభుత్వం బకాయి పెట్టిన అప్పుల్లో.. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రూ.24,296 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. చంద్రబాబు గతంలో సీఎంగా ఉన్నప్పుడు దీపం పథకం కింద 30.80 లక్షల దీపం గ్యాస్ కనెక్షన్లు ఇస్తే, జగన్ తన హయాంలో కేవలం 1.72 లక్షల కనెక్షన్లే ఇచ్చారని విమర్శించారు. దీపం-2 పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా రూ.3,100 కోట్లతో 3.70 కోట్ల ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించామని వివరించారు. నాడు ఇంటింటికీ రేషన్ పంపిణీ పేరిట వాహనాలు ఏర్పాటుచేసి రాష్ట్రఖజానాకు రూ.3 వేల కోట్ల నష్టం కలిగించారని మంత్రి దుయ్యబట్టారు. ఆహార, పౌరసరఫరాల శాఖకు గ్రాంట్లపై సోమవారం శాసనసభలో చర్చ అనంతరం మంత్రి మనోహర్ మాట్లాడారు.

రూ. లక్ష కూపన్ నాకొద్దు.. వెనక్కి ఇచ్చేస్తున్నా!

- సభలో సంబంధం లేని అంశాలతో సమయం వృథా
- పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపీమూర్తి



ఈనాడు, అమరావతి: 'ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రభుత్వం రూ.లక్ష విలువైన కూపన్లు ఇచ్చింది. బడ్జెట్‌పై చర్చ జరగనప్పుడు, మా గొంతు నొక్కుతున్నప్పుడు ఈ రూ.లక్ష కూపన్ నాకెందుకు..? దీన్ని నేను తిరస్కరిస్తున్నాను. ప్రభుత్వానికి తిరిగిచ్చేస్తున్నాను' అని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఆవరణలో మీడియా పాయింట్‌లో సోమవారం మాట్లాడారు. 'శాసనమండలిలో బడ్జెట్, ప్రజల సమస్యలపై చర్చ జరగకుండా అధికార, ప్రతిపక్షాలు సమయాన్ని వృథా చేస్తున్నాయి. మాలాంటి స్వతంత్ర ప్రజాప్రతినిధుల సమయాన్ని, హక్కులను కాలరాస్తున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి భిన్నంగా బడ్జెట్ ఉంది. ఇందులో ఉద్యోగ, ఉపాధ్యాయ, శ్రామికవర్గాల, వేతనజీవుల ప్రస్తావన లేదు. ఇలాంటి లోపాలను ఎత్తిచూపి సరైన మార్గంలో పెట్టాల్సిన ప్రతిపక్షం కూడా సభ జరగకుండా అడ్డుకుంటోంది. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధం. ఇకనైనా మండలిలో ప్రజల సమస్యలు చర్చించండి. హెరిటేజ్, లడ్డూల గురించి మాట్లాడాలంటే బయట వేదికలు ఉన్నాయి' అన్నారు.

ఉర్దూ అకాడమీ రూ.లక్ష బడ్జెట్‌ను రూ.7 కోట్లకు పెంచాం

- ముస్లింల సంక్షేమానికి కూటమి ప్రభుత్వమిచ్చే ప్రాధాన్యమిది
- మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఫరూక్

ఈనాడు, అమరావతి: ఉర్దూ అకాడమీకి గతంలో రూ.లక్ష బడ్జెట్ మాత్రమే ఉండేదని.. కూటమి ప్రభుత్వం దీనికి రూ.7 కోట్లు కేటాయించిందని న్యాయ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి ఇచ్చే ప్రాధాన్యానికి ఈ కేటాయింపులే నిదర్శనమని చెప్పారు. అసెంబ్లీలో సోమవారం మైనారిటీ సంక్షేమశాఖ గ్రాంట్లపై చర్చ అనంతరం మంత్రి మాట్లాడారు. 'విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లే ప్రతి యాత్రికునికి రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తున్నాం' అని వివరించారు. అసెంబ్లీలో చాలా ఏళ్ల తర్వాత డిమాండ్లపై విస్తృత చర్చ నడుస్తోందని పేర్కొన్నారు. మైనారిటీల సంక్షేమానికి 2025-26 బడ్జెట్ కంటే రూ.656 కోట్లు అదనంగా ఇచ్చారని తెలిపారు.

వైకాపా పాలనలో జగన్ కంపెనీలకు.. రూ.వెయ్యి కోట్లకు పైగా అనుచిత లబ్ధి

- ఇన్నేళ్ల తెదేపా పాలనలో హెరిటేజ్‌కు ఒక్క రూపాయీ తీసుకోలేదు
- హెరిటేజ్‌పై బొత్స వ్యాఖ్యలు అర్థరహితం
- మంత్రి లోకేశ్ ధ్వజం

ఈనాడు, అమరావతి: వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్లలో సాక్షి పత్రిక, టీవీ ఛానల్, భారతి సిమెంట్స్ సహా జగన్ కంపెనీలు ప్రభుత్వం నుంచి రూ.వెయ్యి కోట్లకు పైగా అనుచిత లబ్ధి పొందాయని విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. తెదేపా అధికారంలో ఉన్న ఇన్నేళ్లలో ప్రభుత్వం నుంచి హెరిటేజ్ ఒక్క రూపాయి కూడా లబ్ధి పొందలేదని తెలిపారు. ఏపీ సహా ఏ రాష్ట్ర ప్రభుత్వంతోనూ వ్యాపారం చేయరాదన్నది హెరిటేజ్ విధానమని స్పష్టంచేశారు. లోకేశ్ సోమవారం శాసనసభ లాబీల్లో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.



'ఇందాపూర్ డెయిరీ.. హెరిటేజ్‌కు కోకంపెనీ అని బొత్స సత్యనారాయణ ఆరోపించడం విడ్డూరంగా ఉంది. కోకంపెనీ అన్నదే ఉండదన్న విషయం అంత సీనియర్ నేతకు తెలియదా? ఇందాపూర్ డెయిరీ హెరిటేజ్ కంటే చాలా పెద్దది. ఆ సంస్థ ఉత్పత్తుల్లో 30% మాత్రమే రీటెయిల్‌గా విక్రయిస్తుంది. మిగతా 70% ఉత్పత్తులను పెద్ద కంపెనీల కోసం తయారుచేస్తుంది. హెరిటేజ్‌తో పాటు అమూల్, బ్రిటానియా వంటి సంస్థలకు కావలసిన పాల ఉత్పత్తుల్ని తయారుచేసి ఇస్తుంది. దాన్ని కో ప్యాకేజింగ్ అంటారు' అని ఆయన వివరించారు. ఇందాపూర్ డెయిరీ నుంచి హెరిటేజ్ ఎప్పుడూ నెయ్యి కొనుగోలు చేయదని, స్కిమ్డ్ మిల్క్‌పౌడర్, అల్ట్రా హైటెంపరేచర్ మిల్క్ (యూహెచ్‌టీ), పన్నీర్, చీజ్ మాత్రమే ఆ డెయిరీ సరఫరా చేస్తుందని లోకేశ్ తెలిపారు. 'హెరిటేజ్ లిస్టెడ్ కంపెనీ. మా సంస్థపై వైకాపా నాయకులు సెబీకి ఫిర్యాదు చేశారు. ఏమైనా ఆధారాలు చూపించగలిగారా?' అని నిలదీశారు. 'సంబంధం లేని విషయంతో నాలుగు రోజులు శాసనమండలి సమావేశాలు జరగకుండా అడ్డుపడ్డ వైకాపా సభ్యులు.. ఇప్పుడు బడ్జెట్‌పై చర్చించాలని కోరడంలో అర్థం లేదు. సమావేశాల్ని అడ్డుకున్నప్పుడు వారికా విషయం తెలియదా?' అని లోకేశ్ ప్రశ్నించారు. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై మంగళవారం శాసనసభలో చర్చిస్తామని తెలిపారు.

జగన్ వస్తానంటే నేనే టికెట్ తీస్తా

టీ-20 క్రికెట్ వరల్డ్‌కప్ పోటీల్లో భారత్ ఫైనల్స్‌కు చేరితే మ్యాచ్ చూసేందుకు కచ్చితంగా వెళ్తానని లోకేశ్ తెలిపారు. పులివెందుల ఎమ్మెల్యే వస్తానంటే ఆయనకూ టికెట్ తానే తీసుకుంటానని పేర్కొన్నారు. 'పార్టీలో సీనియర్లు, జూనియర్లకు సమానంగా ప్రోత్సాహం ఉంటుంది. నాయకులకు వారి సొంత బూత్‌లలో ఎన్ని ఓట్లు వచ్చాయన్నదాన్నిబట్టే పార్టీలో గుర్తింపు ఉంటుంది. నాతో సహా ఎవరికైనా ఇదే వర్తిస్తుంది. సొంత బూత్‌లోనే ప్రభావం చూపలేనివారు.. ఇక నాయకత్వం ఏమిస్తారు?' అని ఆయన వ్యాఖ్యానించారు.

ఉగాదికి మెగా జాబ్ క్యాలెండర్: మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: ఉగాదికి మెగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయనున్నట్లు మంత్రి లోకేశ్ ప్రకటించారు. అందులోనే ఉపాధ్యాయ పోస్టులూ ఉంటాయని తెలిపారు. 'ఉద్యోగాల భర్తీలో వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లు అమలు చేయాలి. జోనల్ రీ నోటిఫికేషన్ ప్రెసిడెన్షియల్ ఆర్డర్ కూడా వచ్చింది. అన్ని శాఖలూ కలిసికట్టుగా పనిచేస్తున్నాయి' అని వివరించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు కూన రవికుమార్, మురళీమోహన్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ◆ 'దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా ఏపీలోని కేజీబీవీల్లో అడ్మిషన్లు ఉన్నాయి. రెండేళ్లుగా ఫలితాలు బాగా మెరుగుపరిచాం. ఈ పాఠశాలలు కేంద్ర ప్రాయోజిత పథకం కింద అమలవుతున్నాయి. జీతాలు పెంచాలన్నా, ఏ నిర్ణయం తీసుకోవాలన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేయాలి. జీతాల పెంపుపై కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను సంప్రదిస్తే ఆయన సానుకూలంగా స్పందించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలోని కేజీబీవీల్లో జీతాలు అధికంగా ఉన్నా మరింత బడ్జెట్ పెంచాలని కేంద్రమంత్రిని కోరా' అని వివరించారు.

రూ.500 కోట్ల సాస్కీ నిధులతో గురుకుల భవనాలు

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: 'రాష్ట్రంలో 20 బీసీ గురుకులాల్లో కొత్త భవనాల నిర్మాణానికి సాస్కీ పథకం కింద రూ.500 కోట్లు మంజూరు చేశాం. నూతనంగా 10 బీసీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నాం. ఆరు గురుకుల పాఠశాలల్ని బాలికల జూనియర్ కళాశాలలుగా ఉన్నతీకరిస్తున్నామ'ని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ గ్రాంట్లపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో సోమవారం ఆమె మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు బీసీ విద్యార్థులు చదువుకోవడం ఇష్టం లేదని, అందుకే ఆయన హయాంలో హాస్టళ్లు, గురుకులాలకు సరిపడా నిధులివ్వలేదని ఆరోపించారు. వైకాపా హయాంలో డైట్‌ఛార్జీల కింద రూ.



110 కోట్ల బకాయిలు పెట్టారని, తమ ప్రభుత్వం ఆ మొత్తం చెల్లించిందని చెప్పారు. 'ఆదరణ 3.0 పథకానికి రూ.1,000 కోట్లతో ఆధునిక పరికరాలు ఇస్తున్నాం. ఏప్రిల్ 1 నుంచి మగ్గం నేసే చేనేతలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తాం' అని మంత్రి వివరించారు. 'స్థానిక సంస్థల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించేందుకు ఇటీవలే రాజీవ్‌రంజన్ మిశ్రా నేతృత్వంలో డెడికేటెడ్ కమిషన్ నియమించాం. చట్టసభల్లో బీసీలకు 33% రిజర్వేషన్ కల్పించేందుకు అసెంబ్లీలో తీర్మానించి, కేంద్రానికి పంపాం. నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34% రిజర్వేషన్లకు చర్యలు తీసుకుంటున్నాం' అని సవిత తెలిపారు.


శాసనమండలిలో వైకాపా ఎమ్మెల్సీల నిరసన

- 20వ తేదీ నాటి వీడియో ఫుటేజీ ఇవ్వాలని పట్టు
- వారితో పాటు పాల్గొన్న అనంతబాబు

ఈనాడు, అమరావతి: శాసనమండలిలో వైకాపా ఎమ్మెల్సీలు సోమవారం ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ప్రభుత్వం ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోందని ఆరోపించారు. ఈనెల 20న.. శుక్రవారం మండలిలో జరిగిన కార్యకలాపాలకు సంబంధించి పూర్తి వీడియోతో పాటు, ఛైర్మన్ పోడియం వద్ద కెమెరా ఫుటేజీ ఇవ్వాలని కోరారు. మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆ సమయంలో ఛైర్మన్ వద్ద ఉన్నారు. తమ పార్టీ ఎమ్మెల్సీలు బయట నిరసన తెలియజేస్తుండగా.. బొత్స బయటకు వచ్చి వారిని ఛైర్మన్ ఛాంబర్‌లోకి తీసుకువెళ్లారు. తాము అడిగినట్లుగా ఫుటేజీని అందించేందుకు ఛైర్మన్ హామీ ఇచ్చినట్లు తర్వాత ఎమ్మెల్సీలు వెల్లడించారు. అయితే, ఈ నిరసనలో దళిత యువకుడిని హత్య చేసి, మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన కేసులో నిందితుడు, ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న ఎమ్మెల్సీ అనంతబాబు కూడా పాల్గొన్నారు. అనంతబాబును పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు గతంలో వైకాపా ప్రకటించినప్పటికీ ఆయన ఆ పార్టీ ఎమ్మెల్సీలతో పాటే సభకు వస్తున్నారు.

శుక్రవారం ఏం జరిగిందంటే..: వైకాపా ఎమ్మెల్సీలు వేంకటేశ్వరస్వామి ఫొటోలతో ఈ నెల 20న సభలో నిరసన తెలిపారు. ఆ సమయంలో వారు కాళ్లకు చెప్పులు, బూట్లు ధరించి ఉన్నట్లు ఫొటోలు, వీడియోలు బయటకొచ్చాయి. దీనిపై అభ్యంతరం తెలిపిన వైకాపా ఎమ్మెల్సీలు ఆ రోజు సభా కార్యకలాపాలకు సంబంధించిన పూర్తి వీడియో ఫుటేజీ ఇవ్వాలని ఛైర్మన్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. మరోపక్క, ఇదే విషయంపై విచారణ జరిపి బడ్జెట్ సమావేశాలు ముగిసిన వారం రోజుల్లోగా నివేదిక సమర్పించాలని అసెంబ్లీ సెక్రటరీ జనరల్‌ను మండలి ఛైర్మన్ ఆదేశించారు.

శాంతిభద్రతల సమస్యపై ప్రశ్నిస్తాం: బొత్స



ఈనాడు, అమరావతి: 'రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి. కక్షలు, కార్పణ్యాలతో అరెస్టులు చేస్తూ పోలీసులు చట్టాన్ని చేతిలోకి తీసుకుంటున్నారు. శాంతిభద్రతలపై జరిగే చర్చల్లో ఈ పరిస్థితిపై ప్రశ్నిస్తాం' అని శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. మీడియా పాయింట్‌లో సోమవారం మాట్లాడారు. రాష్ట్రంలో రైతులు పడుతున్న ఇబ్బందులపై వ్యవసాయంపై జరిగే చర్చలో, దేవదేవుడిపై సీఎం చంద్రబాబు వేసిన అపవాదులు, హెరిటేజ్-ఇందాపూర్ అంశాలపైనా చర్చలో నిలదీస్తామని స్పష్టం చేశారు.

'కల్తీ నెయ్యి'పై నేడు శాసనసభలో చర్చ

ఈనాడు, అమరావతి: తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా అయిన వ్యవహారంపై మంగళవారం శాసనసభలో లఘు చర్చ నిర్వహించనున్నారు. అంతకుముందు పలువురు దివంగత మాజీ సభ్యుల మృతిపట్ల వారి కుటుంబసభ్యులకు సంతాపాన్ని తెలిపేందుకు సంతాప ప్రతిపాదన ఉంటుంది. బడ్జెట్‌లో శాఖలవారీగా డిమాండ్లు, గ్రాంట్లపై మూడో రోజు చర్చలో భాగంగా పరిశ్రమలు-వాణిజ్య, పర్యాటకం-సాంస్కృతిక, ఆబ్కారీ, రవాణా, యువజన, క్రీడలు, కార్మిక-కర్మాగారాలు-బాయిలర్లు బీమా వైద్య సేవల శాఖల మంత్రులు వారి శాఖలకు సంబంధించి డిమాండ్ల ఆమోదం కోసం సభలో ప్రతిపాదిస్తారు.
◆ వ్యవసాయంపై బుధవారం, తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వ్యవహారంపై ఈ నెల 26న శాసనమండలిలో చర్చ నిర్వహించనున్నారు.

రూ.200 కోట్లతో జైళ్ల ఆధునికీకరణ: అనిత

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో జైళ్ల ఆధునికీకరణ కోసం వచ్చే నాలుగేళ్లలో రూ.200 కోట్లు ఖర్చు చేయనున్నట్లు హోం మంత్రి వంగలపూడి అనిత ప్రకటించారు. కేంద్రం ఇందుకోసం అందించే నిధులతోపాటు అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం తరఫున కూడా ఖర్చు చేయనున్నామని చెప్పారు. ఆధునికీకరణ ప్రాజెక్టులో భాగంగా జైళ్ల పటిష్ఠ నిర్వహణ, పర్యవేక్షణ, ఖైదీల భద్రత కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించనున్నట్లు వెల్లడించారు. జైళ్లు అంటే శిక్షలే కాదు, సంస్కరణలు కూడా అమలుచేయాలని నిర్ణయించామని మంత్రి తెలిపారు. జైళ్లు, సంస్కరణ సర్వీసుల బిల్లు-2026 శాసనసభలో సోమవారం ప్రవేశపెట్టినప్పుడు, బిల్లు సభ ఆమోదం పొందాక హోం మంత్రి మాట్లాడారు.

నాలుగేళ్లుగా... నరమేధం!

ప్రముఖ రచయిత జార్జ్ ఆర్వెల్ ఈసడించినట్లు విధ్వంసానికి మారుపేరైన యుద్ధాల వల్ల విపరీతమైన ప్రాణనష్టమే కాకుండా- తరాల మానవ శ్రమ ఫలితమంతా నాశనమవుతుంది. సహజ వనరులు, మౌలిక వసతులతో పాటు శాంతియుత జీవనమూ ఛిద్రమవుతుంది. కరవులూ వ్యాధులను సైతం మోసుకొచ్చే వినాశకర సమరాలు, సాయుధ ఘర్షణలు గడిచిన వందేళ్లలో ప్రపంచ వ్యాప్తంగా 23 కోట్ల మందిని పొట్టనపెట్టుకున్నాయి. గత శతాబ్దం తొలినాళ్లలో నాలుగేళ్ల పాటు సాగిన మొదటి ప్రపంచ యుద్ధం రెండు కోట్ల మందిని బలితీసుకుంటే- రెండో విశ్వ సంగ్రామం ఆరేళ్లలో ఎనిమిదిన్నర కోట్ల బతుకులను బుగ్గిచేసింది. 2003-11 మధ్యకాలంలో ఇరాక్ యుద్ధం పదిలక్షల మంది ఉసురు తీసింది. సుదీర్ఘంగా కొనసాగిన వియత్నామ్ పోరు సుమారు ముప్పై లక్షల జీవితాలను చిదిమేసింది. నేటికి సరిగ్గా నాలుగేళ్ల క్రితం ఎగసిపడిన రష్యా-ఉక్రెయిన్ యుద్ధజ్వాలల్లో ఇంతవరకు ఇరువైపులా దాదాపు అయిదు లక్షల మంది మరణించారు. అమెరికా ఆధ్వర్యంలో శాంతి చర్చలు జరుగుతున్నా ఉక్రెయిన్‌పై ఆగని భీతావహ దాడులు క్రెమ్లిన్ యుద్ధ పిపాసకు అద్దం పడుతున్నాయి. ప్రపంచం గుండెలపై పెనుకుంపటిగా పరిణమించిన ఈ కర్కశ కదనానికి ముగింపు ఎప్పుడన్నదే తెలియట్లేదు!

ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని కాలరాస్తూ, మౌలిక సదుపాయాలే లక్ష్యంగా బాంబులు గుమ్మరిస్తూ అక్కడి సాధారణ జనజీవనాన్ని రష్యా నరకప్రాయం చేస్తోంది. మాస్కో విచ్చలవిడి దాడుల మూలంగా ఉక్రెయిన్ పంటభూముల్లో 16శాతం దెబ్బతిన్నాయి. ధాన్యం, నూనెగింజల దిగుబడులు 18శాతం క్షీణించాయి. కీవ్ నుంచి గోధుమ, పొద్దుతిరుగుడు ఎగుమతులు సన్నగిల్లడంతో చాలా ఆఫ్రికా, ఆసియా దేశాల్లో ఆహార అభద్రత నెలకొంది. అటు రష్యా సైతం అఫ్గానిస్థాన్ యుద్ధంతో పోల్చితే, ఉక్రెయిన్‌పై దండయాత్రలోనే సైనిక నష్టాన్ని ఎక్కువగా చవిచూసింది. కీవ్‌పై కయ్యానికి దిగినందుకు అగ్రరాజ్యాలు విధించిన ఆంక్షలను మాస్కో తట్టుకుని నిలిచినా- పన్నుల మోత, నిత్యావసర ధరల వాతలతో రష్యన్లు విలవిల్లాడుతున్నారు. యుద్ధంలో కూరుకుపోయిన రష్యా ఇప్పుడు శ్రామికుల కొరతతో అల్లాడుతోంది. సర్వశక్తులనూ పోరుపైనే కేంద్రీకరించడం వల్ల ఆర్థిక వృద్ధి మందగించింది. ఎడతెగని యుద్ధం తమకే చేటు చేస్తున్నా శాంతిచర్చల్లో పట్టువిడుపులకు రష్యా అధినేత పుతిన్ ససేమిరా అంటున్నారు. అదే సమయంలో తమ భద్రతపై ఉక్రెయిన్‌లో నెలకొన్న అపనమ్మకాలు సంధి యత్నాలను పెళుసుబారుస్తున్నాయి!

ముష్కర మూకల అంతమే ధ్యేయమంటూ గాజాను చెరబట్టిన ఇజ్రాయెల్ అక్కడ 67వేల మంది పాలస్తీనీయులను చంపేసింది. 92శాతం ఇళ్లను నాశనం చేసింది. గత అక్టోబరులో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ధిక్కరిస్తూ నేటికీ జాతిహననాన్ని కొనసాగిస్తోంది. తాను పదవిలోకొస్తే యుద్ధాలను ఆపేస్తానని బీరాలు పలికిన ట్రంప్- ఇజ్రాయెల్ మారణకాండను గుడ్లప్పగించి చూస్తున్నారు. ఎనిమిది యుద్ధాలను ఆపిన తనకెందుకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వరని పళ్లుకొరుకుతున్న ఆయన- నిరుడు ఇరాన్ అణుశుద్ధి కేంద్రాలపై ఏకపక్షంగా దాడులు జరిపి ప్రపంచాన్ని పెను ఉద్రిక్తతల్లోకి నెట్టారు. ఇప్పుడేమో ఇరాన్ మెడలు వంచైనా అణుఒప్పందాన్ని సాకారం చేసుకోవాలనే పంతంతో కీలక రక్షణ వ్యవస్థలను పశ్చిమాసియాలో మోహరిస్తూ మరో యుద్ధానికి ఆవాహన పలుకుతున్నారు. ఇప్పటికే అంతూదరీలేని కదనాలు మానవతా పతాకాన్ని అవనతం చేస్తున్నాయి. వాటికి చరమగీతం పాడటంతోపాటు కొత్త యుద్ధాలు రాజుకోకుండా ప్రపంచ దేశాలన్నీ మాటామంతీ జరపాలి. విశ్వశాంతి దీపాన్ని మళ్లీ దేదీప్యమానం చేసేందుకు దౌత్యపరమైన అన్ని ప్రయత్నాలూ చేయాలి!

దారి చూపుతోంది మనవారే!

రోజూ లక్షలమంది వాహనదారులు సురక్షితంగా, వేగంగా ప్రయాణించడానికి స్మార్ట్‌ఫోన్లు, జీపీఎస్ ఆధారిత నావిగేషన్ వ్యవస్థలను వాడుతున్నారు. ఈ ప్రయాణాలకు మన దేశం నుంచే మార్గనిర్దేశనం(నావిగేషన్) జరుగుతోంది. మ్యాపింగ్, లొకేషన్‌ను గుర్తించే సాంకేతికతలో భారత్ నిశ్శబ్దంగా ప్రపంచ శక్తిగా ఎదిగింది.

ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది వాడుతున్న డిజిటల్ మ్యాపులకు వెన్నుదన్నుగా ఉన్న ఇంటెలిజెన్స్‌ను రూపొందించి, నిర్వహిస్తున్నది భారత్‌లోని బ్యాక్ ఆఫీస్ నావిగేషన్ బృందాలే. రహదారి వ్యవస్థలో మార్పుచేర్పులను ఎప్పటికప్పుడు మ్యాపుల్లో చేరుస్తూ, కచ్చితమైన రూట్లను సూచిస్తూ, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించేలా జాగ్రత్తపడుతూ భారతీయ నిపుణులు యావత్ ప్రపంచ నావిగేషన్ యంత్రాంగాన్ని భద్రంగా, స్మార్ట్‌గా ఉంచుతున్నారు. ఇవాళ నావిగేషన్ అంటే రహదారులపై ఏ మలుపు తిరగాలో, ఎక్కడ మలుపు తిరగకూడదో సూచించడం మాత్రమే కాదు. ప్రధాన రహదారులపైన, రహదారులు లేనిచోట, పెద్ద భవనాల మాల్స్‌లో, విమానాశ్రయాల అంతర్గత దారుల్లో, విమానాశ్రయ రన్‌వేలపై పైలట్లకు మార్గదర్శనం చేయడం (ఏరోనాటికల్ మ్యాపింగ్ డేటాబేస్-ఏఎండీబీ) కూడా నావిగేషన్‌లో భాగాలే.



వీటన్నింటినీ కనిపెట్టుకుని ఉంటున్న భారత్‌లోని బృందాలు బ్యాక్ ఆఫీస్ కార్యకలాపాలకే పరిమితం కావడం లేదు. అవి నావిగేషన్ సాఫ్ట్‌వేర్‌ను, ప్రపంచ మ్యాపులనూ రూపొందిస్తున్నాయి. 180కిపైగా దేశాల్లో వాహనాలు నడవడానికి డేటా ప్రాసెసింగ్ సేవలను అందిస్తున్నాయి.

తక్కువ ఖర్చులో భారీగా కార్యకలాపాలు

నావిగేషన్ వేదికలు ఉపగ్రహ చిత్రాలు, జీపీఎస్ సంకేతాలపై మాత్రమే ఆధారపడవు. రూట్లను కచ్చితంగా గుర్తించడానికీ, వాటిలో ఎప్పటికప్పుడు వచ్చే మార్పులను గమనించడానికీ, డేటాను ధ్రువీకరించడానికీ, స్థానిక ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా రవాణా నిర్వహణకు నిరంతర మానవ జోక్యం అవసరమవుతుంది. ప్రపంచవ్యాప్త క్లయింట్ల కోసం భారత్‌లోని నావిగేషన్ బ్యాక్ ఆఫీస్ సిబ్బంది జీఐఎస్ సాధనాలను ఉపయోగించి రోడ్లు, జంక్షన్లు, సందులు, మలుపు తిరగడంపై ఆంక్షలు, వేగ పరిమితులు తదితరాల డిజిటలీకరణకు తోడ్పడుతున్నారు. ఒకచోట నుంచి మరొకచోటికి వెళ్లడానికి ఉత్తమమైన మార్గాన్ని చూపడం; సర్వీస్‌రోడ్లు, ఫ్లైఓవర్లు, అనధికారిక దారిమళ్లింపుల వంటివాటిని సూచించడం నావిగేషన్ కంటెంట్ ధ్రువీకరణ కిందికి వస్తాయి. రోడ్ల మూసివేత, నిర్మాణ పనులు జరుగుతున్న స్థలాలు, ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను గుర్తించి వేరే దారి చూపడం కూడా నావిగేషన్‌లో కీలకాంశాలే. వ్యాపార సంస్థల చిరునామాలను, వాటిలో ఎప్పటికప్పుడు వచ్చే మార్పులను వెల్లడించడం, క్రమపద్ధతిలో లేని చిరునామాలను పొందికగా అమర్చడం వంటివీ భారతీయ నిపుణులే చేస్తున్నారు. భవిష్యత్తులో డ్రైవర్‌రహిత మోటారు వాహనాలు వచ్చినప్పుడు వాటికి నావిగేషన్ డేటానూ మన బ్యాక్ ఆఫీస్ బృందాలే అందించనున్నాయి. ఐరోపా, ఆసియా, అమెరికా ఖండాల్లోని క్లయింట్లకు కావాల్సిన సేవలను కూడా మన బృందాలే అందిస్తాయి.

వ్యక్తిగత, ప్రజారవాణా వాహనాలు, విమానాలకు మార్గదర్శనం చేయడం, మొబైల్ యాప్‌తో ఉబర్, ఓలా వంటి సర్వీసులను పిలవడం ఆన్‌రోడ్ నావిగేషన్ కిందకు వస్తాయి. ఈ సమాచారంతో పాటు బ్యాక్ ఆఫీసు బృందాలు జంక్షన్లు, ఫ్లైఓవర్లు, వేగపరిమితులు, ట్రాఫిక్ సిగ్నల్స్‌తో కూడిన సవివర డిజిటల్ మ్యాపులనూ అందిస్తున్నాయి. ఎప్పటికప్పుడు వచ్చే మార్పులను వాటిలో పొందుపరుస్తాయి. రోడ్లు లేనిచోట స్థానిక భౌగోళిక స్వరూపం, ఉపగ్రహ చిత్రాలు, జీపీఎస్ ట్రాక్‌ల ఆధారంగా ఆఫ్‌రోడ్ నావిగేషన్‌తో మార్గనిర్దేశనం జరుగుతుంది. రక్షణ, విపత్తుల నిర్వహణ, గనుల తవ్వకం, వ్యవసాయం, సాహస యాత్రలకు ఇది ఉపకరిస్తుంది. భారీ మాల్స్, ఆస్పత్రులు, మెట్రో స్టేషన్లు, విమానాశ్రయాల్లో జీపీఎస్ లేకపోయినా వైఫై, బ్లూటూత్ సౌకర్యాలు ఉన్న సెల్‌ఫోన్ సాయంతో గమ్యాలను, ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలను గుర్తించడానికి ఇండోర్ నావిగేషన్ ఉపకరిస్తుంది. ఏరోనాటికల్ మ్యాపింగ్ డేటాబేస్ విమానాశ్రయాల్లో గేట్లు, రన్‌వేల మధ్య విమానాలకు మార్గదర్శనం చేస్తాయి. జీపీఎస్ శిక్షణ పొందిన, ఇంజినీరింగ్ ప్రతిభావంతులకు భారత్ నెలవు కావడంతో ఈ రంగంలో ఇండియా అగ్రగామిగా ఎదిగేందుకు తోడ్పడుతోంది. తక్కువ ఖర్చులో భారీగా కార్యకలాపాలు నిర్వహించే సౌలభ్యం మనదేశంలో ఉంది. ప్రపంచ దేశాలకు 24 గంటలూ సేవలు అందించగలగడం, సంక్లిష్ట రహదారి వ్యవస్థలపై, నియంత్రణ వ్యవస్థలపై అవగాహన ఉండటం, ఆంగ్లంలో సంభాషించే సామర్థ్యం ఉండటం వల్ల దేశవిదేశీ సంస్థలు మన బ్యాక్ ఆఫీస్ బృందాలపై ఆధారపడుతున్నాయి. గూగుల్, ఆపిల్, బాష్, కాంటినెంటల్, మ్యాప్‌మై ఇండియా వంటి సంస్థలు నావిగేషన్ కాంట్రాక్టులను మన బృందాలకే ఇస్తున్నాయి. యంత్రాలు, యంత్రపరికరాలు, మోటారు వాహనాలను తయారు చేసే సువిశాల ఫ్యాక్టరీల్లో ఇండోర్ నావిగేషన్‌కూ మన బృందాలు తోడ్పాటు అందిస్తున్నాయి.

చిన్న పట్టణాలకు విస్తరించాలి

ఇండియా కేవలం మ్యాపల కోసం బ్యాక్ ఆఫీస్‌గానే కాకుండా, ప్రపంచ నావిగేషన్ కార్యకలాపాల నాడీ కేంద్రంగా ఎదిగింది. విమానయాన భద్రతకు ప్రాధాన్యం, బృహత్తర భవనాలు, పారిశ్రామిక కాంప్లెక్స్‌లలో ఇండోర్ నావిగేషన్ అవసరం విస్తరిస్తున్నకొద్దీ భారతీయ నావిగేషన్ నిపుణులకు గిరాకీ పెరుగుతోంది. విమానాశ్రయాల ఆధునికీకరణ, భద్రతా ప్రమాణాల ప్రాధాన్యం వల్ల రాబోయే ఏఎండీబీకి డిమాండ్ రెండు రెట్లు పెరుగుతుందని అంచనా. స్మార్ట్ మౌలిక వసతుల ప్రాజెక్టులతో ఇండోర్ నావిగేషన్ వేగంగా విస్తరిస్తుంది. భారతీయ నావిగేషన్ రంగం స్వదేశంలో కార్యకలాపాలను విస్తరించడానికి, విదేశీ మ్యాపింగ్ కంపెనీలను ఆకర్షించడానికి వీలుగా రెండో, మూడో అంచె నగరాల్లో ప్రత్యేక జియోస్పేషియల్, మొబిలిటీ టెక్నాలజీ పార్కులను ఏర్పాటు చేయాలి. మ్యాపింగ్, జీఐఎస్, ఏఐ ఆధారిత నావిగేషన్‌లో ప్రత్యేక కోర్సులను ప్రవేశపెట్టాలి. విశ్వవిద్యాలయాలు, పరిశ్రమల భాగస్వామ్యంతో సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లను అందించడం ద్వారా భవిష్యత్తు అవసరాలకు తగినట్లుగా ప్రతిభావంతులను తీర్చిదిద్దవచ్చు. ప్రస్తుతం ఉన్న బ్యాక్ ఆఫీస్ సిబ్బందికి ఏఐ పర్యవేక్షణ, వ్యాలిడేషన్‌లో నైపుణ్యాన్ని పెంచడం ద్వారా, మారుతున్న ఆటోమేషన్ నావిగేషన్ వ్యవస్థలో భారత్ తన పోటీతత్వాన్ని నిలబెట్టుకోవాలి. ప్రపంచ డిజిటల్ మ్యాపింగ్, నావిగేషన్ మార్కెట్ పరిమాణం రాబోయే రోజులలో ఏడాదికి దాదాపు 15శాతం చక్రీయవృద్ధి (సీఏజీఆర్)తో విస్తరించనుంది. ఉపాధి అవకాశాలను భారీగా సృష్టించనుంది. ఇండియా ఈ సువర్ణావకాశాన్ని అందిపుచ్చుకోవాలి.



రమేశ్ పైడిపల్లి
లొకేషన్ ఇంటెలిజెన్స్, జీఐఎస్ నిపుణులు
కో-ప్రమోటర్, డైరెక్టర్, ఎస్‌వైఎంఎన్‌ఎస్ నెట్‌వర్క్స్



ఇదేం చదువు?

'ఏంటి సార్ పిల్లల్ని ఇలా పరుగెత్తిస్తున్నారు? ఆరో తరగతి పిల్లలకు కైనమాటిక్స్ ఏంటి? అదీ వారం రోజుల్లో పదేసి ఫార్ములాలు చెప్పేసి, లెక్కలు చేసెయ్యమంటున్నారు. పోయిన వారంలో ఎలక్ట్రిసిటీ, ఆ ముందు వారంలో మాగ్నెటిజం అయిపోగొట్టారు...' అంటూ శ్రీకర్ వాళ్ల నాన్న ఆనంద్, స్కూల్ ప్రిన్సిపాల్‌తో మొరపెట్టుకున్నాడు.

'ఇవన్నీ ఇప్పటినుంచీ నేర్చుకోకపోతే మంచి ర్యాంకు ఎలా వస్తుంది? ఐఐటీలో సీటెలా వస్తుంది? అన్ని ఐఐటీ స్కూళ్లలో ఇలానే చెబుతారు' అన్నాడు ప్రిన్సిపాల్.

'కానీ... వారానికో చాప్టర్ మారిపోతుంటే వాటిని అర్థం చేసుకునే సమయం ఏది పిల్లలకు? కాన్సెప్ట్ అర్థం కావాలి కదా. పైపెచ్చు వారానికో పరీక్ష పెడుతున్నారు. అందులో మార్కులు రాకపోతే కొడుతున్నారు కూడా! మా అబ్బాయి ఆ భయంతోనే ఈరోజు స్కూలుకు రాలేదు' బాధగా చెప్పాడు ఆనంద్.

'మీ అబ్బాయికి ఏం అర్థం కాలేదో చెప్పమనండి... ఓ నాలుగు ఎక్స్‌ట్రా క్లాసులు పెట్టిస్తా, సెట్ అయిపోతాడు' తేలిగ్గా అనేశాడు ప్రిన్సిపాల్.

'ఇప్పటికే ఆడుకోవడానికి టైమ్ లేదంటే ఇంకా ఎక్స్‌ట్రా క్లాసులేంటండీ. ఒక్కసారి ఆలోచించండి పిల్లలు ఎంత ఒత్తిడికి లోనవుతున్నారో. గుడ్డు పొదిగి కోడి పిల్ల బయటికి రావడానికి 21 రోజులు పడుతుంది. కాదు వారం రోజుల్లోనే పిల్ల బయటికి రావాలి, కావాలంటే మూడు కోళ్లను గుడ్డు మీద కూర్చోబెడతానంటే... పిల్ల రాదు. బరువు (స్ట్రెస్) తట్టుకోలేక గుడ్డు పగిలినా పగిలిపోతుంది. పిల్లలు కూడా అంతే అండీ' అని చెప్పాడు ఆనంద్.

'కథలకేం కానీ ఇప్పుడు మీకేం కావాలసలు' చికాగ్గా అడిగాడు ప్రిన్సిపాల్.

'ఏమీలేదు సార్. సిలబస్ పిల్లల వయసుకు తగ్గట్టుగా కాస్త మెల్లగా బోధించండి. సబ్జెక్టు నచ్చి, అర్థమై, ఇష్టంగా చదివినప్పుడే ఆ చదువుకు ప్రయోజనం'.

'అలాంటి ఆదర్శాలన్నీ చెప్పడానికి బాగుంటాయి కానీ ప్రాక్టికల్‌గా అసాధ్యం. అయినా మీరు తప్ప మిగతా పిల్లల తల్లిదండ్రులెవరూ ఇలా అడగలేదు' నిష్ఠూరంగా అని లేచివెళ్లిపోయాడు ప్రిన్సిపాల్.

ఆ మాటలు విని ఆనంద్ నిరుత్తరుడయ్యాడు. ఇంటికి దగ్గరగా ఉందని, మంచి స్కూల్ అని అందరూ చెప్పారని పిల్లాణ్ని ఇక్కడ చేర్పించాడు. మరీ ఆరో తరగతినుంచే ఐఐటీ పాఠాలను రుద్దుతారని ఊహించలేదు. అర్థం కాని పాఠాలు బట్టీ పట్టలేక పిల్లాడు సతమతమైపోతున్నాడు. మిగతా పిల్లల తల్లిదండ్రులు ఎందుకు ఈ విషయం పట్టించుకోవడం లేదో ఆనంద్‌కి అర్థం కాలేదు. తన ఒక్క పిల్లాడి కోసం స్కూల్ పద్ధతి మార్చుకోదు. కాబట్టి తానే ఏదైనా చేయాలనుకున్న ఆనంద్ పిల్లాణ్ని వేరే స్కూల్లో చేర్పించాలని నిర్ణయించుకున్నాడు. అక్కడ ఆటలకు, ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌కి తగిన ప్రాధాన్యమిస్తారని, ఏ పోటీ పరీక్షలకు చదివించరని ముందుగానే తెలుసుకున్నాడు. అలాంటి స్కూల్‌కు శ్రీకర్ ఆడుతూ పాడుతూ వెళ్లిరావడాన్ని ఊహించుకుంటే ఆ తండ్రి మనసుకు హాయిగా అనిపించింది.

– రవితేజ బొప్పూడి




ఆరోగ్యానికి మనం తొలి ప్రాధాన్యమిస్తే జీవితంలో సాధించలేనిది అంటూ ఏదీ ఉండదు. పొద్దున్నే లేచి నిత్యం క్రమం తప్పకుండా బ్రష్ చేసుకున్నట్లే యోగా కూడా చేస్తే జిమ్‌కి వెళ్లే అవసరం రాదు, వైద్య ఖర్చులూ తగ్గుతాయి.

– వి.నానమ్మాళ్, యోగా గురు

వీరమాతలు

చరిత్రలో ఎందరో మాతృమూర్తులు తమ బిడ్డలను ధీరపురుషులుగా తీర్చిదిద్ది వీరమాతలై వెలిగారు. మహారాణులుగా వారు అంతఃపురాలకే పరిమితమైనా, సంతానాన్ని శీలవంతులుగా సంస్కరించడంలో విశేషంగా కృషి చేశారు. తెరవెనుక నిలిచినా పరోక్ష ప్రేరకులుగా తరిగిపోని స్ఫూర్తితో ప్రకాశించారు. మార్కండేయ పురాణంలో ప్రస్తావించిన రాణి మదాలస, మహాభారతంలో పరిచయమయ్యే విదుల తదితరులే అందుకు నిదర్శనం. పుత్రుల్ని సమర రంగానికి సంసిద్ధపరచడం దగ్గర నుంచి వారికి పారమార్థిక జ్ఞానాన్ని ప్రసాదించడం వరకు ఆ మహిళామూర్తులు ఘనమైన పాత్రను పోషించారు.

రాణి మదాలస యోగశాస్త్రాన్ని అభ్యసించి యోగినిగా మారింది. ఆత్మజ్ఞానాన్ని ఆర్జించి తన నలుగురు కుమారులను తేజోవంతులుగా మలచింది. జోలపాటలు పాడే నాటి నుంచే జ్ఞానబోధ చేస్తూ 'శుద్ధోసి బుద్ధోసి నిరంజనోసి...' - 'నువ్వు పరిశుద్ధ ఆత్మస్వరూపుడవు, బద్ధుడవు కావు బుద్ధుడవు, నిత్య నిరంజనుడవు' అంటూ మేల్కొలిపేది. అలా కుమారులను జాగృతపరచి, మహారాణిగానే కాదు ఆత్మజ్ఞానిగా కూడా జీవితాన్ని ధన్యం చేసుకుంది. సంతానానికి స్ఫూర్తి కలిగించడంలో ఆధునికతరం మాతృమూర్తులకూ ఆదర్శప్రాయం- విదుల. కొడుకు సంజయుడు సింధు దేశపు రాజు చేతిలో పరాజితుడై ఇంటికి చేరి, నిరాశతో దుఃఖించసాగాడు. అప్పుడు తల్లి విదుల 'నాయనా! ఎందుకు ఆ నైరాశ్యం? యుద్ధంలో గెలుపోటములు సహజం. పొగలు గక్కే కట్టెలాగా చిరకాలం బతికేకన్నా, క్షణ కాలం జ్వలించినా ప్రకాశాన్నిచ్చే నిప్పు కణికలా జీవించడం ఉత్తమం' అని చైతన్యపరిచింది. 'విజయమో, వీరమరణమో' అంటూ కొడుక్కి వీరతిలకం దిద్ది సమరాంగణానికి సాగనంపింది. సంజయుడు అజేయుడై తిరిగి వస్తే సగర్వంగా స్వాగతం పలికింది.



అంతర్యామి

ఆ మాతృమూర్తుల విజయగాథలను తలపించే మహిళామణులు నవభారతంలోనూ ఉన్నారు. తన ఆశల్నీ ఆకాంక్షల్నీ బాల శివాజీకి ఉగ్గుపాలలో రంగరించిపోసింది జిజాబాయి. తల్లీతండ్రీ అన్నీ తానై శివాజీని పెంచింది. రాముడిలోని సహనం, అర్జునుడిలోని సాహసం కలగలిసిన గుణసంపన్నుడిగా తీర్చిదిద్దింది. తండ్రి కన్నా తల్లి దగ్గరే కొడుకు పరిపూర్ణుడుగా రూపుదిద్దుకుంటాడని నిరూపించింది. 'భోగలాలస లేనివాడు, దేశం కోసం ప్రాణాల్ని తృణప్రాయంగా అర్పించే యోధుడు, అశేష జనవాహినిని ముందుకు నడిపించగల ధీరుడు మన దేశానికి అవసరం. అలాంటి కొడుకును నేను ఈ భారతావనికి అందిస్తాను' అని ఆమె ప్రతిన బూనింది. ఛత్రపతి శివాజీని భరత జాతికి బహూకరించి ధన్యచరితగా మిగిలింది.

స్వామి వివేకానంద తల్లి భువనేశ్వరీదేవి కూడా కుమారుడి మహోన్నతమైన వ్యక్తిత్వంపై ప్రగాఢ ముద్రవేశారు. స్వామీజీ రామాయణ భారతాది ఇతిహాసాలు, పురాణాల్ని మాతృమూర్తి నుంచే ఆలకించారు. వివేకానందకు విలువల పాఠాలు నేర్పిన తొలిగురువు తల్లే. అందుకే 'మా అమ్మ ప్రార్థనల ఫలమే నేను. నాకోసం ఆమె ఎన్ని పూజలు చేసిందో! ఎన్ని నోములు నోచిందో! నన్నీ లోకంలోకి తీసుకురావడానికి ఒక యోగినిలా మారింది. నా జీవితం, ప్రఖ్యాతి మా అమ్మ పెట్టిన భిక్ష' అని ఓ ప్రసంగంలో ఉద్వేగభరితుడయ్యారు.


– బి.సైదులు

జోరుగా అరుదైన ఖనిజాల అన్వేషణ!



పచ్చని ప్రకృతి కోసం...

పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా పునరుత్పాదక ఇంధన వనరులపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో నిరుడు నవంబర్ చివరి నాటికి మన దేశంలో రిన్యూవబుల్ ఎనర్జీ(ఆర్ఈ) స్థాపిత సామర్థ్యం 253.96 గిగావాట్లకు చేరింది. దేశీయంగా మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో ఇది దాదాపు సగం. ఈ విషయంలో భారత్ ప్రపంచంలోనే మూడో స్థానంలో నిలుస్తోంది. మన మొత్తం ఆర్ఈ స్థాపిత సామర్థ్యంలో ఆయా విభాగాల వాటా (శాతాల్లో)...



(ఆధారం: కేంద్ర నవ, పునరుత్పాదక ఇంధన శాఖ గణాంకాలు)

విద్యుత్తు వాహనాల్లో బ్యాటరీలకు లిథియం, గ్రాఫైట్, కోబాల్ట్, మోటార్లకు రేర్ ఎర్త్ పర్మినెంట్ మాగ్నటిక్స్ (ఆర్ఈపీఎం), పవన విద్యుదుత్పత్తి చేసే గాలిమరల (విండ్ టర్బైన్ల) తయారీలో ప్రాసియోడియం, నియోడిమియం, డైస్ప్రోసియం వంటి ఆర్ఈఈలు అత్యంత కీలకం. ఏరోస్పేస్, రక్షణ రంగ ఉత్పత్తులు, సెమీ కండక్టర్ల తయారీలోనూ ఎన్నో రకాల ఆర్ఈఈ, ఆర్ఈపీఎంలు అవసరమవుతాయి. వీటిని తవ్వితీసి, శుద్ధి చేసి ఆయా అవసరాలకు తగినట్లుగా వినియోగించుకునే స్థాయిలో మనం ముందడుగు వేయాల్సి ఉంది. భారత్‌లో ముడిఖనిజాలను తవ్వితీస్తున్నా వాటిని పారిశ్రామిక అవసరాలకు వాడే స్థాయిలో ప్రాసెసింగ్‌పై దృష్టి సారించలేదు. దీంతో చైనా వంటి దేశాల మీద ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోంది. అంతర్జాతీయంగా ఏవైనా ఇబ్బందులు తలెత్తి సరఫరా గొలుసు వ్యవస్థ ప్రభావితమైతే ఎలక్ట్రిక్ వాహనాలు, విండ్ టర్బైన్లు, సెమీ కండక్టర్లు, కొన్ని రకాల రక్షణ రంగ ఉత్పత్తుల తయారీలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ నేపథ్యంలోనే కేంద్రం మైన్ టు మాన్యుఫ్యాక్చర్ ప్రణాళికతో ముందుకెళ్తోంది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, కేరళల్లో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ కారిడార్లను ఏర్పాటు చేయాలని సంకల్పించడం అందులో భాగమే.

వ్యూహాత్మకంగా ఎంపిక

రేర్ ఎర్త్ కారిడార్లకు కేంద్రం ప్రతిపాదించిన నాలుగు రాష్ట్రాల్లో మోనజైట్ బీచ్‌శాండ్ లభిస్తుంది. మోనజైట్ నుంచే ప్రాసియోడియం, నియోడిమియం, డైస్ప్రోసియం వంటి అరుదైన ఖనిజాలు లభ్యమవుతాయి. జాతీయ రహదారులతో కూడిన మెరుగైన రవాణా సౌకర్యాలు, విశాఖపట్నం, చెన్నై, కొచ్చి సహా పలు పోర్టులు అందుబాటులో ఉండటం కూడా ఈ రాష్ట్రాల్లో కారిడార్ల ఏర్పాటుపై నిర్ణయం తీసుకోవడానికి కారణం. అంతేకాదు తమిళనాడులో ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఈవీ తయారీ పరిశ్రమలు ఉన్నాయి. ఒడిశాలో లోహ, ఖనిజ పరిశ్రమలు పనిచేస్తున్నాయి. ఏపీలో పోర్టు ఆధారిత పారిశ్రామికాభివృద్ధి, ఈవీ తయారీ కేంద్రాలు, బ్యాటరీ పార్కులు నెలకొన్నాయి. ఇవే రేర్ ఎర్త్ కారిడార్ల ఏర్పాటుకు ఈ రాష్ట్రాలను అనుకూలంగా మార్చాయి. ఇక్కడ ఏర్పాటు చేసే కారిడార్లలో గనుల తవ్వకం, ఖనిజాల శుద్ధి, ప్రాసెసింగ్ చేపడతారు. ప్రధానంగా

ఆధునిక సాంకేతిక, హరిత ఇంధన, రక్షణ సంబంధ ఉత్పత్తుల తయారీలో కీలకమైన అరుదైన ఖనిజాల (రేర్ ఎర్త్ ఎలిమెంట్స్- ఆర్ఈఈ) విషయంలో స్వావలంబన దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. నాలుగు రాష్ట్రాల్లో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ కారిడార్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. అనుకున్నట్లుగా అవి పట్టాలకెక్కితే దిగుమతుల కోసం వెచ్చిస్తున్న ఎంతో సొమ్ము కలిసివస్తుంది.



రేర్ ఎర్త్ పర్మినెంట్ మ్యాగ్నెట్స్ తయారీ పరిశ్రమలు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలన్నింటినీ అభివృద్ధి చేయనున్నారు.

హరిత ఇంధనం దిశగా భారత్ భారీ లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకెళ్తోంది. గ్రీన్ ఎనర్జీ లక్ష్యసాధనలో అత్యంత కీలకమైన పనులన్నింటికీ రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ చాలా అవసరం. వీటి ఉత్పత్తి, ప్రాసెసింగ్, పరిశ్రమల్లో వినియోగం, సప్లై చైన్ నిర్వహణలో స్వావలంబన సాధించకపోతే పునరుత్పాదక ఇంధన వనరులకు మళ్లాలన్న బృహత్తర లక్ష్యసాధన సంక్లిష్టంగా మారుతుంది. పైగా విదేశాల నుంచి దిగుమతితో ఖర్చు కూడా పెరుగుతుంది. అందుకే కేంద్ర ప్రభుత్వం అరుదైన ఖనిజాలపై గత కొంతకాలంగా దృష్టి సారించింది. వీటి లభ్యతపరంగా మనం ప్రపంచంలో మూడో స్థానంలో ఉన్నాం. 48.2 కోట్ల టన్నుల ముడినిల్వలున్నట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. కానీ, వాటిని ప్రాసెస్ చేసే సామర్థ్యంలో 90 శాతం చైనా దగ్గరే ఉండటంతో అనివార్యంగా ఆ దేశం మీద ఆధారపడాల్సి వస్తోంది.

దీర్ఘకాలిక లక్ష్యాలతో ముందడుగు

అరుదైన ఖనిజాలు ముఖ్యంగా మోనోజైట్ అధికంగా లభించే బీచ్‌శాండ్ నిల్వలు మనకు అపారంగా ఉన్నాయి. గనుల తవ్వకం, ముడి ఖనిజాల్ని శుద్ధి చేయడంపై దృష్టిపెట్టి రేర్ ఎర్త్ మ్యాగ్నట్స్‌ను మనమే తయారు చేసుకోగలిగితే దిగుమతి ఖర్చును గణనీయంగా తగ్గించుకోవచ్చు. ఇది మన ఈవీలు, విండ్ టర్బైన్లు తదితరాల ఉత్పత్తి ఖర్చులనూ తగ్గించి, వాటిని తక్కువ ధరల్లో అందుబాటులోకి తెస్తుంది. మరోవైపు సరఫరాల కోసం విదేశాలపై ఆధారపడాల్సిన అగత్యం ఉండదు. ఆర్థికంగానే కాకుండా వ్యూహాత్మకంగానూ మనకిది చాలా అవసరం. ఖనిజాల తవ్వకం, శుద్ధి, కావాల్సిన ఉత్పత్తుల తయారీతో పాటు, వాటిని వినియోగించుకునే పరిశ్రమలను కూడా ఒకే కారిడార్‌లో ఏర్పాటు చేసుకుంటే రవాణా ఖర్చులు కూడా తగ్గుతాయి. ఒక్కో రేర్ ఎర్త్ కారిడార్‌లో ఈ పరిశ్రమల ఏర్పాటు ద్వారా 25 వేల నుంచి 50 వేలదాకా ఉద్యోగాలు వస్తాయని అంచనా వేస్తున్నారు. క్రిటికల్ ఎలిమెంట్స్ మిషన్, రేర్ ఎర్త్ కారిడార్లను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తే దేశీయ అవసరాలకు కావాల్సిన ఖనిజ ఉత్పత్తులను స్థానికంగానే సమకూర్చుకోవచ్చు. ఇదంతా పూర్తయ్యేందుకు దశాబ్దమైనా పట్టొచ్చు. అందుకే దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనలో వేగం తగ్గకుండా ముందుకుసాగడం ప్రభుత్వ కర్తవ్యం.

– శ్యాంప్రసాద్ ముఖర్జీ కొండవీటి

రాళ్లలో ఎన్ని రకాలో...

ఫ్రెండ్స్! మీరు ఎప్పుడైనా రాళ్లను గమనించారా? ఒక్కోటి ఒక్కో ఆకారంలో వివిధ రంగుల్లో ఉంటాయి కదా! అలా ఎందుకు ఉంటాయనే సందేహం మీకెప్పుడైనా వచ్చిందా? అసలు రాళ్లు ఎలా ఏర్పడతాయని ఆలోచించారా? దాని గురించే ఇప్పుడు తెలుసుకుందాం.

అగ్నిపర్వతాలు పేలినప్పుడు బయటికి వచ్చే లావా చల్లబడి రాళ్లలాగా మారుతుంది. వీటినే మనం అగ్ని శిలలు(ఇగ్నియస్ రాక్స్) అని పిలుస్తాం. ఇందులో ఖనిజాలు ఉంటాయి. ఉపరితలంపైకి వచ్చిన లావా పొరలు పొరలుగా ఏర్పడటం వల్ల పైపొరలో ఉన్నది తొందరగా చల్లబడుతుంది. దీన్ని బసాల్ట్ అంటాం. భూమిపై సుమారు 75శాతం ఇలాంటి శిలలే ఉంటాయి. కింద పొరలో ఉన్నది కొంచెం మెల్లగా చల్లబడుతుంది. దీనినే గ్రానైట్ అని పిలుస్తాం. భూమి ఉపరితలంపై ఉండే శిలలు గాలి, నీరు లేదా మంచు మూలంగా చిన్నచిన్న ముక్కలుగా విడిపోతాయి. అందుకే రాళ్ల ఆకారాలు వేరుగా ఉంటాయి. ఈ రాళ్లు గాలి, నదుల ద్వారా ఒకచోటు నుంచి మరో



చోటుకు కొట్టుకుపోయి పేరుకుపోతాయి. అలా చిన్నపాటి రాళ్లు ఘనపదార్థ రేణువులతో కలిసి పేరుకుపోవడాన్ని అవక్షేపం అంటారు. అలాంటివి కాలక్రమేణా గట్టిపడి శిలలుగా మారతాయి. వీటినే అవక్షేప శిలలు(సెడిమెంటరీ రాక్స్) అంటారు. ఇసుక రాయి, సున్నపు రాయి... ఇవన్నీ అలా ఏర్పడినవే. భూమి లోపల ఉండే తీవ్రమైన వేడి, పీడనం, రసాయనిక మార్పుల వల్ల ముందే ఏర్పడి ఉన్న ఇగ్నియస్, సెడిమెంటరీ రాక్స్‌లో రకరకాల మార్పులు వస్తాయి. అలా మార్పు చెందిన శిలలనే రూపాంతర శిలలు(మెటమార్ఫిక్ రాక్స్) అని పిలుస్తాం. పాలరాయి, మిగ్మాటైట్ ఆ కోవలోకే వస్తాయి. ఇలా వివిధ పరిస్థితుల కారణంగా రాళ్లు ఏర్పడతాయి. అందులో రకరకాల ఖనిజాలు ఉంటాయి కాబట్టి.. వాటి రంగుల్లో కూడా తేడా ఉంటుంది.



పదో తరగతి పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి?

- విద్యార్థుల్లో సందేహాల నివృత్తికి అవకాశం
- 'ఈనాడు-ఈటీవీ-విద్యాశాఖ ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ రేపు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. విద్యార్థులు పుస్తకాలతో కుస్తీపడుతూ ఎవరికి వారు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నారు. ప్రభుత్వం కూడా వివిధ కార్యక్రమాలు అమలు చేస్తూ వారికి ప్రత్యేకంగా బోధిస్తోంది. అయితే పరీక్షల్లో ఎలాంటి ప్రశ్నలు వస్తాయో.. మంచి మార్కులు వస్తాయో లేదో అన్న ఆందోళన అందరిలోనూ ఉంటుంది. తల్లిదండ్రులకు కూడా అనేక సందేహాలు ఉంటాయి. ఎలా చదివితే మంచి మార్కులు వస్తాయి. ఏయే సబ్జెక్టులకు ఎంత సమయం కేటాయించాలి. ఏయే చాప్టర్లలో ఎక్కువ ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నల సరళి ఎలా ఉంటుంది. సిలబస్ బయట ప్రశ్నలు కూడా అడిగే అవకాశం ఉంటుందా? మంచి మార్కులు సాధించడం ఎలా? ఇలాంటి అనేక సందేహాలు నివృత్తి చేసుకునే అవకాశాన్ని ఈనాడు కల్పిస్తోంది. దీనిలో భాగంగానే జిల్లా విద్యాశాఖాధికారితో పాటు ఆయా సబ్జెక్టుల నిపుణులు అందరినీ ఒకే వేదికపైకి తీసుకొస్తోంది.

ఉపాధ్యాయుడు	సబ్జెక్టు	ఫోన్ నంబరు
కె.బాలకృష్ణ	తెలుగు	99492 77148
జె.ఝాన్సీ	హిందీ	92929 09954
పీఆర్ సీతాకుమారి	ఇంగ్లీష్	92904 50064
కె.వాహిని	గణితం	94417 63640
కె.అంకాలరావు	భౌతికశాస్త్రం	93904 31368
వీఎస్ మల్లేశ్వరరావు	జీవశాస్త్రం	98495 01067
షాజహ్‌బేగం	సాంఘికశాస్త్రం	92939 45076
బి.దుర్గాదీప్తి	సంస్కృతం	98494 58556
ఎండీ హనీఫ్	ఉర్దూ	89786 77336

ఫోన్ చేయాల్సిన సమయం: ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తేదీ: ఫిబ్రవరి 25, బుధవారం


విద్యుత్తు అదాలత్ నేడు

సూర్యారావుపేట : విద్యుత్తు సమస్యల పరిష్కారానికి మంగళవారం ఉదయం సూర్యారావుపేటలోని విద్యుత్తు సర్కిల్ కార్యాలయంలో విద్యుత్తు అదాలత్ నిర్వహించనున్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. నగర విద్యుత్తు వినియోగదారులు బిల్లుల్లో లోపాలు, లో ఓల్టేజీ, సరఫరాలో అంతరాయాలు, మీటరు పనితీరుపై అనుమానం... తదితర సమస్యలను లిఖిత పూర్వకంగా తెలియజేస్తే పరిష్కరిస్తామని ఈఈ రవీంద్రబాబు తెలిపారు.

నగరమా.. నరకమా!

- వాహనాలతో కిక్కిరిసిన బందరు రోడ్డు
- ఇంటర్ పరీక్షల తొలి రోజే యాతన...

"ఇంటర్ పరీక్షల తొలి రోజే విజయవాడలో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. కీలకమైన బందరు రోడ్డు, బెంజి సర్కిల్ పద్మవ్యూహాన్ని తలపించాయి. పరీక్ష ముగిశాక ఒక్కసారిగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల వాహనాలు, ప్రైవేటు విద్యాసంస్థల బస్సులు ఒకేసారి రోడ్డుపైకి రావడంతో కిలోమీటర్ల కొద్దీ వాహనాలు ఆగిపోయాయి. ఎండ తీవ్రత పెరగడం, ఆపై బందరు రోడ్డు ఇసుకేస్తే రాలనంతగా కిక్కిరిసి ప్రజలు నరకం చూశారు. బెంజి సర్కిల్‌లో ట్రాఫిక్ సాధారణ స్థితికి రావడానికి గంటపైనే పట్టింది."



బందరురోడ్డులో ఇంటర్ పరీక్షలు రాసి బయటకు వచ్చిన విద్యార్థుల అవస్థలు

బెంజి సర్కిల్ పరిసరాల్లో 27 కేంద్రాలు...

ఇంటర్ పరీక్షలకు నగరంలో వివిధ ప్రాంతాల్లో 71 కేంద్రాలు ఉన్నాయి. వీటిలో నిత్యం రద్దీగా ఉండే బెంజి సర్కిల్, చుట్టుపక్కల ప్రాంతాల్లో 27 పరీక్షా కేంద్రాలను ఇంటర్మీడియట్ బోర్డు కేటాయించింది. విద్యార్థులను వదిలిపెట్టి, తిరిగి తీసుకెళ్లేందుకు కేంద్రాలకు వచ్చే తల్లిదండ్రుల కార్లు, ద్విచక్ర వాహనాలకు తోడు బస్సులు భారీగా వస్తున్నాయి. ఉదయం వేర్వేరు సమయాల్లో పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు రావడంతో పెద్దగా ఇబ్బందిలేదు. మధ్యాహ్నం 12 గంటలకు పరీక్షయ్యాక అందరూ ఒకేసారి రోడ్డెక్కడంతో పరిస్థితి దారుణంగా మారింది. కనీసం నడిచేందుకూ దారి కనిపించలేదు. అంబులెన్సులు కూడా ట్రాఫిక్‌ను దాటేందుకు అష్టకష్టాలు పడ్డాయి.



బెంజిసర్కిల్ వద్ద ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన అంబులెన్స్

నలుదిక్కులా చుక్కలు...

బందరు రోడ్డుకు ఇరువైపులా ఎక్కువ కాలేజీలు ఉన్నాయి. బెంజిసర్కిల్ నుంచి ఇందిరాగాంధీ స్టేడియం వరకు, పటమట వైపు ఆటోనగర్ వరకు వాహనాలు బారులు తీరాయి. ఈ రద్దీ ప్రభావం కేవలం బందరు రోడ్డుకే పరిమితం కాలేదు. చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపైనా పడింది. పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, శిఖామణి సెంటర్, సిద్ధార్థ, జమ్మిచెట్టు సెంటర్, తదితర ప్రాంతాల్లోనూ రద్దీ ప్రభావం కనిపించింది. – ఈనాడు, అమరావతి

ప్రత్యామ్నాయం అవశ్యం...

పరీక్షల వేళ ఇంటర్మీడియట్ బోర్డు కానీ పోలీసులకు కానీ ప్రత్యామ్నాయ ప్రణాళికను రూపొందించలేదు.

- విద్యార్థులను తీసుకొచ్చే బస్సులను కేంద్రాల వద్ద కాకుండా దూరంగా నిలిపేలా పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి, అక్కడే ఉంచేలా చూడాలి.
- కేంద్రాలకు సమీపంలో ఖాళీ రోడ్లనూ ఉపయోగించుకోవాలి.
- పరీక్షయ్యాక బస్సులన్నీ ఒకేసారి కాకుండా విడతల వారీగా పంపించాలి.
- బందరు రోడ్డు, బెంజి సర్కిల్, ఇతర ముఖ్య ప్రాంతాల్లో సాధారణ ట్రాఫిక్‌ను రెండు గంటలు అనుమతించకుండా.. ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్లిస్తే కొంత ఉపశమనం కలిగే వీలుంది.



ఆంధ్రా లయోలా జూనియర్ కళాశాల కేంద్రానికి వచ్చిన విద్యార్థులు

ఇంటర్ పరీక్షలు మొదలయ్యాయ్..

విజయవాడ సిటీ, మాచవరం, న్యూస్‌టుడే : ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం సజావుగా ప్రారంభమయ్యాయి. నగరంలోని పీబీ సిద్ధార్థ, శారదా కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని, విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించామని తెలిపారు. మాల్‌ప్రాక్టీస్‌ను నివారించేందుకు చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. డీఐఈఓ బి.ప్రభాకరరావు మాట్లాడుతూ.. జిల్లాలో 36,567 మంది పరీక్ష రాయాల్సి ఉండగా... 35,622 మంది హాజరయ్యారని వెల్లడించారు. విద్యార్థులను ఉదయం 8.30 గంటలకే కేంద్రాల్లోకి అనుమతించారు. కేంద్రాల పరిసరాలు విద్యార్థులు, తల్లిదండ్రులతో కళకళలాడాయి.

భూ సమస్యలకు కాయకల్ప చికిత్స

'క్లిక్' అయిన రెవెన్యూ క్లినిక్‌లు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం రెవెన్యూ క్లినిక్‌ల నిర్వహణ ద్వారా భూ సమస్యలను పరిష్కరించగలుగుతున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇది జిల్లాలో విజయవంతంగా అమలు అవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి 5వ తేదీన కార్యక్రమం ప్రారంభించగా.. ఈ నెల 16వ తేదీ వరకు మొత్తం 332 అర్జీలు అందినట్లు వెల్లడించారు. వీటిలో 22-ఎకు సంబంధించి 36, ఆర్వోఆర్ 59, మ్యుటేషన్లు 18, ఎఫ్-లైన్ 70, ఇతర సమస్యలకు సంబంధించి 121 వినతులు అందాయని తెలిపారు. అర్జీల్లో 97 పూర్తి స్థాయిలో పరిష్కరించినట్లు ఆయన వివరించారు.

రంజాన్ వేళలు ఇఫ్తార్: (మంగళవారం) సాయంత్రం: 6.17 సహరి: (బుధవారం) ఉదయం: 5.10



గరుడ పతాకావిష్కరణ

మంగళగిరీశా.. లక్ష్మీప్రాణేశా..

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి ధ్వజ స్తంభానికి గరుడ పతాకాన్ని ఆవిష్కరించారు. స్వామివారి కల్యాణోత్సవానికి భక్త జనులను, దేవతలను ఆహ్వానించేందుకు సూచికగా ఈ క్రతువు నిర్వహించారు. గరుత్మంతునికి నివేదన చేసిన ప్రసాదాన్ని గరుడ ముద్దలుగా సంతానం లేని దంపతులకు అందజేశారు.

వాట్సప్‌లోనే అద్దె వ్యవహారాలు

- తమిళంలోనే లావాదేవీల సంభాషణలు...
- మ్యూల్ ఎకౌంట్ల కేసులో నలుగురు నిందితులకు కస్టడీ

ఈనాడు - అమరావతి: అద్దె ఖాతాల వ్యవహారాల కోసం నిందితులు ప్రత్యేకంగా ఓ వాట్సప్ గ్రూప్ పెట్టేశారు. లావాదేవీల వ్యవహారాలు, నగదు జమ, బదిలీ, ఓటీపీలన్నీ.. దానిలోనే జరిగాయి. ఇందులో నలుగురే సభ్యులుగా ఉన్నారు. వీరు పట్టుబడినా.. ఇంకెవరు ఉన్నారో తెలియకుండా సూత్రధారులు జాగ్రత్తపడ్డారు. యనమలకుదురులో వెలుగుచూసిన మ్యూల్ ఎకౌంట్స్ కేసులో నలుగురు నిందితులను సైబర్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. తొలిరోజు సోమవారం రవికుమార్ (ఏ1), స్టీవెన్ (ఏ2), బాజి (ఏ3), దుర్గాప్రసాద్ (ఏ4)లను అద్దె ఖాతాల వ్యవహారాలపై ప్రశ్నించారు. చెన్నైవాసి సుబ్రమణి రాజా వెంకట్ పాత్రపై ఆధారాలు లభించగా ఏ5గా చేర్చారు. అతను శుక్రవారం లొంగిపోయే వీలుంది.

అంతా తమిళంలోనే... వాట్సప్ గ్రూప్‌లో నలుగురు సభ్యులు రెండేసి నెంబర్లతో ఉన్నారు. రవికుమార్, అతని సోదరుడు స్టీవెన్‌లు సభ్యులుగా ఉన్నారు. మరో ఇద్దరు చెన్నైవాసులు. ఒకరు సుబ్రమణి రాజా వెంకట్, మరొకరి వివరాలు తెలియలేదు. వీరంతా తమిళులే కావడంతో గ్రూప్‌లో సంభాషణలన్నీ తమిళంలోనే సాగాయి. ఇంకెన్ని గ్రూప్‌లు ఉన్నాయి? ఇంకెందరు ఉన్నారో.. తెలియలేదు. ఏ1, ఏ2లు.. రాజా వెంకట్ ఒక్కరే తెలుసని వెల్లడించారు.

ఫోర్జరీ సంతకంతో.. శ్రీనివాస్ అనే వ్యక్తితో ఇండియన్ బ్యాంకులో రవికుమార్.. 'శ్రీనివాస బుక్స్ అండ్ స్టేషనరీ' పేరుతో కరెంట్ ఖాతా తెరిపించాడు. తర్వాత అతని చెక్కుతో ఖాతా నుంచి డబ్బు డ్రా చేసేందుకు చెక్కుపై శ్రీనివాస్ సంతకాన్ని ఫోర్జరీ చేశాడు. దీనిని బ్యాంకు సిబ్బంది గుర్తించి నిలదీశారు. అసలు ఖాతాదారు శ్రీనివాస్‌ను పిలిపించగా... వీరి మధ్య గొడవ జరిగింది. దీంతో ఫోన్ నెంబరునూ మార్చాడు. గొడవను దుర్గాప్రసాద్ సర్దుబాటు చేశాడు. ఈకేసులో శ్రీనివాస్‌ను పోలీసులు పిలిచి విచారించి.. సాక్షిగా చేర్చే వీలుంది.

ఏకంగా 150 ఖాతాలు...

ఈ వ్యవహారాలకు 150 ఖాతాలు తెరవగా.. ఇందులో 36 మాత్రమే విజయవాడలో తెరిచినవి. మిగిలినవి ఇతర రాష్ట్రాలవి. వీటిని చెన్నైకి చెందిన నిందితులు అందజేసినట్లు తేలింది. ఇవి నాగపట్నం, కుంభకోణం, తదితర ప్రాంతాల బ్యాంకు ఖాతాలుగా తేలింది.

బంధం.. డబ్బుతో బలోపేతం...

అద్దె ఖాతాలు తెరిపించేందుకు రవికుమార్.. నిర్మలా కాన్వెంట్ వద్ద ఇండియన్ బ్యాంకుకు వెళ్లగా.. అక్కడి పొరుగుసేవల ఉద్యోగి దుర్గాప్రసాద్ పరిచయమయ్యాడు. ఇద్దరిదీ యనమలకుదురు కావడంతో బంధం ఏర్పడింది. ఇతనికి డబ్బులు అవసరమైన ప్రతిసారీ రవి నగదు ఇచ్చేవాడు. తాను డబ్బుల కోసమే అద్దె ఖాతాలను తెరిపించే విషయంలో సాయం చేసినట్లు ఏ4 వెల్లడించాడు.

34 బార్లకు నోటిఫికేషన్ జారీ

మార్చి 4న కలెక్టరేట్‌లో లాటరీ

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ నూతన బార్ పాలసీలో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో మిగిలిపోయిన 34 బార్లకు సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని 33 బార్లకు, జగ్గయ్యపేట మున్సిపాలిటీ పరిధిలో 1 బార్‌కు మార్చి 2వ తేదీ సాయంత్రం 6 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలి. వాటిని లాటరీ తీసి, కేటాయిస్తారు. లీజు 2026, మార్చి 1 నుంచి 2028, ఆగస్టు 31 వరకు ఉంటుంది. దరఖాస్తు రుసుము రూ.5 లక్షలు చెల్లించాలి. నిబంధనల ప్రకారం కనీసం 4 దరఖాస్తులు వచ్చిన బార్లకే లాటరీ తీస్తారు. మార్చి 4వ తేదీ ఉదయం 8 గంటలకు విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ తీయనున్నారు.

రాసిందే మందు.. చెప్పిందే రోగం!

- విచ్చలవిడిగా పెయిన్ కిల్లర్లు, యాంటీబయాటిక్స్ వినియోగం
- లైసెన్స్ లేకుండా నిల్వ చేసి మరీ వాడుతున్న ఆర్‌ఎంపీలు...

ఈనాడు – అమరావతి

నందిగామ, తిరువూరు, జగ్గయ్యపేట, అవనిగడ్డ, పెడన తదితర నియోజకవర్గాల్లో ఆర్‌ఎంపీలు లైసెన్స్‌లు తీసుకోకుండా రూ.లక్షల విలువైన ఔషధాలను నిల్వ చేస్తున్నారు. డ్రగ్ కంట్రోల్ అధికారుల తనిఖీల్లో పెద్దఎత్తున మందులు దొరుకుతున్నాయి. అత్యధికంగా పెయిన్ కిల్లర్ మందు బిళ్లలు, ఇంజక్షన్లు, యాంటీబయాటిక్స్ ఉండడం ఆందోళనకర పరిణామం. నొప్పి రాగానే.. తక్షణ ఉపశమనానికి విచ్చలవిడిగా పెయిన్ కిల్లర్ సూదిమందులు గుచ్చుతున్నారు. ఏ మందు వాడితే ఎవరొచ్చి చూస్తారనే.. ధోరణి వీరిలో పెరిగిపోతోంది. జ్వరం వచ్చిన రోజే తగ్గిపోవాలని. యాంటీబయాటిక్స్ ఇస్తున్నారు. అందుకే వీటినే అధికంగా నిల్వ చేస్తున్నారు.

వైద్యారోగ్యశాఖ పర్యవేక్షణ లేక.. ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లు కుప్పలుతెప్పలుగా గ్రామాల్లో వెలిశాయి. ఆర్‌ఎంపీలు కేవలం ప్రాథమిక వైద్యానికే పరిమితం కావాలి. కానీ.. క్లినిక్‌లను తెరిచేసి.. అనుబంధంగా రూ.లక్షల విలువైన మందులను నిల్వ చేసి. దర్జాగా వైద్యం అందిస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.



అరాచకం ఇలా...

- జగ్గయ్యపేట మండలం బలుసుపాడులో ఒక ఆర్‌ఎంపీ దగ్గర రూ.లక్ష విలువైన మందులు దొరికాయి.
- జగ్గయ్యపేట టౌన్‌లో మరో ఆర్‌ఎంపీ దగ్గర రూ.2 లక్షల మందులు పట్టుకున్నారు.
- పెనుగంచిప్రోలు మండలం తోటచర్లలో ఇంకో ఆర్‌ఎంపీ దగ్గర రూ.లక్ష మందులు దొరికాయి.

పట్టించుకునేదెవరు?

తిరువూరు, సమీప ప్రాంతాల్లో కిడ్నీ బాధితులు పెరగడంతో.. ఇక్కడా ఆర్‌ఎంపీలు ఎక్కువయ్యారు. నొప్పి వెంటనే తగ్గడానికి పెయిన్ కిల్లర్ ఇంజక్షన్లను విచ్చలవిడిగా వాడుతుండడంతో కిడ్నీ సమస్యల తీవ్రత పెరిగిపోతోంది. ఎవరొచ్చి చూస్తారలెమ్మని మందులనూ పెద్దఎత్తున నిల్వ చేస్తున్నారు. ఆ మందులకు గడువు ముగిసినా.. వాటినే రోగులకు ఇస్తున్నారు. మందులపై తయారీ, ముగింపు తేదీలు, బ్యాచ్ నంబర్లను చూసే పరిస్థితి గ్రామీణుల్లో ఉండదు.

పోటీ పెరిగిన వేళ...

ప్రస్తుతం ఆర్‌ఎంపీల మధ్య పోటీ పెరిగి.. నొప్పులు, జ్వరాలు, వ్యాధులకు.. తక్షణ ఉపశమనానికి పెయిన్ కిల్లర్లు, యాంటీబయాటిక్స్, గ్యాస్ బిళ్లలను ఇస్తున్నారు. 'రోగులకు వెంటనే ఉపశమనమిచ్చే మందులను ఇవ్వకపోతే.. మరొకరి దగ్గరికి వెళ్లిపోతున్నారు. దీంతో తప్పక నొప్పినివారణ మందులను ఇస్తున్నామని' ఓ ఆర్‌ఎంపీ వెల్లడించారు. అవగాహన కల్పించాల్సిన వైద్యారోగ్య శాఖ మాత్రం తీవ్ర ఫిర్యాదులొస్తేనే.. క్షేత్రానికెళ్లి క్లినిక్‌లను మూయించి.. అంతటితో సరిపెడుతోంది.

నేటి నుంచి 'రత్నాచల్'కు ఎల్‌బీహెచ్ బోగీలు

విజయవాడ (రైల్వేస్టేషన్) : విజయవాడ- విశాఖపట్నం మధ్య నడిచే రైలు నెంబరు 12717/12718 రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌ను మంగళవారం నుంచి అత్యాధునిక ఎల్‌బీహెచ్ బోగీలతో నడపనున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. ఈ రైలుకు 12 ఛైర్ కార్లు, 3 థర్డ్ ఏసీ ఛైర్‌కార్‌లు, ఒక ప్యాంట్రీ కార్, 4 జనరల్ బోగీలు, ఒక లగేజీ కమ్ దివ్యాంగుల బోగీ, ఒక పవర్‌కార్‌తో కలిపి 22 బోగీలు ఉంటాయన్నారు. దశల వారీగా విజయవాడ డివిజన్‌లో అన్ని రైళ్లను ఎల్‌హెచ్‌బీ బోగీలతో నడపనున్నట్లు చెప్పారు.

కాల్వలకు 2,656 క్యూసెక్కుల నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి సోమవారం 2,656 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. వీటిలో కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 502, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 2,010, గుంటూరు ఛానల్‌కు 144 క్యూసెక్కుల మేర ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి కేఈబీకి 302, బందరు కాల్వకు 200 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 12 అడుగులకు గాను 11.9 అడుగులు ఉంది.

నార్త్ ఇన్‌ఛార్జి ఏసీపీగా భానుప్రకాశ్‌రెడ్డి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : నార్త్ ఏసీపీ స్రవంతిరాయ్ సోమవారం రిలీవ్ అయ్యారు. ఆమెను అనిశాకు బదిలీ చేయడంతో.. అనిశా కేంద్ర కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. ఆమె స్థానంలో టెక్నికల్ వింగ్ ఏసీపీ భానుప్రకాశ్‌రెడ్డిని ఇన్‌ఛార్జి నార్త్ ఏసీపీ నియమించగా.. ఆయన బాధ్యతలు స్వీకరించారు.

నైపుణ్య వృద్ధి.. ఉద్యోగ సిద్ధి

కరెన్సీనగర్, న్యూస్‌టుడే

నిరుద్యోగ యువత, విద్యార్థులకు వృత్తి నైపుణ్య కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చి.. వారిలో నైపుణ్యాలు (స్కిల్స్) పెంపొందించడంపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో అధికారులు ఎన్టీఆర్ జిల్లాలోని కొన్ని డిగ్రీ/ఇంజినీరింగ్ కళాశాలల్లో స్కిల్ సెంటర్లు ఏర్పాటు చేసి వృత్తి నైపుణ్య కోర్సుల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. జిల్లాలో 10 ఎంప్లాయిబిలిటీ స్కిల్ సెంటర్లు, 6 సీఎం ఎక్సలెన్స్ సెంటర్లు ఏర్పాటు చేసి 55 కోర్సుల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు.

అందుబాటులో నైపుణ్య యాప్...

- యువతకు అభిరుచి ఉన్న కోర్సుల్లోనే అధికారులు శిక్షణ ఇప్పిస్తున్నారు. అందుకు 'నైపుణ్యం' యాప్ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటివరకు ఎన్టీఆర్ జిల్లాలో 4384 మంది తమ వివరాలు నమోదు చేసుకున్నారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 54 ఉద్యోగ మేళాలు నిర్వహించి 3,977 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించినట్లు పేర్కొన్నారు.
- 'ఎన్ఏఐపీయూఎన్‌వైఏఎం. ఏపీ. జీవోవీ. ఇన్' వెబ్‌సైట్‌లోనూ నిరుద్యోగ యువత తమ పూర్తి వివరాలు నమోదు చేసుకోవచ్చు. ఉద్యోగాలు కల్పించే కంపెనీలు కూడా రిజిస్టర్ చేసుకుంటాయి. ఇప్పటివరకు 150 పరిశ్రమలు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు.



శిక్షణ తీసుకుంటున్న నిరుద్యోగులు

- విజయవాడలో పీబీ సిద్ధార్థ, స్టెల్లా, ఆంధ్రా లయోల డిగ్రీ, పీజీ, కేబీఎన్, ఎస్ఆర్ఆర్, దుర్గా మల్లేశ్వర మహిళ, తిరువూరులో ఎస్ఎల్ఆర్ ప్రతిభ, మైలవరంలో లకిరెడ్డి హనిమిరెడ్డి, కంచికచర్ల డిగ్రీ కళాశాలల్లో 10 ఎంప్లాయిబిలిటీ స్కిల్ సెంటర్లు ఏర్పాటు చేశారు.
- ఎస్ఆర్‌కే, విజయ (ఎనికేపాడు), లకిరెడ్డి బాలిరెడ్డి (మైలవరం), మిక్ (కంచికచర్ల), పొట్టిశ్రీరాములు చలువాది మల్లికార్జునరావు, లయోల (విజయవాడ) ఇంజినీరింగ్ కళాశాలల్లో సీఎం ఎక్సలెన్స్ సెంటర్లు ప్రారంభించారు.
- ఆయా కేంద్రాల్లో ఏఐ, డి-జాన్గో, ఏడబ్ల్యూఎస్ పైథాన్, టాలీ, ఎంఎస్ ఆఫీస్... తదితర 55 రకాల కోర్సులు 30-90 రోజుల వ్యవధిలో నేర్పిస్తున్నారు.

విద్యుత్తు బస్సులు.. వచ్చేస్తున్నాయ్

ఈనాడు – అమరావతి

రూ.23 కోట్లతో విద్యాధరపురంలో నిర్వహణ కేంద్రం

నగర దారిలో విద్యుత్తు బస్సులు పరుగులు పెట్టనున్నాయి. విజయవాడకు వంద బస్సులు కేటాయించగా.. విద్యాధరపురం డిపోలో వీటి నిర్వహణ కేంద్రం ఏర్పాటవనుంది. ఇప్పటికే ఒప్పంద ప్రక్రియ పూర్తవగా ఆరు నెలల్లో బస్సులు రోడ్డెక్కనున్నాయి. కాలుష్య నివారణకు పీఎం ఈ-బస్ సేవా పథకం ద్వారా నడుపుతున్న వీటి నిర్వహణ భారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పంచుకోనున్నాయి.



100 బస్సులు.. 11 మార్గాలు..

- కాళేశ్వరరావు మార్కెట్ -ఆటోనగర్
- హెచ్‌బీ కాలనీ - ఆటోనగర్
- రైల్వేస్టేషన్ - ఆటోనగర్,
- హెచ్‌బీ కాలనీ - పెనమలూరు
- సిటీ బస్‌పోర్టు - విస్సన్నపేట
- కేఆర్ మార్కెట్ - పామర్రు
- పీఎన్‌బీఎస్ - గవర్నమెంట్ ప్రెస్
- జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీ-ఆటోనగర్
- జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీ-తాడిగడప
- ఎన్ఎస్‌బీ నగర్ - ఆటోనగర్
- సిటీబస్ పోర్టు -మైలవరం

కాలుష్యానికి సెలవిక...

ప్రస్తుతం 400 సిటీ బస్సులు ఉన్నాయి. విద్యుత్తు బస్సుల రాకతో అవసాన దశలోని బస్సులను తొలగిస్తారు. తద్వారా 7,000 లీటర్ల డీజిల్ ఆదా అవుతుంది. గతంలో తిరుపతి ఐఐటీ బృంద అధ్యయనంలో విజయవాడలో కార్బన్‌మోనాక్సైడ్ ఆందోళనకరంగా ఉందని గుర్తించింది. విద్యుత్తు బస్సులతో కొంత కాలుష్యం తగ్గుతుంది.

రూపుమారేలా...

❖ విద్యుత్తు బస్సు నిర్వహణ కేంద్రం ఏర్పాటుతో విద్యాధరపురం డిపో రూపురేఖలు మార్చనున్నారు. మెరక పనులు, ప్లాట్‌ఫారాలు, అధికారులు, నిర్వాహకుల కార్యాలయ భవనాల నిర్మాణం, ఇతర సివిల్ పనులకు రూ.12.5 కోట్లు కేటాయించారు. 6,000 కేవీ సామర్థ్యంతో సబ్‌స్టేషన్, ఛార్జింగ్ స్టేషన్ నిర్మాణం, 5 బస్సులకు ఒక్కోటి చొప్పున 20 ఛార్జింగ్ పాయింట్లు, వైరింగ్, ఇతర ఎలక్ట్రికల్ సామగ్రికి రూ.10.5 కోట్లు వినియోగించనున్నారు. ❖ కేంద్రం 60 శాతం.. రాష్ట్రం 40 శాతం నిధులు సమకూర్చనుంది. ❖ పినాకిల్ మొబిలిటీ సంస్థకు బస్సుల నిర్వహణ బాధ్యత అప్పగించారు. 250 మంది డ్రైవర్లను ఈ సంస్థ సమకూరుస్తుండగా.. 250 మంది కండక్టర్లను ఆర్టీసీ సర్దుబాటు చేస్తుంది.

మహిళలకు ఉచితమే...

ఒక్కో బస్సుకు 40 సీట్లుంటాయి. ఉచిత బస్సు పథకం వర్తించనుంది. మొత్తం 100 విద్యుత్తు బస్సులను 11 రూట్లలో తిప్పనున్నారు.

మత్తు రహిత సమాజమే లక్ష్యం



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, డీసీపీ సరిత, నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తదితరులు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మత్తు రహిత సమాజమే లక్ష్యంగా డ్రగ్స్‌పై దండయాత్ర కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని, ఇది కేవలం ప్రదర్శన కాదని, యువత భవిష్యత్తు కాపాడే సంకల్పమని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలనే సదుద్దేశంతో సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు నేతృత్వంతో అడ్మిన్ డీసీపీ కె.జి.వి.సరిత పర్యవేక్షణలో 'డ్రగ్స్‌పై దండయాత్ర' నినాదంతో చేపట్టిన సైకిల్ యాత్ర 28వ రోజైన సోమవారం జగ్గయ్యపేటకు చేరుకుంది. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మత్తు కుటుంబాలను నిశ్శబ్దంగా నాశనం చేస్తుందని తెలిపారు. సీపీ రాజశేఖరబాబు మాట్లాడుతూ ఒక్కసారి డ్రగ్స్‌కు అలవాటు పడితే భవిష్యత్తు నాశనమవుతుందని యువత గుర్తించాలన్నారు. డ్రగ్స్ సరఫరాదారులపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాలను ప్రయోగిస్తామని హెచ్చరించారు. ఈగల్ విభాగం అధికారులు మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు భయంకరంగా ఉంటాయన్నారు. నాడీ వ్యవస్థ దెబ్బతిని మనిషి విచక్షణ కోల్పోతాడన్నారు. విద్యావంతులైన యువత ఈ విష వలయంలో చిక్కుకోకుండా ఉండడమే ప్రధాన లక్ష్యంగా కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. డ్రగ్స్‌పై ఎటువంటి సమాచారం ఉన్నా.. వెంటనే 112, 1972 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. వేదికపై పట్టణంలోని పాఠశాలల విద్యార్థులు నృత్యాలు, అవగాహన నాటికలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం, అడ్మిన్ డీసీపీ సరిత, ఈగల్ టీం ఎస్పీ నగేష్, ఆర్డీవో బాలకృష్ణ, డీసీపీ లక్ష్మీనారాయణ, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు, విద్యార్థులు, యువత, మహిళలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రతినిధులనుద్దేశించి ప్రసంగిస్తున్న సత్యనారాయణరెడ్డి

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల ఐక్య కార్యాచరణ కమిటీ (ఐకాస)ని పునర్ వ్యవస్థీకరించుకోవడం ద్వారా సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణరెడ్డి అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగ సంఘాల నాయకులతో సోమవారం గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో హోమ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అత్యంత కీలకమైన ఉద్యోగ సంఘాల ఐకాసను గత ఐదు సంవత్సరాలుగా వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని దుయ్యబట్టారు. దీనిని పునర్ వ్యవస్థీకరించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ అడుగుజాడల్లో నడవాలని సూచించారు. నవంబరులో ప్రభుత్వం ఆరు డిమాండ్లపై హామీ ఇచ్చిందని, వీటిలో అయిదు అంశాలపై ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తు చేశారు. సీపీఎస్ విధానంలో ఉన్న ఉద్యోగులను నిబంధనల ప్రకారం ఓపీఎస్‌లోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు, గురుకుల పాఠశాలల ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 సంవత్సరాలు చేసే అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి పి.రమేష్, సి.వి.ఆర్.ప్రసాద్, కె.శ్రీనివాసరావు, జె.రాజేంద్రప్రసాద్, ఎం.రాజబాబు, సి.హెచ్.రామకృష్ణ, డి.రవీంద్రప్రసాద్, సి.హెచ్.సాయి కిషోర్, బేగం, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆస్తి.. భూ వివాదాల ఫిర్యాదులే అధికం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ప్రతి సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 81 ఫిర్యాదులు వచ్చాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు డీసీపీ ఉదయరాణి బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వచ్చిన 81 ఫిర్యాదుల్లో భూ.. ఆస్తి వివాదాలు 48 వచ్చాయి. ఇవి కాక కుటుంబ కలహాలు 8, మహిళా సంబంధ నేరాలు 4, దొంగతనాలు 3, వివిధ మోసాలు 2, ఇతర సమస్యలపై 16 చొప్పున వచ్చాయి. వీటిని సంబంధిత పోలీస్‌స్టేషన్లకు పంపి, సత్వరమే పరిష్కరించాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు.



యువతి సమస్య తెలుసుకుంటున్న డీసీపీ ఉదయరాణి

జోగి సోదరుల బెయిల్ రద్దు పిటిషన్లపై విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో వైకాపా నేత జోగి రమేష్, అతని సోదరుడు రాము బెయిల్ తిరస్కరణ పిటిషన్‌పై విచారణ మంగళవారానికి వాయిదా పడింది. ఈ పిటిషన్‌పై ఇన్‌ఛార్జి న్యాయస్థానమైన 7వ ఏడీజే కోర్టులో సోమవారం విచారణకు వచ్చింది. నిందితుల తరఫు న్యాయవాది కోర్టు నోటీసులు పంపించడంతో 24కు న్యాయాధికారి వాయిదా వేశారు. ఇదే కేసులో తాండ్ర రమేష్ (ఏ15) బెయిల్ పిటిషన్‌పై విచారణ ఎక్సైజ్ కోర్టులో విచారణకు వచ్చింది. నిందితుడి తరఫు న్యాయవాది హాజరుకాకపోవడంతో తదుపరి విచారణ బుధవారానికి వాయిదా వేశారు.

సాంకేతిక పరిజ్ఞానంతో దేశాభివృద్ధి వేగవంతం



జ్యోతి వెలిగిస్తున్న సంజయబారు, శంకర్, నాగేశ్వరరావు తదితరులు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : 21వ శతాబ్దం.. ఆసియా అభివృద్ధి శతాబ్దమని ప్రముఖ ఆర్థిక వేత్త, ప్రధాని మాజీ మీడియా సలహాదారు సంజయ బారు పేర్కొన్నారు. కనకదుర్గంబ, జంధ్యాల దక్షిణామూర్తి ఫ్యామిలీ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎంబీ విజ్ఞాన కేంద్రంలో సోమవారం సాయంత్రం డాక్టర్ దక్షిణామూర్తి స్మారక ఉపన్యాసం కార్యక్రమం ఏర్పాటు చేశారు. 'అభివృద్ధి చెందుతున్న ఆసియాలో అభివృద్ధి చెందుతున్న భారత దేశం' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం ఏడు శాతంగా ఉన్న దేశం ఆర్థిక వృద్ధి.. 10-12శాతానికి పెరిగితే ప్రపంచంలో అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. దేశంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు సృష్టించాలంటే పరిశ్రమలు, తయారీ రంగం మరింత అభివృద్ధి చెందాలని చెప్పారు. ఐటీ, సేవల రంగంలో భారత్ ముందంజలో ఉన్నప్పటికీ.. తయారీ, ఎగుమతుల రంగం మరింత బలపడాల్సి ఉందన్నారు. ప్రస్తుత విద్యావ్యవస్థ పాశ్చాత్య దేశాల వ్యాపార విధానాలను అనుసరిస్తున్నట్లుగా ఉందన్నారు. జపాన్, కొరియా, చైనా తదితర దేశాల అభివృద్ధి నమూనాల నుంచి ఇంకా నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యువతకు నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తే.. దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని వివరించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ జంధ్యాల శంకర్, ట్రస్టీలు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, కె.దుర్గా ప్రసాద్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతేరాజు

ఏడాది పొడవునా ఆదాయం

సీజన్ల వారీగా కూరగాయలు సేద్యం చేస్తున్న కౌలు రైతులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ఏడాది పొడవునా కూరగాయల పంటలు సాగుచేస్తూ చక్కని ఆదాయం పొందుతున్నారు నందిగామ మండలం మాగల్లుకు చెందిన కౌలు రైతులు. పొలాన్ని కౌలుకు తీసుకుని పలురకాల కూరగాయ పంటలు సాగు చేస్తున్నారు. మార్కెట్‌లో ఒక్కోసారి ధరలు పెరిగినా.. తగ్గినా నష్టపోకుండా చూసుకుంటున్నారు. నేలబావి ఆయిల్ ఇంజిన్ ఏర్పాటుచేసి నీటితడులిస్తున్నారు.



ఎకరం సాగుతో రూ.50 వేలు మిగులు

మాగల్లుకు చెందిన జిల్లా ప్రభుదాసు పల్లగిరి గ్రామం వద్ద ఎకరం పొలం ఏడాదికి రూ.25 వేలు చెల్లించి కౌలుకు తీసుకున్నారు. ఇందులో అరెకరంలో బెండ తోట, అరెకరంలో దోస పంట సాగు చేస్తున్నారు. ఈ ఏడాది మార్కెట్‌లో కూరగాయలకు గిరాకీ ఉంది. వీటిని నందిగామ రైతుబజారులో విక్రయించి లాభం పొందారు. సీజన్ వారీగా కూరగాయలను మారుస్తూ పంటలు సాగుచేస్తున్నారు. కుటుంబ సభ్యులు పొలం పనులు, కాయకోత పనులు చేస్తున్నారు. ఏడాదిలో సాగు ఖర్చులు సుమారు రూ.50 వేలు అవుతోందని కౌలు, సాగు ఖర్చులు పోను ఏడాదికి రూ.50 వేలు ఆదాయం వస్తోందని ప్రభుదాసు తెలిపారు. అయిదేళ్లుగా కూరగాయల సాగుచేస్తున్నానని పేర్కొన్నారు.



ఆదుకున్న పంటలు

ఇదే గ్రామానికి చెందిన పెరికల లక్ష్మణరావు ఏడాదికి రూ.25 వేలు చెల్లించి ఎకరం పొలం కౌలుకు తీసుకున్నారు. ఇందులో అరెకరంలో బెండ, అరెకరంలో కాకర సాగుచేస్తున్నారు. వివాహాల సీజన్‌లో వీటికి మంచి ధర ఉంది. కౌలుకు అదనంగా ఈ పంటలు సాగుకు రూ.లక్ష పెట్టుబడి పెట్టారు. ఈ రెండు పంటల సాగుతో ఖర్చులు పోను ఏడాదికి నికరంగా రూ.50 వేలు ఆదాయం పొందుతున్నారు. అన్ని సీజన్లలో కూరగాయలు పండించడంవల్ల ఒక్కో సీజన్‌లో ధర తగ్గినా మరో సీజన్లో పెరిగిన ధరకు విక్రయించడంవల్ల నష్టం రాకుండా ఉంటోంది. వంగతోట సాగుచేసి కాపురాక నష్టపోయామని, బెండ, కాకర సాగుతో లాభం వచ్చిందని లక్ష్మణరావు తెలిపారు. కుటుంబ సభ్యులు నిత్యం పొలం పనులు చేయడంవల్ల జీవనం సాగుతోందని సంతోషం వ్యక్తం చేశారు.

వేసవిలో మేకల, గొర్రెల రక్షణ

పమిడిముక్కల, న్యూస్‌టుడే: రానున్నది వేసవి కాలం. ఈ సమయంలో గొర్రెలు, మేకల సంరక్షణకు సరైన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కృష్ణాపురం పశువైద్యాధికారి రామ్‌నరేష్ సూచించారు.

ఎండ వేడిమి ఉద్ధృతంగా ఉన్నప్పుడు వీచే వడగాడ్పుల నుంచి రక్షణకు మూడు రకాల చర్యలు అవసరమని వివరించారు.

★ మొదటిది వీటిని ఉంచే షెడ్లు ఇరుకుగా ఉండి పైరేకుల నుంచి వేడి షెడ్డులోకి రావడంతో అవి ఉష్ణతాపానికి గురవుతాయి. గొంతు ఎండి దాహంతో నీరసిస్తాయి. చిన్నపిల్లలయితే చనిపోయే ప్రమాదం ఉంటుంది. అందుకని షెడ్డులోకి గాలి, వెలుతురు రావాలి. షెడ్డు పైకప్పు వేడెక్కకుండా చర్యలు తీసుకోవడం, ఎండ వేడిమి తగ్గేవరకు దఫాల వారీగా నీళ్లు అందిస్తే అవి సేద తీరుతాయి.

★ రెండోది వీటిని కట్టివేసే షెడ్ల చుట్టూ చెట్లు పెంచి నీడ ఉండేలా చూసుకోవాలి. వేడి గాలులు తగలకుండా పరదాలు ఏర్పాటు చేసి తరచూ తడపడం చేయాలి. మేత కోసం వెళ్లినప్పుడు ఎండ తీవ్రతను బట్టి వాటిని నీడ నిచ్చే చెట్ల కిందకు చేర్చాలి. స్వచ్ఛమైన నీరు అందుబాటులో పెట్టాలి.



★ మూడోది జీవాలను మేత కోసం ఉదయాన్నే తోలుకెళ్లి 10 గంటల లోపల ఇంటికి చేర్చాలి. సాయంత్రం 5 గంటల తర్వాత బయటకు తీసుకెళ్లాలి. నీరు తాగించడం, ఒంట్లో శక్తి తగ్గకుండా ఖనిజ లవణాల మిశ్రమాల దాణాను పెట్టడం మంచిది. అవి నీరసంగా కనిపించినా, అనారోగ్యం పాలైనట్టు అనిపించినా సమీప పశువైద్యులను సంప్రదించి వైద్యం అందించాలి.

మొక్కజొన్నలో కత్తెర పురుగుతో జాగ్రత్త!



తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: మొక్కజొన్నకు కత్తెర పురుగు ఆశించడంతో ఎక్కువ నష్టం వాటిల్లుతోందని వ్యవసాయ శాఖ అధికారిణి శ్రీదేవి తెలిపారు. కత్తెర పురుగు ఉద్ధృతి వల్ల లార్వాలు ఆకులు, మొవ్వలు, కంకులు తినేయడంతో అధిక నష్టం కలుగుతుంది. నివారణకు ఎకరాకు 10 లింగాకర్షక బుట్టలతో ఎస్‌ఎఫ్ ల్యూర్ అనే ఎరలను అమర్చి పురుగుల ఉనికిని గమనించాలి. ఆడ పురుగులు కలవకుండా మగ పురుగులన్నీ బుట్టల్లో పడిపోయి చనిపోతాయి. విత్తిన 20- 25 రోజుల తర్వాత వేప నూనె 1500 పీపీఎం 5 మి.లీ నీటిలో కలిపి పిచికారీ చేసి రెక్కల పురుగులను పైరుపై గుడ్లు పెట్టకుండా నివారించాలి. గుడ్డు పరాన్నజీవి అయిన ట్రైకోగ్రామాకిలోనిస్ పంట విత్తిన 10వ రోజు నుంచి నాలుగుసార్లు వారం రోజుల వ్యవధిలో వదలాలి. ట్రైకోగ్రామా పరాన్నజీవులను ఎకరాకు 20 వేల వరకు వాడుకోవాలి.



ప్రశ్న: షేడ్‌నెట్‌లో కూరగాయల నారు పెంపకం ఎలా? వివరించండి?

- బి.నాగరాజు, రైతు, పూషడం

సమాధానం: షేడ్‌నెట్‌లో ప్లాస్టిక్ ట్రేలలో ఉత్పత్తి చేసిన నారు దృఢంగా, చీడపీడల నుంచి సంరక్షణ కలిగి ఉంటుంది. మొక్కలకు నీరు, ఎరువులు వినియోగించుకునే శక్తి సామర్థ్యాలు, ప్రతికూల పరిస్థితులను తట్టుకోగల సామర్థ్యం పెరుగుతుంది. నారుపోసి పెంచుకుని సాగు చేసే కూరగాయలైన టమాట, మిరప, వంగ, పూలమొక్కలు- బంతి, పండ్ల మొక్కలు- బొప్పాయి మొదలైన నారుమళ్లలో పెంచుకునే ప్రోట్రేలలో, షేడ్‌నెట్ల కింద పెంచుకున్నట్లయితే మొక్కకు అనుకూల పరిస్థితులు అంటే తేమశాతం, కాంతి సరిపడా అంది మంచి నాణ్యత గల నారును పొందవచ్చు. సాధారణంగా నారు పెంచుకోవడానికి 50శాతం నీడనిచ్చే షేడ్‌నెట్‌లను ఎంచుకోవాలి. ప్రోట్రేలలో నారు పెంచడానికి 54×27 సెం.మీ పరిమాణం గల ట్రేలను వాడతారు. అందులో టమాట, వంగ, మిరప వంటి నారు పెంపకానికి 4సెం.మీ లోతుగల 98 గుంతల గల ట్రేలను వాడుకోవాలి. పుచ్చ, కర్బూజ వంటి మొక్కలైతే 40 గుంతలు కలిగిన ట్రేలను ఎన్నుకోవాలి.

– వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞానకేంద్రం, ఘంటసాల

- ఘంటసాల, న్యూస్‌టుడే

కౌలు రైతుల డిమాండ్లు తీర్చాల్సిందే

విజయవాడలో 30 గంటల దీక్ష



ధర్నాచౌక్‌లో దీక్ష ప్రారంభిస్తున్న శోభనాద్రీశ్వరరావు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్రంలోని కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు కోరారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ రూ.20వేలు ఇవ్వాలని, భూ యజమాని సంతకం తొలగించి, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పంట రుణాలు, నష్ట పరిహారం, బీమా మొత్తం కౌలు రైతులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకు సోమవారం ఏపీ కౌలు రైతుల సంఘం ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కమిటీల ఆధ్వర్యంలో 30 గంటల నిరవధిక దీక్షలను విజయవాడ ధర్నాచౌక్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొలం కౌలుకు ఇచ్చే సందర్భంలో భూ యజమాని కౌలు ఒప్పంద పత్రంపై సంతకం చేయడం వల్ల ఏమాత్రం నష్టం లేదని, భూమి ఎట్టిపరిస్థితుల్లోనూ పోదని చెప్పారు. కౌలు రైతులు ఎంతగా శ్రమిస్తున్నా.. వారికి అప్పులే మిగులుతున్నాయని ఆవేదన చెందారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ. . రాష్ట్రంలో వ్యవసాయం ఉంది అంటే అది కౌలు రైతుల పుణ్యమేనని పేర్కొన్నారు. రానున్న కాలంలో సన్న, చిన్నకారు రైతులు మాయమైపోతారని.. భూములు మొత్తం కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లిపోతాయన్నారు. ప్రజా ఉద్యమకారులపై ఎస్మా ప్రయోగించడం అత్యంత పాశవికమని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు మాట్లాడుతూ.. ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్లో వ్యవసాయానికి రూ.52 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నప్పటికీ.. కౌలు రైతుల ప్రస్తావన మాట మాత్రంగా కూడా లేదని విమర్శించారు. కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వం అనుసరించిన విధానాలను తీవ్రంగా నిరసించి అధికారంలోకొచ్చాక వాటినే అనుసరిస్తున్నారని విమర్శించారు. ధర్నాకు కౌలు రైతుల సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షుడు లక్ష్మణస్వామి అధ్యక్షత వహించారు. తొలుత నాయకులు పంచకర్ల రంగారావు, జె.వెంకటేశ్వరరావు, జి.సీతారెడ్డి తదితరులకు వడ్డే అరుణ దీక్షామాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆశయం నెరవేర్చేలా అధికారుల కృషి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వం ఆశయం. దీనిని నెరవేర్చడానికి ప్రతి అధికారి కృషి చేయాలి. అర్జీదారులు సంతృప్తి చెందేలా పారదర్శకంగా పరిష్కారం చూపాలని కలెక్టర్ జి.లక్ష్మీశ ఆయా శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. నగరంలోని కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్‌లను సోమవారం నిర్వహించారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 104 వినతులు స్వీకరించినట్టు తెలిపారు. వీటిలో పోలీస్ శాఖకు 24, మున్సిపల్ 20, పంచాయతీరాజ్ 20, డీఆర్డీఏ 7, ఆరోగ్య శాఖ 5, విద్య, రిజిస్ట్రేషన్, మార్కెటింగ్ శాఖలకు మూడేసి, వ్యవసాయం, డ్వామా, ఆర్అండ్‌బీ, సాంకేతిక విద్య శాఖలకు రెండేసి, విద్యుత్తు, పౌరసరఫరాలు, బీసీ కార్పొరేషన్, గనులు తదితర శాఖలకు ఒక్కొక్కటి చొప్పున వినతులు అందాయి. జేసీ ఎస్.ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, వార్డు/గ్రామ సచివాలయాల జిల్లా అధికారిణి జి.జ్యోతి, కేఆర్‌ఆర్‌సీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు, డీఆర్డీఏ పీడీ ఎ.ఎన్.వి.నాంచారరావు, డీపీవో డి.ఎం.ఎఫ్.విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విలువిద్య పోటీలు



విజేతలతో అతిథులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో రెండు రోజుల పాటు జరిగిన ఎన్టీపీఎస్ ఖేలో ఇండియా మహిళా జాతీయ స్థాయి ర్యాంకింగ్ ఆర్చరీ టోర్నీ సోమవారం ముగిసింది. టోర్నీలో వివిధ విభాగాల నుంచి 170 మంది తలపడ్డారు. సబ్ జూనియర్ కాంపౌండ్ విభాగంలో వి.స్ఫూర్తి (భీమవరం) పసిడి, జూనియర్ కాంపౌండ్ విభాగంలో కె.రుషికీర్తన (విజయవాడ) రజతం, వి.ప్రియవైష్ణవి (విజయవాడ) కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. వీఎంసీ ట్రాఫిక్ అండ్ స్పోర్ట్స్ కమిటీ మాజీ ఛైర్మన్ దోనేపూడి శంకర్, హైకోర్టు న్యాయవాది పి.రాజశేఖర్, టోర్నీ కాంపిటీషన్ డైరెక్టర్ అరుంధతి విజేతలకు పతకాలు, నగదు బహుమతులు అందజేశారు. రాష్ట్ర ఆర్చరీ సంఘం ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు బి.శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బెవర వెంకట రమణ, జిల్లా ఆర్చరీ సంఘం కోశాధికారి గొట్టిపాటి ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన లోన్ యాప్

పురుగుల మందు తాగి యువకుడి మృతి

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : లోన్ యాప్‌లో రూ.80వేలు రుణం తీసుకున్నాడు. అసలు కన్నా వడ్డీ ఎక్కువైంది. ఈఎంఐలు కట్టలేనని వేడుకున్నా. . వసూలుదారులు వదలలేదు. వారి వేధింపులు ఎక్కువ కావడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. సూర్యారావుపేటకు చెందిన కలపాల సత్యసాగర్ (28) గొల్లపూడిలోని ఒక కార్పొరేట్ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకులో పని చేస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో బాత్‌రూంలో వాంతులు చేసుకుంటుండగా.. తండ్రి ఇశ్రాయేల్ చూశారు. మళ్లీ 6 గంటల సమయంలో కడుపునొప్పి తాళలేకపోతున్నానని చెప్పడంతో ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. మార్గమధ్యంలో తాను పురుగుల మందు తాగానని తండ్రికి తెలిపారు. లోన్‌యాప్‌లో రూ.80 వేలు తీసుకున్నానని, దానికి సంబంధించిన ఈఎంఐలు కట్టలేకపోతుండడంతో ఒత్తిడి చేస్తున్నారని వివరించారు. మనస్తాపంతో పురుగుల మందు తాగానని చెప్పడంతో.. ఐసీయూకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందారు. దీనిపై తండ్రి ఇశ్రాయేల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ఒక్కింటికి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



గణేష్‌నాయక్ (పాత చిత్రం)

పెనమలూరు, విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా పెనమలూరులోని ఓ కార్పొరేట్ కళాశాల విద్యార్థి ఆదివారం అర్ధరాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మార్కాపురం జిల్లా గిద్దలూరు సమీపంలోని బురుజపల్లితండాకు చెందిన మూడావత్ బాలాజీ నాయక్ కుమారుడు ఎం.గణేష్‌నాయక్(19) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రెండ్రోజుల క్రితం మరో విద్యార్థి సెల్‌ఫోన్‌కు గణేష్‌నాయక్ ఓ అభ్యంతరకర మెసేజ్ చేసినట్లు, ఈ వ్యవహారం తల్లిదండ్రులకు తెలుస్తుందనే భయంతో ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో కళాశాల గోడదూకి బయటకు వెళ్లిపోయి ఆటోలో రైల్వే స్టేషన్ చేరుకొని ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. తన సోదరుడికి ఫోన్ చేసి ఆటోడ్రైవర్‌కు రూ.100 ఫోన్‌పే ద్వారా చెల్లించాలని కోరినట్లు పోలీసులు చెబుతున్నారు. రాత్రి ఒంటి గంట సమయంలో గణేష్‌నాయక్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే పోలీసులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో తండ్రి బాలాజీ నాయక్, తల్లి ఆదిలక్ష్మి, బంధువులు సోమవారం కళాశాల వద్దకు చేరుకొన్నారు. కుటుంబసభ్యుల రోదనలు, వేదనలతో కళాశాల వద్ద విషాద వాతావరణం నెలకొంది. కుమారుడి బలవన్మరణాన్ని వీరు జీర్ణించుకోలేకపోయారు. ప్రభుత్వ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫేస్‌బుక్ ఖాతాలో భార్యకు అసభ్య సందేశాలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : పాఠశాల స్నేహితుడినని ఓ వ్యక్తి నుంచి ఫేస్‌బుక్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్ వస్తే.. ఆమె అంగీకరించారు. ఆ తర్వాత అసభ్యకరమైన సందేశాలు వస్తుండడంతో సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సందేశాలు పంపేది భర్తేనని తేలడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడ నగర శివారు ప్రాంతానికి చెందిన ఓ యువతి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. ఆమెకు తెలంగాణ రాష్ట్రం ఖమ్మంకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నాగుబండి నవీన్‌తో 2023, జనవరిలో వివాహమైంది. వీరికి రెండేళ్ల పాప ఉంది. భర్తతో విభేదాల కారణంగా 2025, డిసెంబరు నెలలో ఆమె పుట్టింటికి వచ్చేశారు. డిసెంబరు 15 నుంచి 20వ తేదీ మధ్య ఆమె ఫేస్‌బుక్ ఐడీకి పాఠశాల స్నేహితుడినంటూ ఓ వ్యక్తి నుంచి రిక్వెస్ట్ రావడంతో అంగీకరించారు. కొన్ని రోజుల తర్వాత వరుసగా అసభ్యకరమైన సందేశాలు వస్తుండడంతో ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. దీనిపై గత నెల 28న విజయవాడ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు విచారణ చేపట్టారు. ఆ యువతికి అసభ్యకరమైన సందేశాలు పంపించేది.. ఆమె భర్త నవీన్‌గా తేల్చారు. భర్త వేధింపులపై తగిన చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

ఎర్రన్నాయుడికి ఘన నివాళి




మైలవరంలో నివాళులర్పిస్తున్న తెదేపా నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే : కేంద్ర మాజీ మంత్రి, తెదేపా నేత ఎర్రన్నాయుడు జయంతిని పురస్కరించుకుని సోమవారం మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఎర్రన్నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. పార్టీకి, రాష్ట్రాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. లీతీష్, గోపాలస్వామి, కరీం, ప్రసాద్, అంకరాజు, బాలకృష్ణ, రేణుక, షహనబేగం పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



స్పందన: • కోడూరు ఎస్సీ ఏరియాలోని నియంత్రిక పాడైపోయి విద్యుత్తు సరఫరా నిలిచిపోయిందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా అధికారులకు తెలిపారు. స్పందించిన లైన్‌మెన్ నియంత్రిక ఏర్పాటు చేసి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు.

• కపులూరు కొత్త కాలనీలో పంచాయతీ బోరు మరమ్మతులకు గురైందని స్థానికులు అధికారులకు తెలిపారు. స్పందించిన కార్యదర్శి సరోజ సిబ్బందితో బోరుకు మరమ్మతులు చేయించారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

? నరసాపురంలోని సత్తుపల్లి రోడ్డులో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. **- స్థానికులు** ✔ పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయిస్తాం. **- జి.స్వాతి, పంచాయతీ కార్యదర్శి, నరసాపురం - న్యూస్‌టుడే, విస్సన్నపేట**

రోబోటిక్ లీగ్- 2026 కరపత్రాల ఆవిష్కరణ

తిరువూరు, న్యూస్‌టుడే : స్థానిక శ్రీనిధి పాఠశాలలో ఈ నెల 27, 28 తేదీల్లో జాతీయ స్థాయి రోబోటిక్ లీగ్- 2026 నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎం.కిషోర్‌బాబు సోమవారం తెలిపారు. దీన్ని స్కైస్పేస్ విశాఖపట్టణం వారి భాగస్వామ్యంతో కలిసి చేపడుతున్నట్లు హెచ్‌ఎం ఆర్.వెంకటనారాయణ చెప్పారు. స్కైస్పేస్ సీఈవో ఇందుగు.వేణుకుమార్ ఆధ్వర్యంలో పలు రంగాల్లో ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం దీనికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు.

తిరుగుతున్నా పట్టించుకోరు.. ఉపాధి చూపించరు!

పనులు లేక అవస్థలు పడుతున్న జనాలు

జి.కొండూరు, న్యూస్‌టుడే



పిచ్చిచెట్లతో అధ్వానంగా ఎన్నెస్పీ కాలువ

వేసవిలో ఉపాధి పనులకు వెళ్లి కడుపు నింపుకోవచ్చని ఆశించిన మునగపాడులోని పేదల ఆశలు అడియాసలయ్యాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఎదురైన లేమిడి కఠినమైన పరిస్థితులతో వ్యవసాయ పనులు సరిగా సాగకపోవడంతో గ్రామస్థులంతా పని కోసం ఎదురు చూస్తున్నారు. వేసవి సమీపించడంతో ఉపాధి పనులకు వెళ్లవచ్చని ఆశించిన వారికి పని దొరక్క పోవడంతో ఆందోళన చెందుతున్నారు.

విధిగా నమోదైనా..: సాధారణంగా గ్రామాల్లో అక్టోబర్ 2వ తేదీ నుంచి గ్రామ సభల నిర్వహించి కూలీల నుంచి జాబ్ కార్డు ఉన్న పేదలకు డిమాండ్ మేరకు పని కల్పించేందుకు క్షేత్ర స్థాయి సహాయకులు, అధికారులు కృషి చేస్తుంటారు. మునగపాడులో మాత్రం అందుకు విరుద్ధంగా నడుస్తోందని గ్రామస్థులు మండిపడుతున్నారు. పని కల్పించాలని రెండు నెలలుగా ఉపాధి హామీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో క్షేత్ర స్థాయి సహాయకుడు లేకపోవడం, స్థానిక నాయకులు చెబితేనే పని కల్పిస్తానని ఓ అధికారి చెబుతుండడంతో జనాలు వాపోతున్నారు. పని చూపించకపోతే తమ జీవనం ఎలా కొనసాగించాలని పేదలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఉపాధి పని కల్పించి తమకు ఆర్థిక చేయూత ఇవ్వాలని వారు కోరుతున్నారు.

ఎదురు చూస్తున్నాం

ఖరీఫ్‌లో వ్యవసాయం పనులు సరిగా సాగలేదు. వేసవిలోనైనా ఉపాధి హామీ పని దొరుకుతుందేమోనని ఎదురు చూస్తున్నాం. కూలీ పనులు దొరక్క పూట గడిచే పరిస్థితి లేకుండా పోయింది. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలి. **- మండల వాణి**

కడుపు నింపుకొంటాం..

గ్రామంలోని కాలువల్లో పూడిక, జంగిల్ క్లియరెన్స్ చేయాల్సిన పనులు చాలా వరకు పెండింగ్ ఉన్నాయి. డిమాండ్ మేరకు తమకు పని కల్పిస్తే కడుపు నింపుకొనేందుకు సిద్ధంగా ఉన్నాం. **- గంజి స్వామి**

డిమాండ్ పత్రం ఇస్తే..

బడ్జెట్ పుష్కలంగా ఉంది. డిమాండ్ పత్రం ఇస్తే పని కల్పించడానికి తాము సిద్ధంగా ఉన్నాం. మునగపాడుకు క్షేత్ర స్థాయి సహాయకుడు లేకపోయిన పక్క గ్రామానికి చెందిన క్షేత్ర సహాయకుడితో మస్టర్లు తీసుకుంటాం. **- బీవీ రామకృష్ణ నాయక్, ఎంపీడీవో, జి.కొండూరు**

ఆకట్టుకున్న సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే : పెనుగొలను జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం హెచ్‌ఎం ఎం.దుర్గాప్రసాద్, సైన్స్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు తయారు చేసిన పలు సైన్స్ ప్రాజెక్టులతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం వీటిని సిద్ధం చేసిన వారికి బహుమతులు అందజేశారు. ఎస్ఎంసీ ఛైర్మన్ ఎ.ఆంజనేయులు, తెదేపా నాయకుడు ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మానసిక ఎదుగుదలకు అయోడిన్ ఉప్పు ఉపయుక్తం



చిన్నారులకు అయోడిన్ పరీక్షలు నిర్వహిస్తున్న సయ్యద్ ఫర్హీన్

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే : పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగుదలకు అయోడిన్ ఉప్పు ఎంతో ఉపయోగపడుతుందని ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సయ్యద్ ఫర్హీన్ అన్నారు. గుంటుపల్లి సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి 12 ఏళ్ల వయసు గల విద్యార్థులకు సోమవారం అయోడిన్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వోలు మానస, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

'పేరుకే బీసీ.. చేసేదంతా వైకాపా భజనే'

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: బీసీలను రెచ్చగొట్టేందుకే బీసీ గర్జన అని తెదేపా నియోజకవర్గ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి వి.వెంకటకృష్ణ అన్నారు. ఇబ్రహీంపట్నంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. బీసీవై పేరుతో పార్టీని ఏర్పాటు చేసిన రామచంద్ర యాదవ్ బీసీలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఆయనకు ప్రత్యేక ఆలోచనలు ఏమి లేవని, వైకాపా అజెండానే ఆయన జెండా అని వ్యాఖ్యానించారు. బీసీలందరూ తెదేపా వైపే ఉన్నారని చెప్పారు.

నివాస స్థలాల పంపిణీ త్వరగా ప్రారంభిస్తే మేలు



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : ఎన్నికల సందర్భంగా కూటమి ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేద ప్రజలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ విధివిధానాలు త్వరితగతిన ప్రారంభించాలని తిరువూరు ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. సోమవారం జరిగిన శాసనసభ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్ల స్థలాల కోసం నియోజకవర్గంలోని ప్రజలు నిరీక్షిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆదివారం తిరువూరులో టిడ్కో గృహాలను వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. ముఖ్యమంత్రి చొరవ చూపి వాటిని త్వరగా సిద్ధం చేయించి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే కోరారు.

యాప్‌లు పనిచేయక కుస్తీలు పడుతున్నాం



మైలవరంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మైలవరం, న్యూస్‌టుడే : అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీలకు వేతనాలు పెంచుతామన్న హామీని కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ సుధాకర్, జిల్లా కార్యదర్శి ఎం.మహేష్ అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో వేతనాల పెంపు నిర్ణయం చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా సోమవారం రిలే దీక్షలను వారు ప్రారంభించారు. ప్రధాన దారిలో ప్రదర్శన చేసి, పంచాయతీ కార్యాలయం వద్ద మహాధర్నా ఏర్పాటు చేశారు. సంఘం ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శి సీహెచ్ శారద, పుష్పకుమారి, మాణిక్యం, బుల్లెమ్మ, నిర్మల, కుమారి తదితరులు పాల్గొన్నారు.



తిరువూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద..

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : నియోజకవర్గంలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం దాములూరులో రూ.20 లక్షల మండల పరిషత్తు నిధులతో ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైన్ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం చిలుకూరులో రూ.25 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఎంపీపీ పాగురు జ్యోత్స్న, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీడీవో శకుంతల, కూటమి నాయకులు పాల్గొన్నారు.



దాములూరులో కుళాయి నుంచి నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

ఉమాగౌరీశంకరునికి విశేష పూజలు

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని కొత్తపల్లి, పెనుగొలను, మేడూరు, గంపలగూడెం, కొణిజెర్ల, గోసవీడు గ్రామాల్లోని శివాలయాల్లో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



కొత్తపల్లి: ప్రత్యేక అలంకరణలో శివలింగం

విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : రాయనపాడులోని సోమేశ్వర శివలింగ, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ పూజలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 25న విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో గోపూజ, శోభాయాత్ర నిర్వహించారు.

సత్యాలపాడు(గంపలగూడెం), న్యూస్‌టుడే : సత్యాలపాడులోని వీరబ్రహ్మేంద్ర స్వామి గుడి ప్రాంగణంలో నూతన నిర్మించిన శివాలయంలో విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి.

భవన నిర్మాణానికి నిధుల కేటాయింపు

ఇబ్రహీంపట్నం గ్రామీణం: మూలపాడు పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరి విధుల నిర్వహణలో వైద్యులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. దీనికి పరిష్కారంగా నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయించారు. ఈ సమస్యపై 'ఈనాడు' పలు కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ఎన్టీటీపీఎస్ మంజూరు చేస్తున్న సీఎస్ఆర్ నిధుల్లో రూ.40 లక్షలను నూతన భవన నిర్మాణానికి కేటాయించాలని కొండపల్లి పురపాలిక వైస్ ఛైర్మన్ చిట్టిబాబును సూచించారు. దీంతో ఆయన నిధులు కేటాయిస్తున్నట్లు ఇటీవల నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ప్రకటించారు.

సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవాస్తవం

గంపలగూడెం, న్యూస్‌టుడే : కొత్త పింఛన్ల మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలంటూ కొన్ని రోజులుగా సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని ఎంపీడీవో టి.సరస్వతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎటువంటి అధికారిక ఉత్తర్వులు వెలువడ లేదన్నారు. ప్రస్తుతం భర్త మృతి చెందితే అతని పింఛన్ భార్యకు మంజూరు చేసే ప్రక్రియ అమల్లో ఉందన్నారు.

మహిళలను ప్రోత్సహించాలన్నదే లక్ష్యం



కుట్టు శిక్షణ ప్రారంభిస్తున్న సమగ్ర శిక్షా రాష్ట్ర ఐఈ కో-ఆర్డినేటర్ అన్నపూర్ణ

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: కుటుంబ ఆర్థిక వెసులుబాటుకు తోడ్పడే మహిళలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వృత్తి విద్యా కోర్సులను నేర్పించే కార్యక్రమాన్ని భవిత కేంద్రాల్లో చేపట్టిందని సమగ్ర శిక్షా రాష్ట్ర ఐఈ కో-ఆర్డినేటర్ అన్నపూర్ణ అన్నారు. ఈ మేరకు సోమవారం ఇబ్రహీంపట్నం భవిత కేంద్రంలో టైలరింగ్‌ను ఆమె ప్రారంభించారు. సమగ్ర శిక్షా అధికారులు వనజ, నారాయణ, ఎంఈవో పుష్పలత, భవిత పాఠశాల హెచ్‌ఎం నరసమ్మ తదిరులు పాల్గొన్నారు.

దీక్షా కాలం.. పోషకాల హలీం..

ఇబ్రహీంపట్నం గ్రామీణం, కొండపల్లి, న్యూస్‌టుడే

రంజాన్ మాసంలోనే తయారు చేసే హలీం విక్రయాలు మైలవరం నియోజకవర్గంలో జోరుగా సాగుతున్నాయి. దీని రుచులను కేవలం ముస్లింలే కాకుండా అన్ని వర్గాల వారు ఆస్వాదిస్తున్నారు. ఇందు కోసం కొండపల్లి, ఇబ్రహీంపట్నంలతో పాటు మైలవరంలో కూడా ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేశారు. రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు ముగిసిన అనంతరం మసీదుల సమీపంలోనే ఈ కేంద్రాల్లో విక్రయాలు ప్రారంభించి రాత్రి వరకు కొనసాగిస్తున్నారు. హలీం హైదరాబాద్‌కు పెట్టింది పేరు. అక్కడ సాధారణ రోజుల్లోనూ అమ్మకాలు సాగుతుంటాయి. ప్రస్తుతం రంజాన్ మాసం నేపథ్యంలో ఇబ్రహీంపట్నం, కొండపల్లిల్లోనూ ఆ రుచులు అందుబాటులోకి వచ్చాయి. దీంతో కొండపల్లి పురపాలిక పరిసర ప్రాంతాల నుంచి దీక్షపరులతో పాటు ఇతరులు హలీం తినడానికి తరలి వస్తున్నారు.



స్టాల్‌లో విక్రయాలు చేస్తున్న అప్పసర్

తయారీ విధానం ఇలా.

.: హలీం తయారు చేయడానికి కనీసం అయిదారు గంటల సమయం పడుతోందని తయారీదారులు చెబుతున్నారు. దీన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బట్టీలో వేసి కింద మంట పెట్టి ఉడికిస్తారు. తయారీలో శుభ్రమైన కోడి, మేక మాంసంతో పాటు ప్రత్యేక పోషక విలువలు ఉండే పప్పు ధాన్యాలు వాడుతారు. రుచి కోసం గోధుములు, బాదం, డ్రైఫ్రూట్స్, మసాలాలు, రవ్వ, స్వచ్ఛమైన నెయ్యి, సుగంధ ద్రవ్యాలను కలుపుతారు.

అదనపు శక్తి కోసం..

దీక్ష సమయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏమి తినక పోవడంతో కోల్పోయిన శక్తిని పొందేందుకు అందరూ ఇష్టంగా హలీం తింటారు. మాంసహార ప్రియులు కూడా దీన్ని తినడానికి ఆసక్తి చూపుతున్నారు. దీని తయారీ కష్టంతో కూడుకున్న పని. ఎంత ఉడికితే అంత రుచిగా ఉంటోంది. **- అప్పసర్, హలీం స్టాల్ నిర్వాహకుడు, కొండపల్లి**

సజావుగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

మైలవరం, న్యూస్‌టుడే : ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో సోమవారం మొదటి ఏడాది విద్యార్థులకు తెలుగు, సంస్కృతం పరీక్ష నిర్వహించారు. స్థానిక వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 324 మందిని కేటాయించగా 311 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రాధాకృష్ణ తెలిపారు. ఎస్వీఆర్‌జీ కళాశాలలో 239 మందిని కేటాయించగా 226 మంది పరీక్ష రాసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ బుచ్చిబాబు వెల్లడించారు.



పెదకొమిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని పెదకొమిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని కేంద్రం వద్దకు విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు చేరుకున్నారు. తొలిరోజు తల్లిదండ్రులు, అధ్యాపకులు వారి వెంట వచ్చారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేటలోని నాలుగు పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాలల అధ్యాపకులు తరలివచ్చారు. స్థానిక ఎస్సై అర్జున్‌రాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



మైలవరంలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



విస్సన్నపేటలో తల్లిదండ్రులతో తరలివస్తూ..

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : కంభంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పరీక్షకు మొత్తం 174 మందికి 165 హాజరు అయ్యారని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రసాద్ తెలిపారు.

దుమ్ము, ధూళి వస్తుందంటే దాడి చేయబోతారా..?

కొండపల్లి, న్యూస్‌టుడే : క్రషర్ లారీల రాకపోకలతో కొండపల్లి అరుణానగర్‌లో దుమ్ము, ధూళి ఏర్పడి ఇబ్బందిగా ఉందని స్థానికులు కొన్ని రోజులుగా టెంటు వేసుకొని నిరసన తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఇద్దరు యువకులు టెంటు వద్దకు రాగా అక్కడ మహిళలు మాత్రమే ఉండడంతో టెంటును తొలగించే ప్రయత్నం చేశారు. వారు ఎదురుతిరగడంతో సమీపంలోని పురుషులు వచ్చి టెంటును ఎవరు తొలగించమన్నారని యువకులను అడిగారు. ఓ క్రషర్ సూపర్‌వైజర్ తమను పంపాడని వారికి సమాధానమిచ్చారు. ఆగ్రహం చెందిన స్థానికులు ఆ యువకులను పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

డిమాండ్లు పరిష్కరించే వరకు ఆందోళన



నల్లరిబ్బన్లతో నిరసన తెలుపుతున్న సహకార సంఘాల ఉద్యోగులు

మైలవరం, న్యూస్‌టుడే : డిమాండ్ల సాధన కోసం నిరసన దీక్ష చేస్తున్న సహకార సంఘాల ఉద్యోగులు సోమవారం స్థానిక కేడీసీసీ బ్యాంకు కార్యాలయం ఎదుట కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. దీక్షా శిబిరం నుంచి ప్రధాన రహదారుల వెంట ప్రదర్శన చేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించే వరకు నిరసన కొనసాగిస్తామన్నారు. ఎం.సాంబశివరావు, సీహెచ్ కిశోర్‌బాబు, కె.సతీష్, జి.గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పీఆర్సీ అమలు చేయాలి

కొండపల్లి, న్యూస్‌టుడే : సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కొండపల్లి పురపాలిక పారిశుద్ధ్య కార్మికులు నినాదాలు చేశారు. మున్సిపల్ కార్మికులకు 12వ పీఆర్సీ అమలు చేయాలంటూ కరపత్రాల ఆవిష్కరణ, పంపిణీ కార్యక్రమాన్ని కొండపల్లి చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద సోమవారం నిర్వహించారు. మున్సిపల్ వర్కర్స్ అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి కృష్ణ, నవీన్, అప్పారావు, దేవుళ్లు పాల్గొన్నారు.

అవీ ఇవీ

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రంగాపురం, నాగులూరు విద్యుత్తు ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు రంగాపురం లైన్‌మెన్ హరి తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రైతులకు నిధుల కేటాయింపులో అన్యాయం

గంపలగూడెం, న్యూస్‌టుడే : రాష్ట్ర బడ్జెట్‌లో రైతులకు అన్యాయం జరిగిందని సీపీఐ నాయకులు విమర్శించారు. దీనిపై జిల్లా, నియోజకవర్గ సీపీఐ నాయకులు టి.కృష్ణయ్య, సీహెచ్.వెంకటేశ్వరరావు, ఎస్కే.నాగుల్‌మీరా ఆధ్వర్యంలో సోమవారం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయంలోని అధికారులకు వినతిపత్రం అందజేశారు.

వాగ్గేయకారుడు అన్నమయ్యకు నివాళి

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని పెనుగొలను ప్రధాన ప్రాథమిక పాఠశాలలో సోమవారం వాగ్గేయకారుడు అన్నమయ్య వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు నివాళులర్పించారు.

పది రాష్ట్రాల్లో లెప్రా సంస్థ వైద్య సేవలు



విద్యార్థినికి కేకు తినిపిస్తున్న అధికారులు

గంపలగూడెం, న్యూస్‌టుడే : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం లెప్రా సొసైటీ 37వ వార్షికోత్సవం నిర్వహించారు. ఇందులో లెప్రా సంస్థ రాష్ట్ర సమన్వయకర్త రాధిక మాట్లాడుతూ సంస్థ ద్వారా పది రాష్ట్రాల్లో కుష్ఠు, బోధ వ్యాధితో పాటు మరో అయిదు రకాల వ్యాధిగ్రస్తులకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. బాధితులకు వైద్య సేవలతో పాటు ఆర్థిక, సామాజికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నట్లు చెప్పారు. సర్పంచి కె.పుల్లమ్మ, సంస్థ అధికారులు ఏవీ.బాషా, చంద్రశేఖర్, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని వినతి

గంపలగూడెం, న్యూస్‌టుడే : కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ మండలంలోని పెనుగొలనుకు చెందిన భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు ఎస్.రామారావు, ఐ.పిచ్చియ్య, ఎం.మురళీ తదితరులు స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు.

'ప్రతిపక్ష నేతలపై దాడులు హేయం'

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : కూటమి పాలనలో ప్రతిపక్ష నేతలపై దాడులు చేయడం మంచి సంస్కృతేనా అని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభరెడ్డి అన్నారు. మాజీ మంత్రి జోగి రమేష్‌ను ఆయన సోమవారం ఇబ్రహీంపట్నంలో పరామర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. దాడి జరిగిన వీడియోలను వీక్షించారు. కాపులు, బలహీన వర్గాలే లక్ష్యంగా దాడులు జరుగుతుండడం హేయమన్నారు. వైకాపా నాయకులు పాల్గొన్నారు.

మామిడి సాగుపై అవగాహన అవసరం



రైతులకు సూచనలిస్తున్న నూజివీడు ఉద్యాన శాఖ శాస్త్రవేత్త రాధారాణి

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు మండలం లక్ష్మీపురం గ్రామంలో సోమవారం మామిడి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నూజివీడు ఉద్యాన శాఖ శాస్త్రవేత్త డాక్టర్.కె.రాధారాణి, తిరువూరు ఇన్‌ఛార్జి ఉద్యాన శాఖ అధికారి సుహేల్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మామిడి పంటలో అన్నదాతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారు వివరించారు. రైతులు, అధికారులు పాల్గొన్నారు.

రబీ వరిలో అగ్గి తెగులు..

విస్సన్నపేట, న్యూస్‌టుడే : రబీ వరిలో అగ్గి తెగులు, పాము పొడ తెగులు, జింకు లోపం గమనించామని విస్సన్నపేట వ్యవసాయ సహాయ సంచాలకులు కె.శశికళ, ఏవో షేక్ టిప్పుసుల్తాన్ తెలిపారు. క్షేత్ర సందర్శనలో భాగంగా సోమవారం చంద్రుపట్ల గ్రామంలో వారు పర్యటించి రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఏఈవో ఉషారాణి, వీహెచ్ఏ జమలారావు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : ముద్దులపర్వ గ్రామంలోని వరి పొలాలను విస్సన్నపేట వ్యవసాయ సహాయ సంచాలకులు కె.శశికళ, రెడ్డిగూడెం ఇన్‌ఛార్జి ఏవో టిప్పుసుల్తాన్, రైతులతో కలిసి పరిశీలించారు. ఏఈవో బిజిలీ తదితరులు పాల్గొన్నారు

5న ఆశా కార్యకర్తల ధర్నా

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : విజయవాడలోని అలంకార్ కూడలిలో మార్చి నెల 5వ తేదీన నిర్వహించే ఆశా కార్యకర్తల రాష్ట్ర స్థాయి ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ అనుబంధ జిల్లా ఆశా కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు ఎ.కమల పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారం కోరుతూ.. నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.లక్ష్మీశకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. కార్యకర్తలకు వేతనాలు పెంచి ఏడు సంవత్సరాలు అయిందన్నారు. నిత్యావసరాలు, విద్య, వైద్యం తదితర ధరలు/ ఖర్చులు పెరుగుతున్నా.. వేతనాలు పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీలను భర్తీ చేయాలని ఆమె కోరారు.

కాలువలు ఇలా.. నీటి ప్రవాహం ఎలా?



ఎన్నెస్పీ మేజర్ కాల్వల్లో దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు, పిచ్చిచెట్లు నీటి ప్రవాహానికి అడ్డుగా మారాయి. మైలవరం బ్రాంచి కాల్వ రెడ్డిగూడెం మండలం కూనపరాజుపర్వ గ్రామం వద్ద రంగాపురం మేజర్ కాల్వ ప్రారంభం అవుతోంది. దీనిలో పెరిగిన పొదలు వల్ల నీరు చివరి భూములకు అందడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. అధికారులు స్పందించి పొదలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

మురుగు నిల్వ.. దుర్వాసనతో వెత



జి.కొండూరు టమాటా మార్కెట్ సమీపంలో మురుగు నిల్వ ఉండి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు లేకపోవడంతో చుట్టు పక్కల నుంచి వచ్చే మురుగు నీరంతా సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఎదురుగా ఉన్న ఖాళీ ప్రాంతంలో నిలుస్తోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి సరైన డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

భర్త వేధింపులపై కేసు

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండల కేంద్రానికి చెందిన కరిమికొండ శిరీష ఫిర్యాదు మేరకు కొండపల్లికి చెందిన భర్త నాగవెంకటసత్యభరత్‌రాజు, అత్తమామలు శ్రీలక్ష్మి, శ్రీనివాసరావు, మరిది ప్రణీత్‌పై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై- 2 శశిధర్ సోమవారం తెలిపారు. తనకు రాజుతో 2022లో వివాహం కాగా ఉద్యోగ రీత్యా యూకేలోని మాంచెస్టర్‌కు తీసుకెళ్లారని, 2023 నుంచి అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధింపులకు పాల్పడినట్లు శిరీష ఫిర్యాదులో తెలిపారు. పెళ్లి సమయంలో తన తల్లిదండ్రులు భర్త కుటుంబానికి నగదు, బంగారం కట్నంగా ఇచ్చినట్లు ఆమె చెప్పారు.

కల్తీ పాలు.. మరో ముగ్గురి మృతి

(మొదటి పేజీ తరువాయి)

దిగాయి. పాల కల్తీ వల్లే అందరూ అనారోగ్యానికి గురైనట్లు ముందే అంచనాకు వచ్చిన నేపథ్యంలో పోలీసులు కోరుకొండ మండలం నరసాపురానికి చెందిన పాల వ్యాపారి గణేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. సాయంత్రం అరెస్టు చేశారు. ఆయనపై వివిధ పోలీస్ స్టేషన్లలో మృతుల కుటుంబాల ఫిర్యాదుల మేరకు 4 హత్య కేసులు నమోదయ్యాయి. మరోవైపు సోమవారం సాయంత్రానికి 64 కుటుంబాల నుంచి ద్రవనమూనాలు సేకరించి సీరం, కిడ్నీ, రక్తపు పరీక్షలకు పంపించారు. చికిత్స పొందుతున్న, మృతి చెందినవారి రక్త, మూత్ర నమూనాలను, పాల నమూనాలను సెంట్రల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌తో పాటు విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్‌లోని ప్రయోగశాలలకు పంపించారు. ఫలితాలు వచ్చేందుకు మూడు నుంచి వారం రోజులు పట్టే అవకాశముంది. ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహకిశోర్‌తో కలిసి వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండ్యన్, ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ పర్యటించారు. మరణాల వెనుక కారణాన్ని శాస్త్రీయంగా నిర్ధారించాల్సి ఉందని, విశాఖకు చెందిన నెఫ్రాలజిస్టు రవిరాజ్ ఆధ్వర్యంలోని బృందం అధ్యయనం చేస్తుందని తెలిపారు. ఐజీ అశోక్ కుమార్ కోరుకొండ మండలం నరసాపురంలో గణేష్ నిర్వహిస్తున్న పాలసేకరణ కేంద్రాన్ని పరిశీలించారు.

ఇప్పటికి రూ.8.5 లక్షలు ఖర్చు చేశాం..: ఏడాదిన్నర వయసున్న తన కుమారుడు రితిక్ ఈ నెల 16న పాలు తాగి వాంతులు చేసుకున్నాడని తండ్రి లోవరాజు తెలిపారు. ఆసుపత్రిలో ప్రస్తుతం డయాలిసిస్ చేస్తున్నారన్నారు. ఇప్పటికి రూ.8.5 లక్షలు ఖర్చు చేశామని, 72 గంటలు గడిస్తే తప్ప ఏమీ చెప్పలేమంటున్నారని వాపోయారు. చౌడేశ్వరినగర్‌కు చెందిన మధు మాట్లాడుతూ.. 'అమ్మ, నాన్న, పిన్ని, పెదనాన్న రాజమహేంద్రవరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నాన్న కోలుకున్నట్లు కనిపించినా, మిగిలిన అందరూ వెంటిలేటర్లపై ఉన్నారు' అని పేర్కొన్నారు.



పాల వ్యాపారి నిర్వహిస్తున్న అనధికార పాల సేకరణ కేంద్రంలో యంత్రాలు



చికిత్స పొందుతున్న రితిక్



చౌడేశ్వరినగర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం

(మొదటి పేజీ తరువాయి)

నిర్ధారిస్తున్నారు. రోగుల నమూనాలు, పాల నమూనాలను హైదరాబాద్, విశాఖపట్నంలోని 'స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీ'తో పాటు విమ్స్ ల్యాబ్‌కు పంపాం' అని ప్రకటించారు.

వెంటనే రాజమహేంద్రవరం వెళ్లండి: కల్తీ పాలతో జరిగిన మరణాలు, అస్వస్థతపై సీఎం చంద్రబాబు ఉన్నతాధికారులతో సమీక్షించారు. తూర్పుగోదావరి కలెక్టర్, ఎస్పీ, వైద్యారోగ్య, ఫుడ్ సేఫ్టీ అధికారులతో మాట్లాడి పరిస్థితిపై ఆరాతీశారు. బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. పాల నమూనాలను ల్యాబ్‌కు పంపామని ఫుడ్‌సేఫ్టీ అధికారులు తెలిపారు. ఫుడ్‌సేఫ్టీ, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు వెంటనే రాజమహేంద్రవరం వెళ్లాలని, పరిస్థితి కుదుటపడేలా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.

72 గంటల్లో ల్యాబ్ ఫలితాలు

– వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

పాల వ్యాపారి నుంచి సేకరించిన నమూనాలను ల్యాబ్‌కు పంపామని, 72 గంటల్లో ఫలితాలు వస్తాయని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఉన్నతాధికారులతో ఫోన్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అంతకుముందు ఆయన శాసనసభలో ఈ అంశంపై ప్రకటన చేశారు. '567 కుటుంబాల స్క్రీనింగ్ చేశాం. చికిత్స అవసరమైనవారిని ఆసుపత్రులకు పంపిస్తున్నాం. వరలక్ష్మి మిల్క్‌ప్లాంట్‌లో పాల నమూనాలను సేకరించాం' అని పేర్కొన్నారు.

పరిస్థితి నియంత్రణలో ఉంది: మంత్రి అనిత

'కల్తీ పాల ఘటన వ్యవహారంపై సీఎం సమీక్షిస్తున్నారు. పరిస్థితి నియంత్రణలోనే ఉంది. పాల విక్రేతను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు' అని అనిత సభకు తెలిపారు.

కొంపముంచిన కూలెంట్ లీకేజీ

(మొదటి పేజీ తరువాయి)

మూడు క్యాన్లలో 120 లీటర్ల పాలు సేకరించి, మర్నాడు ఉదయం సరఫరా చేస్తారు. 15వ తేదీన కూలెంట్ లీకై ఓ క్యాన్ పాలల్లో కలిసిన విషయాన్ని గణేష్ గుర్తించకుండా వాటినే 16న ఉదయం సరఫరా చేశారని తేల్చారు. ఈ నెల 17న శీతలీకరణ యంత్రానికి మరమ్మతులు చేసినట్లు గుర్తించారు.

ప్రొపైలిన్ గ్లైకాల్‌కు బదులు ఇథలీన్ గ్లైకాల్ వాడటం వల్లే..: ఇథలీన్ గ్లైకాల్‌ను కార్లు, ట్రక్కులు, హెచ్‌వీఏసీ సిస్టమ్స్, పరిశ్రమల్లోని చిల్లర్లలో మాత్రమే కూలెంట్‌గా వాడతారు. డీ-ఐసింగ్ ద్రవాలు, బ్రేక్ ఫ్లూయిడ్లు, పెయింట్లు, ప్లాస్టిక్, పాలిస్టర్ ఫైబర్ల తయారీలోనూ వినియోగిస్తారు. డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల్లో దీన్ని వినియోగించరు. ఇది లీకై పాలల్లో కలిస్తే అత్యంత ప్రమాదకరం. కాబట్టి డెయిరీల్లో సురక్షితమైన, ఫుడ్‌గ్రేడ్ ప్రొపైలిన్ గ్లైకాల్‌నే వినియోగిస్తారు. ఇది ఖర్చు తక్కువని కొన్ని అనధికారిక డెయిరీలు ప్రొపైలిన్ గ్లైకాల్‌కు బదులు ఇథలీన్ గ్లైకాల్‌ను వాడుతుంటాయి. వరలక్ష్మి డెయిరీలోనూ దీన్నే వినియోగించినట్లు అనుమానిస్తున్నారు.

ప్రాణాలు తీసే మహమ్మారి: ఇథలీన్ గ్లైకాల్ అత్యంత ప్రమాదకరం. 100-200 మిల్లీలీటర్లు మనిషి శరీరంలోకి వెళ్లినా ప్రాణాంతకంగా మారుతుంది.

■ దీని ప్రభావం మూడు దశల్లో ఉంటుంది. దీన్ని తాగిన అర గంట నుంచి 12 గంటల వరకు మద్యం సేవించినట్లుగా మత్తు, తల నొప్పి, వికారం, వాంతులు, నిద్రమత్తు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

■ 12-24 గంటల వరకు మెటబాలిక్ యాసిడోసిస్, శ్వాస తీవ్రంగా తీసుకోవడం, గుండె దడ, రక్తపోటు తగ్గడం వంటి లక్షణాలుంటాయి.

■ 24 నుంచి 72 గంటల వ్యవధిలో మూత్రపిండాలు తీవ్రంగా దెబ్బతింటాయి. కాల్షియం ఆక్సలేట్ క్రిస్టల్స్ ఏర్పడి మూత్రపిండాలు విఫలమవుతాయి. నొప్పి, మూత్రం తక్కువగా రావడం లేదా పూర్తిగా ఆగిపోవడం వంటి లక్షణాలు ఏర్పడతాయి. మెదడు, నరాలు, ఊపిరితిత్తులు, గుండె సమస్యలు తలెత్తుతాయి. తక్షణ చికిత్స అందించకపోతే ప్రాణాలు పోతాయి.

■ ఇథలీన్ గ్లైకాల్ తీపిగా ఉంటుంది. అందువల్ల పిల్లలు, పెంపుడు జంతువులు పొరపాటున తాగకుండా చేదు రుచినిచ్చే మిశ్రమాన్ని కలుపుతారు.

■ రాజమహేంద్రవరంలో పాల వ్యాపారి ఈ నెల 16న సరఫరా చేసిన పాలు కూడా చేదుగా ఉన్నట్లు కొందరు బాధితులు చెప్పడంతో కూలెంట్ కలిసిందని అధికారులు ఒక అంచనాకు వచ్చారు.

ప్రముఖ హృద్రోగ నిపుణుడు, కార్డియో థొరాసిక్ సర్జన్

ముళ్లపూడి వెంకటరత్నం కన్నుమూత



ఈనాడు, హైదరాబాద్-న్యూస్‌టుడే, షాపూర్‌నగర్: సుప్రసిద్ధ కార్డియో థొరాసిక్ సర్జన్, ఉషా ముళ్లపూడి ఆసుపత్రి వ్యవస్థాపకులు డా.ముళ్లపూడి వెంకటరత్నం(88) కన్నుమూశారు. కొంతకాలంగా వయోసంబంధిత, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్ గాజులరామారం లోని సొంత ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా గోరిపట్నం వాస్తవ్యులైన వెంకటరత్నం ఎంబీబీఎస్ పూర్తిచేసిన తర్వాత ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లారు. కార్డియో థొరాసిక్ సర్జరీ నిపుణులుగా రాణించారు. 1990లో స్వదేశానికి తిరిగొచ్చి...1998లో హైదరాబాద్‌లో ముళ్లపూడి కార్డియాక్ సెంటర్‌ను నెలకొల్పారు. అత్యున్నత ప్రమాణాలు, ఉత్తమ మౌలిక వసతులతో ఆసుపత్రిని తీర్చిదిద్దారు. మూడున్నర దశాబ్దాలకుపైగా వైద్య సేవలు అందించిన ఆయన.. స్వయంగా 20 వేలకుపైగా శస్త్రచికిత్సలు చేశారు. వేల సంఖ్యలో హృద్రోగులకు పునర్జన్మ ప్రసాదించారు. ఆయన సతీమణి నళిని కూడా వైద్యురాలే. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. ఓ కుమార్తె ప్రమాదంలో మృతి చెందడంతో ఆమె జ్ఞాపకార్థం ఆసుపత్రిని ఉషా ముళ్లపూడి కార్డియాక్ సెంటర్‌గా మార్చారు. యువ వైద్యులకు స్ఫూర్తిగా నిలుస్తూ.. వారికి వృత్తిగత మెలకువలు నేర్పడంలో వెంకటరత్నం ముందుండేవారని, తెలుగు రాష్ట్రాలతోపాటు విదేశాల్లో స్థిరపడిన ఎంతోమంది హృద్రోగ నిపుణులు ఆయన శిష్యులేనని ఆయన సన్నిహితులు గుర్తుచేసుకున్నారు. కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్, ప్రముఖ కార్డియాలజిస్టు డా.రమేష్ గూడపాటి, ఇతర వైద్యులు, స్థానిక నాయకులు ఆసుపత్రిలో ఆయన భౌతిక కాయం వద్ద నివాళులు అర్పించారు. జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు.

వచ్చెయ్యండి.. ఐఐటీకి!

(మొదటి పేజీ తరువాయి)

డ్రోన్ల వంటి వాటిపై అవగాహన కల్పించడమే కాకుండా పలు ఇంటరాక్టివ్ కార్యక్రమాలు చేపట్టనున్నారు. టాకియన్ టెక్ ఫెస్ట్‌లో పాల్గొనే వారికి రీసెర్చ్ ల్యాబ్‌లు, క్రీడా సముదాయం, తరగతి గదులతో పాటు 580 ఎకరాల ప్రాంగణాన్ని సందర్శించే అవకాశం ఉంటుంది. ప్రతిభ కనబరచిన వారు బహుమతులూ అందుకోవచ్చు.

అర్హులు వీరే

ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. రూ.100 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలి. మొదటి 30 మందికే అవకాశం కల్పిస్తారు. ఆసక్తి ఉన్నవారు 63746 16872 నంబరు ద్వారా ఈవెంట్ నిర్వాహకులు సంప్రదించవచ్చు.



బిహార్ రాజధాని పట్నాలో సునీల్‌నాయక్ (గ్రీన్ కలర్ షర్ట్)తో ఆయన ఇంట్లో కేసు విచారణాధికారి దామోదర్

రఘురామకృష్ణరాజుపై హత్యాయత్నం కేసు..

సునీల్ నాయక్ అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశాలిచ్చింది. దీంతో సునీల్‌నాయక్‌ను అరెస్టు చేసినప్పటికీ పట్నా నుంచి ఏపీకి తీసుకురావటం సాధ్యం కాలేదు. ఈ మొత్తం వ్యవహారంలో సోమవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకూ పలు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఎస్పీ దామోదర్ బృందాన్ని బిహార్ పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. సునీల్ నాయక్‌ను వైద్య పరీక్షలకు తీసుకెళ్లనీయకుండా, ట్రాన్సిట్ వారంట్ దాఖలు చేయటానికి వెళ్లనీయకుండా అనేక ఆటంకాలు సృష్టించారు. వాటన్నింటినీ ఏపీ పోలీసులు చాకచక్యంగా అధిగమించినప్పటికీ ట్రాన్సిట్ వారంట్ తిరస్కరణకు గురికావటంతో సునీల్‌నాయక్‌కు తాత్కాలికంగా ఉపశమనం దక్కినట్లైంది.

అంతా చుట్టుముట్టేసి..

పట్నాలోని స్థానిక కోర్టు వద్ద కూడా ఏపీ పోలీసులకు తీవ్ర ఆటంకాలు ఎదురయ్యాయి. ఏపీ పోలీసులు కేసు డైరీ, అరెస్టు వారంట్ తీసుకురాలేదంటూ సునీల్ నాయక్ తరఫు న్యాయవాదులు కోర్టుకు చెప్పారు. దాంతో కోర్టు సునీల్‌నాయక్ ట్రాన్సిట్ వారంట్‌ను తిరస్కరించింది. తాము ఆ పత్రాలన్నీ సమర్పించామని ఎస్పీ దామోదర్ బృందం పదేపదే చెప్పేందుకు ప్రయత్నించింది. అయితే సునీల్‌నాయక్ న్యాయవాదులు, బిహార్ పోలీసులు ఏపీ బృందాన్ని చుట్టుముట్టేసి వాదనలు వినిపించటానికి కూడా వీల్లేకుండా చేశారు. దీంతో పిటిషన్‌పై విచారణ రెండు నిమిషాల్లోనే ముగిసిపోయింది. న్యాయస్థానం నుంచి లిఖితపూర్వక ఉత్తర్వులు అందిన వెంటనే.. వాటిపై అప్పీలుకు వెళ్లాలని ఏపీ పోలీసులు భావిస్తున్నారు.

అడ్డంకుల్ని అధిగమించి మరీ న్యాయస్థానానికి తీసుకెళ్లినా..

బిహార్ రాష్ట్ర అగ్నిమాపక సేవల విభాగం, హోంగార్డుల విభాగానికి ఐజీగా బాధ్యతలు నిర్వహిస్తున్న సునీల్ నాయక్ వైకాపా హయాంలో అంతర్రాష్ట్ర డిప్యుటేషన్‌పై ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి సీఐడీ విభాగం డీఐజీగా పనిచేశారు. జగన్ హయాంలో సీఐడీ కస్టడీలో రఘురామకృష్ణరాజును చిత్రహింసలు పెట్టి హత్య చేయడానికి ప్రయత్నించారనే ఆరోపణలపై గుంటూరులోని నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో 2024 జులైలో నమోదైన కేసు దర్యాప్తులో సునీల్‌నాయక్ పాత్ర వెలుగుచూడటంతో ఆయన్ను నిందితుడిగా చేర్చారు. విచారణకు రావాలంటూ పలుమార్లు నోటీసులిచ్చినా ఆయన గైర్హాజరయ్యారు. సునీల్ నాయక్ వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ గుంటూరు రెండో అదనపు జిల్లా న్యాయస్థానం మొన్న జనవరిలో ఉత్తర్వులిచ్చింది. ఈ నేపథ్యంలో ఆయన్ను అరెస్టు చేయడానికి దర్యాప్తు అధికారి దామోదర్ నేతృత్వంలోని 12 మంది అధికారుల బృందం ఆదివారం సాయంత్రమే పట్నాకు చేరుకుంది. సోమవారం ఉదయం 6 గంటల సమయంలో.. పట్నా శాస్త్రినగర్‌లోని సునీల్‌నాయక్ అధికారిక నివాసానికి చేరుకుని ఆయన్ను అరెస్టు చేస్తున్నట్లు చెప్పి అదుపులోకి తీసుకుంది. ఆయన్ను తరలించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో దాదాపు 500 మందికి పైగా హోంగార్డులు, పోలీసులు వచ్చి దామోదర్ బృందాన్ని అడ్డుకున్నారు. వాహనాలకు అడ్డంపడి మరీ.. ముందుకు కదలకుండా ఆటంకాలు సృష్టించారు. ఏపీ పోలీసులు వాటన్నింటినీ దాటుకుని సునీల్‌నాయక్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యపరీక్షలు చేయించారు. ఆయన ఆరోగ్యంగా ఉన్నట్లు తేలటంతో.. ట్రాన్సిట్ వారంట్ కోసం పట్నాలోని స్థానిక కోర్టులో హాజరుపరిచారు.

జగన్ హయాంలో పేట్రేగిపోయిన ఫలితం

సాధారణంగా అంతర్రాష్ట్ర దొంగల ముఠాలు, వ్యవస్థీకృత నేరగాళ్లను అరెస్టు చేయటానికి మన రాష్ట్ర పోలీసులు ఇతర రాష్ట్రాలకు వెళ్లి ఆపరేషన్లు చేస్తుంటారు. అక్కడ దొంగల ముఠాలు, వారి అనుచరుల నుంచి దాడులు, ఆటంకాలు ఎదుర్కొంటుంటారు. కానీ హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉన్న మరో రాష్ట్ర క్యాడర్‌కు చెందిన ఓ ఐపీఎస్, అందులోనూ ఐజీ స్థాయి అధికారిని అరెస్టు చేయడానికి ఏపీ నుంచి ప్రత్యేక బృందం ఇతర రాష్ట్రాలకు వెళ్లటం, అరెస్టు చేయటం ఇదే తొలిసారి. జగన్ మోహన్‌రెడ్డి హయాంలో కన్నుమిన్నూ కానకుండా పేట్రేగిపోయిన ఫలితం ఆ అధికారి ఇప్పుడు అనుభవించాల్సి వస్తోంది.

తదుపరి ఎవరు?

రఘురామకృష్ణరాజును సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారనే ఆరోపణలపై నమోదైన కేసులో వైకాపా హయాంలో సీఐడీ విభాగాధిపతిగా పనిచేసిన పీవీ సునీల్‌కుమార్, నిఘా విభాగాధిపతిగా పనిచేసిన పీఎస్ఆర్ ఆంజనేయులు, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అప్పటి సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్, నాటి గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, సునీల్‌కుమార్ అనుచరుడిగా ముద్రపడ్డ కామేపల్లి తులసిబాబు సహా పలువురు నిందితులు. ఈ కేసులో ఇంతకు ముందే విజయ్‌పాల్, తులసిబాబు అరెస్టయ్యారు. సునీల్‌నాయక్ అరెస్టుతో ఈ కేసులో అరెస్టుల సంఖ్య మూడుకు చేరినట్లయింది. దీంతో తదుపరి ఎవర్ని అరెస్టు చేస్తారనే చర్చ జరుగుతోంది. ఈ కేసులో పీవీ సునీల్‌కుమార్ ప్రధాన నిందితుడు. ఆయన గతంలో ఓసారి విచారణకు హాజరైనా దర్యాప్తునకు ఏ మాత్రం సహకరించలేదని దర్యాప్తు అధికారి సమర్పించిన నివేదిక ఆధారంగానే ఇటీవల ఆయనపై సస్పెన్షన్ పొడిగించారు.

■ బిహార్ క్యాడర్ ఐపీఎస్ అధికారి సునీల్‌నాయక్ సొంతూరు పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గం బొల్లాపల్లి మండలం లాలీపురం తండా. ఆయన తండ్రి బద్యానాయక్ వైకాపా హయాంలో సర్పంచిగా పనిచేశారు. ప్రస్తుతం అదే పార్టీలో కొనసాగుతున్నారు.

తితిదేలో తప్పు చేసిన వారిపై క్రిమినల్ చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం శాసనసభలోని తన ఛాంబర్‌లో కొందరు మంత్రులు, సీఎంఓ అధికారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. తిరుమల శ్రీవారి ఆలయంలోకి అన్యమతస్థులు ప్రవేశించాలంటే డిక్లరేషన్ ఇవ్వడం తప్పనిసరి చేస్తూ.. నిబంధనల్లో మార్పులు చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై మంగళవారం శాసనసభలో ప్రత్యేక చర్చ చేపట్టనున్నారు. అధికార కూటమిలోని మూడు పార్టీలకు చెందిన సుమారు 10 మంది సభ్యులతో ఈ అంశంపై మాట్లాడించనున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గొంతు నొప్పి కారణంగా సోమవారం శాసనసభ సమావేశాలకు హాజరుకాలేదు. మంగళవారం కల్తీ నెయ్యిపై చర్చలో ఆయన పాల్గొని మాట్లాడతారని సమాచారం. చివర్లో సీఎం చంద్రబాబు ప్రకటన ఉంటుంది.

హిజ్రాల హక్కుల రక్షణ చట్టం అమలుకు కీలక ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: హిజ్రాల హక్కుల రక్షణ చట్టం-2019 అమలుపై ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీచేసింది. వారి గుర్తింపు సర్టిఫికెట్లను జిల్లా అధికారులు తిరస్కరిస్తే అప్పీలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ అప్పిలేట్ అథారిటీ నియామకానికి ఉత్తర్వులను సోమవారం జారీచేసింది. విచారణ కోసం దివ్యాంగులు, హిజ్రాలు, వృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్‌ను అప్పిలేట్ అథారిటీగా నియమించింది. పనిచేసే చోట వారికి సమస్య ఎదురైతే ఫిర్యాదుల కోసం ప్రతి సంస్థలోనూ ఫిర్యాదుల స్వీకరణ అధికారిని నియమించాలని స్పష్టం చేస్తూ మరో ఉత్తర్వును జారీచేసింది.



27న ఐఎన్ఎస్ అంజదీప్ కమిషనింగ్

విశాఖపట్నం (సింధియా), న్యూస్‌టుడే: భారత నౌకాదళ అవసరాల నిమిత్తం కోల్‌కతా జీఆర్ఎస్ఈ నిర్మించిన యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ (ఏఎస్‌డబ్ల్యూ) సామర్థ్యం గల ఐఎన్ఎస్ అంజదీప్ నౌకను ఈ నెల 27న కమిషన్ చేయనున్నట్లు నేవీ వర్గాలు సోమవారం తెలిపాయి. ఈ నౌకను ఆ రోజు చెన్నై పోర్టులో నౌకాదళ సేవల్లోకి ఆహ్వానించనున్నట్లు పేర్కొన్నాయి. ఈ నౌక నిర్మాణంలో డాల్ఫిన్ హంటర్ ఇంజినీరింగ్ సాంకేతికత, హల్‌మౌంటెడ్ సోనార్ అభయ్ పరిజ్ఞానాన్ని వినియోగించినట్లు వెల్లడించాయి. తక్కువ బరువున్న టార్పెడోలు, రాకెట్ లాంచర్లతో సముద్రతీర నిఘా, శోధన, రక్షణ వ్యవస్థలతో 25 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణించేందుకు 77 మీటర్ల పొడవున నిర్మించిన ఈ నౌకను భారత నేవీ అడ్మిరల్ దినేష్‌కుమార్ త్రిపాఠి చేతులమీదుగా జాతికి అంకితం చేయనున్నట్లు ఆ వర్గాలు వివరించాయి.

విచారణ కమిటీ ఏర్పాటు సబబే

(మొదటి పేజీ తరువాయి)

ఏమైనా లోపలున్నాయా? అవి ఎలాంటివి? అందుకు బాధ్యులెవరు? వాటి పర్యవసానాలేంటి? అన్నది గుర్తించడానికి పాలనాపరమైన విచారణకు ఆదేశించింది. ఛార్జిషీట్లు, అనుబంధ ఛార్జిషీట్లు వేయడానికి దారితీసిన క్రిమినల్ ప్రొసీడింగ్స్‌తో ఈ విచారణ ఓవర్‌ల్యాప్ కాదన్నది మా అభిప్రాయం. ఆ రెండింటి మధ్య పరస్పర ప్రయోజన వైరుధ్యం, ఓవర్‌ల్యాపింగ్ లేవు. విచారణ, దర్యాప్తు పరిధిని విస్పష్టంగా నిర్దేశించినందున, ప్రస్తుత వ్యాజ్యంలో పిటిషనర్ అనుమానాలకు ఏ ప్రాతిపదికా లేదు. చట్టప్రకారం రెండు విచారణ ప్రక్రియలూ కొనసాగొచ్చు. ఈ వివరణతో ఈ పిటిషన్‌పై విచారణ ముగిస్తున్నాం' అని పేర్కొంది.

లోపాలను సవరించడానికే ఏకసభ్య కమిటీ

తొలుత సుబ్రహ్మణ్యస్వామి తరఫు న్యాయవాది రాజశేఖర్‌రావు వాదిస్తూ, ఈ కేసులో సుప్రీంకోర్టు వేసిన సిట్ ఇప్పటికే నివేదిక ఇచ్చాక, మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిటీ వేయాలని నిర్ణయించడాన్ని ప్రశ్నించారు. దీనికి సీజేఐ స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తన ప్రతిపాదన ప్రకారం ముందుకెళ్లనివ్వండని అన్నారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కల్పించుకొని, 'ఇప్పటికే సిట్ దర్యాప్తు పూర్తిచేసి, ఛార్జిషీట్ వేసింది. సిట్ కొన్ని పరిపాలనాపరమైన లోపాలను గుర్తించింది. వాటితో నేరాపరాధాలకు సంబంధం లేదు. ఆ విషయాలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించగా, వాటిని సరిచేయడానికి ప్రభుత్వం ఏకసభ్య కమిటీ వేసింది. అంతే తప్ప, సిట్ దర్యాప్తులో జోక్యం చేసుకోవడం లేద'ని పేర్కొన్నారు. మరో సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదిస్తూ, 'ఇవన్నీ శాఖాపరమైన ఉత్తర్వులు. పాలనాపరమైన లోపాలను గుర్తించడానికే ఈ కమిటీ పనిచేస్తుంది. దీని పరిధిలోకి వచ్చే అధికారులకు నేరాభియోగాలతో సంబంధం ఉండకపోవచ్చు' అని అన్నారు. తర్వాత న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కూడా వాదించారు. 'పిటిషనర్ గతంలో తితిదే తరఫున హాజరయ్యారు. శాఖాపరమైన చర్యలను పక్కదోవ పట్టించడానికే దురుద్దేశంతో ఈ పిటిషన్ వేశార'ని పేర్కొన్నారు. చివరకు పిటిషనర్ తరఫు న్యాయవాది.. మా వ్యాజ్యంలోని వినతులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. దానికి సీజేఐ స్పందిస్తూ 'మా ఉత్తర్వుల గురించి మీకు ఆందోళన అక్కర్లేదు. ఎలా దర్యాప్తు చేయించాలో మాకు తెలుసు. దానిపై విస్పష్ట ఆదేశాలున్నాయి. ఆ దర్యాప్తును తార్కిక ముగింపునకు తీసుకెళ్లేందుకు హామీ ఇస్తున్నాం. ఈ వ్యవహారంలో పాలనాపరమైన లోపాలు, అలక్ష్యం, నేరపూరిత నిర్లక్ష్యం ఉండొచ్చు. ఏదైనప్పటికీ, మీ ఆందోళనంతా దర్యాప్తు ఓవర్‌ల్యాపింగ్ కాకుండా చూడాలనే కదా?' అని ప్రశ్నించారు.

బహిరంగ ప్రకటనల ప్రభావం ఉండదు

పిటిషనర్ న్యాయవాది మరో అంశాన్ని కోర్టు దృష్టికి తెచ్చారు. 'రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఎవరూ ఈ విషయాన్ని రాష్ట్రంలోని మిగతా ఆలయాలకు వర్తింపజేస్తూ మాట్లాకుండా నియంత్రించండి. సిట్ దర్యాప్తునకు ముందే కొందరు ప్రజాప్రతినిధులు మాట్లాడడాన్ని కోర్టు సీరియస్‌గా పరిగణించింది. ఇప్పటికీ బహిరంగ వేదికలపై అవే ఆరోపణలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి కూడా ప్రకటనలు చేయడం సమస్యగా మారింది. ఆయనకు పొలైట్ అడ్వైజరీ జారీచేయండ'ని కోరారు. సీజేఐ నిరాకరిస్తూ.. 'దీనిపై మేం ఎలాంటి వ్యాఖ్యలూ చేయం. దానివల్ల అనవసర అభిప్రాయాలు ఏర్పడవచ్చు. విషయం కోర్టులో ఉన్నప్పుడు బహిరంగ ప్రకటనల ప్రభావం దర్యాప్తుపై ఎలా పడుతుంద'ని ఎదురుప్రశ్న వేస్తూ, విచారణను ముగించారు.

---

64 దేశాలతో మైత్రికి పార్లమెంటరీ బృందాల ఏర్పాటు

ఈనాడు, దిల్లీ: విదేశీ పార్లమెంటు సభ్యులతో సంభాషణల ద్వారా ఆయా దేశాలతో భారత్ సంబంధాలను మరింత బలోపేతం చేసే సంకల్పంతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సోమవారం పార్లమెంటరీ మైత్రీ బృందాలను ఏర్పాటు చేశారు. అనుచిత ప్రవర్తన కారణంగా ఇటీవల బడ్జెట్ సమావేశాల్లో దిగువ సభ నుంచి సస్పెండైన విపక్ష నేతలకూ వాటిలో స్థానం కల్పించారు. ప్రతి బృందంలో 11 మంది సభ్యులు ఉంటారు. మొత్తం 64 దేశాలతో సంబంధాల బలోపేతం కోసం ఇవి ఏర్పాటయ్యాయి. విపక్ష ప్రముఖ నేతలు శశి థరూర్, పి.చిదంబరం, గౌరవ్ గొగొయ్, సుప్రియా సూలే, అఖిలేశ్ యాదవ్ ఈ బృందాలకు ఛైర్‌పర్సన్లుగా నియమితులైనవారిలో ఉన్నారు. భాజపా నుంచి రవిశంకర్ ప్రసాద్, బైజయంత్ పాండా, నిశికాంత్ దుబే, అనురాగ్ ఠాకుర్‌లకు ఆ పదవులు దక్కాయి. మొత్తం ఏడు గ్రూపులకు తెలుగు రాష్ట్రాల ఎంపీలు నేతృత్వం వహించనున్నారు. జపాన్‌తో మైత్రీబృందంలో కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకాగాంధీ సభ్యురాలిగా ఉన్నారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో సస్పెండైన కాంగ్రెస్ నేతల్లో మాణికం ఠాగూర్ (ఇండోనేసియాతో పార్లమెంటరీ మైత్రీబృందంలో), గుర్జీత్‌సింగ్ ఔజ్లా (ఇటలీ), హిబీ ఈడెన్ (సింగపూర్), అమరీందర్ సింగ్ రాజ్ వారింగ్ (బ్రిటన్), ప్రశాంత్ పడోలె (ట్రినిడాడ్ అండ్ టొబాగో), కురియాకోస్ (సౌదీ అరేబియా), సి.కిరణ్‌కుమార్ రెడ్డి (దక్షిణ కొరియా) కూడా ఈ గ్రూపుల్లో సభ్యులుగా చోటుదక్కించుకున్నారు. ఇలాంటి మరిన్ని బృందాలను ఓం బిర్లా త్వరలోనే ఏర్పాటుచేసే అవకాశాలు ఉన్నాయి. ఈ బృందాలు ఆయా దేశాల పార్లమెంటు సభ్యులతో విభిన్న అంశాలపై సంప్రదింపులు జరిపి అభిప్రాయాలు పంచుకుంటాయి. కేవలం పార్లమెంటరీ నియమ నిబంధనల వరకే పరిమితం కాకుండా వాణిజ్యం, సాంకేతికత, సామాజిక విధానాలు, సంస్కృతి, ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యం ఎందుర్కొంటున్న సవాళ్ల వంటి అంశాలపైనా చర్చిస్తారు.



తాజాగా ఏర్పాటైన బృందాల్లో కొన్ని..

ఏ దేశంతో మైత్రీ బృందం?	ఎవరి నేతృత్వం?
ఇజ్రాయెల్	రవిశంకర్ ప్రసాద్ (భాజపా)
అమెరికా	బైజయంత్ పాండా (భాజపా)
రష్యా	నిశికాంత్ దుబే (భాజపా)
ఈయూ పార్లమెంటు	అనురాగ్ ఠాకుర్ (భాజపా)
శ్రీలంక	డి.పురందేశ్వరి (భాజపా)
కువైట్	కొండా విశ్వేశ్వరరెడ్డి (భాజపా)
ఉక్రెయిన్	ధర్మపురి అర్వింద్ (భాజపా)
ఇటలీ	పి.చిదంబరం (కాంగ్రెస్)
జపాన్	మనీశ్ తివారీ (కాంగ్రెస్)
ఫ్రాన్స్	శశి థరూర్ (కాంగ్రెస్)
పోర్చుగల్	కె.సి.వేణుగోపాల్ (కాంగ్రెస్)
ఆస్ట్రేలియా	అఖిలేశ్ యాదవ్ (సమాజ్‌వాదీ పార్టీ)
ఒమన్	అసదుద్దీన్ ఒవైసీ (ఏఐఎంఐఎం)
క్యూబా	ఎం.శ్రీనివాసులు రెడ్డి (తెదేపా)
మాల్దీవులు	లావు శ్రీకృష్ణ దేవరాయలు (తెదేపా)
బాల్టిక్స్	మిథున్ రెడ్డి (వైకాపా)

ముందొస్తాయి.. ముంచేస్తాయి!

(మొదటి పేజీ తరువాయి)

పదుల సంఖ్యలో నకిలీ వెబ్‌సైట్లు తెరపై కనిపిస్తాయి. అంటే నేరగాళ్లే సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ విధానంలో నకిలీ వెబ్‌సైట్లకు ఎక్కువ క్లిక్‌లు, రివ్యూలు ఇచ్చుకుని ప్రముఖంగా వచ్చేలా చేస్తున్నారన్నమాట. ఈ వెబ్‌సైట్లలోకి వెళ్లగానే వ్యక్తిగత వివరాలు, ఫోన్ నంబర్లు సేకరించి ఆ తర్వాత ఖాతాల్లోంచి డబ్బు కొట్టేస్తారు. సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్‌కు బదులు యాడ్‌ల ద్వారా వెబ్‌సైట్‌ను ప్రముఖంగా కనిపించేలా చేయడం పెయిడ్ అడ్వర్టైజ్‌మెంట్ విధానం. దీనినీ మోసగాళ్లు విరివిగా వినియోగిస్తున్నారు.



నేరాల తీరు..

● నేరగాళ్లు నకిలీ వెబ్‌సైట్లు, కస్టమర్‌కేర్ నంబర్లు ప్రధానంగా ఉపయోగిస్తున్నారు. అసలైన బ్యాంకులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల వెబ్‌సైట్ల తరహాలోనే నకిలీవి ఉంటాయి.

● బ్యాంకు, ఏదైనా సంస్థ కస్టమర్‌కేర్ పేరు నమోదు చేయగానే అసలు వెబ్‌సైట్, అందులోని ఫోన్ నంబరు బదులు నకిలీది తెరపై వస్తుంది.

● కస్టమర్‌కేర్ ప్రతినిధుల్లా మాట్లాడే సైబర్ నేరగాళ్లు వివిధ ఛార్జీల పేరుతో డబ్బులు వసూలు చేయడం, వాట్సప్‌లో లింక్ పంపించి ఎనీ డెస్క్ లాంటి యాప్‌లు డౌన్‌లోడ్ చేయించి ఫోన్లను తమ అధీనంలోకి తీసుకుని బ్యాంకు ఖాతాలోని డబ్బు బదిలీ చేయించుకోవడం తదితర నేరాలకు పాల్పడుతున్నారు.

● ఎక్కువగా బ్యాంకు కస్టమర్‌కేర్ పేరుతో మోసాలు జరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం సంచార్ సాథీ వెబ్‌సైట్‌లో దేశవ్యాప్తంగా దాదాపు 200 బ్యాంకులకు సంబంధించిన కస్టమర్‌కేర్ నంబర్లు, వెబ్‌సైట్ల వివరాలను పొందుపరిచింది.

జాగ్రత్తలివీ..

● ఆన్‌లైన్‌లో వెతికినప్పుడు.. తెరపై కనిపించే వెబ్‌సైట్లను తనిఖీ చేసుకోవాలి.

● ఏదైనా వస్తువు కొనుగోలు చేసినప్పుడు ఇచ్చే రసీదులపై వెబ్‌సైట్ వివరాలుంటాయి. వాటిని మాత్రమే సంప్రదించాలి.

● బ్యాంకులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల అధికారిక వెబ్‌సైట్‌ల గురించి తెలుసుకుని ఆన్‌లైన్‌లో టైప్ చేస్తే కచ్చితమైన సమాచారం వస్తుంది.

● సెర్చ్ ఇంజిన్‌లో స్పాన్సర్డ్ లేదా ప్రకటన (యాడ్) అని ఉంటే దాన్ని క్లిక్ చేయకుండా అప్రమత్తంగా ఉండాలి.

● మోసానికి గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ (1930)కి ఫిర్యాదు చేయాలి.

అప్రమత్తత అవసరం

ప్రతి చిన్న సమాచారానికి సెర్చ్ ఇంజిన్లలో వెతకడాన్ని సైబర్ నేరగాళ్లు తమకు అవకాశంగా మలచుకుంటున్నారు. సెర్చ్ ఫలితాల్లో ముందుగా వచ్చినంత మాత్రాన అవి అసలైన వెబ్‌సైట్‌లు అని నమ్మడానికి వీల్లేదు. నకిలీ వెబ్‌సైట్లలో వ్యక్తిగత వివరాలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకింగ్ వివరాలు, వాట్సప్ లింక్‌లు.. అడుగుతున్నారంటే వెంటనే అప్రమత్తమవ్వాలి. ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే ఫిర్యాదు చేయాలి. – వీసీ సజ్జనార్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్

– ఈనాడు, హైదరాబాద్

వసుంధర

vasundhara@eenadu.in

పాపం... ఓపిక లేదు!



కొంతమంది తల్లులను చూడండి. ఎప్పుడూ డల్‌గా, అలసిపోయినట్లుగా కనిపిస్తుంటారు. చిన్న చిన్నవాటికే ఓపిక ఉండదు, చిరాకు పడుతుంటారు. రోజువారీ పనుల్నీ భారంగా చేస్తుంటారు. వాళ్లని చూసినప్పుడు ఈమేంటి ఇలా ఉంది అనుకుంటూ ఉంటాం కదా! ఇదేమీ వాళ్లు కావాలని చేసేది కాదు. వాళ్లలా ఉండటానికి 'డిప్లేటెడ్ మదర్‌హుడ్ సిండ్రోమ్' కారణమంటారు నిపుణులు. తీరికలేకుండా ఇల్లు, పిల్లలను చూసుకోవడం, ఒకటే రొటీన్‌లో జీవితాన్ని సాగించడం, తగిన విశ్రాంతి తీసుకోకపోవడం... ఇలా దీనికి చాలానే కారణాలు. కాబట్టే, ఇలా ఓపిక లేకుండా నీరసంగా తయారవుతారు. అన్నింటా అనాసక్తి. పిల్లలతో హోమ్‌వర్క్ చేయించేంత సహనమూ ఉండదు. పైగా ఇవన్నీ సరిగా చేయట్లేదని గిల్టీగానూ ఫీలవుతుంటారు. స్నేహితులకు దూరమవడమే కాదు... భాగస్వామితోనూ అంటీముట్టనట్లు తయారవుతారు. ఇవన్నీ వాళ్లలో ప్రేమ తగ్గడానికి చిహ్నాలు కాదు... విశ్రాంతి, సాయం కావాలని, మోయలేని అంచనాలను వాళ్లమీద వేయొద్దని అర్థం. అందుకే ఇలాంటి చిహ్నాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయొద్దు అంటున్నారు నిపుణులు. రోజులో ప్రతి కొన్ని గంటలకు విశ్రాంతి తీసుకోవడం, అన్నీ ఒక్కరే చేసుకుంటూ వెళ్లక సాయం అడగడం వంటివి చేయమంటున్నారు. చేయలేను అనిపిస్తే 'నో' చెప్పేయాలి. మీకంటూ కొన్ని వ్యాపకాలను ఏర్పరచుకోవాలి. ఇతరులతో మాట్లాడటం, అసంతృప్తులను పంచుకోవడం వంటివీ చేయాలి. ముఖ్యంగా మీకంటూ కొంత సమయం కేటాయించుకోవాలి. చేస్తారుగా మరి!

మీకు తెలుసా?

టెక్సాస్‌కు చెందిన లీన్లీ హోప్ బూమర్ అనే పాప రెండుసార్లు జన్మించింది. లీన్లీ తల్లి మార్గరెట్ గర్భం దాల్చిన 23 వారాల తర్వాత ఆమె వెన్నెముకలో ప్రాణాంతకమైన కణితిని గుర్తించారట. దాంతో ఐదు గంటలు సర్జరీ నిర్వహించి, వైద్యులు కణితిని తొలగించారు. ఈక్రమంలో బేబీని కడుపులోంచి తీశారట. సర్జరీ తర్వాత యథాస్థానంలో బేబీని ఉంచారు. 12 వారాలు గడిచాక సి-సెక్షన్ ద్వారా లీన్లీకి జన్మనిచ్చారు మార్గరెట్.

బంగారం - వెండి



23న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,63,500	1,47,300	2,72,327
విజయవాడ	1,58,630	1,47,900	2,82,800
ప్రొద్దుటూరు	1,57,500	1,44,900	2,70,000
రాజమహేంద్రవరం	1,61,350	1,47,900	3,00,000
విశాఖపట్నం	1,60,250	1,46,900	2,74,000
తమిళనాడు	-----	1,48,600	3,00,000



కృష్ణ

బోర్డులో... సగం మహిళలే!

మహిళల కెరియర్‌కు ఎప్పుడూ ద్వారాలు తెరిచే ఉంటాయి... నిర్ణయించుకోవాల్సింది ఆ ప్రయాణం ఎప్పుడనేదే. అందుకు నిదర్శనం కృష్ణ పీసపాటి. పెళ్లి, పిల్లల తర్వాత వృత్తి జీవితాన్ని ప్రారంభించారామె. ఆపై ఐటీ కంపెనీ కోవెలెన్స్‌కు సహ-వ్యవస్థాపకురాలిగా విజయవంతమైన కెరియర్‌ని నిర్మించుకున్నారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

సొంతూరు విశాఖపట్నం. అక్కడ సెయింట్ జోసెఫ్ కాలేజీలో చదువుకున్నా. బీఎస్సీ మ్యాథ్స్ చేశా. బ్యాచ్ టాపర్‌ని. డిగ్రీ కాగానే పెళ్లి. మావారి ఉద్యోగరీత్యా కొన్నేళ్లు అమెరికాలో ఉన్నాం. ఆయనకు భారత్ తిరిగిరావాలని ఉండేది. దాంతో 2000లో వైజాగ్ తిరిగొచ్చి ఓ ఐటీ కంపెనీకి సీఓఓగా చేరారు. మాకో బాబు, పాప. వాళ్లు స్కూల్‌కి వెళ్లడం మొదలుపెట్టాక సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి... వృత్తి జీవితం ప్రారంభించాలనుకున్నా. అప్పటికి రియల్ ఎస్టేట్ రంగం నన్ను ఆకట్టుకుంది. మావారు నారాయణతో చెబితే... 'జీవితం అంటే నేర్చుకోవడమే ప్రయత్నించు' అని ప్రోత్సహించారు. అందులో లాభాలు వచ్చాయి. ఐటీ కంపెనీ పెట్టాలనేది మావారి లక్ష్యం. నన్ను అందులో చేరమన్నారు. 2006లో హైదరాబాద్‌కు వచ్చి 'కోవెలెన్స్ టెక్నాలజీస్'ని స్థాపించాం. స్థిరాస్తి వ్యాపారంలో కొనసాగుతూనే దీన్లో చేరాను. అమీర్‌పేట్‌లో ఆఫీసు తెరిచాం. సేల్స్, రిక్రూట్‌మెంట్, ఆపరేషన్స్... ఇలా వివిధ విభాగాల్ని పర్యవేక్షించేదాన్ని. గచ్చిబౌలిలో ఆఫీస్ స్పేస్ కొన్నప్పుడు ఇంటీరియర్ డిజైనింగ్ పనులూ చూసుకున్నా.

బాబు టెన్త్... నేను ఎంబీయే

కొన్నేళ్ల ప్రయాణం తర్వాత మేనేజ్‌మెంట్ కోర్సు చేయాలనుకున్నా. జంషెడ్‌పుర్‌లోని జేవియర్ ఇన్‌స్టిట్యూట్ నుంచి ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ కోసం చేరా. అప్పుడు అబ్బాయి టెన్త్ చదివేవాడు. అయినా నా లక్ష్యాన్ని వాయిదా వేయలేదు. మా బ్యాచ్‌లో కార్పొరేట్ రంగం నుంచి వచ్చిన సీనియర్లు ఉన్నారు. 'సొంత కంపెనీ స్థాపించి, మాకంటే మీరే ఎక్కువ అచీవ్ చేశార'ంటూ మెచ్చుకున్నారు. భిన్న రకాల కేస్ స్టడీస్‌ని అధ్యయనం చేస్తూ చాలా విషయాల్ని నేర్చుకోగలిగా. గొప్ప ప్రొఫెసర్లు ఉన్నారక్కడ. వాళ్లిచ్చిన ప్రోత్సాహంతో బ్యాచ్‌లో సెకండ్ టాపర్‌గా నిలిచా. ప్రస్తుతం సంస్థకు సీఓఓగా ఉన్నా. అమెరికా, ఆస్ట్రేలియా సహా ఏడు దేశాల్లో డేటా, ఏఐ, బిజినెస్ అప్లికేషన్స్... తదితర విభాగాల్లో సేవలు అందిస్తున్నాం. కోకకోలా, యూనీలీవర్, వొడాఫోన్ మొదట్నుంచీ మా ఖాతాదారుల్లో ఉన్నారు. కొవిన్ పోర్టల్ అభివృద్ధిలో థర్డ్ పార్టీగా మా పాత్ర ఉంది. శరీరంలో నిత్యం వైరస్‌లకు వ్యతిరేకంగా పోరాటం జరుగుతుంది. దానివల్లే జీవించగలుగుతున్నాం. అలాగే సవాళ్లు లేకుండా కెరియర్ నిర్మాణం సాధ్యం కాదు. వాటిని ఎలా చూస్తున్నామనేదే ముఖ్యం. మా ఇంట్లో 'బాగా' పాలసీని ఫాలో అవుతాం. బాగా నవ్వాలి, తినాలి, వ్యాయామం చేయాలి, విశ్రాంతి తీసుకోవాలి. దీనివల్ల పెద్ద సమస్యలూ చిన్నవిగా, తాత్కాలికమైనవిగా కనిపిస్తాయి. అత్తమామలు మాతోనే ఉంటారు. అమ్మానాన్న దగ్గర్లోనే ఉంటారు. పిల్లలతోపాటు వీళ్ల బాధ్యతనూ చూసుకోవాలి. అలాగని భయపడను. కారణం... కుటుంబ మద్దతు ఉంటుందన్న ధీమా. చేయాల్సిన పనుల్ని ఒక పుస్తకంలో రాసుకుని ఏరోజుకారోజు వాటిని పూర్తిచేస్తా. కొన్నిసార్లు 12 గంటలు పడుతుంది.

నిర్ణయశక్తిగా మహిళలు...

మా సంస్థ బోర్డులో సగం మంది మహిళలే. హెచ్ఆర్ హెడ్‌తోపాటు మొత్తం ఆ విభాగంలో అందరూ మహిళలే. అమ్మాయిలకు పెళ్లి, పిల్లలు, భర్తకు బదిలీ అయినప్పుడు తానూ వెళ్లడం... వీటివల్ల కెరియర్ బ్రేక్‌లు ఉంటాయి. ఆ సమయంలో సంస్థలు పనివేళల తగ్గింపు, ఇంటి నుంచి పని చేసుకునే వీలు... లాంటి వెసులుబాట్లు ఇవ్వాలి. బోధన, వైద్యం కంటే ఐటీ రంగం మహిళలకు ఎంతో అనుకూలం. ఎక్కడ ఉన్నా ల్యాప్‌టాప్ ఉంటే చాలు పనిచేసుకోవచ్చు. కొవిడ్‌కు ముందు నుంచే అలా ఎందరికో వర్క్ ఫ్రమ్ హోమ్‌కు అవకాశం కల్పించాం. దాంతో ఉద్యోగంలో కొనసాగగలిగారు. పరిస్థితులు సర్దుకున్నాక ఫుల్‌టైమ్ ఎంతో అంకితభావంతో పనిచేసి సంస్థలో ఉన్నతస్థాయికి చేరుకున్నారు.

ఇక నా భర్త తీసుకెళ్లడా?

నా భర్త ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. మా పెళ్లి అయ్యి మూడేళ్లు. ఇప్పటివరకూ కాపురం పెట్టలేదు. నేను ప్రస్తుతం అత్తింట్లోనే ఉంటున్నా. ఇదే విషయాన్ని అమ్మానాన్నలు... అత్తమామల్ని అడిగితే కంగారు ఏముంది? అంటూ మాట దాటేస్తున్నారు. తరచూ 'నీకు ఏ పనీ రాదు... ఉద్యోగం లేదు. మా అబ్బాయి నెత్తిన ఎక్కి కూర్చుంటావా' అంటూ మాటలతో వేధిస్తున్నారు. మా వారిని అడిగితే... అసహ్యంగా మాట్లాడుతున్నారు. నాకు విలువ ఇవ్వని చోట ఉండాలని లేదు. నేను వెళ్లిపోతేనైనా మారతారేమో? - ఓ సోదరి

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

మీరు ఎక్కడికి వెళ్లిపోదాం అనుకుంటున్నారు? పుట్టింటికా? మీ భర్త దగ్గరకా? మీ భర్తకి ఉద్యోగం ఉందో లేదో ముందు కనుక్కోండి. మీ భర్త అడ్రస్ కూడా తెలియకుండా దాచిపెడుతున్నారంటే ఏదైనా మెన్స్ హాస్టల్‌లో ఉంటున్నాడేమో! అతడి జీతం కుటుంబ నిర్వహణకి సరిపోదని భయపడుతున్నారేమో! కానీ, ఇన్నేళ్లు దాచిపెట్టడం సరికాదు. కాపురం అంటే భర్తతోనే కానీ అత్తగారితో కాదు. అతడి చిరునామా ఇవ్వమని ఒత్తిడి చేయండి. మిమ్మల్ని మానసికంగా హింసించే హక్కు వాళ్లకి లేదు. కొడుకు తప్పులను కప్పిపుచ్చుకోవడానికి మిమ్మల్ని సతాయిస్తూ ఉండొచ్చు. భర్త మిమ్మల్ని తీసుకెళ్లకపోతే వాళ్లతో ఉండను అని కచ్చితంగా చెప్పండి. స్త్రీలకు శారీరక, మానసిక క్షోభలను తొలగించడానికే గృహహింస చట్టం తెచ్చారు. దానిలో విడాకుల ప్రసక్తి లేదు. కానీ, మీరు ఈ చట్టం ద్వారా భర్తతో కలిసి ఉండాలని కోరలేరు. హిందూ వివాహచట్టంలోని సెక్షన్-9 ప్రకారం మీ భర్తని తీసుకెళ్లమని కోరవచ్చు. అయితే, ఇప్పటికే మీరు అత్తింట్లోనే ఉంటే అది సాధ్యపడదు. కాబట్టి మీరు మీకు దగ్గర్లోని ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌ని సంప్రదించండి. వాళ్లకి కౌన్సెలింగ్ ఇప్పించండి. మీ భర్త జీతం సరిపోకపోతే మీరు కూడా ఉద్యోగం చేస్తానని ఆర్థికభద్రత కల్పించండి. ఇవేవీ కాకుండా అతడికి వేరే అనైతిక వివాహేతర సంబంధాలు ఏమైనా ఉన్నాయేమో కనుక్కోండి. మాటల ద్వారా లొంగకపోతే గృహహింస చట్టాన్ని ఆశ్రయించండి.

కొలువు వదిలి... బొమ్మలతో కోటి టర్నోవర్!

అభిరుచుల్ని వ్యాపారంగా మలుచుకుని... విజయ తీరాల్ని చేరుకుంటోన్న మహిళా వ్యాపారవేత్తల సంఖ్య పెరుగుతోంది. నిషా శ్రీకాంత్ కూడా ఆ కోవకు చెందినవారే. 'శ్రీకోలాపురి' బొమ్మల ఫ్యాక్టరీ ద్వారా తన అభిరుచికి వ్యాపార రూపం ఇచ్చారీమె. ఈమె గురించి తెలియాలంటే...



నిషా

నిషా పుట్టిపెరిగిందంతా కేరళలోని తిరువనంతపురం. 'మేం ఐదుగురం ఆడపిల్లలం. మా తల్లిదండ్రులు ఎందులోనూ మాకు లోటు చేయలేదు. ఊహ తెలిసినప్పట్నుంచి ధైర్యసాహసాలు నూరిపోశారు. మంచి చదువులు చదువుకుని, ఉన్నత స్థానాల్లో ఉండాలని కోరుకున్నారు. వాళ్ల ఆశయానికి తగ్గట్లే మేమూ సాధన చేసేవాళ్లం. లఖ్‌నవూలోని ఐఐఎమ్‌లో ఎంబీఏ పూర్తిచేశా. ఐటీ సెక్టార్‌లో హెచ్ఆర్‌గా ఉద్యోగం సంపాదించా. తర్వాత పెళ్లి, పిల్లలు. అయినా ఉద్యోగం వదల్లేదు. కెరియర్, కుటుంబ బాధ్యతలు సమన్వయం చేసుకుంటు పదిహేనేళ్లకు పైగానే ఐటీ సెక్టార్‌లో పనిచేశా'నని గుర్తుచేసుకుంటారు నిషా.







బొమ్మ దగ్గర నేర్చుకున్నా...

'బొమ్మలంటే ఇష్టపడని పిల్లలుంటారా. అదీ బేబీ డాల్ బొమ్మలైతే... వాటి జుట్టు దువ్వీ, బొట్టు పెట్టీ, చీర కట్టీ ఎంత హడావుడి చేస్తారో అమ్మాయిలు. నేనూ ఆ కోవకు చెందినదాన్నే. కానీ చాలామందిలో వయసు పెరుగుతున్న కొద్దీ వీటిపై ఆసక్తి తగ్గిపోతుంది. నాకు మాత్రం వీటిపై ఇష్టం పెరిగింది. దానికి కారణం బామ్మే. ఆమె ఈ బొమ్మల్ని దుస్తులతో తయారుచేసేవారు. నవరాత్రి పండుగల్లో బొమ్మల కొలువులో వీటినే పెట్టేవాళ్లు. అంతేనా, ఏ శుభకార్యం అయినా వీటినే బహుమతిగా ఇచ్చేది బామ్మ. ఆమె చేసేది చూస్తూ పెరిగిన నేను పాత దుస్తులతో వాటిని తయారుచేయడం నేర్చుకున్నా' అనే నిషా ఉద్యోగం చేస్తున్నప్పుడూ వీటిని తయారుచేసి స్నేహితులకీ, బంధువులకీ బహుమతిగా ఇచ్చేవారట. వాళ్ల ప్రశంసలే శ్రీకోలాపురి ఫ్యాక్టరీ ప్రారంభానికి కారణమంటారామె.

ఆ ఒక్క ఘటనతో...

ఈ క్రమంలోనే ఒకసారి 'బంధువుల ఇంట్లో ఓ పుట్టిన రోజు వేడుకకు వెళ్లాం. అక్కడకి ఈ బొమ్మనే బహుమతిగా పట్టుకెళ్లా. దాన్ని చూసి, వీటిని మీరు అమ్ముతారా? బల్క్‌లో తయారుచేయగలరా అంటూ అడిగారు. అప్పుడే వ్యాపారంగా మలచాలన్న ఆలోచన వచ్చింది. మావారికి చెబితే... ఉద్యోగం వదిలేసి బొమ్మల తయారీ అవసరమా? రిస్క్ భరించగలవా? పోటీ తట్టుకుని నిలబడగలవా? అంటూ వేల ప్రశ్నలు. కుదరకపోతే మళ్లీ ఉద్యోగంలో చేరతా అన్నా. దాంతో ఆయనా ఒప్పుకొన్నారు. అలా 2017లో చెన్నైలోని నంగనల్లూర్‌లో చిన్న గదిని అద్దెకు తీసుకున్నా. ఒక టైలర్‌ని పనిలో పెట్టుకుని వ్యాపారాన్ని ప్రారంభించా' అనే ఈమె పని మొదలైన కొద్ది రోజులకే వరలక్ష్మీ వ్రతం, నవరాత్రి, వినాయక చతుర్థి తదితర పండుగలు రావడంతో ఆర్డర్లు అధికంగా వచ్చాయి. దాంతో మరో నలుగుర్ని నియమించుకుని, శ్రీకోలాపురి ఫ్యాక్టరీ ప్రారంభించారీమె. 'ఏడాదికి రూ.కోటిన్నర టర్నోవర్‌ను అందుకుంటున్నా. కాటన్, వెల్వెట్, నైలాన్ వంటి వస్త్రాలను వాడి బొమ్మల్ని తయారుచేస్తున్నా. పెళ్లి, సీమంతం, బొమ్మల కొలువు, వ్రతాలు... ఇలా ఏ శుభకార్యమైనా దానికి తగ్గట్టుగా బొమ్మల్ని తయారుచేసి ఇస్తున్నా' అనే నిషా నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న వాళ్లకీ నేర్పుతున్నారు. ఇలా ఇప్పటివరకూ 2వేల మందికి పైగానే నేర్పి గిన్నిస్ రికార్డులో స్థానాన్ని సంపాదించుకున్నారీమె.

ఆళ్ల లక్ష్మీహరికృష్ణ, చెన్నై



కాళ్ల నొప్పులు తగ్గాలంటే...

ముప్పైలు దాటిన మహిళలు ఎదుర్కొనే సమస్యల్లో కాల్షియం లోపం ఒకటి. ఇది కాళ్లు, మోకాళ్ల నొప్పులు, ఎముకల అరుగుదల వంటి అనేక సమస్యలకు దారితీస్తుంది. మెనోపాజ్ తర్వాత ఆస్టియో పోరోసిస్ ముప్పు అధికమవుతుంది. మరి వీటి ప్రభావాన్ని తగ్గించుకోవడానికి కాల్షియం ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. ముఖ్యంగా పాలు, పాల ఉత్పత్తులను ఆహారంలో భాగం చేసుకోవాలి. శాకాహారులు చీజ్, పనీర్, బాదం వంటివి తీసుకోవడం వల్ల కావలసినంతగా ఈ విటమిన్‌ని భర్తీ చేసుకోవచ్చు. ఒకవేళ పాల పదార్థాలు పడకపోతే... ఓ కప్పు ఉడికించిన పాలకూరని ఎంచుకుంటే సరి. మీ రోజువారీ అవసరంలో కనీసం 25శాతం భర్తీ చేస్తుంది ఇది. రోజూ గుడ్డు తింటే... కాల్షియం, విటమిన్-డి కొంత మేర లభిస్తుంది. ఇది ఎముకల ఆరోగ్యానికి చాలా అవసరం. మిగిలిన దానికోసం ఎండ తగిలేలా ఓ గంటపాటు తోటలో గడపండి. అయితే, కాల్షియం అధికంగా ఉండే ఆహారం తీసుకున్నాక ఓ గ్లాసు బత్తాయి రసం తాగండి. ఇందులోని విటమిన్ సి ఆ పోషకాన్ని శోషించగలిగే శక్తిని శరీరానికి ఇస్తుంది.

రాత్రి... అలా వద్దు!

మార్నింగ్, నైట్ రొటీన్లు... ఇప్పుడు చాలామంది పాటిస్తున్నదే! అంటే పగలు ఒక క్రీము, రాత్రి ఒక క్రీము ఇలాగన్నమాట. ఇంకా ఆసక్తి ఉన్నవాళ్లు హెవీ క్రీములు, నూనెలు, ఓవర్‌నైట్ మాస్కులు అంటూ ఇంకా చాలానే ప్రయత్నిస్తుంటారు. వీటన్నింటితో చర్మం ఇంకా బాగా రిపేర్ అవుతుంది అనుకుంటారు. కానీ అది వాస్తవం కాదు అంటున్నారు నిపుణులు. పగలు వేడి, దుమ్ము... చర్మం ఇలా ఎన్నింటి బారినో పడుతుందని తెలుసుగా? రిపేర్ చేసుకోవడానికి దానికి రాత్రి బాగా సాయపడుతుంది. ఆ సమయంలో కణాల పునరుత్పత్తి, కొలాజెన్ పెరుగుదల, చర్మం తిరిగి పునరుత్తేజం పొందడం వంటివి జరుగుతాయి. అయితే అందుకు తగిన తేమ, పోషకాలు కావాలి. ఇలా చర్మంపై పేరుకుని పోయినట్లుగా ఉండేవి కాదు. పొడిచర్మం వాళ్లయితే సెరమైడ్స్, ఫ్యాటీ యాసిడ్లు ఉన్నవి వాడొచ్చు. అదే జిడ్డు, మొటిమలు ఎక్కువగా వచ్చేవాళ్లు వీటిని వాడితే మొటిమలు పెరుగుతాయి. కాబట్టి, మీ చర్మానికి తగ్గట్టుగా అలా ఏం కావాలో తెలుసుకోండి. అలాగే వృద్ధాప్య ఛాయలు రావొద్దంటూ చాలామంది రెటినాయిడ్స్‌ని వాడుతున్నారు.



దాంతోపాటు ఎక్స్‌ఫోలియేటింగ్ యాసిడ్ ఉన్నవి రాస్తే సమస్య తగ్గకపోగా పెద్దదవుతుంది. రెటినాల్‌తోపాటు బెంజైల్ పెరాక్సైడ్, విటమిన్ సి వంటివి వాడినా సమస్యే. దానికి హైలురోనిక్ యాసిడ్, గ్లిజరిన్, నియాసినమైడ్, పెప్టైడ్‌లు ఉన్న క్రీములు జతగా వాడుకోవచ్చు. కాబట్టి, ఏవి అనువైనవో తెలుసుకోండి. జోడీ కుదురుతుందా అన్నదీ గమనించుకోండి. అలాగే అన్నీ ఒక్కసారిగా రాస్తూ వెళ్లకండి. నిపుణుల సాయంతో ఎంచుకోండి. మొత్తంగా మీరు రాసేవి ఏవైనా చర్మం తిరిగి కోలుకోవడానికి సాయపడాలే కానీ దానికి ఇబ్బంది కలిగించేదిగా మారొద్దు. మరి గమనించుకుంటారుగా!

వస్తువు ఒకటే... ప్రయోజనాలు మూడు!



కొన్ని వస్తువులు చూడటానికి చిన్నగా ఉన్నా... అవి అందించే ప్రయోజనాలు మాత్రం బోలెడు. ఈ 'బెలూన్ పవర్డ్ ఏరోడైనమిక్ కార్ టాయ్' కూడా ఆ కోవకు చెందినదే. పాండా ఆకారంలో ఉండే ఈ బొమ్మ పైన భాగంలో హ్యాండిల్ అమర్చి ఉంటుంది. జతగా ఓ చిన్న పాండా కార్ కూడా వస్తుంది. పాండా కార్‌ని లాంచర్ ద్వారా పెద్ద పాండాకు అమర్చాలి. కార్ పైన గుండ్రంగా ఉండే భాగంలో బెలూన్ పెట్టి... హ్యాండిల్ ద్వారా గాలి నింపాలి. తర్వాత లాంచర్ నుంచి కార్‌ను వేరు చేస్తే ఏరోడైనమిక్ సూత్రం ప్రకారం కారు వేగంగా ముందుకు కదులుతుంది. దీన్ని పిల్లలకు కొని ఇవ్వడం వల్ల, చిన్నవయసులోనే వాళ్లకు సైన్స్ సూత్రాలు పరిచయం చేసినవారమవుతాం. చేతికీ కంటికీ మధ్య సమన్వయానికి ఈ గ్యాడ్జెట్ మంచి ఎంపిక. అలానే, పెళ్లిరోజు, పుట్టినరోజు వేడుకల్లో ఎక్కువగా బెలూన్స్ ఊదాల్సి వచ్చినప్పుడు పంప్‌గానూ దీన్ని ఉపయోగించొచ్చు. ఆన్‌లైన్‌లోనూ దొరుకుతుంది, నచ్చితే వెతికేయండి మరి!

శోధిత

ఆ దశలో శ్రద్ధ వహించాల్సిందే!

మెనోపాజ్ సమయంలో మహిళల్లో ఒత్తిడి, ఆందోళన, మతిమరపు, హాట్ ఫ్లాషెస్... వంటి లక్షణాలు కనిపించడం సహజం. అయితే ఇవి కొందరిలో తక్కువగా ఉంటే మరికొందరిలో ఎక్కువగా ఉండొచ్చు. కానీ భావోద్వేగాలు అదుపులో ఉండకపోవడం, నిద్రలేమి, అలసట... వంటి లక్షణాలు మాత్రం చాలామందిలో కనిపిస్తుంటాయి. ఆ సమయంలో మెదడు నిర్మాణంలోని కొన్ని మార్పులు చోటుచేసుకుంటున్నాయనీ, అందువల్లే ఈ రకమైన సమస్యలు ఏర్పడుతున్నాయనీ గుర్తించారు కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ నిపుణులు. 45 నుంచి 55 మధ్య వయసులో ఉన్న మహిళల ఎమ్మారై స్కాన్‌లను పరిశీలించినప్పుడు- మెదడులోని గ్రే మ్యాటర్‌లో కొన్ని మార్పుల్ని గమనించారట. అందువల్లే వీళ్లలో ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, నిద్రలేమి... వంటి లక్షణాలు కనిపిస్తున్నట్లు గుర్తించారు. కాబట్టి ఈ దశను నిర్లక్ష్యం చేయవద్దనీ ముందు నుంచీ సరైన అవగాహన ఏర్పరచుకుంటే దీన్ని అధిగమించడం కష్టం కాదనీ అంటున్నారు. నలభైల్లోకి అడుగుపెడుతూనే వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ఏర్పరచుకోవాలి అని చెబుతున్నారు. నిద్ర ఎంతో ముఖ్యమనీ నిర్ణీత సమయానికి నిద్రపోవడాన్ని అలవాటుగా మార్చుకోవాలనీ అంటున్నారు. ముఖ్యంగా ఈ సమయంలో భాగస్వామితోపాటు కుటుంబసభ్యులూ మహిళల మానసిక ఆరోగ్యం గురించి మరింత శ్రద్ధ కనబరచాలి, వాళ్ల సమస్యలను అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాలి. మహిళలు సైతం తాము ఎదుర్కొంటున్న సమస్యల నుంచి బయటపడేందుకు కుటుంబసభ్యుల మద్దతునీ నిపుణుల సలహానూ తీసుకోవడానికి సంశయించకూడదని వివరిస్తున్నారు సదరు పరిశోధకులు.




నగా నట్రా

ముత్యం-పగడం జోడీ కట్టాయి!

అమ్మాయిల అందాన్ని రెట్టింపు చేసేవాటిల్లో నగలు ముందుంటాయి. అయితే, వాటిల్లో కొన్నింటితో మనకి భావోద్వేగ అనుబంధమూ ఎక్కువే. ముఖ్యంగా ముత్యాలు, పగడాలతో చాలామందికి అలాంటి భావనే ఉంటుంది. అందుకే, అమ్మమ్మల తరం నుంచీ వీటిని కేవలం నగల్లానే చూడట్లేదు... వారసత్వంగానూ భావిస్తున్నారు. దీంతో కాలమెంత మారినా... సాగర గర్భంలో పుట్టిన ఈ రెండు రత్నాలకు ఆదరణ తగ్గట్లేదు. ఇన్నాళ్లూ విడివిడిగా మెప్పించిన ఇవి... ఇప్పుడు కలిసి కనికట్టు చేస్తున్నాయి. ముత్యాలు మృదుత్వానికి చిహ్నమైతే, పగడాలు ఉత్సాహానికి నిదర్శనం. ఈ రెండింటి కలయికతో తయారైన ఆభరణాలివి. అచ్చంగా కనకాంబరాలు-మల్లెలతో జత కట్టినట్లుగా గొలుసులు, గాజులు, హారాల డిజైన్లలో చేరి ఆకట్టుకుంటున్నాయి. బ్రైడల్ ఫ్యాషన్‌గానూ, సంప్రదాయ దుస్తులకు కాంబినేషన్‌గానూ వీటినే ఎంచుకుంటున్నారు. పుత్తడి ధరలు పైపైకి ఎగబాకుతున్న తరుణంలో ఇవి అందరినీ మెప్పించడం సహజమే! వీటిని ధరించిన యువతులకు ఫ్రెష్‌లుక్‌ని ఇస్తే... మహిళలకు హుందాతనాన్ని తెచ్చిపెడుతున్నాయి. వాటినోసారి మీరూ చూసేయండి.





ఛాంపియన్స్

గెలుస్తున్నపుడు అంతా బాగానే ఉందనిపిస్తుంది. లోపాలు కనిపించవు. కానీ కఠిన పరీక్ష ఎదురైనపుడే జట్టు అసలు సత్తా ఏంటో తెలుస్తుంది. తప్పులన్నీ బయటికొస్తాయి. ప్రపంచకప్ లాంటి పెద్ద టోర్నీలో ఇప్పుడు భారత్‌కు ఎదురైన ఘోర పరాభవం టీమ్‌ఇండియా సామర్థ్యం మీద అనేక సందేహాలు రేకెత్తిస్తోంది. ఓటమి కంటే ఓడిన తీరు అభిమానులను హతాశులను చేసింది. టీమ్ సెలక్షన్, తుది జట్టు కూర్పు, వ్యూహాల మీద అనేక ప్రశ్నలకు తావిచ్చింది.

ఇదేమి వ్యూహం?

ఈనాడు క్రీడావిభాగం

ఆటలో గెలుపోటములు సహజం. కానీ డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో, టైటిల్ ఫేవరెట్ ముద్రతో పెద్ద టోర్నీల్లో బరిలోకి దిగిన జట్టు.. కీలక దశలో కనీస పోటీ లేకుండా ఓడిపోవడం అభిమానులు జీర్ణించుకోలేని విషయం. టీ20 ప్రపంచకప్ సూపర్-8 పోరులో దక్షిణాఫ్రికా చేతిలో టీమ్‌ఇండియా అలాగే ఓడింది. బౌలింగ్‌లో మంచి ఆరంభం లభించినా ఉపయోగించుకోని జట్టు.. తర్వాత బ్యాటింగ్‌లో ప్రత్యర్థి వ్యూహానికి సులువుగా లొంగిపోయింది. జట్టు కూర్పు దగ్గర్నుంచి అన్ని విషయాల్లో తప్పటడుగులే కనిపించాయి.

మాస్టర్ స్ట్రోక్ అనుకున్నారా?

దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో ఆట ఆరంభానికి ముందు అందరూ అవాక్కయ్యే పరిణామం చోటు చేసుకుంది. తుది జట్టు చూసి ఆశ్చర్యపోని వాళ్లు లేరు. అక్షర్ పటేల్ మ్యాచ్ ఆడట్లేదంటే అతడికేమైనా గాయమైందేమో.. ఇంకేదైనా సమస్య తలెత్తిందేమో అనుకున్నారు. కానీ ఆశ్చర్యకరంగా అతను ఫిట్‌గా ఉన్నా సరే, పక్కన పెట్టి.. వాషింగ్టన్ సుందర్‌ను తుది జట్టులోకి తీసుకుంది జట్టు యాజమాన్యం. గ్రూప్ దశలో అక్షర్ పటేల్ 3 మ్యాచ్‌లు ఆడి 6 వికెట్లు తీశాడు. పాకిస్థాన్‌తో కీలక పోరులోనూ పొదుపుగా బౌలింగ్ చేసి రెండు ముఖ్యమైన వికెట్లు తీశాడు. సుందరేమో.. గ్రూప్ దశలో ఆడింది ఒక్కటే మ్యాచ్. అది కూడా నెదర్లాండ్స్‌పై. అలాంటి చిన్న జట్టుపై ఒక్క వికెట్ లేకుండా 36 పరుగులు సమర్పించుకున్నాడు. మరి ఏ ఉద్దేశంతో అక్షర్‌ను కాదని సుందర్‌ను తుది జట్టులోకి తీసుకున్నారన్నది అంతుబట్టని విషయం. అక్షర్ బ్యాటింగ్‌లో సుందర్‌కు ఏమీ తీసిపోడు. అతను ఎడమచేతి వాటం బౌలర్ కావడం వల్ల బౌలింగ్‌లో వైవిధ్యమూ ఉండేది. సుందర్‌ను ఆడించడం ద్వారా దక్షిణాఫ్రికాకు మాస్టర్ స్ట్రోక్ ఇద్దామనుకుందేమో జట్టు యాజమాన్యం. కానీ స్ట్రోక్ తిరిగి భారత్‌కే తగిలింది. సుందర్‌ను ఆడించి, అతడినైనా పూర్తిగా వాడుకున్నారా అంటే అదీ లేదు. రెండు ఓవర్లకు పరిమితం చేశారు. గత ఏడాది కాలంలో సుందర్‌ను వివిధ ఫార్మాట్లలో తుది జట్టులో ఆడించినపుడు ఎక్కువసార్లు తనను బౌలింగ్‌లో పూర్తి స్థాయిలో ఉపయోగించుకోలేదు. తన బౌలింగ్ అంత ప్రభావవంతంగా లేకపోవడమే అందుకు కారణం కావచ్చు.


అక్షర్

అక్షర్ చివరి 7 టీ20ల్లో 14 సగటుతో 13 వికెట్లు తీయడం గమనార్హం. ఆదివారం అతను ఆడి ఉంటే కచ్చితంగా భారత బౌలింగ్ ఇంకాస్త ప్రభావవంతంగా ఉండేదనే విషయంలో భిన్నాభిప్రాయాలు లేవు. మరోవైపు రింకు సింగ్‌ను కొంత కాలం పక్కన పెట్టి, ఉన్నట్లుండి మళ్లీ ప్రపంచకప్‌నకు ఎంపిక చేయడం, తుది జట్టులో ఆడిస్తుండడం మీదా విమర్శలు తప్పట్లేదు. శ్రేయస్ అయ్యర్, జితేశ్ శర్మ లాంటి నాణ్యమైన బ్యాటర్లు ఉండగా.. రింకుకే అవకాశం ఇవ్వడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అతడికి గతంలో ఎక్కువగా బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. కానీ ప్రపంచకప్‌లో అమెరికాపై, దక్షిణాఫ్రికాపై జట్టు పీకల్లోతు కష్టాల్లో ఉండగా నిలిచి ఆదుకోవాల్సిన స్థితిలో పేలవంగా ఆడి ఔటయ్యాడు. నమీబియా లాంటి చిన్న జట్టుపై 6 బంతుల్లో ఒక్క పరుగే చేసి వెనుదిరిగాడు. ఇక టీ20ల్లో ఆడించిన ప్రతిసారీ రాణిస్తున్న కుల్‌దీప్ యాదవ్‌ను తుది జట్టుకు దూరంగా ఉంచడం మీదా విమర్శలు వస్తున్నాయి. అతను గత ఏడాది ఆసియా కప్ నుంచి 14 టీ20లు ఆడి 12.88 సగటుతో 26 వికెట్లు పడగొట్టడం విశేషం. ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌తో కీలక పోరులో 3 ఓవర్లలో 14 పరుగులే ఇచ్చి ఒక వికెట్ తీసిన అతడికి.. తర్వాత అవకాశమే రాలేదు. అక్షర్‌ను పక్కన పెట్టాలనుకున్నపుడు కుల్‌దీప్‌ను అయినా ఎంచుకుని ఉండాల్సింది. ఆడించిన ప్రతిసారీ ఉత్తమ ప్రదర్శన చేస్తున్నప్పటికీ కుల్‌దీప్‌పై పదే పదే వేటు వేయడంలో కెప్టెన్, కోచ్ ఆంతర్యమేంటో?

మార్పులు తప్పవా?

టీమ్‌ఇండియాకు సఫారీల దెబ్బ గట్టిగానే తాకింది. గ్రూప్ దశలో భారత్ తడబడ్డా పుంజుకుని మ్యాచ్‌లు గెలిచింది. అప్పుడే జట్టు సామర్థ్యంలో సందేహాలు కలిగినా.. విజయాలతో సాగిపోవడంతో దాని గురించి పెద్ద చర్చ లేకపోయింది. కానీ ఇప్పుడు దక్షిణాఫ్రికా చేతిలో చిత్తుగా ఓడడం.. కూర్పు, వ్యూహాల విషయంలో తీవ్ర విమర్శలు వస్తుండడంతో జట్టు యాజమాన్యానికి సెగ గట్టిగానే తాకినట్లు కనిపిస్తోంది. ఒక్క ఓటమితో సెమీస్ అవకాశాలు సంక్లిష్టంగా మారిన నేపథ్యంలో ఇప్పుడు జట్టు యాజమాన్యం ఆచితూచి వ్యవహరించాల్సిన పరిస్థితి నెలకొంది. కూర్పు విషయంలో జాగ్రత్తగా అడుగులు వేయాల్సి ఉంది. తర్వాతి మ్యాచ్‌లకైనా జట్టులో మార్పులు ఉంటాయని సంకేతాలు ఇచ్చాడు సహాయ కోచ్ టెన్ డస్కాటే. గురువారం జింబాబ్వేతో పోరుకు సుందర్ స్థానంలో అక్షర్ రావడం లాంఛనమే. కుల్‌దీప్ ఏక కాలంలో ఆడించే అవకాశముంది. ఇక ఈ ఇప్పటికే మ్యాచ్ జరిగే చెపాక్ స్టేడియం స్పిన్నర్లకు బాగా సహకారం అందిస్తుంది. ఈ నేపథ్యంలో ఒక బ్యాటర్‌ను (రింకు సింగ్) లేదా ఒక పేసర్‌ను (అర్ష్‌దీప్ సింగ్‌ను) తగ్గించుకుని, కుల్‌దీప్‌ను ఆడించే అవకాశాలను కొట్టిపారేయలేం. దస్కాటే మాటల్ని బట్టి చూస్తే బ్యాటింగ్ ఆర్డర్‌లోనూ ఒకటిరెండు మార్పులు అనివార్యంగా కనిపి


శాంసన్

స్తున్నాయి. ప్రపంచకప్ ముంగిట సూపర్ ఫామ్‌లో ఉన్నప్పటికీ, టోర్నీలో ఘోరాతి ఘోరంగా విఫలమవుతున్న అభిషేక్ శర్మపై వేటు వేయాలన్న డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి. అలాగే తిలక్ వర్మ సైతం తన ఆటతీరుతో విమర్శలు ఎదుర్కొంటున్నాడు. వీరిలో ఒకరిని తప్పించి సంజు శాంసన్‌ను ఆడించే అవకాశాలను కొట్టిపారేయలేం.

"మేం కొంచెం భిన్నంగా ఏదైనా చేయాల్సిన అవసరం ఉందని ప్రధాన కోచ్, జట్టు యాజమాన్యం భావిస్తే.. మేం అలాగే చేస్తాం. గత 18 నెలల్లో ఎంతో మెరుగైన ప్రదర్శన చేసిన జట్టుకే మేం కట్టుబడ్డాం. సంజును తుది జట్టులోకి తీసుకోవాలా వద్దా అన్నది చూడాలి. టాప్ ఆర్డర్‌లో ఒక ఎడమ చేతి వాటం బ్యాటర్ ఉన్నాడు. సంజు ఎంపిక గురించి మా చర్చల్లో ఉంటుంది. అతని గుణాత్మకంలో సందేహం లేదు. రింకు విషయానికి వస్తే.. టీ20ల్లో 7, 8 స్థానాల్లో ఆడే బ్యాటర్ పరిస్థితి కఠినంగా ఉంటుంది. నమీబియాతో మ్యాచ్‌లో అతను సరిగా ఆడలేకపోయాడు. దక్షిణాఫ్రికాపై ఏమాత్రం ఆశల్లేని స్థితిలో క్రీజులోకి వచ్చి బౌండరీకి ప్రయత్నించాడు. కానీ కలిసి రాలేదు. అతడికి ఎక్కువ అవకాశాలు రాని మాట వాస్తవం. అయితే ఆ స్థానంలో అలాగే ఉంటుంది. ఇబ్బందులన్నీ పరిష్కరించుకుని జింబాబ్వేతో మ్యాచ్‌లో జట్టు బలంగా పుంజుకుంటుందని ఆశిస్తున్నాం" - టెన్ డస్కాటే, టీమ్‌ఇండియా సహాయ కోచ్

అహాన్ని పక్కన పెట్టండి


గావస్కర్

అహ్మదాబాద్: టీమ్‌ఇండియా అహాన్ని పక్కనపెట్టి, పరిస్థితులకు తగినట్లు బ్యాటింగ్ చేయాలని మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ అన్నాడు. టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా చేతిలో భారత్ 76 పరుగుల తేడాతో ఘోరపరాజయం పాలైన నేపథ్యంలో ఆయన స్పందించాడు. "బ్రెవిస్, మిల్లర్ ఎంత బాగా భాగస్వామ్యాన్ని నిర్మించారో. భారత బ్యాటర్లు కూడా వాళ్ల లాగే ఆడాల్సింది. కానీ అలా చేయలేదు. అతి విశ్వాసంతో క్రీజులోకి వచ్చి, ఇష్టం వచ్చినట్లు బ్యాట్ ఊపారు. వికెట్లు కోల్పోయారు. దక్షిణాఫ్రికా చాలా తెలివిగా భారత్‌పై పైచేయి సాధించింది. విజయానికి వాళ్లు సంపూర్ణ అర్హులు" అని గావస్కర్ అన్నాడు. "దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ నుంచి భారత్ ఏమీ గ్రహించలేదు. బౌండరీ వస్తుందన్న ఆశతో భారత బ్యాటర్లు ప్రతి బంతినీ బాదడానికి ప్రయత్నించారు. టీ20 క్రికెట్ ఆడాల్సిన పద్ధతి అది కాదు. ప్రత్యర్థి నుంచి నేర్చుకోవాలి. ఇలాంటి కఠినమైన పిచ్‌పై మెరుగైన స్కోరు సాధించాలంటే అహాన్ని పక్కన పెట్టాలి. పరిశీలించాలి. పరిస్థితులకు తగినట్లు సర్దుబాటు చేసుకోవాలి" అని చెప్పాడు. వచ్చే మ్యాచ్‌లో వాషింగ్టన్ సుందర్ స్థానంలో అక్షర్ పటేల్ జట్టులోకి రావడం ఖాయమని గావస్కర్ అన్నాడు.

జమ్ముకశ్మీర్ చరిత్ర సృష్టిస్తుందా!

నేటి నుంచి కర్ణాటకతో రంజీ ఫైనల్


పరాస్ డోగ్రా


పడిక్కల్

ఉ. 9.30 నుంచి

హుబ్లీ: రంజీ ట్రోఫీ ఫైనల్‌కు వేళైంది. మంగళవారం ఆరంభమయ్యే ఈ సమరంలో ఎనిమిదిసార్లు ఛాంపియన్ కర్ణాటకతో తొలిసారి టైటిల్ పోరుకు వచ్చిన జమ్ముకశ్మీర్ తలపడనుంది. స్టార్ ప్లేయర్లతో నిండిన కర్ణాటకను జమ్ముకశ్మీర్ ఎలా ఎదుర్కొంటుందో చూడాలి. బౌలింగ్‌లో ఈ సీజన్లో 55 వికెట్లు పడగొట్టిన పేసర్ అకిబ్ నబి ఆ జట్టుకు ప్రధాన బలం. బ్యాటింగ్‌లో అబ్దుల్ సమద్ (655 పరుగులు), కెప్టెన్ పరాస్ డోగ్రా (551)పై ఆ జట్టు ఆధారపడుతోంది. టాప్‌ఆర్డర్ బ్యాటర్ శుభమ్ ఖజూరియా, ఆల్‌రౌండర్ వన్ష్ రాజ్ శర్మ ఫిట్‌నెస్ సమస్యలతో ఉండడం జమ్ముకశ్మీర్‌కు ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు కర్ణాటక అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో పటిష్టంగా ఉంది. ఈ సీజన్లోనే అత్యధిక పరుగులు చేసిన రవిచంద్రన్ స్మరణ్ (950)తో పాటు కరుణ్ నాయర్ (699), కెప్టెన్ దేవ్‌దత్ పడిక్కల్ (532), మయాంక్ అగర్వాల్ (518) జోరు మీద ఉన్నారు. 3 మ్యాచ్‌ల్లోనే 457 పరుగులు చేసిన సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఫైనల్లోనూ రాణించాలని కర్ణాటక కోరుకుంటోంది. బంతి, బ్యాట్‌తో అదరగొడుతున్న శ్రేయస్ గోపాల్ (46 వికెట్లు, 442 పరుగులు)పై కర్ణాటక మరోసారి ఆశలు పెట్టుకుంది. జమ్ముకశ్మీర్‌తో పోలిస్తే అనుభవం దృష్ట్యా కర్ణాటకనే ఫైనల్లో ఫేవరెట్‌గా బరిలో దిగుతోంది.

తొలి గెలుపు దక్కేనా?

హోబర్ట్: హాకీ ప్రొ లీగ్‌లో భారత హాకీ జట్టు విజయాన్వేషణ కొనసాగుతోంది. మంగళవారం స్పెయిన్‌తో పోరులో గెలుపు బోణీ చేయాలని పట్టుదలతో ఉంది. వరుస పరాజయాల నేపథ్యంలో కోచ్ క్రెయిగ్ ఫుల్టన్‌పై విమర్శలు వస్తున్నాయి. సొంత గడ్డపై అన్ని మ్యాచ్‌లు ఓడిన భారత్.. ఆస్ట్రేలియా అంచెలోనూ వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడింది. పేలవ ప్రదర్శన నుంచి తేరుకుని గత మ్యాచ్‌లో ఆసీస్‌తో పోరాడి 2-2తో డ్రా చేసుకుంది. అయితే షూటౌట్‌లో ఒక్క గోల్ తేడాతో ఓడిన విషయం తెలిసిందే.

ఈ సిరీసూ పట్టేయాలని..

నేడు ఆస్ట్రేలియాతో భారత్ తొలి వన్డే

ఉ. 9.20 నుంచి

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా గడ్డపై పదేళ్ల విరామం తర్వాత టీ20 సిరీస్ గెలిచిన భారత మహిళల జట్టు.. వన్డే పోరుకు సిద్ధమైంది. ప్రపంచ ఛాంపియన్ భారత్.. కంగారూలతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మంగళవారం ఆరంభించనుంది. స్వదేశంలో ప్రపంచకప్ గెలిచిన తర్వాత హర్మన్‌ప్రీత్ బృందం ఆడుతున్న మొదటి వన్డే సిరీస్ ఇదే. టీ20 సిరీస్‌లో సత్తా చాటిన స్టార్ బ్యాటర్ స్మృతి మంధానపై భారత్ ఎక్కువ ఆశలు పెట్టుకుంది. స్మృతి స్థిరంగా ఆడుతున్నా.. మరో ఓపెనర్ షెఫాలి ఎక్కువసేపు నిలవలేకపోతోంది. ఆసీస్‌పై పైచేయి సాధించాలంటే మిడిల్ ఆర్డర్‌లో జెమీమా రోడ్రిగ్స్, హర్మన్ ప్రీత్, రిచా ఘోష్ కూడా సత్తా చాటాలి. టీ20 సిరీస్‌లో ఆదరగొట్టిన శ్రీచరణి ఎలా రాణిస్తుందో చూడాలి. యువ స్పిన్ సంచలనం వైష్ణవి శర్మ ఆసక్తి రేకెత్తిస్తోంది. టీ20 సిరీస్ ఓడినా.. సొంతగడ్డపై ఆస్ట్రేలియాను తక్కువ అంచనా వేస్తే భారత్ దెబ్బ తినడం ఖాయం. కెప్టెన్ అలీసా హీలీ సారథ్యంలోని ఆసీస్.. ఎలీస్ పెర్రీ, సోఫీ మోలనూ, ఆష్లీ గార్డ్‌నర్, జార్జియా వేర్‌హామ్, బెత్ మూనీ, తాలియా మెక్‌గ్రాత్ లాంటి స్టార్లతో కళకళలాడుతోంది.


హర్మన్‌ప్రీత్

విండీస్ విధ్వంసం

- జింబాబ్వేపై ఘనవిజయం
- చెలరేగిన హెట్‌మయర్, పావెల్


హెట్‌మయర్ 85

ముంబయి: టీ20 ప్రపంచకప్‌లో వెస్టిండీస్ దూసుకుపోతోంది. గ్రూప్ దశలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన ఆ జట్టు.. హెట్‌మయర్ (85; 34 బంతుల్లో 7×4, 7×6) విధ్వంసంతో సూపర్ 8లోనూ ఘనంగా బోణీ కొట్టింది. తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ సోమవారం గ్రూప్-1 మ్యాచ్‌లో 107 పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తుగా ఓడించింది. హెట్‌మయర్‌తో పాటు రోమన్ పావెల్ (59; 35 బంతుల్లో 4×4, 4×6) మెరవడంతో మొదట విండీస్ 6 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది. ఛేదనలో జింబాబ్వే తేలిపోయింది. మోటీ (4/28), అకీల్ హొసీన్ (3/28), ఫోర్డ్ (2/27) ధాటికి 17.4 ఓవర్లలో 147 పరుగులకే ఆలౌటైంది. బ్రాడ్ ఎవాన్స్ (43; 21 బంతుల్లో 2×4, 5×6) టాప్ స్కోరర్.

తేలిపోయిన జింబాబ్వే

కొండంత ఛేదనలో జింబాబ్వే నుంచి కనీస ప్రతిఘటన కూడా కరవైంది. స్పిన్నర్లు మోటీ, అకీల్ హొసీన్ ధాటికి విలవిల్లాడిన ఆ జట్టు.. క్రమం తప్పకుండా వికెట్లు చేజార్చుకుంది. ఏ దశలోనూ పోటీలో లేదు. రెండో ఓవర్లో మరుమాని (14)ని ఔట్ చేయడం ద్వారా ఆ జట్టు పతనాన్ని ఫోర్డ్ ఆరంభించాడు. ఆ తర్వాత బెనెట్ (5), ర్యాన్ బర్ల్ (0)ను అకీల్ ఒకే ఓవర్లో ఔట్ చేశాడు. కాసేపటి తర్వాత మయర్స్ (28)ను మోటీ వెనక్కి పంపడంతో జింబాబ్వే 52/4తో చిక్కుల్లో పడింది. అయితే మున్యోంగా (14)తో కలిసి రజా (27) ఇన్నింగ్స్ నడిపించడంతో ఆ జట్టు 10 ఓవర్లలో 87/4తో నిలిచింది. ఓటమి అంతరాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేసింది. కానీ 11వ ఓవర్లో మోటీ.. రజా, ముసెకివాలను ఔట్ చేయడంతో జింబాబ్వేకు భారీ పరాజయం ఖాయమైపోయింది. కానీ ఆఖర్లో ఎవాన్స్ అద్భుత బ్యాటింగ్ విన్యాసాలతో ఆ జట్టు అభిమానులను అలరించాడు. అతడు ఎంగరవ (7 నాటౌట్)తో ఆఖరి వికెట్‌కు 44 పరుగులు జోడించాడు.

పాయింట్ల పట్టిక సూపర్-8 గ్రూప్-1						
జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	నె.రన్‌రేట్
వెస్టిండీస్	1	1	0	0	2	5.350
దక్షిణాఫ్రికా	1	1	0	0	2	3.800
భారత్	1	0	1	0	0	-3.800
జింబాబ్వే	1	0	1	0	0	-5.350

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, ఫ.తే: ఫలితం తేలనివి

విండీస్ పరుగుల వరద

విండీస్ ఇన్నింగ్స్‌లో హెట్‌మయర్ ఆటే హైలైట్. ఆకాశమే హద్దుగా చెలరేగిన ఈ హిట్టర్.. జింబాబ్వే బౌలింగ్‌ను ఊచకోత కోశాడు. రోమన్ పావెల్, రూథర్‌ఫర్డ్ కూడా రెచ్చిపోవడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. టాస్ గెలిచి కరీబియన్లకు బ్యాటింగ్ అప్పగించినందుకు జింబాబ్వే తీవ్రంగా చింతించే ఉంటుంది. ఓపెనర్ బ్రెండన్ కింగ్ (9)ను త్వరగానే వెనక్కి నెట్టినప్పటికీ.. హెట్‌మయర్ రాక జింబాబ్వే బౌలర్లను కష్టాల్లోకి నెట్టింది. హెట్‌మయర్ వస్తూనే బాదుడు మొదలెట్టాడు. ఎదుర్కొన్న తొలి బంతినే బౌండరీ దాటించిన అతడు.. ఆ తర్వాత ఎడాపెడా ఫోర్లు, సిక్స్‌లతో చెలరేగిపోయాడు. ఎంగరవ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు, క్రెమర్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్స్‌లు, సికందర్ రజా ఓవర్లో మూడు సిక్స్‌లు దంచేసిన అతడు.. 19 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. మరోవైపు హోప్ (14) కూడా ఔట్ కావడంతో క్రీజులోకి వచ్చిన పావెల్ కూడా బ్యాట్ ఝుళిపించాడు. హెట్‌మయర్ కాస్త తగ్గిన దశలో పావెల్ విరుచుకుపడ్డాడు. 29 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేశాడు. అయితే 15వ ఓవర్లో భారీ షాట్ ఆడే ప్రయత్నంలో హెట్‌మయర్ ఔట్ కావడంతో 122 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. నిజానికి అతడు 9 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్దే ఔట్ కావాల్సింది. కానీ అతడిచ్చిన తేలికైన క్యాచ్‌ను ముజరబాని వదిలేయడంతో జింబాబ్వే భారీ మూల్యమే చెల్లించుకుంది. జింబాబ్వే ఫీల్డర్ క్యాచ్ వదిలేయడంతో ఆ తర్వాత అతడు మరోసారి హెట్‌మయర్ బతికిపోయాడు. ఎట్టకేలకు అతణ్ని ఔట్ చేసినా, పావెల్ కూడా నిష్క్రమించినా.. జింబాబ్వేకు ఉపశమనమేమీ దక్కలేదు. రూథర్‌ఫర్డ్ (31 నాటౌట్; 13 బంతుల్లో 3×4, 2×6), షెపర్డ్ (21; 10 బంతుల్లో 3×6) దంచేయడంతో విండీస్ స్కోరు 250 దాటింది. విండీస్ ఆఖరి మూడు ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 46 పరుగులు రాబట్టింది.


మోటీ (4/28)

స్కోరు వివరాలు

వెస్టిండీస్ ఇన్నింగ్స్: కింగ్ (సి) ముసెకివా (బి) ఎంగరవ 9; హోప్ (బి) బెనెట్ (బి) ఎవాన్స్ 14; హెట్‌మయర్ (సి) బెనెట్ (బి) క్రెమర్ 85; రోమన్ పావెల్ (సి) ముసెకివా (బి) ముజరబాని 59; రూథర్‌ఫర్డ్ నాటౌట్ 31; షెపర్డ్ (సి) బర్ల్ (బి) ఎంగరవ 21; హోల్డర్ (సి) మున్యోంగా (బి) ముజరబాని 13; ఫోర్డ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 21 మొత్తం: (20 ఓవర్లలో 6 వికెట్లకు) **254**; వికెట్ల పతనం: 1-17, 2-54, 3-176, 4-194, 5-229, 6-248; బౌలింగ్: ఎంగరవ 4-0-47-2; ముజరబాని 4-0-42-2; ఎవాన్స్ 4-0-46-1; క్రెమర్ 4-0-38-1; రజా 3-0-52-0; మయర్స్ 1-0-19-0

జింబాబ్వే ఇన్నింగ్స్: మరుమాని (సి) హెట్‌మయర్ (బి) ఫోర్డ్ 14; బెనెట్ (బి) అకీల్ 5; మయర్స్ (బి) మోటీ 28; ర్యాన్ బర్ల్ (సి) హెట్‌మయర్ (బి) అకీల్ 0; రజా (బి) మోటీ 27; మున్యోంగా (సి) షమర్ (బి) మోటీ 14; ముసికెవా (బి) మోటీ 0; ఎవాన్స్ (సి) అకీల్ (బి) ఫోర్డ్ 43; క్రెమర్ (సి) అండ్ (బి) హోల్డర్ 0; ముజరబాని (సి) జోసెఫ్ (బి) అకీల్ 0; ఎంగరవ నాటౌట్ 7; ఎక్స్‌ట్రాలు 9 మొత్తం: (17.4 ఓవర్లలో ఆలౌట్) **147**

వికెట్ల పతనం: 1-20, 2-20, 3-20, 4-52, 5-94, 6-94, 7-101, 8-102, 9-103

బౌలింగ్: అకీల్ హొసీన్ 4-1-28-3; ఫోర్డ్ 3.4-0-27-2; మోటీ 4-1-28-4; షమర్ జోసెఫ్ 3-0-35-0; హోల్డర్ 3-0-25-1

ఎవరివైపు తిరుగుతుందో!

రాత్రి 7 నుంచి

☛ నేడు ఇంగ్లాండ్-పాక్ పోరు

పల్లెకెలె: టీ20 ప్రపంచకప్‌లో మరో ఆసక్తికర సమరం. సూపర్-8 మ్యాచ్‌లో భాగంగా మంగళవారం ఇంగ్లాండ్‌తో పాకిస్థాన్ తలపడనుంది. పిచ్‌పై బంతి గింగిరాలు తిరిగే అవకాశం ఉండడంతో రెండు జట్లూ స్పిన్నే ఆయుధంగా బరిలో దిగుతున్నాయి. సూపర్-8లో తొలి మ్యాచ్‌లో శ్రీలంకపై ఇంగ్లాండ్ గెలవగా.. పాకిస్థాన్-న్యూజిలాండ్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. ఈ మ్యాచ్‌లో గెలిచి పూర్తి పాయింట్లు సాధించాలని పాక్ పట్టుదలగా ఉండగా.. జోరు కొనసాగించాలని ఇంగ్లాండ్ చూస్తోంది. మరి ఈ రెండు జట్ల మధ్య పైచేయి ఎవరిదో!


ఆఘా



బ్రూక్

బ్రావో చిట్కాలతో..


ఎంగిడి

అహ్మదాబాద్: చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడుతున్నప్పుడు వెస్టిండీస్ దిగ్గజం డ్వేన్ బ్రావో దగ్గర నేర్చుకున్న చిట్కాలు తన కెరీర్‌ను మలుపు తిప్పాయని దక్షిణాఫ్రికా పేసర్ ఎంగిడి తెలిపాడు. బ్రావో పర్యవేక్షణలో గంటల తరబడి శ్రమించి నేర్చుకున్న స్లో డెలివరీ ఇప్పుడు తన అమ్ములపొదిలో కీలక అస్త్రంగా మారిందని చెప్పాడు. "నేనెప్పుడూ చెబుతుంటాను. 2018 ఐపీఎల్‌లో బ్రావోతో కలిసి సీఎస్కేలో ఉన్నప్పుడు సీజన్ మొత్తం స్లో డెలివరీలపై దృష్టిసారించా. మ్యాచ్‌లు ఆడే అవకాశం లేకపోవడంతో ప్రాక్టీస్ చేయడానికి నాకు తగినంత సమయం దొరికింది. దక్షిణాఫ్రికా వెళ్లిన తర్వాత మరింత పట్టుసాధించా. నెమ్మదిగా వేసే బంతుల్లో వైవిధ్యం ప్రదర్శించడం సుదీర్ఘ ప్రక్రియ. యార్కర్, బ్యాక్ ఆఫ్ లెంగ్త్, బౌన్సర్లను నెమ్మదిగా సంధించొచ్చు. అంటే ఒకే బంతితో మూడు భిన్నమైన లెంగ్త్‌లలో వేయొచ్చు. మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ ఆఫ్ కటర్ కోసం ఎదురుచూస్తున్నాడని నాకు తెలుసు. అందుకే అతడిని అయోమయానికి గురిచేయడానికి లెగ్ కటర్లను ప్రయోగించా. అది బాగా పనిచేసింది" అని ఎంగిడి పేర్కొన్నాడు.

శ్రీకాంత్ గాడినపడేనా!



ముల్హీమ్ అన్ డెర్ రుహర్: జర్మన్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీపై భారత అగ్రశ్రేణి ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ గురిపెట్టాడు. కొన్నేళ్లుగా టైటిల్ కోసం ఎదురుచూస్తున్న శ్రీకాంత్.. జర్మన్ ఓపెన్‌లో నిరీక్షణకు తెరదించాలని భావిస్తున్నాడు. మంగళవారం ప్రారంభంకానున్న ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో క్వాలిఫయర్‌తో శ్రీకాంత్ తలపడనున్నాడు. వాంగ్ వీ (చైనీస్ తైపీ)తో తరుణ్ మన్నెపల్లి, క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్)తో కిరణ్ జార్జ్ పోటీపడనున్నారు. మహిళల సింగిల్స్‌లో వాంగ్ లింగ్ (మలేసియా)తో తన్వి శర్మ, వాంగ్ యి (చైనా)తో తస్నిమ్ మీర్, లైన్ హోజ్‌మార్క్ (డెన్మార్క్)తో మాళవిక బాన్సోద్, లైన్ క్రిస్టోఫెర్సెన్ (డెన్మార్క్)తో రక్షిత శ్రీ, పోర్న్‌పావీ (థాయ్‌లాండ్)తో ఇషారాణి తమ పోరాటాన్ని ప్రారంభించనున్నారు.

మెస్సికి మైనపు విగ్రహం



అసాన్‌సోల్: భారత్ పర్యటనకు వచ్చిన సందర్భంగా అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియొనల్ మెస్సికి కోల్‌కతాలో కాంస్య విగ్రహం ఆవిష్కరించగా.. తాజాగా పశ్చిమ బెంగాల్‌లోనే మరో విగ్రహం పెట్టారు. అసాన్‌సోల్‌లో మెస్సి మైనపు విగ్రహాన్ని రాష్ట్ర కార్మిక మంత్రి మోలీ ఘటక్ ఆవిష్కరించారు. సుశాంత్ రాయ్ తయారు చేసిన ఈ విగ్రహాన్ని అసాన్‌సోల్ వ్యాక్స్ మ్యూజియంలో ఉంచారు. విగ్రహాన్ని చూడటానికి పెద్ద సంఖ్యలో అభిమానులు వస్తున్నారు. సెల్ఫీలు తీసుకుంటున్నారు. సుశాంత్ గతంలో సచిన్ తెందుల్కర్, సౌరభ్ గంగూలీ, జ్యోతి బసు (పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం), అమితాబ్ బచ్చన్, షారుక్ ఖాన్, చార్లీ చాప్లిన్ తదితర ప్రముఖుల మైనపు విగ్రహాలను రూపొందించాడు.

వరుణ్ మిస్టరీని అలా ఛేదించాం


మిల్లర్

అహ్మదాబాద్: భారత్‌తో టీ20 ప్రపంచకప్ సూపర్-8 మ్యాచ్‌లో మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని పక్కా ప్రణాళికలతోనే ఎదుర్కొన్నట్లు దక్షిణాఫ్రికా బ్యాటర్ డేవిడ్ మిల్లర్ చెప్పాడు. ఈ మ్యాచ్‌లో వరుణ్ 4 ఓవర్లలో 47 పరుగులు సమర్పించుకుని ఒక్క వికెట్టే తీశాడు. ''వరుణ్‌ను ఎదుర్కోడానికి మేం ప్రత్యేక వ్యూహాన్ని అనుసరించాం. అతని బౌలింగ్‌లో అనవసర కదలికలు లేకుండా.. స్థిరమైన మనస్సుతో ఉండటం కీలకం. చెత్త బంతి వేయగానే భారీ షాట్ ఆడాలని పట్టుదలతో ఆడాం. పిచ్ నుంచి స్పిన్‌కు పెద్దగా సహకారం లభించకపోవడంతో బంతి లైన్ మీద నమ్మకంతో షాట్లు బాదాం. వరుణ్ ముప్పుగా మారతాడు కాబట్టి అతడిని లక్ష్యంగా చేసుకోవాలని ముందుగానే నిర్ణయించుకున్నాం. భారత్ అద్భుతమైన జట్టు. కానీ వారిని ఓడించడం అసాధ్యమేమీ కాదు. టోర్నీలో మా పనిని పక్కాగా చేస్తే ఫలితాలు అవే వస్తాయి" అని మిల్లర్ తెలిపాడు.

గ్రామంలో గాసిప్‌లకు బైబై



ఛత్తీస్‌గఢ్‌లోని బలోద్ జిల్లా మేడకే గ్రామం సరికొత్త నిర్ణయం తీసుకుని ఆదర్శంగా నిలిచింది. గ్రామంలో పుకార్లకు బైబై చెప్పేలా గాసిప్‌ (పుకార్ల)లపై పుల్‌స్టాప్ పెట్టింది. ఇక నుంచి ఎవరూ గాసిప్‌ల ద్వారా చెప్పుడుమాటలు ప్రచారం చేయకుండా గాసిప్‌లపై నిషేధం విధించారు. గ్రామంలో చాలా మంది తరచూ గొడవలు పడుతున్నారు. వేరే వారు ప్రచారం చేసే గాసిప్‌లే ఇందుకు కారణం. దీంతో వాటిని నిషేధించాలని నిర్ణయించాం. ఎవరైనా ఉల్లంఘిస్తే రూ.5 వేల జరిమానా విధిస్తాం' అని గ్రామ కమిటీ పేర్కొంది. వేళ్ల కిందటే గ్రామంలో మద్యం విక్రయిస్తే.. రూ.10,000, తాగి గొడవ చేస్తే రూ.11,000 జరిమానా విధించే నిబంధన తెచ్చారు.

హిమాలయాల్లో అద్భుతం



హిమాలయాల్లో ఏటా శీతాకాలంలో అద్భుతం ఆవిష్కృతమవుతుంది. హిమాచల్ ప్రదేశ్‌లోని కుల్లు జిల్లాలో మనాలికి సమీపంలో ఉన్న సోలంగ్ లోయలో ఏర్పడే 25 అడుగుల శివలింగం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. అంజని మహాదేవ్ ఆలయం సమీపంలో ఇది ఏర్పడుతుంది. ఇక్కడికి కర్ణాటక, ఉత్తర ప్రదేశ్, దిల్లీతోపాటు పలు రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. ఒక్కోసారి 45 అడుగుల ఎత్తున ఆ శివలింగం ఏర్పడుతుంది. ఈసారి మంచు తక్కువగా ఉండటంతో 25 అడుగులకు పరిమితమైంది.

ఝార్ఖండ్‌లో కూలిన ఎయిర్ అంబులెన్స్

- ఏడుగురి మృతి
- రాంచీ నుంచి దిల్లీ వెళ్తుండగా దుర్ఘటన



ఎయిర్ అంబులెన్స్ శకలాలు

రాంచీ: కాలిన గాయాలతో విషమ పరిస్థితుల్లో ఉన్న రోగిని చికిత్స కోసం దిల్లీకి తరలించేందుకు ఝార్ఖండ్ రాజధాని రాంచీ నుంచి బయల్దేరిన ఎయిర్ అంబులెన్స్ సోమవారం రాత్రి కుప్పకూలిపోయింది. ఝార్ఖండ్‌లోని చత్రా జిల్లా సిమరియా వద్ద అటవీ ప్రాంతంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో అందులో ఉన్న ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. రాత్రి 7.11కి బయల్దేరి 7.34 గంటల సమయంలో ఏటీసీతో సంబంధాలు కోల్పోయిన కాసేపటికి ఈ ఘోరం జరిగింది. రెడ్‌బర్డ్ ఎయిర్‌వేస్ ప్రై.లి.కి చెందిన బీచ్‌క్రాఫ్ట్ సీ90 విమానం రాత్రి 10 గంటలకు దిల్లీ చేరుకోవాల్సి ఉంది. చికిత్స కోసం 41 ఏళ్ల సంజయ్‌కుమార్‌ను దిల్లీకి తరలిస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఎయిర్ అంబులెన్సులో రోగితోపాటు ఒక వైద్యుడు, ఒక పారామెడికల్ ఉద్యోగి, ఇద్దరు సహాయకులు, ఇద్దరు పైలట్లు ఉన్నారు. వీరంతా ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు వెల్లడించారు.

కేంద్ర మాజీ మంత్రి ముకుల్‌రాయ్ కన్నుమూత



కోల్‌కతా: కేంద్ర మాజీ మంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అగ్రనేత ముకుల్ రాయ్ (71) కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో కొంతకాలంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. రాజకీయ చాణక్యుడిగా పేరొందిన ముకుల్ మృతిపట్ల పలు పార్టీల నేతలు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. సమాజ సేవ పరంగా ఆయన ఎప్పటికీ గుర్తుంటారని ప్రధాని మోదీ సంతాపం తెలియజేశారు. రాజకీయంగా ముకుల్ తన చిరకాల స్నేహితుడని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ పేర్కొన్నారు. టీఎంసీ వ్యవస్థాపక సభ్యుల్లో ముకుల్ ఒకరు. నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో ముకుల్ రాయ్.. టీఎంసీతో పాటు కాంగ్రెస్, భాజపాల్లో కూడా పనిచేశారు. రెండు సార్లు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. 1998లో మమతా బెనర్జీ.. కాంగ్రెస్‌ను వీడి టీఎంసీ ఏర్పరచినపుడు పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరిగా ఉన్నారు. యూపీఏ-2లో రైల్వే మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2017లో టీఎంసీని వీడిన ఆయన 2019 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అదే ఏడాది మళ్లీ తృణమూల్ గూటికి తిరిగొచ్చారు.

బెంగాల్‌ను చూస్తుంటే
గుండె తరుక్కుపోతోంది

- ఆ రాష్ట్ర ప్రజలకు మోదీ బహిరంగ లేఖ



కోల్‌కతా: ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పాలనలోని పశ్చిమబెంగాల్‌ను చూస్తుంటే గుండె తరుక్కుపోతోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రాష్ట్రంలో రాజకీయ మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. బెంగాల్‌ను 'బంగారు బంగ్లా'గా మారుస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆ రాష్ట్ర ప్రజలకు మోదీ సోమవారం బహిరంగ లేఖ రాశారు. మరికొద్ది నెలల్లో బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఆయన ఈ లేఖ రాయడం గమనార్హం.

ప్రభుత్వం నుంచి సహకారం లేదు

"బెంగాల్ ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేదు. అయినా రాష్ట్రంలో దాదాపు 5 కోట్ల మంది ప్రజలతో 'జన్ ధన్ యోజన' ఖాతాలు తెరిపించాం. 'స్వచ్ఛ భారత్ అభియాన్' కింద 85 లక్షల మరుగుదొడ్లు నిర్మించాం. బెంగాల్‌ను పాలిస్తున్న టీఎంసీ సర్కార్ పేదల జీవనోపాధిని లాక్కుంటోంది. 'అటల్ పెన్షన్ యోజన' కింద 56 లక్షల మంది వృద్ధులకు ఊరట కల్పించాం. 'ఉజ్వల యోజన' ద్వారా కోటి కుటుంబాలకు ఎల్పీజీ కనెక్షన్లను అందించాం. 'కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా 52 లక్షల మంది రైతులకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం చేస్తున్నాం" అని మోదీ పేర్కొన్నారు.

రాష్ట్రంలో హింస, అరాచకత్వం

"బెంగాల్ దేశ ఆర్థిక వ్యవస్థ దిశను నిర్ణయించేది. నేడు రాష్ట్రం దీనావస్థలో ఉంది. 6 దశాబ్దాల బుజ్జగింపు రాజకీయాలు.. బెంగాల్‌కు కోలుకోలేని నష్టాన్ని తెచ్చిపెట్టాయి. ఓ వైపు ఉపాధి లేక యువత వలస వెళుతోంది. మరోవైపు రాష్ట్రంలోని మహిళలు తమకు భద్రత లేదని భావిస్తున్నారు. స్వామి వివేకానంద, రిషి అరబిందో కలలు కన్న బెంగాల్ నేడు ఓటు బ్యాంకు రాజకీయాలు, హింస, అరాచకత్వంతో నిండిపోయింది. బెంగాల్‌ను పునర్నిర్మిద్దాం. 2026 నాటికి రాష్ట్రాన్ని వికసిత్ బెంగాల్‌గా మారుస్తామని ప్రమాణం చేద్దాం' అని మోదీ అన్నారు.



న్యూజెర్సీలో కార్లపై పేరుకుపోయిన మంచు

ఈశాన్య అమెరికాను వణికిస్తున్న హిమపాతం

న్యూయార్క్: అమెరికాలోని ఈశాన్య ప్రాంతాన్ని చలిగాలులు వణికిస్తున్నాయి. భారీగా కురుస్తోన్న మంచుకు బలమైన గాలులు తోడవడంతో అధికారులు సోమవారం మంచుతుపాను హెచ్చరికలు జారీ చేశారు. కొన్ని ప్రాంతాల్లో గంటకు 30 సెంటీమీటర్ల మందంతో మంచు కురిసింది. న్యూయార్క్‌లోని మెక్‌ఆర్థర్ విమానాశ్రయంలోనైతే 57 సెం.మీ. ఎత్తున మంచు పేరుకుపోయింది. న్యూయార్క్ నగరం, కోనీ ఐలాండ్, న్యూజెర్సీ, న్యూలండన్, కనెక్టికట్ వంటి చోట్ల కూడా భారీ హిమపాతం నమోదై ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. దట్టమైన పొగమంచు కారణంగా పలు రహదారులను మూసివేశారు. న్యూయార్క్‌లోని కొన్నిచోట్ల పాఠశాలలకు సెలవు ప్రకటించారు. అమెరికా అంతటా ఐదు వేలకుపైగా విమానాలు రద్దయ్యాయి. న్యూయార్క్, న్యూజెర్సీ, బోస్టన్‌లో అత్యధిక సంఖ్యలో విమానాల రాకపోకలు నిలిచిపోయాయి.

అది చిన్న ఘటనే..
తేజస్‌కు ప్రమాదంపై హెచ్‌ఏఎల్

దిల్లీ: దేశీయంగా అభివృద్ధి చేసిన తేలిక పాటి యుద్ధవిమానం తేజస్ ఈ నెల 7న ఓ వైమానిక స్థావరం వద్ద స్వల్ప ప్రమాదానికి గురవడాన్ని దాని తయారీ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) చిన్న ఘటనగా పేర్కొంది. మైనర్ సాంకేతిక సమస్య కారణంగా అలా జరిగిందని తెలిపింది. లోపాన్ని సరిచేసేందుకు వాయుసేన (ఐఏఎఫ్)తో కలిసి పనిచేస్తున్నామని అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఆ ప్రమాదానికి సంబంధించి స్పష్టమైన వివరాలు వెల్లడించలేదు.

తక్షణమే ఇరాన్‌ను వీడండి
భారత పౌరులకు కేంద్రం ఆదేశం

దిల్లీ: ఇరాన్‌లోని నివసిస్తున్న భారత పౌరులు తమకు అందుబాటులో ఉన్న రవాణా సౌకర్యాలను ఉపయోగించుకొని తక్షణ దేశం విడిచి వెళ్లాలని భారత్ ఆదేశించింది. ఇరాన్‌పై అమెరికా దాడి చేయనుందన్న వార్తలు, మళ్లీ టెహ్రాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థుల ఆందోళనలు ప్రారంభమైన నేపథ్యంలో టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం ఈ మేరకు అడ్వైజరీ జారీ చేసింది. ఒక అంచనా ప్రకారం.. ఇరాన్‌లో 10 వేల మంది భారతీయులు ఉన్నారు. "ఇరాన్‌లో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా.. జనవరి 5న భారత ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు కొనసాగింపుగా మళ్లీ అడ్వైజరీ జారీ చేస్తున్నాం. ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న భారతీయులు (విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు, పర్యాటకులు) కమర్షియల్ విమానాలతో సహా అందుబాటులో ఉన్న ప్రయాణ మార్గాల ద్వారా ఇరాన్‌ను తక్షణమే విడిచిపెట్టి వెళ్లండి. . ఆందోళనలు జరిగే ప్రాంతాలకు దూరంగా ఉండండి. ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ ఉండండి" అని భారత ఎంబసీ తమ అడ్వైజరీలో వెల్లడించింది.

నేటి నుంచి అమెరికా సుప్రీంకోర్టు తీర్పు అమల్లోకి

వాషింగ్టన్: ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలు చట్టవ్యతిరేకమంటూ అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మంగళవారం నుంచి అమల్లోకి రానుంది. ఈ మేరకు అమెరికా కస్టమ్స్, సరిహద్దు భద్రతా విభాగం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. దిగుమతి సుంకాలను పెంచుతూ గతంలో ట్రంప్ జారీచేసిన మార్గదర్శకాలన్నీ రద్దవుతాయని వెల్లడించింది. కోర్టు ఆదేశాలు వెలువడిన మూడు రోజుల తర్వాత తీర్పు అమలుదిశగా సర్కారు ప్రకటన చేసింది. ఐఈఈపీఏ-1977 ప్రకారం ప్రపంచ దేశాలపై ట్రంప్ విధించిన సుంకాలకు మాత్రమే ఈ సడలింపు వర్తిస్తుందని స్పష్టం చేసింది.

30 సెకన్లలో 27 కత్తిపోట్లు
పదో తరగతి విద్యార్థిపై సహచరుల దాడి

భోపాల్: మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో దారుణం చోటుచేసుకుంది. పదో తరగతి విద్యార్థిపై సహచర విద్యార్థులు ఇద్దరు కత్తులతో విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దాదాపు పది రోజుల క్రితం ఈ దాడి జరగగా, దీనికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు తాజాగా వైరల్ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ నెల 15న స్నూకర్ క్లబ్‌కు వచ్చిన బాధిత విద్యార్థి(16)పై పదో తరగతి చదువుతున్న ఇద్దరు బాలురు దాడికి దిగారు. 30 సెకన్లలో 27 సార్లు కత్తులతో పొడిచారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. అతడికి 10 చోట్ల లోతైన గాయాలు కాగా, రెండు వేళ్లు తెగిపడ్డాయి. తీవ్రంగా గాయపడిన బాలుడిని క్లబ్ సిబ్బంది వెంటనే ఆస్పత్రికి తరలించారు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బాధితుడు, నిందితులు ఒకే కోచింగ్ సెంటర్‌కు వెళ్లేవారని, గతంలో స్నూకర్ గేమ్ విషయంలో వారి మధ్య గొడవ జరిగిందని పోలీసులు చెప్పారు. ఈ క్రమంలో నిందితులను బాధితుడు చెంప దెబ్బ కొట్టాడని, దానిపై ప్రతీకారం తీర్చుకోవడానికే వారు దాడికి పాల్పడినట్లు తెలిపారు.



జ్ఞానార్జనే సరిపోదు

పుస్తకాలను చదివి జ్ఞానం సంపాదించుకోవడంతో సరిపోదు. మారుతున్న లోకానికి అనుగుణంగా మన పాత నమ్మకాలు, ఆలోచనలు వదులుకోవడం ముఖ్యం. వచ్చే దశాబ్దాల్లో విజయం సాధించేవారెవరంటే.. తమ మూస పద్ధతులను, కాలం చెల్లిన వ్యూహాలను వదిలిపెట్టగలిగినవారే..

– సామ్ ఎవాన్స్, బిజినెస్ కన్సల్టెంట్

రాష్ట్రపతి భవన్‌లో రాజగోపాలాచారి విగ్రహం

- ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము



రాజగోపాలాచారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

దిల్లీ: స్వతంత్ర భారతదేశపు తొలి, ఏకైక భారతీయ గవర్నర్ జనరల్ చక్రవర్తి రాజగోపాలాచారి విగ్రహాన్ని దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం ఆవిష్కరించారు. అశోక మండపం సమీపంలోని గ్రాండ్ ఓపెన్ మెట్ల వద్ద ఉన్న బ్రిటిష్ ఆర్కిటెక్ట్ ఎడ్విన్ లుట్యెన్స్ విగ్రహాన్ని తొలగించి, ఆ స్థానంలో దీన్ని ఏర్పాటు చేశారు. వలసవాద స్మృతులను తొలగించి, భారతీయ సంస్కృతి, వారసత్వం, సంప్రదాయాలకు పట్టం కట్టే దిశగా ఈ చర్య తీసుకున్నట్లు రాష్ట్రపతి కార్యాలయం ఎక్స్‌లో పేర్కొంది. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, రాజగోపాలాచారి కుటుంబసభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేస్తూ తన సందేశాన్ని పంపించారు. "మహాత్మా గాంధీ, రాజాజీ(రాజగోపాలాచారి) మధ్య పరస్పర విశ్వాసంతో కూడిన అనుబంధం ఉండేదన్న విషయం అందరికీ తెలుసు. ఇప్పుడు బాపూజీ విగ్రహం ఎదురుగానే రాజాజీ ప్రతిమను ఏర్పాటు చేయడం సముచితం" అని మోదీ తన సందేశంలో పేర్కొన్నారు.

మోదీజీ.. సిగ్గు పడాల్సిన విషయాలు ఇవీ..

- విమర్శలతో విరుచుకుపడ్డ రాహుల్‌గాంధీ

దిల్లీ: కాంగ్రెస్ సిగ్గుచేటు రాజకీయాలు చేస్తోందంటూ ప్రధాని మోదీ ఆదివారం విమర్శించడంపై ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. వాస్తవానికి ప్రధాని, ఆయన మంత్రివర్గ సహచరుడి పేరు ఎప్‌స్టీన్ ఫైళ్లలో కనిపించడమే సిగ్గుపడాల్సిన విషయమని 'ఎక్స్'లో పోస్టు ద్వారా సోమవారం విరుచుకుపడ్డారు. "మోదీజీ.. మీరు సిగ్గు గురించి మాట్లాడుతున్నారా? సిగ్గుచేటు అంటే ఏంటో నన్ను చెప్పనివ్వండి. మీ పేరు, మీ మంత్రి పేరు, మీ స్నేహితుడి పేరు మూకుమ్మడిగా ఎప్‌స్టీన్ ఫైళ్లలో కనిపించడం సిగ్గుపడాల్సిన విషయం. దేశాన్ని అమ్మేస్తూ అమెరికాతో మీరు వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నారు. సిగ్గుచేటు అంటే అది. మీరు దేశ డేటాను ఇతరులకు అప్పగించేశారు. రైతుల ప్రయోజనాలను దెబ్బతీశారు. జౌళి పరిశ్రమను నాశనం చేశారు. ఇవన్నీ సిగ్గుపడాల్సిన విషయాలు" అని ప్రధానిని ఉద్దేశించి రాహుల్ పేర్కొన్నారు. పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీపై అమెరికాలో కేసు ఉండటంతో మోదీకి రాత్రుళ్లు నిద్రపట్టడం లేదంటూ ఆయన ఎద్దేవా చేశారు. "మీ స్నేహితులైన అనిల్ అంబానీ, అదానీల కోసం.. మీరు ఏమైనా చేసుకోండి. నాతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు దేశాన్ని రక్షించుకోవడంలో ఒక్క అడుగు కూడా వెనక్కి వేయరు" అని రాహుల్ పేర్కొన్నారు.



రాహుల్‌ను కలిసిన 'మహమ్మద్ దీపక్'

ఉత్తరాఖండ్‌లోని కోట్‌ద్వార్‌లో గత నెల 26న బజరంగ్ దళ్ కార్యకర్తలకు ఎదురుతిరిగి ఓ ముస్లిం దుకాణదారుడికి అండగా నిలిచిన వ్యాయామశాల యజమాని దీపక్ కుమార్.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని దిల్లీలో సోమవారం కలిశారు. దీపక్ ధైర్యాన్ని మెచ్చుకున్న రాహుల్.. ఆయన భార్యతోనూ ఫోన్‌లో మాట్లాడారు. కోట్‌ద్వార్‌కు వచ్చి ఆయన వ్యాయామశాలలో సభ్యత్వం తీసుకుంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీతోనూ దీపక్ సమావేశమయ్యారు. ముస్లిం దుకాణదారుడికి అండగా నిలిచినప్పటి నుంచీ దీపక్ కుమార్ 'మహమ్మద్ దీపక్'గా ప్రాచుర్యంలోకి వచ్చిన సంగతి గమనార్హం.

వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను వదిలేస్తే కఠిన చర్యలు
గుజరాత్‌లోని ఓ డిప్యూటీ కలెక్టర్ ఆదేశాలు

సురేంద్రనగర్: నేటి కాలంలో కని, పెంచిన తల్లిదండ్రుల పట్ల బిడ్డలు నిరాదరణ చూపుతున్న ఘటనలు బాగా పెరిగిపోతున్నాయి. ఇలాంటి ఘటనే ఒకటి గుజరాత్‌లోని సురేంద్రనగర్ జిల్లాలో చోటుచేసుకుంది. దీంతో రంగంలోకి దిగిన చోటిలా డివిజన్ డిప్యూటీ కలెక్టర్ హరేశ్ టి.మక్వానా కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి అమానుష చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. "వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను సరిగ్గా చూసుకోకపోవడం, వారికి అవసరమైన సేవలు చేయకపోవడం శిక్షార్హమైన నేరం. అమ్మానాన్నలను ఇంట్లో ఉండనివ్వకుండా, వారికి ఆహారం, దుస్తులు, వైద్యం వంటి కనీస సౌకర్యాలు కల్పించకుండా ఇబ్బంది పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించాం" అని మక్వానా పేర్కొన్నారు. కన్న బిడ్డల నుంచి వేధింపులు ఎదుర్కొంటున్నవారు జిల్లా లేదా తాలూకా యంత్రాంగాన్ని సంప్రదించాలని హరేశ్ సూచించారు. వయోవృద్ధుల సంరక్షణ, సంక్షేమ చట్టం- 2007లోని సెక్షన్ 5 ప్రకారం అపరాధులపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.



నదిలో పడిన బస్సు
నేపాల్‌లో 18 మంది మృతి

కాఠ్‌మాండూ: నేపాల్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ధాడింగ్ జిల్లాలో ఓ ప్రయాణికుల బస్సు త్రిశూలీ నదిలో పడి 18 మంది మృతిచెందారు. మరో 28 మంది గాయపడ్డారు. పొఖారా నుంచి కాఠ్‌మాండూ వెళ్తుండగా సోమవారం తెల్లవారుజామున ఈ దుర్ఘటన జరిగింది. బస్సు అదుపుతప్పి పృథ్వీ హైవే మీది నుంచి నదిలో పడింది. ప్రమాద సమయంలో బస్సులో 45 మందికి పైగా ప్రయాణికులున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో న్యూజిలాండ్‌కు చెందిన ఒక వ్యక్తి, జపాన్, నెదర్లాండ్స్ దేశాలకు చెందిన ఇద్దరు మహిళలు ఉన్నట్లు సమాచారం అందింది. అతివేగం వల్లే ఈ ఘటన జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రహార్

- కీలక విధానాన్ని ప్రకటించిన కేంద్రం



దిల్లీ: కేంద్ర ప్రభుత్వం సోమవారం "ప్రహార్" పేరుతో దేశంలో తొలి ఉగ్రవాద నిర్మూలన విధానానికి తెరతీసింది. బహుముఖ వ్యూహాన్ని అవలంబిస్తూ ఉగ్రవాదం పట్ల ఏమాత్రం సహనం వహించరాదన్నది ఈ విధానంలోని ప్రధాన అంశం. నిఘా ఆధారంగా ఉగ్రవాద హింసను నిరోధించడం, ఉగ్రవాదులకు, వారికి ఆర్థిక సాయం చేసేవారికి, మద్దతు దారులకు నిధులు, ఆయుధాలు, ఆశ్రయం అందకుండా చేయడం ఈ పథకం ఉద్దేశమని హోంశాఖ పేర్కొంది. దేశ విదేశాల నుంచి ఎదురవుతున్న ఉగ్రవాద ముప్పును నిర్మూలించేందుకు ఈ విధానానికి ఏడు స్తంభాల్లాంటి అంశాలను నిర్దేశించారు. ఉగ్రవాద నిరోధం, సత్వర స్పందన, అంతర్గత సామర్థ్యాల వినియోగం, మానవహక్కులు, చట్టపాలన ఆధారిత పద్ధతుల అనుసరణ, ఉగ్రవాదానికి దారితీస్తున్న మత ఛాందస భావనల కట్టడి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ప్రయత్నాలతో జతకలవడం అనే ఈ అంశాలు ప్రహార్‌కు పునాది వంటివని స్పష్టం చేసింది. భారత్ పొరుగున తరచూ అస్థిర పరిస్థితులు నెలకొంటున్న కారణంగా ఆయా ప్రాంతాల్లో అరాచక పరిస్థితులు తలెత్తుతున్నాయి. మన ప్రాంతంలోని కొన్ని దేశాలు ఉగ్రవాదాన్ని తమ ప్రభుత్వ విధానంగా ఎంచుకున్నాయని హోంశాఖ తన విధాన పత్రంలో పాకిస్థాన్‌ను పరోక్షంగా ప్రస్తావించింది. "భారత్ ఉగ్రవాదాన్ని ఏ మతానికీ, జాతీయతకూ, నాగరికతకూ ముడిపెట్టదు. ఉగ్రవాదం ప్రకటిత, అప్రకటిత లక్ష్యాలు ఏవైనా భారత్ ఎల్లవేళలా దాన్ని నిర్ద్వంద్వంగా ఖండిస్తూనే ఉంది" అని హోంశాఖ విధాన పత్రం పేర్కొంది. కొన్ని వర్గాల్లో నెలకొన్న దారిద్ర్యం, నిరుద్యోగం వంటి సమస్యల్ని ప్రతికూల శక్తులు తమకు అనుకూలంగా ఉపయోగించుకోకుండా నిరోధించేందుకు భారత ప్రభుత్వం ఆయా సమస్యల పరిష్కారానికి అనేక పథకాలు ప్రవేశపెట్టిందని పేర్కొంది. ఉగ్రవాద కార్యకలాపాల కోసం సమాచార, కమ్యూనికేషన్ల సాంకేతిక పరిజ్ఞానాన్ని దురుపయోగ పరిచే తత్వాన్ని నిర్మూలించేందుకు తాము కంకణబద్ధులమై ఉన్నామని విధానపత్రం తెలిపింది. ఇందుకోసం సాంకేతిక పరిజ్ఞాన రంగంలో పెట్టుబడులు పెంచడంతోపాటు, ప్రైవేటు భాగస్వామ్యానికి వీలు కల్పిస్తున్నట్టు వెల్లడించింది.

గ్లోబల్ ఎంట్రీ మూసివేత

- అమెరికాలో ప్రభుత్వ పాక్షిక షట్‌డౌన్‌తో హోంలాండ్ సెక్యూరిటీ నిర్ణయం

డాలస్: అమెరికా ప్రభుత్వ పాక్షిక షట్‌డౌన్ కారణంగా విమానాశ్రయాల్లో వేగంగా ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ ఇచ్చే గ్లోబల్ ఎంట్రీలను హోంలాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్‌ఎస్) మూసివేసింది. ప్రభుత్వ షట్‌డౌన్ ఎత్తేసేదాకా ఈ మూసివేత కొనసాగుతుందని ఆదివారం ఆ విభాగం స్పష్టం చేసింది. తొలుత గ్లోబల్ ఎంట్రీతోపాటు ట్రాన్స్‌పోర్టేషన్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్ విభాగం (టీఎస్‌ఏ) ద్వారా అమలయ్యే ముందస్తు తనిఖీ (ప్రి చెక్) ప్రక్రియనూ నిలిపేస్తామని డీహెచ్‌ఎస్ ప్రకటించింది. కానీ చివరకు ఒక్క గ్లోబల్ ఎంట్రీనే నిలిపేస్తున్నామని వెల్లడించింది. డీహెచ్‌ఎస్‌కు నిధుల విడుదలపై ఈ నెల 14వ తేదీన అధికార రిపబ్లికన్లకు, డెమోక్రాట్లకు సంధి కుదరకపోవడంతో ప్రభుత్వం పాక్షిక షట్‌డౌన్‌లోకి వెళ్లిపోయింది. ట్రంప్ డిపోర్టేషన్ ప్రక్రియతో పాటు ఇమ్మిగ్రేషన్ విధానాల్లో మార్పులు చేయాలని డెమోక్రాట్లు కోరుతున్నారు.

ఏమిటీ గ్లోబల్ ఎంట్రీ?

గ్లోబల్ ఎంట్రీ అనేది అమెరికాలో ప్రవేశానికి ముందస్తుగా అనుమతి మంజూరు చేసే కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విధానం. విమానాశ్రయాల్లో ఈ విధానం కింద ఏర్పాటు చేసిన కియోస్కుల ద్వారా విదేశాల నుంచి వచ్చిన ప్రయాణికులు వేగంగా ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ పొందవచ్చు.

- ఈ విధానం కింద ఎంత సేపట్లో ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ పొందవచ్చనే అధికారిక సమాచారం లేదు. అయితే వైమానిక పరిశ్రమ వర్గాల వివరాల ప్రకారం.. సాధారణ కస్టమ్స్ క్యూలలో తనిఖీకి 30 నుంచి 90 నిమిషాల సమయం పడుతుంది. అదే గ్లోబల్ ఎంట్రీ ద్వారా వెళ్తే 5 నుంచి 10 నిమిషాల్లో బయటకు వెళ్లవచ్చు.
- గ్లోబల్ ఎంట్రీకి అనుమతి ఉన్నవారు టీఎస్‌ఏ ప్రి చెక్‌కూ అర్హులే.
- 2024లో 2 కోట్ల మంది అమెరికన్లు టీఎస్‌ఏ ప్రి చెక్‌ను వినియోగించుకున్నారు.

ఏఐ సదస్సులో నిరసనల కేసులో మరొకరి అరెస్ట్

దిల్లీ: ఏఐ సదస్సులో చొక్కాలు విప్పి నిరసన చేపట్టిన వ్యవహారంలో దిల్లీ పోలీసులు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జితేంద్ర యాదవ్ అనే వ్యక్తిని సోమవారం అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో ఇప్పటివరకూ అరెస్టయిన వారి సంఖ్య అయిదుకు చేరింది. దిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో ఈ నెల 20న కొంత మంది భారత యువజన కాంగ్రెస్(ఐవైసీ) కార్యకర్తలు చొక్కాలు విప్పి కేంద్ర ప్రభుత్వానికి, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం పలు రాజకీయ విమర్శలకు దారి తీసిన సంగతి తెలిసిందే. పోలీసులు అదే రోజు నలుగురు ఐవైసీ కార్యకర్తలను అరెస్టు చేశారు.

డబుల్‌డెక్కర్ బోల్తాపడి ఐదుగురి మృతి

లఖ్‌నవూ: పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వేపై ఓ టోల్ ప్లాజా సమీపంలో సోమవారం డబుల్ డెక్కర్ బస్సు ఒకటి బోల్తాపడి ఐదుగురు మరణించారు, 45 మంది గాయాల పాలయ్యారని పోలీసులు తెలిపారు. డ్రైవర్ తాగిన స్థితిలో అతివేగంగా బస్సు నడపడం వల్లనే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు తెలియజేశారు. దీనిపై కేసు నమోదు చేసుకొని డ్రైవర్‌ను నిర్బంధంలోకి తీసుకున్నామని పోలీసులు వెల్లడించారు. పంజాబ్‌లోని లుధియానా నుంచి బిహార్‌లోని మోతీహారికి వెళ్తున్న ఈ బస్సులో ప్రమాదం జరిగే సమయానికి 80 నుంచి 85 మంది ప్రయాణిస్తున్నారు. సమాచారం అందిన వెంటనే ప్రమాద స్థలానికి పోలీసు సిబ్బందిని, అంబులెన్సులను తరలించామని దక్షిణ లఖ్‌నవూ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ నిపుణ్ అగర్వాల్ వెల్లడించారు.

ఆరెస్సెస్ హిందుత్వ రాజకీయాలను ఆచరించదు
మోహన్ భాగవత్


దేహ్రాదూన్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆరెస్సెస్) హిందుత్వ రాజకీయాలను ఆచరించదని, వ్యక్తిగత అభివృద్ధి ద్వారా పటిష్ఠమైన సమాజాన్నీ, దేశాన్ని నిర్మించడాన్ని విశ్వసిస్తుందని ఆ సంస్థ అధ్యక్షుడు మోహన్ భాగవత్ పేర్కొన్నారు. ఆరెస్సెస్ ప్రారంభించి 100 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన 'సంఘ్ యాత్రా- న్యూ హారిజన్స్, న్యూ డైమెన్షన్స్' అనే ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "కొందరు ఆరెస్సెస్‌ను పారామిలిటరీ దళంగా అనుకుంటే.. మరికొందరు సేవా రంగ సంస్థగా భావిస్తారు. కానీ ఆరెస్సెస్ ఈ హద్దులన్నీ దాటి పనిచేసే ఒక సామాజిక శక్తి' అని ఆయన పేర్కొన్నారు.

ఎప్‌స్టీన్ ఫైళ్ల కేసులో మాండెల్సన్ అరెస్టు

లండన్: అమెరికాలో బ్రిటన్ రాయబారిగా గతంలో పని చేసిన పీటర్ మాండెల్సన్‌ను ఎప్‌స్టీన్‌తో సంబంధాలు నెరపిన కేసులో పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌కు సన్నిహితుడైన ఆయనను ఇంట్లో ఉండగా అదుపులోకి తీసుకున్నారు. మాండెల్సన్ ఇప్పటికే హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు, లేబర్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అధికారంలో ఉండి దుష్ప్రవర్తనకు పాల్పడినందుకు 72 ఏళ్ల మాండెల్సన్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అజిత్ పవార్‌లాంటి అత్యుత్తమ 'డిప్యూటీ సీఎం' లేనేలేరు

- కొనియాడిన మహారాష్ట్ర సీఎం ఫడణవీస్



ముంబయి: విమాన ప్రమాదంలో మరణించిన దివంగత నేత అజిత్ పవార్.. రాష్ట్రం ఇంతవరకూ చూడని 'అత్యుత్తమ ఉప ముఖ్యమంత్రి' అని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ పేర్కొన్నారు. రాష్ట్రం ఓ గొప్ప నాయకుడిని, నిర్వాహకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహారాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాల మొదటి రోజైన సోమవారం అజిత్ పవార్‌కు సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్ని పార్టీల నేతలు ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. 'అజిత్‌దాదా మరణం రాష్ట్ర రాజకీయాల్లో ఎవరూ పూడ్చలేని లోటును మిగిల్చింది. ఆయనదీ, నాదీ బర్త్‌డే ఒకటే. నాకన్నా 11 ఏళ్లు పెద్దవాడైన ఆయన నాకు తండ్రి లాంటివారు. 6 సార్లు ఉప ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించిన ఆయనకు సీఎంగా రాష్ట్రాన్ని నడిపించే సామర్థ్యం ఉంది. ఏ సీఎం అయినా కోరుకునే అత్యుత్తమ ఆర్థిక మంత్రి ఆయన. ఈ ఏడాది ఆయన తన 12వ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేవారు. రాష్ట్రంలో అత్యధికంగా 13 సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన శేష్‌రావ్ వాంఖడే రికార్డును వచ్చే ఏడాది అజిత్ బద్దలు కొట్టేవారు' అని ఫడణవీస్ వ్యాఖ్యానించారు. సమయ పాలన పాటించే అజిత్ లాంటి ఓ గొప్ప నేతను రాష్ట్రం కోల్పోయిందని డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే వ్యాఖ్యానించారు.


బంతికి చెమటపట్టించేందుకు సిద్ధం


స్టంప్స్ లక్ష్యంగా...


దొరికిపోయాడు..


వదిలేదే లేదు..!


వికెట్!

ప్రతి ఆటా ఓ స్ఫూర్తి పాఠమే!

వాళ్ల ఒళ్లు అడుగు కదల్లేదు. అయితేనేం.. ఆత్మవిశ్వాసంతో క్రికెట్ మైదానంలోకి దిగారు. బ్యాట్‌తో.. స్కోరును పరిగెత్తించారు. బాల్‌తో.. బెయిల్స్ ఎగరగొట్టారు. బౌండరీ వైపు దూసుకెళ్లే బంతిని మెరుపువేగంతో ఒడిసిపట్టారు. చక్రాల కుర్చీలోంచే ఈ విన్యాసాన్ని చేసి క్రికెట్ ప్రేమికులనే కాదు.. చూసిన ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరిచారు. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం గుల్లేపల్లిలో సోమవారం ప్రారంభమైన జాతీయ వీల్‌చైర్ క్రికెట్ టోర్నీలోని ప్రతీ ఆట ఆత్మవిశ్వాసం నింపే పాఠంగా సాగింది. చక్రాల కుర్చీలో మోహరించిన ఫీల్డర్లు, వీల్‌చైర్లపైనే వికెట్ల మధ్య దుమ్ము రేపుతూ పరుగులు తీసిన బ్యాటర్లు ప్రేక్షకుల్లో స్ఫూర్తి నింపారు. ఈ నెల 26 వరకు జరిగే పోటీల్లో ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ జట్లు టోర్నీలో పాల్గొంటున్నాయి.

– ఈనాడు, విశాఖపట్నం

14 క్రీడాంశాలు.. 156 మంది ప్రజాప్రతినిధులు

నేటి నుంచి విజయవాడ వేదికగా 'లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్-2026'


జెర్సీలను ఆవిష్కరిస్తున్న రవినాయుడు, సుధీర్ రెడ్డి, విజయకుమార్, కళ్యాణ చక్రవర్తి తదితరులు

ఈనాడు-అమరావతి, విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మంగళవారం నుంచి మూడు రోజుల పాటు విజయవాడ వేదికగా 'ఏపీ స్టేట్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్-2026' జరగనుంది. క్రికెట్, క్యారమ్స్, కబడ్డీ, టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, పరుగుపందెం, షాట్‌పుట్, టేబుల్ టెన్నిస్, పికిల్‌బాల్, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్స్, త్రోబాల్, చెస్ తదితర 14 క్రీడాంశాల్లో మొత్తం 156 మంది ప్రజాప్రతినిధులు తలపడనున్నారు. కొందరు మూడు, నాలుగు ఆటల్లోనూ పాల్గొనేందుకు పేర్లు నమోదు చేయించుకున్నారు. ఐజీఎంసీ, డీఆర్ఆర్ఎంసీ స్టేడియాల్లో పోటీలు నిర్వహిస్తారు. ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, మంత్రులు వాసంశెట్టి సుభాష్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిలు కబడ్డీ జట్లకు కెప్టెన్లుగా వ్యవహరిస్తారు. అన్నింటిలో క్రికెట్ ముందువరుసలో ఉంది. ఇందులో ఆడేందుకు 82 మంది ఆసక్తి చూపారు. వీరందరూ ఆరు జట్లుగా తలపడనున్నారు. ఆయా జట్లకు మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కెప్టెన్లుగా వ్యవహరించనున్నారు. మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, సవిత కూడా క్రికెట్ ఆడనున్నారు.

ప్రత్యక్ష ప్రసారాల కోసం లైవ్‌లింక్

ప్రజాప్రతినిధుల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించేందుకు, క్రీడలను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ మీట్ ఏర్పాటుచేసినట్లు శాప్ ఛైర్మన్ రవి నాయుడు తెలిపారు. ఐజీఎంసీ స్టేడియంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ వేడుకలో పాల్గొంటారు. పోటీలను ప్రత్యక్షప్రసారం చేయడానికి లింక్‌లు ఏర్పాటుచేశాం' అని వివరించారు. అనంతరం ప్రజాప్రతినిధులు ధరించే జెర్సీలను ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్‌రెడ్డి, ఎస్.విజయ్‌కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. శాప్ పాలకమండలి సభ్యులు జగదీశ్వరి, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

11 మంది ఆర్అండ్‌బీ ఇంజినీర్లపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు

రోడ్డు విస్తరణ పనుల్లో పర్యవేక్షణ లోపమే కారణం

ఈనాడు, అమరావతి: ఉమ్మడి కడప జిల్లాలోని రాజంపేట నుంచి వత్తలూరు వెళ్లే రహదారి విస్తరణ పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన 11 మంది ఆర్అండ్‌బీ ఇంజినీర్లపై క్రమశిక్షణ చర్యలకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సిఫార్సు చేసింది. ఈ రహదారి పని జరుగుతున్నప్పుడు ఈఈలుగా పనిచేసిన పి.ప్రతాప్‌రెడ్డి, ఏపీ దేవాదాస్, మురళీకృష్ణ, డీఈలు జి.ప్రభాకర్‌రావు, జి.చలపతి, ఎన్.రాజకుమార్, ఎస్ఆర్ శ్రీధర్‌రెడ్డి, ఏఈలు జి.వెంకట రామాంజినేయులు, సీహెచ్ శ్రీనివాసులు, ఎస్.అమానుల్లా, వై.రాధా రత్నకుమారిలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.



ఆర్థిక జీవితాన్ని మార్చే పుస్తకాలు..


ప్రతి ఒక్కరు తప్పక చదవాల్సిన పుస్తకాల్లో ముఖ్యమైన పుస్తకాలు అయిదు ఉన్నాయి. మీ ఆర్థిక జీవితాన్ని సమూలంగా మార్చే శక్తి వాటికి ఉంది. అవి..

1. ది రిచెస్ట్ మ్యాన్ ఇన్ బాబిలోన్
2. ది సైకాలజీ ఆఫ్ మనీ
3. రిచ్ డాడ్ పూర్ డాడ్
4. ది ఇంటెలిజెంట్ ఇన్వెస్టర్
5. ఐ విల్ టీచ్ యూ టు బీ రిచ్

– టోబీ, ఫైనాన్స్ ఎడ్యుకేటర్

బాగా పనిచేసే ఉద్యోగులకు వెయిటేజ్

- అభినందన లేఖలతోపాటు, వారి వ్యక్తిగత రికార్డుల్లో నమోదు
- రెవెన్యూశాఖకు ఉన్న చెడ్డపేరు పోవాలి
- ఏసీబీని క్రియాశీలం చేసే పరిస్థితి తెచ్చుకోవద్దు
- ఆసుపత్రుల పారిశుద్ధ్యంలో అశ్రద్ధ చూపితే ఏజెన్సీలు, ఏవోలే బాధ్యులు
- వివిధ శాఖల పనితీరుపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి



ఈనాడు, అమరావతి: బాగా పనిచేసే ఉద్యోగులను గుర్తించి వారిని ప్రోత్సహించేలా అభినందన లేఖలు పంపేలా అన్నిశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అలాగే ఆయా ఉద్యోగుల వ్యక్తిగత రికార్డుల్లో వాటిని నమోదు చేయాలన్నారు. పనితీరు ఆధారంగా ఉద్యోగులకు వెయిటేజ్ ఇవ్వాలని ఆదేశించారు. సరిగా పనిచేయని వారిని మోటివేట్ చేయడంపై దృష్టిపెట్టాలని సూచించారు. సీఎం సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో బాగా పనిచేసే ఉద్యోగులను గుర్తించి, ప్రోత్సహిస్తే బాగుంటుంది అంటూ సీఎం చేసిన సూచనపై అధికారులంతా.. చాలా మంచి నిర్ణయమని పేర్కొన్నారు. ఉద్యోగులను అభినందించడం ఇదే తొలిసారి అవుతుందని అభిప్రాయపడ్డారు. ఉద్యోగుల్లో పోటీతత్వం కూడా పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, ప్రభుత్వ సేవలను సులభతరం చేయడమే లక్ష్యంగా ఉద్యోగులు, అధికారులు పనిచేయాలని పేర్కొన్నారు. ఇంకా సీఎం ఏమన్నారంటే..

- ✦ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదలుకొని అన్ని స్థాయిల్లో ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి.
- ✦ పారిశుద్ధ్యం విషయంలో ఎన్నిసార్లు చెప్పినా పద్ధతి మార్చుకోని ఆసుపత్రుల జాబితా సిద్ధం చేయండి.
- ✦ అక్కడి పొరుగుసేవల ఏజెన్సీని, సంబంధిత ఆసుపత్రి ఏవోలను బాధ్యులుగా చేయాలి.
- ✦ గతంతో పోల్చితే ఆలయాల్లో సిబ్బంది పనితీరు కొంత బాగుంది. ఇంకా మెరుగుపడాలి.
- ✦ ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం ఉండేలా చూసే విషయంలో ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించొద్దు.
- ✦ భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేలా సిబ్బంది అంతా పనిచేయాలి.
- ✦ అవినీతికి ఆస్కారం ఉండరాదు. ఏసీబీని రంగంలోకి దించే (యాక్టివేట్ చేసే) పరిస్థితి తెచ్చుకోవద్దు.
- ✦ సరిగా పనిచేయని కారణంగా తహసీల్దార్లను పక్కన పెట్టాల్సిన దుస్థితి రాకూడదు.
- ✦ మంచి పనితీరు కనబరిచే డిప్యూటీ కలెక్టర్లను గుర్తిస్తున్నాం.
- ✦ రెవెన్యూ శాఖకు ఫ్రెష్‌లుక్ తీసుకురావాల్సి ఉంది. ఈ శాఖకు ఉన్న చెడ్డపేరు పోవాలి. పనితీరులో మార్పు కనిపించాలి.
- ✦ రీ సర్వేతో అన్ని రకాల భూ సమస్యలు పోవాలి. మళ్లీ వివాదాలు రాకుండా చూడాలి.
- ✦ ఎవరైనా సర్వేయర్లు సరిగా వ్యవహరించకపోతే కఠిన చర్యలు తప్పవు.

తాగునీటి పరీక్షలకు మొబైల్ ల్యాబ్‌లు

- ✦ తాగునీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు నమూనాలు సేకరించి, ల్యాబ్‌లో పరీక్షలు చేయించాలి.
- ✦ ల్యాబ్‌లు అందుబాటులో లేకపోతే మొబైల్ ల్యాబ్‌లు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలి.
- ✦ రోడ్డు ప్రమాదాలపై ఆడిట్ చేయించాలి. దాని ఆధారంగా ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి.
- ✦ ప్రభుత్వం పెద్దఎత్తున టెక్నాలజీ వినియోగించి సేవలు అందిస్తుండగా, వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.
- ✦ ఇందుకు మీసేవ, డ్వాక్రా సంఘాలు, ప్రణాళిక విభాగంతో ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలి.
- ✦ ఇటీవల దిల్లీలో జరిగిన ఏఐ-ఇంపాక్ట్ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఏడు ఎంవోయూలను ఎలా అమల్లో పెట్టాలనేదానిపై కార్యాచరణ సిద్ధం చేయాలి. ఈ సమీక్షలో రెవెన్యూ, ఆర్అండ్‌బీ, దేవాదాయ, వైద్యారోగ్య, పట్టణాభివృద్ధి, రవాణా, అగ్నిమాపక శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


గ్రామస్థులు కోరగానే రూ.60 లక్షలతో రోడ్డు నిర్మాణం

పవన్‌కల్యాణ్ హామీతో పనులు పూర్తి

ఈనాడు, అమరావతి: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతో ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండల పరిధిలోని ఎర్రంపేట, రాజవరం గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణం పూర్తయింది. గతేడాది నవంబరు 24న ఐ.ఎస్.జగన్నాథపురం పర్యటనకు పవన్‌కల్యాణ్ వెళ్లినప్పుడు అక్కడి ప్రజలు డొంకరోడ్డు నిర్మించాలంటూ వినతిపత్రం ఇచ్చారు. ఆ రోడ్డు లేక తాము పడుతున్న ఇబ్బందులను అందులో వివరించారు. స్పందించిన ఉపముఖ్యమంత్రి.. తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జాతీయ ఉపాధిహామీ పథకం కింద రూ.60 లక్షలు రెండు ప్యాకేజీలుగా మంజూరు చేసి పనులు పూర్తి చేయించారు. 'జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో 3 కిలోమీటర్ల డొంక రోడ్డు నిర్మితమైంది. దీంతో 12,500 మంది ప్రజల కష్టాలు తీరతాయి' అని ఉపముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

వసతిగృహాల పేరును డాక్టర్ అంబేడ్కర్ రాజగృహాలుగా మార్చాలి

సీఎం చంద్రబాబుకు పోతుల బాలకోటయ్య వినతి


సీఎం చంద్రబాబుకు నివేదిక అందజేస్తున్న బాలకోటయ్య

ఈనాడు, అమరావతి: సాంఘిక సంక్షేమ వసతిగృహాలకు సంబంధించిన సామాజిక నివేదికను రాష్ట్ర సామాజిక సంక్షేమ మండలి ఛైర్మన్ పోతుల బాలకోటయ్య ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందించారు. సోమవారం సచివాలయంలో సీఎంను కలిసి ఈ మేరకు నివేదిను అందించారు. సంక్షేమ ఆదివారం పేరిట రాష్ట్రంలోని పలు వసతిగృహాలను సందర్శించి నివేదికను రూపొందించినట్లు ఆయన సీఎంకు వివరించారు. విద్యార్థుల వసతి సౌకర్యాలతోపాటు, ఆడపిల్లలకు కాస్మెటిక్స్ కిట్, సీసీ కెమెరాలు, హెల్త్‌కేర్, గ్రంథాలయం, ట్యూషన్ టీచర్లు, శానిటరీ సిబ్బంది నియామకం, ఆర్వో ప్లాంట్లు, టీవీల ఏర్పాటు, తదితర అంశాలను నివేదికలో పొందుపరిచారు. వసతిగృహాల పేరును డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజగృహాలుగా మార్చాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న వసతిగృహాల పునర్నిర్మాణ పనులు చేపట్టాలని నివేదించారు. వసతిగృహ తలిదండ్రుల కమిటీల నియామకం, అధికారుల సమీక్ష సమావేశాల నిర్వహణ లాంటి విషయాలను అందులో పేర్కొన్నారు. నివేదికను సీఎం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు పోతుల బాలకోటయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కల్తీ పాల వ్యవహారంలో చర్యలు తీసుకోవాలి: జగన్

ఈనాడు, అమరావతి: ఆహార భద్రతపై నిర్లక్ష్యం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లిందని మాజీ ముఖ్యమంత్రి జగన్ విమర్శించారు. రాజమహేంద్రవరం కల్తీ పాల వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అక్కడ కల్తీ పాలు తాగి నలుగురు మృతిచెందడం, మరికొందరు తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న ఘటన పట్ల సోమవారం ఆయన విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు.

✦ మాజీ ముఖ్యమంత్రి జగన్ మంగళవారం నుంచి రెండు రోజులపాటు పులివెందులలో పర్యటించనున్నారు. మంగళవారం సాయంత్రం పులివెందుల చేరుకుని, భాకరాపురంలోని క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తారు.

ప్రముఖ రచయిత్రి పోలాప్రగడ రాజ్యలక్ష్మి కన్నుమూత



ఆలమూరు, హైదరాబాద్, న్యూస్‌టుడే: ప్రముఖ తెలుగు రచయిత్రి, రమ్యకథా రచయిత్రిగా పేరుపొందిన పోలాప్రగడ రాజ్యలక్ష్మి (88) సోమవారం ఉదయం గుండెపోటుతో హైదరాబాద్‌లో మరణించారు. రాజ్యలక్ష్మి 1938 ఫిబ్రవరి 5న తూర్పుగోదావరి (ప్రస్తుత అంబేడ్కర్ కోనసీమ) జిల్లా ఆలమూరు మండలం చింతలూరులో బలరామమూర్తి, కృష్ణవేణమ్మలకు జన్మించారు. ఐదో తరగతి వరకు మాత్రమే చదువుకున్నారు. ప్రముఖ రచయిత పోలాప్రగడ సత్యనారాయణమూర్తిని వివాహం చేసుకున్నారు. హాస్యాన్ని మేళవించి ఆమె రాసిన తొలి కథను అప్పట్లో బాపు, రమణలు నిర్వహించిన జ్యోతి మాసపత్రికలో ప్రచురితమైంది. భర్త ప్రోత్సాహంతో శరన్మేఘం, శృతి తప్పిన వీణలు తదితర నవలలు రాశారు. వందకు పైగా కథలు, అనేక రేడియో వ్యాసాలు రచించారు. రాజ్యలక్ష్మి అస్సాంలోని దిబ్రూగఢ్‌లో ఉద్యోగం చేస్తున్న కుమారుడి ఇంటికి వెళ్లినప్పుడు ఆ రాష్ట్రంలో జరుగుతున్న విద్యార్థి ఉద్యమంపై రెల్లుపొదలు నవల రాశారు. అది సంచలనం సృష్టించడమే కాదు ఇంగ్లిష్‌లో రెడ్‌బుషెస్, హిందీలో సర్కండీ కీ ఝూడియా పేరుతో అనువాదమైంది. రాజ్యలక్ష్మి నాగార్జున యూనివర్సిటీ ఉన్నవ లక్ష్మీనారాయణ అవార్డు, హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీ ఉత్తమ రచయిత్రి అవార్డు, సీఎం చంద్రబాబు చేతులమీదుగా 2002లో ఉగాది పురస్కారాలను అందుకున్నారు. 'మా పిన్ని పోలాప్రగడ రాజ్యలక్ష్మి మహిళా శక్తికి, విలువలతో కూడిన స్ఫూర్తిదాయక ఆలోచనలకు ప్రతీక. ఐదో తరగతి వరకూ మాత్రమే చదువుకున్నా.. తపనతో తెలుగు సాహిత్యాన్నంతా వడపోశారు' అని నటుడు పోలాప్రగడ జనార్దనరావు (జెన్నీ) చెప్పారు.

కొత్తగా బ్యాంకు ఖాతాలు తెరిచేలా అనుమతించొద్దు

- విచారణ ముగిసిన కేసులో, మళ్లీ అభ్యర్థన సరికాదు
- జగతి పబ్లికేషన్స్ పిటిషన్‌పై సీబీఐ వాదన
- తీర్పు వాయిదా వేసిన తెలంగాణ హైకోర్టు



ఈనాడు, హైదరాబాద్: వ్యాపార వ్యవహారాల్లో భాగంగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఎస్‌బీఐ బ్రాంచి నుంచి విదేశీ ఖాతాలకు సొమ్ము బదిలీ చేయడానికి గానీ, ఇతర బ్యాంకుల్లో కొత్త ఖాతాలను తెరవడానికి గానీ జగతి పబ్లికేషన్స్‌కు అనుమతి ఇవ్వరాదని సీబీఐ సోమవారం తెలంగాణ హైకోర్టుకు విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే విచారణ పూర్తై, తుది ఉత్తర్వులు వెలువడిన కేసులో మధ్యంతర పిటిషన్ వేసేందుకు అనుమతించరాదని, ఈ లెక్కన జగతి దాఖలుచేసిన మధ్యంతర పిటిషన్ విచారణార్హం కాదని తెలిపింది. ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసుల వ్యవహారంలో భాగంగా.. సీజ్ చేసిన బ్యాంకు ఖాతాలకు సంబంధించి గతంలో ఇచ్చిన ఉత్తర్వులను సవరించాలని, సడలించాలని కోరుతూ జగతి పబ్లికేషన్స్ లిమిటెడ్ (సాక్షి) హైకోర్టులో మధ్యంతర పిటిషన్ వేసింది. దీనిపై జస్టిస్ ఇ.తిరుమలాదేవి సోమవారం విచారించారు.

✦ పిటిషనర్ తరఫు న్యాయవాది జి.అశోక్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 'రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో అమెరికా విధించిన షరతుల్లో భాగంగా న్యూస్‌ప్రింట్ కొనుగోళ్లకు సంబంధించి దుబాయ్‌లోని ఖాతాలకు నిధులను బదిలీ చేయడానికి నిరాకరిస్తోంది. ఇది వ్యాపార కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. అందువల్ల బంజారాహిల్స్‌లోని ఎస్‌బీఐకి నిధులు బదలాయించేలా ఆదేశాలివ్వండి. అలాకాని పక్షంలో నిధుల తరలింపునకు అనుమతించే హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్, ఐసీఐసీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడాల్లో కొత్త ఖాతాలను తెరవడానికి అనుమతించండి' అని కోరారు.

✦ సీబీఐ తరఫు ప్రత్యేక న్యాయవాది శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపిస్తూ 'ఒకే మధ్యంతర పిటిషన్‌పై పలు ఉపశమనాలు కోరారు. అందువల్ల ఇది విచారణార్హం కాదు. ఎస్‌బీఐకి ఆదేశాలు జారీచేయాలని, ఇతర బ్యాంకుల్లో ఖాతాలు తెరవడానికి అనుమతించాలని జగతి పబ్లికేషన్స్ దాఖలుచేసిన పిటిషన్‌లో బ్యాంకులను ప్రతివాదులుగా చేర్చలేదు. గత ఉత్తర్వులను సవరించాలని, సడలించాలన్న విజ్ఞప్తితో పిటిషన్ వేసినప్పటికీ.. అలాంటి అభ్యర్థనలేవీ కోరలేదు' అని కోర్టు దృష్టికి తెచ్చారు. 'నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పలు కంపెనీలకు అక్రమ ప్రయోజనాలు కల్పించినందుకు ప్రతిఫలంగా.. ఆయా కంపెనీలు ముడుపులను జగన్ కంపెనీల్లో పెట్టుబడులుగా పెట్టాయి. దీనిపై హైకోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి, జగతి పబ్లికేషన్స్ బ్యాంకు ఖాతాలను సీబీఐ స్తంభింపజేసింది. దీంతో జగతి, జనని ఇన్‌ఫ్రా, ఇందిరా టెలివిజన్ కంపెనీలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించాయి. కంపెనీ నిర్వహణ, ఉద్యోగుల ప్రయోజనాల దృష్ట్యా వివిధ ఎస్‌బీఐ బ్రాంచీల్లో వసూళ్లకు 19 ఖాతాలు, చెల్లింపులకు 5 ఖాతాలు నిర్వహించుకోవడానికి అనుమతించింది. కొత్తగా ఎలాంటి ఖాతాలూ తెరవడానికి వీల్లేదు. సీబీఐ కోర్టులో కేసు విచారణ పూర్తయ్యేదాకా ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని తుది తీర్పు వెలువరించింది' అని పేర్కొన్నారు. దీనిపై అభ్యంతరాలుంటే సుప్రీం కోర్టులో అప్పీల్ చేసుకోవాల్సి ఉందని, అయితే ఎలాంటి అప్పీలూ దాఖలు చేయనందున అదే అంతిమమన్నారు. 'ఒకసారి కేసు విచారణ ముగిసిన పిటిషన్‌లో ఉత్తర్వులు ఇచ్చిన 4,764 రోజుల తర్వాత సవరణ పిటిషన్ వేయడం చెల్లదు. తుదితీర్పు వెలువరించిన పిటిషన్‌లో అక్షర దోషాలు, సంఖ్యలు తేడా ఉంటే సవరించవచ్చు కానీ, తీర్పును సమీక్షించడానికి వీల్లేదు. గతంలోనూ ఇలా మధ్యంతర ఉత్తర్వులను సవరించాలని పిటిషన్ వేసినపుడు రూ.లక్ష జరిమానా విధించింది' అని శ్రీనివాస్ కపాటియా కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. కొత్త అభ్యర్థన ఉంటే తాజాగా పిటిషన్ దాఖలు చేసుకోవాలని, తుది ఉత్తర్వులు వెలువరించిన కేసులో మధ్యంతర పిటిషన్ వేయడానికి వీల్లేదని, పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును వాయిదా వేశారు.

ఏటీఎం కార్డులు మార్చి.. డబ్బు కాజేసి

- వృద్ధులు, మహిళలను మోసం చేస్తున్న యువకుడి అరెస్టు
- తెలుగు రాష్ట్రాల్లో నిందితుడిపై 20 కేసులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఏటీఎం కార్డులు, నగదు


నిందితుడు వీరయ్య చౌదరి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: వృద్ధులు, మహిళలను లక్ష్యంగా చేసుకుని ఏటీఎం సెంటర్ల వద్ద కార్డులు మారుస్తూ నగదు అపహరిస్తున్న యువకుడిని అనకాపల్లి జిల్లా పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా పర్చూరు మండలం వీరన్నపాలేనికి చెందిన మొవ్వ వీరయ్యచౌదరి(34) విశాఖపట్నంలో నివసిస్తున్నాడు. గత నెల 17న నర్సీపట్నం మండలం ధర్మసాగరానికి చెందిన నూకరాజు నర్సీపట్నంలోని డీబీఆర్ షాపింగ్‌మాల్ వద్ద ఏటీఎంలో నగదు తీసుకోవడానికి వచ్చారు. ఆ సమయంలో అక్కడే ఉన్న వీరయ్య సహాయం చేస్తానని చెప్పడంతో నమ్మి ఏటీఎం కార్డు ఇచ్చారు. నగదు తీయడానికి పిన్ నంబర్ కూడా చెప్పారు. మూడుసార్లు కార్డు పెట్టి తీసి నగదు రావడం లేదని చెప్పిన వీరయ్య.. ఓ కార్డు అతడి చేతిలో పెట్టి వెళ్లిపోయాడు. మర్నాడు మరో ఏటీఎంకు వెళ్లిన నూకరాజు కార్డు పెట్టి చూసినా ఫలితం లేకపోవడంతో బ్యాంక్‌కు వెళ్లారు. ఏటీఎం కార్డు మారిపోయిందని బ్యాంక్ సిబ్బంది చెప్పడంతో మోసపోయినట్లు గుర్తించారు. అప్పటికే గుర్తుతెలియని వ్యక్తి ఒరిజినల్ కార్డును ఉపయోగించి రూ.15వేలు డ్రా చేశారని తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు సీసీకెమెరా ఫుటేజ్ పరిశీలించి నర్సీపట్నంలో వీరయ్యను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ.10వేల నగదు, తొమ్మిది ఏటీఎం కార్డులు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. 2017 నుంచి ఇప్పటివరకు వీరయ్యపై ఇలాగే రెండు తెలుగు రాష్ట్రాల్లో 20 కేసులు నమోదయ్యాయని డీఎస్పీ వెల్లడించారు.

నిలువునా ముంచిన స్నేహితుడు

యువతి ఖాతాలో రూ.7 కోట్లు ఖాళీ!

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే: ఆమె నమ్మకాన్ని ఆ స్నేహితుడు వమ్ముచేశాడు. ఏకంగా రూ.7 కోట్లకు టోపీ పెట్టాడు. స్నేహితుడిని నమ్మి బ్యాంకు ఖాతా వివరాలు ఇస్తే.. ఆ వివరాలను రూ.7 కోట్లను ఖాతా నుంచి ఖాళీచేసిన ఘటన బెంగళూరులో కలకలం రేపింది. బాధితురాలు ఓ సంపన్న కుటుంబానికి చెందిన విద్యార్థిని. నగర ఉత్తర విభాగం సైబర్ క్రైమ్ పోలీసు ఠాణాలో ఆమె చేసిన ఫిర్యాదు ప్రకారం.. ఏడాది కిందట ఆయుష్ అనే విద్యార్థి ఆమెకు పరిచయమయ్యాడు. 'అనుకోకుండా ఏదో సాంకేతిక సమస్య ఎదురైంది. నా బ్యాంకు ఖాతాను అధికారులు స్తంభింపచేశారు. కొన్ని లావాదేవీలు చేసుకోవడానికి నీ బ్యాంకు ఖాతా వివరాలు కాస్త చెబుతావా' అంటూ నమ్మబలికాడు. అతడిని అప్పటికే బాగా విశ్వసించిన ఆమె పాస్‌బుక్, చెక్‌బుక్, ఏటీఎం కార్డులను అప్పగించింది. వాటి సాయంతో చేయాల్సినదంతా చేసేశాడని గుర్తించడానికి ఆమెకు ఎక్కువ రోజులు పట్టలేదు. ఆమె మేలుకునేలోపే బ్యాంకు అధికారులు అప్రమత్తమయ్యారు. 'మీ ఖాతా నుంచి ఇంత సొమ్ము మీకు తెలిసే ఖాళీ అవుతోందా' అని ప్రశ్నించడంతో విద్యార్థిని కాళ్ల కింద భూమి కదిలినంత పనైంది. వెంటనే ఖాతాలను స్తంభింపజేశారు. మోసగాడి కోసం గాలిస్తున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

వీఐటీ-ఏపీలో ఘనంగా విటోపియా-2026 ఫెస్ట్


కార్యక్రమంలో కేరింతలు కొడుతున్న విద్యార్థులు

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, తుళ్లూరు: అమరావతిలోని వీఐటీ-ఏపీ యూనివర్సిటీలో విటోపియా-2026 ఫెస్ట్ సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. గత మూడు రోజులుగా జరుగుతున్న వార్షిక క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను ఉర్రూతలూగిస్తున్నాయి. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో యువత ప్రతిభ చాటుతూ సందడి చేస్తున్నారు. ఈ నెల 22న రాత్రి మొదలై అర్ధరాత్రి ముగిసిన ప్రోషోలో మోహన భోగరాజు, అబ్దుల్ వహాబ్ బ్యాండ్, డి.జె.నోటోరియస్ సంగీత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కేరింతలు కొట్టారు. సోమవారం ఉదయం నుంచీ సంప్రదాయ, పాశ్చాత్యనృత్యాలతో యువత పోటీపడ్డారు. తొలిరోజు సంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్న యువతీ యువకులు.. తర్వాత రెండు రోజులు ఆధునిక నృత్యరీతులకు తగ్గట్లుగా అలంకరణలతో కనిపించారు. కార్యక్రమంలో వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ పి.అరుల్మోళివర్మన్, రిజిస్ట్రార్ జగదీష్‌చంద్ర ముదిగంటి, విటోపియా కన్వీనర్ ఎస్.గోపీకృష్ణన్, స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఖదీర్ పాషా, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ రామచంద్రరావు పాల్గొన్నారు.

అట్టుడికిన మెక్సికో

- డ్రగ్స్ మాఫియా డాన్ ఎల్ మెంచో హతం
- తీవ్రస్థాయిలో చెలరేగిన హింస

మెక్సికో: ఉత్తర అమెరికా దేశం మెక్సికోలో తీవ్రస్థాయి హింస చెలరేగింది. ఆ దేశంతో పాటు అమెరికాకూ మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా ఉన్న డ్రగ్స్ ముఠా నాయకుడు నెమెసియో ఒసెగువెరా సెర్వాంటెస్ ఎలియాస్ ఎల్ మెంచో ఆదివారం హతమయ్యాడు. అనంతరం మెక్సికో వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో అతడి అనుచరులు దాడులకు దిగి.. 25 మంది నేషనల్ గార్డ్ సభ్యులను హత్య చేశారు. 59 ఏళ్ల ఎల్ మెంచోను అదుపులోకి తీసుకునేందుకు అతడి స్వరాష్ట్రమైన హలిస్కోలోని తపాల్పాలో మెక్సికో సైన్యం ఆదివారం భారీ ఆపరేషన్‌ను చేపట్టింది. ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి సోదాలు నిర్వహించింది. ఎల్ మెంచో అనుచరులు కాల్పులకు దిగడంతో.. సైన్యం ఎదురుకాల్పులు జరిపింది. ఈ ఆపరేషన్‌లో దాదాపు 62 మంది డ్రగ్స్ ముఠా సభ్యులు హతమైనట్లు తెలుస్తోంది. కాల్పుల్లో గాయపడ్డ ఎల్ మెంచోను గగన మార్గంలో మెక్సికో సిటీకి తరలించేందుకు సైన్యం ప్రయత్నించింది. అయితే అక్కడికి చేరుకునేలోపే అతడు మరణించాడు. ఎల్ మెంచో లక్ష్యంగా మెక్సికో సైన్యం చేపట్టిన ఆపరేషన్‌కు తాము నిఘా సహకారం అందించినట్లు అమెరికా ధ్రువీకరించింది. ఎల్ మెంచో హతమయ్యాక పలు రాష్ట్రాల్లో హింసాత్మక ఆందోళనలు చోటుచేసుకున్నాయి. అతడి అనుచరులు చాలా ప్రాంతాల్లో వాహనాలను తగలబెట్టారు. రహదారుల్ని దిగ్బంధించారు. సూపర్ మార్కెట్లు, పెట్రోల్ బంకులు, బ్యాంకులకు నిప్పంటించారు. వారు జరిపిన ఆరు వేర్వేరు దాడుల్లో 25 మంది నేషనల్ గార్డ్ సభ్యులు ప్రాణాలు కోల్పోయారు. ఈ పరిణామాలతో చాలా రాష్ట్రాల్లో పాఠశాలలను సోమవారం మూసివేశారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దంటూ భారత్ సహా పలు దేశాలు మెక్సికోలోని తమ పౌరులకు అడ్వైజరీ జారీ చేశాయి. తాజా హింసలో కొందరు పౌరులూ ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది.

పోలీసు నుంచి మాఫియా డాన్‌గా..

ఎల్ మెంచో కరడుగట్టిన నేరగాడు. మెక్సికోలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న క్రిమినల్ సంస్థ 'న్యూ జనరేషన్ కార్టెల్'కు అతడే బాస్. అమెరికాకు ఫెంటానిల్, మెథాంఫెటమైన్, కొకైన్‌లను అక్రమంగా రవాణా చేయిస్తుంటాడు. ఎల్ మెంచో 1980ల్లో అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించి.. కాలిఫోర్నియాలో హెరాయిన్ సరఫరా చేస్తూ పోలీసులకు దొరికిపోయాడు. కొన్నేళ్ల జైలుశిక్ష తర్వాత అమెరికా అతడిని మెక్సికోకు అప్పగించింది. స్వదేశానికి వచ్చాక ఎల్ మెంచో కొంతకాలం పోలీసుగా పనిచేశాడు. ఆ సమయంలో డ్రగ్ మాఫియా గురించి వివరాలన్నీ తెలుసుకొని.. క్రమంగా ఆ దందాలోకి దిగాడు. 2009లో న్యూ జనరేషన్ కార్టెల్‌ను ఏర్పాటు చేశాడు. ఈ ముఠా 2015లో ఆరు వారాల వ్యవధిలో 20 మందికి పైగా పోలీసులను తలలు నరికి అత్యంత పాశవికంగా చంపేసింది. ఎల్ మెంచోను అదుపులోకి తీసుకునే సమాచారమిచ్చేవారికి దాదాపు రూ.136 కోట్ల రివార్డు అందజేస్తామంటూ గతంలో వాషింగ్టన్ ప్రకటించింది. అతడి కుమారుడు అమెరికాలో డ్రగ్స్ అక్రమ రవాణా కేసులో జీవితఖైదు అనుభవిస్తున్నాడు.

EENADU Vol: 52, Issue: 195 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

మహా బలహీనత



కూర్చోవటం, నిల్చోవటం, నడవటం వంటివి మనం అలవోకగా చేసేస్తుంటాం. కానీ వీటి వెనక పెద్ద తతంగమే నడుస్తుంది. ముందు నాడీ కణాల నుంచి కండరాలకు సంకేతాలు అందాలి. వాటిని గ్రహించి, కండరాలు స్పందించాలి. అప్పుడే ఏ కదలికైనా సాధ్యమవుతుంది. నాడీ కణాలు దెబ్బతిన్నా, కండరాలు బలహీనమైనా చిన్న పనులే పెద్ద కష్టంగా మారతాయి. స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ).. అంటే వెన్ను కండర క్షీణత సమస్య ఇలాగే చిక్కులు తెచ్చిపెడుతుంది. పుట్టుకతోనే తలెత్తే ఇది ఎంతోమందికి చిన్నప్పటి నుంచే పెను శాపంగా మారుతోంది.

పుట్టిన తర్వాత నెలలు గడుస్తున్నకొద్దీ మెడ నిలపటం, బోర్లా పడటం, పాకటం, కూర్చోవటం, నిల్చోవటం.. ఇలా ఒక్కొక్కటిగా అలవడుతూ వస్తుంటాయి. శిశువుల దృష్టితో చూస్తే ఒక్కోటీ ఒక్కో ఘన విజయమే. బలాన్నంతా కూడదీసుకొని ఒక్కో పని నేర్చుకుంటారు. ఇందులో వెన్నుపాములోని నాడీ కణాలు కీలక పాత్ర పోషిస్తాయి. కండరాల కదలికలకు వీటి నుంచి అందే సంకేతాలే ఆధారం. వెన్ను కండర క్షీణత (ఎస్ఎంఏ)తో పుట్టిన పిల్లల్లో ఇవే కొరవడతాయి. మనదేశంలో ఏటా సుమారు 4వేల మంది శిశువులు దీంతో పుడుతున్నారని అంచనా. ఇది వచ్చిందంటే ఒకప్పుడు ఆశలు వదులు కునేవారు. ఇప్పుడిది జన్యు చికిత్సల్లోనే ఓ అత్యద్భుత విజయంగా నిలుస్తోంది. సమస్యను ముందే గుర్తించటం, ఆధునిక చికిత్సల ఆవిష్కరణ, వైద్య బృంద సంరక్షణ పుణ్యమాని ప్రస్తుతం ఎంతోమంది పిల్లలు హాయిగా జీవించగలుగుతున్నారు. పదేళ్ల క్రితం ఇది సాధ్యమంటే ఎవరూ నమ్మేవారే కాదు. కాకపోతే జన్యుచికిత్స ఖరీదైంది కావటమే అడ్డంకిగా నిలుస్తోంది. అయినప్పటికీ దాతల ఆర్థిక సహకారంతో ఎంతోమందికి కొత్త జీవితం లభిస్తుండటం విశేషం.



డా॥ రమేశ్ కోనంకి
డైరెక్టర్, న్యూరోసైన్సెస్
పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్
బంజారాహిల్స్, హైదరాబాద్

నాలుగు రకాలు

ఎస్ఎంఏ అప్పుడే పుట్టిన శిశువుల దగ్గరి నుంచి పెద్దవారి వరకూ ఏ వయసులోనైనా రావొచ్చు. జబ్బు లక్షణాలు ఏ వయసులో మొదలయ్యాయి? జబ్బు తీరు, తీవ్రత ఎలా ఉన్నాయి? అనే వాటిని బట్టి ఎస్ఎంఏను నాలుగు రకాలుగా వర్గీకరిస్తారు.

టైప్ 1: ఇందులో కండరాల బలహీనత 3-4 నెలల వయసు నుంచే మొదలవుతుంది. అరుదుగా కొందరికి పుట్టుకతోనే బలహీనత ఉండొచ్చు. ఈ పిల్లలు మెడ సరిగా నిలపలేరు. పాకటంలో ఇబ్బంది పడతారు. కూర్చోలేరు. తరచూ శ్వాస సమస్యలూ వేధిస్తుంటాయి. సరైన చికిత్స అందకపోతే ఇలాంటి పిల్లలు రెండేళ్లలోపే మరణించొచ్చు. దీనికి ప్రధాన కారణం శ్వాస తీసుకోవటానికి తోడ్పడే కండరాలు బలహీనం కావటం.


టైప్ 2: సాధారణంగా ఏడాదిన్నర వయసు వచ్చేసరికి కండరాల బలహీనత ఆరంభమవుతుంది. వీళ్లు తమంత తాము కూర్చోగలరు గానీ సొంతంగా నడవలేరు. దేనినైనా దన్నుగా పట్టుకొని లేవటానికీ కష్టపడతారు. వయసు పెరుగుతున్నకొద్దీ బలహీనత ఎక్కువవుతుంది. ఐదు, పదేళ్లు వచ్చేసరికి కూర్చునే సామర్థ్యాన్నీ కోల్పోతారు. శ్వాస కండరాల బలహీనత, వెన్నుపాము లోపాల మూలంగా జీవనకాలమూ తగ్గుతుంది.

టైప్ 3: ఇది ఏడాదిన్నర తర్వాత కనిపిస్తుంది. ఈ పిల్లలు తమంత తాము నడవగలరు గానీ కింద కూర్చొని లేవటానికి ఇబ్బంది పడతారు. మెట్లు ఎక్కటం, పరుగెత్తటమూ కష్టంగా ఉంటుంది. ఏళ్లు గడుస్తున్నకొద్దీ నడిచే సామర్థ్యమూ కొరవడుతుంది.

టైప్ 4: పెద్దవారిలో వచ్చే రకమిది. 30ల్లో, 40ల్లో దీని లక్షణాలు మొదలవుతుంటాయి. కాకపోతే బలహీనత అంత ఎక్కువగా ఏమీ ఉండదు.

కారణమేంటి?

సర్వైవల్ మోటార్ న్యూరాన్ 1 (ఎస్ఎంఎన్1) జన్యువులో తలెత్తే లోపమే ఎస్ఎంఏకు కారణం. వెన్నుపాములోని చలన నాడీ కణాలు సజీవంగా ఉండటానికి, సక్రమంగా పనిచేయటానికిది తోడ్పడుతుంది. శరీరంలోని వివిధ కండరాల కదలికలను నియంత్రించటంలో కీలక పాత్ర పోషించే ఎస్ఎంఎన్ ప్రొటీన్ దీన్నుంచే పుట్టుకొస్తుంది. ఈ జన్యువు లోపిస్తే ప్రొటీన్ తగినంత ఉత్పత్తి కాదు. దీంతో చలన నాడీ కణాలు క్రమంగా దెబ్బతింటూ వస్తాయి. ఫలితంగా మెదడు, కండరాల మధ్య సంకేతాల ప్రసారం ఆగిపోతుంది. ఇది క్రమంగా కండరాల బలహీనతకు, చచ్చుబడటానికి దారితీస్తుంది. ఎస్ఎంఏ వయసుతో పాటు ముదురుతూ వచ్చే సమస్య. అంటే పిల్లలు పెద్దగా అవుతున్నకొద్దీ బలహీనమవుతూ వస్తారన్నమాట. నిజానికి ఎస్ఎంఎన్1 జన్యు లోపాన్ని ఎస్ఎంఎన్2 అనే జన్యువు పాక్షికంగా భర్తీ చేయటానికి ప్రయత్నిస్తుంటుంది. అందువల్ల ఎస్ఎంఎన్2 జన్యు ప్రతుల సంఖ్యను బట్టి ఎస్ఎంఏ తీవ్రత ఆధారపడి ఉంటుంది. వీటి ప్రతులు ఎంత ఎక్కువగా ఉంటే జబ్బు తీవ్రత అంత తగ్గుతుంది.



ఏంటీ సమస్య?

స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ ఓ జన్యు సమస్య. ఇది వెన్నుపాములోని ప్రత్యేకమైన నాడీ కణాల (యాంటీరియర్ హార్న్ సెల్స్) మీద తీవ్ర ప్రభావం చూపుతుంది. కూర్చోవటం, నిల్చోవటం, పాకటం, నడవటం, మింగటం, శ్వాస తీసుకోవటం వంటి పనులకు సాయం చేసే కండరాలను నియంత్రించేవి ఈ కణాలే. ఇవి క్షీణించినా, మరణించినా కండరాలు క్రమంగా బలహీనమవుతూ వస్తుంటాయి. వీటి పనితీరు అస్తవ్యస్తమవుతుంది. దీంతో పిల్లలు కూర్చోవటం, లేవటం, నడవటం కష్టమవుతుంది. కొన్నిసార్లు శ్వాస తీసుకోవటం, మింగటమూ కష్టం కావొచ్చు. అదృష్టవశాత్తూ వీరిలో తెలివి తేటలు మామూలుగానే ఉంటాయి. కానీ కాళ్లూ చేతుల వంటి భాగాలు కదలికలు దెబ్బతింటాయి. మానసికంగా చురుకుగా, అప్రమత్తంగా ఉన్నప్పటికీ కండరాల బలహీనత మూలంగా అంత వేగంగా స్పందించలేరు.

లక్షణాలు ఇవీ

ఎస్ఎంఏ లక్షణాలు కూడా జబ్బు మొదలైన వయసు, తీవ్రతను బట్టి ఉంటాయి.

- **శిశువుల్లో:** కండరాలు, కాళ్లూ చేతులూ వదులుగా, వేలాడుతున్నట్టుగా ఉంటాయి (హైపోటోనియా). మెడ సరిగా నిలపకపోవటం, పక్కలకు దొర్లలేకపోవటం, బలహీనంగా ఏడ్వటం, పాలు సరిగా తాగకపోవటం, శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది వంటివి కనిపిస్తుంటాయి.
- **కాస్త పెద్ద పిల్లల్లో:** పడుకున్న తర్వాత లేచి కూర్చోవటానికి చాలా ఇబ్బంది పడతారు. కూర్చున్నప్పుడు ముందుకు వంగుతారు. దేనినైనా పట్టుకొని లేవటమూ ఇబ్బందే. నడవటమూ కష్టమే.
- **పెద్ద పిల్లల్లో:** నడుస్తున్నప్పుడు పక్కలకు ఊగటం, నేల మీది నుంచి లేవటానికి కష్టపడటం, మెట్లు ఎక్కటానికి, దిగటానికి ఇబ్బంది పడటం, చేతులు వణకటం వంటి లక్షణాలు ఉంటాయి.
- బలంగా దగ్గలేకపోవటం, తరచూ ఛాతీ ఇన్‌ఫెక్షన్లు రావటం.
- వీపు కండరాల బలహీనత మూలంగా పెద్ద పిల్లల్లో వెన్నెముక పక్కకు వంగటం (స్కోలియోసిస్).

తల్లిదండ్రులకు జన్యులోపమున్నా..

ఎస్ఎంఏ కారక జన్యు లోపం తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమిస్తుంది. అయితే తల్లిదండ్రులకు జన్యులోపమున్నా పిల్లలకు కచ్చితంగా రావాలనేమీ లేదు. తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరికి జన్యులోపముంటే పిల్లలకు జబ్బు రాదు. ఇద్దరికి జన్యులోపముంటే 25% ముప్పు పొంచి ఉంటుంది. అంటే ప్రతి నలుగురిలో ఒకరికి మాత్రమే జబ్బుగా మారుతుందన్నమాట. మిగతావారిలో జన్యులోపమున్నా ఆరోగ్యంగానే ఉంటారు. కాకపోతే పెద్దయ్యాక వీరి నుంచి పిల్లలకు జన్యులోపం సంక్రమించే అవకాశముంది.

నిర్ధారణ ఇలా

నాడుల పనితీరును తెలిపే నర్వ్ కండక్షన్ పరీక్ష ద్వారా ఎస్ఎంఏను నిర్ధారిస్తారు. అలాగే ఎంఎల్‌పీఏ అనే రక్త పరీక్ష కూడా అవసరమే. ఇందులో ఎస్ఎంఎన్1 జన్యువు లోపించినా, మార్పులు తలెత్తినా బయటపడతాయి. ఒకప్పుడు ఎస్ఎంఏ నిర్ధారణకు కండరం నుంచి చిన్న ముక్కను తీసి పరీక్షించేవారు. ఎంఎల్‌పీఏ రక్తపరీక్ష అందుబాటులోకి వచ్చాక దీని అవసరం తప్పింది. చాలా పాశ్చాత్య దేశాల్లో నవజాత శిశువులకు ముందస్తు పరీక్షల్లో భాగంగా ఎస్ఎంఏ పరీక్షనూ చేస్తున్నారు. దీంతో లక్షణాలు ఆరంభం కావటానికి ముందే జబ్బును పట్టుకోవటం సాధ్యమవుతోంది. జబ్బు ఆనవాళ్లు కనిపిస్తే సత్వరం చికిత్స మొదలెట్టటానికీ వీలవుతోంది.

అధునాతన చికిత్సల అండ

ఎస్ఎంఏను వీలైనంత త్వరగా గుర్తించి, చికిత్స ఆరంభించటం కీలకం. లేకపోతే కండరాలు బలహీనమై కూర్చోవటమే కష్టం కావొచ్చు. కొన్నిసార్లు ప్రాణాంతకంగానూ పరిణమించొచ్చు. గతంలో ఎస్ఎంఏకు దన్నుగా నిలిచే చికిత్స తప్ప గత్యంతరం ఉండేది కాదు. ఇప్పుడు జబ్బును మార్చేయగల చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. ఇవి చికిత్స తీరుతెన్నులనే గణనీయంగా మార్చేశాయి.

1. న్యూసినెర్సెన్: అన్నిరకాల ఎస్ఎంఏకు అనుమతి పొందిన తొలి ఔషధం ఇది. దీన్ని ఇంజెక్షన్ల రూపంలో వెన్నుపాములోకి ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతి నాలుగు నెలలకు ఒక మోతాదు ఇస్తే చాలు. ఇది ఎస్ఎంఎన్2 ప్రొటీన్ ఉత్పత్తిని పెంచటం ద్వారా జబ్బు అదుపులో ఉండటానికి తోడ్పడుతుంది. ఈ ఇంజెక్షన్లను పిల్లలు జీవితాంతం తీసుకోవాల్సి ఉంటుంది.

2. ఇంట్రావీనస్ జన్యు చికిత్స: దీన్ని జీవితంలో ఒక్కసారి తీసుకుంటే చాలు. ఇందులో కృత్రిమంగా తయారుచేసిన ఎస్ఎంఎన్1 జన్యు ప్రతిని రక్తనాళం ద్వారా రక్తంలో ప్రవేశపెడతారు. ఇది మెదడు, చలన నాడీ కణాలకు చేరుకుంటుంది. ఎస్ఎంఎన్1 ప్రొటీన్ ఉత్పత్తిని పెంచుతుంది. దీన్ని శిశువులకు, రెండేళ్ల లోపు పిల్లలకు ఇవ్వచ్చు.

3. రిస్డిప్లామ్: ఇది నోటి ద్వారా తీసుకునే మందు. పొడి రూపంలో ఉండే దీన్ని ద్రవరూపంలోకి మార్చి తీసుకోవాల్సి ఉంటుంది. రోజుకోసారి చొప్పున జీవితాంతం వాడుకోవాలి. శిశువుల దగ్గరి నుంచి పెద్దవాళ్ల వరకూ అన్నిరకాల ఎస్ఎంఏలకూ పనిచేస్తుంది.

4. ఇంట్రాథీకల్ జన్యు చికిత్స: ఇది ఇటీవలే అనుమతి పొందిన అధునాతన చికిత్స. దీన్ని నేరుగా వెన్నుపాములోకి ఇవ్వాల్సి ఉంటుంది. ఇందులోనూ కృత్రిమ ఎస్ఎంఎన్1 జన్యు ప్రతిని ఒంట్లోకి ప్రవేశపెడతారు. ఒకసారి తీసుకుంటే చాలు. దీన్ని 2-18 ఏళ్ల పిల్లలకు ఇవ్వచ్చు.

నిపుణుల బృందం అవసరం

నాడీ కండర బలహీనత చికిత్సకు రకరకాల నిపుణులు అవసరం. మందులతో పాటు మున్ముందు ఇతరత్రా సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తగా ఉండటం తప్పనిసరి. అందువల్ల నిపుణుల బృందం పర్యవేక్షణలో సమష్టిగా ప్రయత్నించాల్సి ఉంటుంది.

- వీరికి కండరాలు బలం పుంజుకోవటానికి, కదలికలు సాఫీగా సాగేలా చూడటానికి ఫిజికల్ థెరపీ, రిహాబిలిటేషన్ అవసరమవుతుంది.
- రాత్రిపూట బైప్యాప్ పరికరంతో శ్వాస సరిగా తీసుకునేలా చూసుకోవాల్సి ఉంటుంది.
- ఊపిరితిత్తుల నుంచి జిగురుద్రవం బయటకు వెళ్లటానికి, శ్వాస సరిగా తీసుకునేలా చూడటానికి, శ్వాస సమస్యల నివారణకు ఛాతీ ఫిజియోథెరపీ కూడా అవసరం.
- నిపుణుల సలహా మేరకు మంచి పోషకాహారం తీసుకోవటం ముఖ్యం. కండరాలకు సత్తువ లభించేలా, రోగనిరోధకశక్తి పెంపొందేలా ఆహారంలో మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది.
- వెన్నెముక, కీళ్లు బాగుండటానికి ఎముకల నిపుణుల తోడ్పాటు కావాలి. వంగిన వెన్నెముకను సరిచేయటమూ ముఖ్యమే.
- న్యుమోనియా వంటి శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల నివారణకు అవసరమైన టీకాలు ఇప్పించటం ముఖ్యం.

నివారించుకోవచ్చా?

పిల్లలు పుట్టిన తర్వాత ఎస్ఎంఏ నివారణ సాధ్యం కాదు కానీ పుట్టక ముందు జాగ్రత్త పడొచ్చు. కొత్తగా పెళ్లయి, సంతానం కోసం ప్రయత్నించేవారు ముందుగానే జన్యుపరీక్ష చేయించుకొని, లోపాన్ని గుర్తించొచ్చు. ఒకవేళ గర్భం ధరించినా ఉమ్మనీటిని పరీక్షించి, జన్యులోపాన్ని తెలుసుకోవచ్చు. ఒక జన్యుప్రతి తల్లి నుంచి, మరో ప్రతి తండ్రి నుంచి సంక్రమిస్తుంది. రెండింటిలో లోపముంటేనే బిడ్డకు జబ్బు లక్షణాలు మొదలవుతాయి. ఒక ప్రతిలోనే మార్పులుంటే ఆరోగ్యంగానే ఉంటారు. కాబట్టి వీటి ఆధారంగా గర్భాన్ని కొనసాగించాలో, వద్దో నిర్ణయించుకోవచ్చు.

- పుట్టిన తర్వాత నవజాత శిశువులకు ముందస్తు పరీక్ష కూడా ఒక మార్గమే. ఇది జన్యులోపాన్ని ఆపలేదు గానీ కండరాలు దెబ్బతినక ముందే చికిత్స ఆరంభిస్తే వైకల్యం బారినపడకుండా కాపాడుకోవచ్చు.

మెదడుకు కిడ్నీజబ్బు దెబ్బ

కిడ్నీజబ్బు ముదురుతున్నకొద్దీ విషయగ్రహణ సామర్థ్యం మరింతగా తగ్గుతున్నట్టు జామా పత్రికలో ప్రచురితమైన అధ్యయనం పేర్కొంటోంది. కిడ్నీజబ్బు దీర్ఘకాల సమస్య. ఇందులో కిడ్నీ పనితీరు క్రమంగా తగ్గుతూ వస్తుంటుంది. మూడు నెలల కన్నా ఎక్కువ కాలంగా కిడ్నీలు సరిగా పనిచేయకపోతే దీర్ఘకాల సమస్యగా పరిగణిస్తారు. సాధారణంగా కిడ్నీలు రక్తాన్ని శుద్ధిచేసి క్రియాటినైన్ వంటి వ్యర్థాలను మూత్రంలోకి పంపిస్తాయి. అలాగే కొన్ని రకాల ప్రొటీన్లనూ వడపోస్తాయి. అయితే ప్రొటీన్లు శరీరానికి అత్యవసరం. అందువల్ల వీటిని తిరిగి రక్తంలోకి చేరవేస్తాయి. కిడ్నీ జబ్బులో ఈ ప్రక్రియ అస్తవ్యస్తమవుతుంది. దీంతో మూత్రంలో ప్రొటీన్ల మోతాదు పెరుగుతుంది. అందుకే కిడ్నీ పనితీరును తెలుసుకోవటానికి మూత్రంలో ప్రొటీన్, క్రియాటినైన్ నిష్పత్తి (యూపీసీఆర్) పరీక్ష చేస్తుంటారు. ఈ నిష్పత్తి ఎక్కువగా ఉండటం వల్ల ఏకాగ్రత, పనుల్లో వేగం తగ్గటం వంటి సమస్యలు తలెత్తుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. కిడ్నీజబ్బుతో రక్తపోటు పెరుగుతుంది. ఇది మెదడులో రక్తనాళాలను దెబ్బతీయటం విషయగ్రహణ సామర్థ్యం తగ్గే ముప్పు పెరగటానికి కారణమవుతుండొచ్చని భావిస్తున్నారు.



నిద్రలేమితో హఠాత్తుగా ముందస్తు మధుమేహం




నిద్ర సరిగా పట్టక ఇబ్బంది పడుతున్నారా? అయితే వెంటనే సరిచేసుకోండి. ఎందుకంటే నిద్రలేమి మూలంగా ఆరోగ్యవంతులు రాత్రికి రాత్రే ముందస్తు మధుమేహం (ప్రిడయాబిటిస్) బారినపడే అవకాశమున్నట్టు జర్నల్ ఆఫ్ గ్లోబల్ హెల్త్‌లో ప్రచురితమైన దీర్ఘకాల అధ్యయనం హెచ్చరిస్తోంది. ముందస్తు మధుమేహంలోనూ రక్తంలో గ్లూకోజు మోతాదులు పెరుగుతాయి. కాకపోతే మధుమేహంగా గుర్తించేంత స్థాయిలో ఉండవు. ఇది మున్ముందు పూర్తిస్థాయి మధుమేహంగా మారే ప్రమాదముంది. కాబట్టి కంటి నిండా నిద్రపోయేలా చూసుకోవటం మంచిదని పరిశోధకులు సూచిస్తున్నారు. వేళకు పడుకోకపోవటం, రాత్రిపూట తరచూ మెలకువ రావటం, నిద్ర సరిగా పట్టకపోవటం మూలంగా గ్లూకోజు మోతాదులను నియంత్రించే హార్మోన్లు అస్తవ్యస్తమవుతాయి. దీంతో పరగడుపున రక్తంలో గ్లూకోజు మోతాదులు పెరుగుతాయి. ఇన్సులిన్ హార్మోన్‌కు కణాలు స్పందించటమూ తగ్గుతుంది. దీంతో కణాల్లోకి గ్లూకోజు సరిగా వెళ్లదు. ఇది రక్తంలోనే ఉండిపోతుంది.

ఈ చిరుతిళ్లు పొగాకుతో సమానం!

చిప్స్ ప్యాకెట్ తెరిస్తే అయిపోయేదాకా నోరు ఆగదు. కూల్‌డ్రింక్ బాటిల్ మూత తీస్తే మొత్తం ఖాళీ కావాల్సిందే. ఇది స్వీయ నియంత్రణకు మాత్రమే సంబంధించింది కాదని, మళ్లీ మళ్లీ తినేలా పురికొల్పే విధానాలూ కారణమేనని తాజా అధ్యయనం సూచిస్తోంది. ఒకప్పుడు పొగాకు కంపెనీలు ఉపయోగించిన వ్యూహాలనే చిప్స్, కుకీస్ వంటి పలు అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్ విషయంలోనూ అనుసరిస్తున్నారని హార్వర్డ్ యూనివర్సిటీ, డ్యూక్ యూనివర్సిటీ పరిశోధకులు గుర్తించారు. ప్యాకెట్లలో అమ్మే చిప్స్ వంటి చిరుతిళ్లు, తీపి పానీయాలు, ఫాస్ట్ ఫుడ్ పదార్థాల వంటివన్నీ అల్ట్రా ప్రాసెస్డ్ ఆహారాల కిందికే వస్తాయి. చాలా రుచిగా ఉండటం కోసం బాగా శుద్ధి చేసిన పిండి పదార్థాలు, అదనపు కొవ్వులు, ఉప్పు, రుచి కారకాల వంటి వాటితో వీటిని తయారుచేస్తారు. ఏదైనా ఒక పనిచేసినప్పుడు ఆనందాన్ని బహుమతిగా ఇచ్చే మెదడులోని భాగాన్ని బలంగా ప్రేరేపించే విధంగా వీటిని ఉత్పత్తి చేస్తుంటారు. దీంతో మళ్లీ మళ్లీ, ఎక్కువెక్కువగా తినాలనే కోరిక కలుగుతుంది. అంటే ఈ చిరుతిళ్లు పొగాకు మాదిరిగానే మనిషిని లోబరచుకుంటున్నాయన్నమాట. ఒకరకంగా ఇవి వ్యసనంగానూ మారుతున్నాయనీ అనుకోవచ్చు. కాబట్టి జాగ్రత్తగా ఉండటం అవసరమని పరిశోధకులు అన్యాపదేశంగా సూచిస్తున్నారు.

క్లోమ క్యాన్సర్ నయం!

క్లోమ క్యాన్సర్ చికిత్సలో స్పెయిన్ పరిశోధకులు గొప్ప విజయం సాధించారు. కొత్తగా మూడు మందుల వినూత్న చికిత్సను కనుగొన్నారు. ఇది ఎలుకల్లో క్లోమ కణితులను పూర్తిగా నిర్మూలించటం గమనార్హం. కణితులు తిరగబెట్టకపోవటం, దుష్ప్రభావాలూ పెద్దగా లేకపోవటం విశేషం. క్లోమ క్యాన్సర్ చాలావరకూ బాగా ముదిరిన తర్వాతే బయటపడుతుంటుంది. వేగంగా విస్తరిస్తుంటుంది. దీని బారినపడ్డవారిలో ఐదేళ్ల కన్నా ఎక్కువకాలం జీవించేవారు 10% కన్నా తక్కువే. క్యాన్సర్ చాలా తెలివైంది. ఒక మార్గం మూసుకుపోతే కణితి కణాలు తమ మనుగడ కోసం మరో మార్గాన్ని సృష్టించుకుంటాయి. దీన్ని అడ్డుకోవటానికే స్పెయిన్ పరిశోధకులు ఒకేసారి మూడు మార్గాలను అడ్డుకునే వ్యూహాన్ని రూపొందించారు. తొలి మందు (డారాక్సోన్‌రసిబ్) కణితి వృద్ధిని ప్రోత్సహించే క్రాస్ జన్యువు సంకేతాలను నిలువరిస్తుంది. రెండో మందు (అఫటినిబ్) ఈజీఎఫ్ఆర్, హెచ్ఈఆర్2 మార్గాలను మూసేస్తుంది. క్రాస్ మీద దాడిచేసే చికిత్సల నుంచి తప్పించుకోవటానికి క్లోమ కణితులు ఈ మార్గాలనే ఎంచుకుంటాయి మరి. ఇక మూడో మందు (ఎస్‌డీ36) క్యాన్సర్ కణాలు ఒత్తిడిని, చికిత్సలను ఎదుర్కోవటానికి వాడుకునే స్టాట్3 అనే బ్యాకప్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తాయి. ఈ మందులన్నింటినీ కలిపి ఎలుకలకు ఇవ్వగా గణనీయమైన ఫలితాలు కనిపించాయి. క్లోమ కణితులు పూర్తిగా కుంచించుకుపోయాయి. చికిత్సను ఆపేసిన 200 రోజుల తర్వాత కూడా అవి తిరగబెట్టలేదు. మరో మంచి విషయం- ఎలుకలు మందులను బాగా తట్టుకోవటం. వీటిల్లో తీవ్రమైన దుష్ప్రభావాలేవీ తలెత్తలేదు. అందుకే ఈ ఫలితాల ఆధారంగా మనుషుల మీద ప్రయోగ పరీక్షలు నిర్వహించటంపై పరిశోధకులు దృష్టి సారించారు.




కీమో మంచీ చెడూ

క్యాన్సర్ చికిత్సలో కీమోథెరపీ ప్రత్యేకతే వేరు. విచ్చల విడిగా వృద్ధి చెందే క్యాన్సర్ కణాలను ఆపటం శరీరానికి కష్టమైన పనిగా మారుతుంది. ఇక్కడే కీమోథెరపీ ఆదుకుంటుంది. ఇది క్యాన్సర్ కణాలను చంపుతుంది. వృద్ధి చెందటాన్ని నిలువరిస్తుంది. సాధారణంగా ఇవి వేగంగా వృద్ధి చెందే కణాలను లక్ష్యంగా చేసుకుంటాయి. ఈ క్రమంలో చాలా కీమో మందులు మామూలు కణాల మీదా దాడి చేస్తుంటాయి. ఫలితంగా అవాంఛిత దుష్ప్రభావాలూ తలెత్తుతుంటాయి.

మన శరీరంలోని చాలా కణాలు విభజన చెంది, కొత్త కణాలుగా వృద్ధి చెందుతుంటాయి. పాత కణాల భర్తీకి, దెబ్బతిన్న కణాల మరమ్మతుకివి అవసరం. కొన్ని ఆరోగ్యకణాలు తరచూ వృద్ధి చెందుతాయి. పేగుల గోడల్లోని కణాలు, వెంట్రుకల ఎదుగుదలకు తోడ్పడే కణాలు ఇలాంటివే. కీమోథెరపీ మందులు ఇలాంటి కణాలనూ చంపగలవు. ఇదే దుష్ప్రభావాలకు దారితీస్తుంటుంది. వీటిల్లో ఎక్కువగా కనిపించేవి- వికారం, వాంతి, నోట్లో పుండ్లు, అలసట, జుట్టు ఊడటం. క్యాన్సర్ బాధితుల్లో ఎలాంటి దుష్ప్రభావాలు తలెత్తుతాయనేది క్యాన్సర్ రకం, కీమో మందుల వంటి అంశాల మీద ఆధారపడి ఉంటుంది.

- ఇన్‌ఫెక్షన్లు, జబ్బులతో శరీరం పోరాడటానికి తెల్ల రక్తకణాలు సాయం చేస్తాయి. కీమోతో వీటి సంఖ్య తగ్గొచ్చు. దీంతో ఇన్‌ఫెక్షన్ల బారినపడే ముప్పు పెరుగుతుంది.
- కొన్ని కీమో మందులు నాడులనూ దెబ్బతీసే ప్రమాదముంది. దీన్నే కీమోథెరపీ ఇండ్యూస్డ్ పెరిఫెరల్ న్యూరోపతీ (సీఐపీఎన్) అంటారు. ఇది నొప్పి, పొడుస్తున్నట్టు అనిపించటం, మొద్దుబారటం, తూలటం వంటి వాటికి కారణమవుతుంది.



అదుపులో ఉంచే మార్గాలూ

కీమోథెరపీ దుష్ప్రభావాలను అదుపులో ఉంచే మార్గాలూ అందుబాటులో ఉన్నాయి. వికారం, వాంతి తగ్గటానికి మందులు ఎంతగానో ఉపయోగపడతాయి. ఆహారంలో మార్పులు చేసుకోవటం ద్వారా వికారం, నీరసం, నోట్లో పుండ్లను నియంత్రించుకోవచ్చు. కొన్నిరకాల నొప్పులకు మందులు కూడా అందుబాటులో ఉన్నాయి.

- కీమో దుష్ప్రభావాలను మరింతగా తగ్గించటానికీ శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. వికారం, వాంతి తగ్గటానికి ఆక్యుపంక్చర్ తోడ్పడగలదని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఆక్యుపంక్చర్‌లో సన్నటి సూదులను గుచ్చటం ద్వారా ఒంట్లో ఆయా భాగాలను ఉత్తేజితం చేస్తుంటారు. వికారం తగ్గటానికి అల్లం వంటి వంటింటి దినుసులు ఉపయోగపడతాయేమో కూడా పరీక్షిస్తున్నారు.
- కీమోతో ముడిపడిన నొప్పులకు ఆక్యుపంక్చర్, యోగా తోడ్పడుతున్నట్టు కొన్ని పరిశోధనల్లో తేలింది. యోగాలో ఆసనాలతో పాటు ప్రాణాయామం, ధ్యానం అంతర్భాగాలు. ఇలాంటి పురాతన పద్ధతులతో పెద్దగా దుష్ప్రభావాలేవీ ఉండకపోవటం పరిశోధకులను ఆకట్టుకుంటోంది. ఆక్యుపంక్చర్‌లో కొద్దిగా రక్తస్రావం, చర్మం కమలటం వంటివి తప్ప ఇబ్బందులేవీ ఉండవు. యోగాతో ఆరంభంలో కీళ్ల, కండరాల నొప్పులు ఉండొచ్చు. క్రమంగా ఇవీ తగ్గుతాయి.
- సీఐపీఎన్‌కు దారితీస్తున్న కణపరమైన అంశాల మీదా కొందరు పరిశోధకులు దృష్టి సారించారు. వీటి మీద పనిచేసే మందులనూ పరీక్షిస్తున్నారు.

సందేహ నివృత్తి చేసుకోవాలి

క్యాన్సర్ బాధితులు కీమోథెరపీకి సిద్ధమయ్యే ముందు డాక్టర్‌ను అడిగి అన్ని సందేహాలను నివృత్తి చేసుకోవటం మంచిది. అడగాల్సిన ప్రశ్నల్లో కొన్ని ఇవీ..

- క్యాన్సర్ రకం, చికిత్స తీరును బట్టి ఎలాంటి దుష్ప్రభావాలు తలెత్తే అవకాశముంది?
- దుష్ప్రభావాలు ఎప్పుడు మొదలవుతాయి? ఎంతకాలం కొనసాగుతాయి?
- ఎలాంటి లక్షణాలు, సంకేతాలు కనిపిస్తే డాక్టర్‌ను సంప్రదించాలి?
- దుష్ప్రభావాలను తగ్గించుకోవటానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?
- ఏయే మందులు పనిచేస్తాయి?
- ఏయే పదార్థాలు, పానీయాలు తీసుకోవాలి? ఏవి తీసుకోకూడదు?
- మరింత మంచి సలహా కోసం నిపుణులను ఎవరినైనా సంప్రదించాలా?

ఉదయాన్నే కీళ్ల బిగువు

ఉదయం లేస్తూనే కీళ్లు బిగుసుకున్నట్టు, నొప్పి పుడుతున్నట్టు అనిపించగానే వృద్ధాప్యం, పాత పరుపు, సరిగా నిద్ర పట్టకపోవటం వంటి వాటిని నిందించటం తెలికే. కానీ ఇబ్బందులు తరచూ వేధిస్తుంటే జబ్బులకు సంకేతం కావొచ్చని అనుమానించాలి. వయసు మీద పడటంతో కీళ్లు అరగటం (ఆస్టియోఆర్థ్రయిటిస్), కీళ్లవాతం (రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్), సోరియాసిస్‌తో ముడిపడిన ఆర్థ్రయిటిస్, యాంకీలోజింగ్ స్పాండిలైటిస్ వంటి సమస్యలేవైనా వీటికి కారణం కావొచ్చు. ఆస్టియోఆర్థ్రయిటిస్‌లో కీళ్లు బిగుసుకోవటంలో పెద్ద ఆశ్చర్యమేమీ లేదు. మన కీళ్లు ఒకదాంతో మరోటి ఒరుసుకుపోకుండా చూడటానికి వీటి మధ్య మెత్తటి రబ్బరులాంటి మృదులాస్థి (కార్టిలేజ్) ఉంటుంది. ఇది వయసు మీద పడుతున్నకొద్దీ పొడిబారుతుంటుంది. మరోవైపు మోకీళ్లు తేలికగా కదలటానికి తోడ్పడే జిగురుద్రవం (సైనోవియల్ ఫ్లూయిడ్) ఉత్పత్తీ తగ్గుతుంది. కొన్నిసార్లు ఈ ద్రవాన్ని 'ఉదయపు జెల్' అనీ అంటారు. ఎందుకంటే కొద్ది గంటల వరకూ కదలకుండా ఉంటే ఇది జెలటిన్ మాదిరిగా మారి కీళ్లు బిగుసుకుంటాయి. ఇక కీళ్లవాతం, సోరియాటిక్ ఆర్థ్రయిటిస్, యాంకీలోజింగ్ స్పాండిలైటిస్ సమస్యలో కీళ్ల బిగువుకు వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) కారణమవుతుంటుంది. వయసుతో కీళ్లు అరగటానికీ కీళ్లవాతం వంటి ఇతర సమస్యలకూ మధ్య తేడా ప్రధానమైన తేడా బిగువు, నొప్పి ఎంతసేపు ఉంటాయనేదే. వయసుతో కీళ్లు అరిగినవారిలో కొద్ది నిమిషాలే ఉంటాయి. కదులుతున్నకొద్దీ తగ్గుతూ వస్తాయి. అదే వాపుతో ముడిపడిన సమస్యల్లో కొన్ని గంటల వరకూ విడవకుండా వేధిస్తుంటాయి.

- యాంకీలోజింగ్ స్పాండిలైటిస్‌లో ఉదయాన్నే శరీరం బిగుసుకోవటం ప్రధాన లక్షణం. ఇది ముఖ్యంగా వెన్నెముక, తుంటి, మోకీళ్లను ప్రభావితం చేస్తుంది. ఇందులో నడుం, మెడ ఎక్కువగా బిగుసుకుంటుంటాయి. ఆస్టియోఆర్థ్రయిటిస్, రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్‌లో మాదిరిగానే ఇందులోనూ ఎక్కువసేపు విశ్రాంతి తీసుకున్నప్పుడు బిగువు మరింత ఎక్కువవుతుంది.
- థైరాయిడ్ జబ్బు, విటమిన్ డి లోపం, ఫైబ్రోమయాల్జియా, ఊబకాయం మూలంగానూ ఉదయం పూట శరీరం బిగుసుకోవచ్చు.

డాక్టర్ సలహా తీసుకోవాలి: మూడు రోజుల కన్నా ఎక్కువగా ఉదయం పూట కీళ్లు బిగుసుకోవటం, నొప్పి తీవ్రంగా ఉన్నట్టయితే డాక్టర్‌ను సంప్రదించటం మంచిది. తగు పరీక్షలు చేసి కారణాన్ని గుర్తిస్తారు. వయసుతో కీళ్లు అరిగితే నొప్పి మందులు సూచిస్తారు. కీళ్లవాతం వంటి సమస్యలకైతే వాపుప్రక్రియను అణచిపెట్టే మందులు ఉపయోగపడతాయి. ఇప్పుడు బయాలాజిక్స్ వంటి అధునాతన మందులు సత్వరం ఉపశమనం కలిగిస్తున్నాయి. మందులతో పాటు యోగా, తేలికైన వ్యాయామాలు, బరువు తగ్గటం, మానసిక ఒత్తిడిని అదుపులో ఉంచుకోవటం, ఫిజియోథెరపీ కూడా అవసరమవుతాయి.

ఈనాడు సినిమా

బాఫ్టా వేడుకలో అలియా హొయలు


అలియా భట్

అందాల తార అలియా భట్ అంతర్జాతీయ వేదికపై మెరిసి అభిమానుల్ని అలరించింది. ఆమె లండన్‌లో ఆదివారం జరిగిన బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్(బాఫ్టా)79వ ఎడిషన్ అవార్డుల వేడుకలో ప్రెజెంటర్‌గా వ్యవహరించింది. తొలిసారి ఈ వేడుకకు హాజరై రెడ్ కార్పెట్‌పై హొయలొలికించిన అలియా.. వేదికపై తన ప్రసంగాన్ని 'నమస్కార్' అంటూ హిందీలో ప్రారంభించి అందరిదృష్టిని ఆకర్షించింది. ఈ సందర్భంగా అలియా మాట్లాడుతూ.. "కెమెరా ముందు నిల్చున్నప్పుడు తెలియని ఆనందం. సినీపరిశ్రమలోకి రావడం నిజంగా ఒక వరం. నటన నా బాధ్యత. దాని పట్ల నేను ఎప్పుడూ కృతజ్ఞతతో ఉంటాను. సినిమాను ఆస్వాదించడానికి భాషతో సంబంధం లేదు. ఎందుకంటే సినిమాను నడిపించేది భాష కాదు భావోద్వేగం"అని చెప్పింది. అలానే ప్రస్తుతం తన కుమార్తె రాహా తనలో ఎంతో స్ఫూర్తిని నింపుతోందని అంది. గత సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా చలనచిత్ర రంగంలో మరణించిన ప్రముఖులను ఈ వేదికపై గుర్తుచేసుకున్నారు. అందులో భాగంగా భారతీయ సినీ దిగ్గజం దివంగత నటుడు ధర్మేంద్రకు హృదయపూర్వక నివాళి అర్పించారు.

భారతీయ చిత్రం 'బూంగ్'కు పురస్కారం

చిత్ర దర్శకురాలికి ప్రశంసలు

తన తొలి చిత్రం 'బూంగ్'తో ప్రతిష్ఠాత్మకమైన బాఫ్టా పురస్కారాలలో అవార్డు సాధించి రికార్డు సృష్టించారు దర్శకురాలు లక్ష్మీప్రియ దేవి. 'బెస్ట్ చిల్డ్రన్ అండ్ ఫ్యామిలీ' విభాగంలో ఈ చిత్రం అవార్డును సొంతం చేసుకుంది. ఈ సినిమా నామినేషన్ బరిలో ఉన్న హాలీవుడ్ చిత్రాలు 'లిలో అండ్ స్టిచ్, 'జూటోపియా 2'లతో పోటీపడి గెలిచిన తొలి భారతీయ చిత్రంగా సత్తా చాటింది. ఈశాన్య రాష్ట్రాల నుంచి 'బాఫ్టా' అందుకున్న తొలి వ్యక్తిగా నిలిచారు లక్ష్మీప్రియ.

బూంగ్ కథేంటి?

'బూంగ్' ఒక సున్నితమైన కథాంశంతో తెరకెక్కిన చిత్రం. ప్రాంతీయ సంఘర్షణల మధ్య ఓ బాలుడి భావోద్వేగ ప్రయాణమే ఈ చిత్రం. తమ నుంచి విడిపోయిన తండ్రిని ఇంటికి తీసుకురావడమే తల్లికి ఓ గొప్ప బహుమతి అని భావించే బూంగ్ అనే బాలుడి కథ ఇది. చిన్నవయసులో అమాయకత్వంతో అతను చేసే సాహసోపేతమైన ప్రయత్నాల చుట్టూ తిరిగే కథాంశంతో ఈ సినిమా రూపొందింది. ఇందులో గుగున్ కిప్గెన్, బాలా హిజామ్, విక్రమ్ కొచ్చర్ కీలక పాత్రలు పోషించారు. తన బాల్యంలో అనేక రాజకీయ అలజడులుండేవని.. ఈశాన్య భారతదేశంలో బహిర్గతం కాని ప్రాంతం నేపథ్యంలో ప్రాంతీయ భాషా చిత్రంగా ఈ సినిమాని తెరకెక్కించినట్లు ఓ ఇంటర్వ్యూలో తెలిపారు దర్శకురాలు.

ఎవరీ లక్ష్మీప్రియ?


మణిపుర్‌కు చెందిన లక్ష్మీప్రియ దేవి తొలుత సామాజిక స్పృహతో కూడిన కథలు, రాజకీయ సంఘర్షణలను అన్వేషిస్తూ ఆలోచింపజేసే లఘు చిత్రాలు, డాక్యుమెంటరీలు రూపొందించేవారు. హృతిక్ రోషన్, అమితాబ్ బచ్చన్ ప్రధాన పాత్రల్లో ఫర్హాన్ అక్తర్ తెరకెక్కించిన 'లక్ష్య' సినిమాతో దర్శకత్వ విభాగంలో చేరి బాలీవుడ్‌లో తన ప్రయాణాన్ని మొదలుపెట్టారు. 'స్వదేశ్', 'పీకే', 'తలాశ్' నుంచి ఇటీవల వచ్చిన 'దూస్రా' లాంటి పలు చిత్రాలకు దర్శకత్వ శాఖలో పని చేశారు. ఆమె రచించి, దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'బూంగ్'. గతేడాది సెప్టెంబరులో విడుదలై ప్రేక్షకులను అలరించింది. ఇప్పటికే ఈ చిత్రం పలు చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై అవార్డులను గెలుచుకుంది.

ఇది నా మాతృభూమికి నివాళి


గుగున్ కిప్గెన్

ఈ చిత్రం బాఫ్టా పురస్కారం గెలుచుకోవడంతో లక్ష్మీప్రియ దేవి వేదికపై మాట్లాడారు. 'ఇక్కడి వరకు చేసిన ప్రయాణం..ఎక్కుతున్నామని కూడా తెలియని ఓ పర్వత శిఖరాన్ని చేరుకోవడానికి తుది మెట్టులా అనిపిస్తుంది. మణిపుర్‌లో శాంతి తిరిగి రావాలని చెప్పడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అనుకుంటున్నాం. క్షమాపణను కూడా నాశనం చేసేంత బలమైన సంఘర్షణలు ఎప్పుడూ ఉండకూడదు అని కోరుకుంటున్నాము. మణిపుర్‌లో చాలా సమస్యాత్మకమైన.. నిర్లక్ష్యానికి గురైన ప్రాంతం నేపథ్యంలో రూపుదిద్దుకుంది చిత్రం. సినిమాలోని బాల నటులతో సహా నిజ జీవితంలోని పిల్లలందరూ తమ ఆనందాన్ని, అమాయకత్వాన్ని వారి కలలతో తిరిగి పొందాలి. మా చిన్న చిత్రానికి ఇంతటి ప్రేమని ఇచ్చినందుకు, అవార్డునే కాకుండా ఈ వేదికపై మాట్లాడే అవకాశాన్ని కల్పించిన బాఫ్టాకి ధన్యవాదాలు. ఈ పురస్కారం నా మాతృ భూమికి నివాళి" అని ఆమె అన్నారు. 'బూంగ్ విజయం మణిపుర్‌కే కాదు దేశానికే గర్వకారణమ'ని అన్నారు మణిపుర్ ముఖ్యమంత్రి వై.ఖేమ్‌చంద్. బాఫ్టా వేడుకకు దర్శకురాలితో పాటు నిర్మాతలు ఫర్హాన్ అక్తర్, రితేష్ సిధ్వానీ, అలెన్ మెక్ అలెక్స్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫర్హాన్ చిత్రబృందానికి కృతజ్ఞతలు తెలుపుతూ తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఇన్‌స్టాలో పోస్టులు పంచుకున్నారు.


అలెన్, ఫర్హాన్ అక్తర్, లక్ష్మీప్రియ, రితేశ్ సిధ్వానీ


అమితాబ్ బచ్చన్

హైదరాబాద్‌లో అశ్వత్థామ సందడి


కథానాయకుడు ప్రభాస్.. దర్శకుడు నాగ్ అశ్విన్ కలయికలో వచ్చిన 'కల్కి 2898ఏడీ' పాన్ ఇండియా స్థాయిలో సత్తా చాటిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ సినిమాకి కొనసాగింపుగా రెండో భాగం చిత్రీకరణ మొదలైంది. ప్రస్తుతం హైదరాబాద్ సమీపంలోని శంకర్‌పల్లిలో సిద్ధం చేసిన ప్రత్యేక సెట్‌లో అమితాబ్ బచ్చన్‌పై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారు. ఈనెలాఖరు నుంచి కొద్దిరోజుల పాటు ప్రభాస్ కూడా ఈ చిత్రీకరణలో పాలుపంచుకోనున్నట్లు సమాచారం. కమల్‌హాసన్ మార్చి తర్వాత సెట్‌లోకి వచ్చే అవకాశమున్నట్లు తెలిసింది. ప్రభాస్ ఇందులో కర్ణగా.. భైరవగా రెండు పాత్రల్లో అలరించనున్నారు. అశ్వత్థామగా అమితాబ్, సుప్రీం యాస్కిన్‌గా కమల్ నటిస్తున్నారు. ఇక తొలి భాగంలో దీపిక పదుకొణె చేసిన సుమతి పాత్రను ఈ రెండో భాగంలో ఎవరు పోషిస్తారన్నది తేలాల్సి ఉంది. వైజయంతీ మూవీస్ సంస్థ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతమందిస్తున్నారు.

ఓటీటీలో ఈ వారం

నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్ కోసం కొత్త కథల్ని సిద్ధం చేశాయి ఓటీటీ వేదికలు. ఎప్పటిలాగే ఈ వారాంతం కూడా వినోదాలు పంచడానికి రెడీ అంటున్నాయి. వైవిధ్యమైన సిరీస్‌లు, అదిరిపోయే సినిమాల్ని ప్రేక్షకులకు అందుబాటులోకి తీసుకొచ్చి.. ఫిబ్రవరి నెలకు సెండాఫ్ ఇవ్వనున్నాయి.

సంగమర్మార్ (సిరీస్)	గురువారం	జియోహాట్‌స్టార్
శ్రీ చిదంబరంగారు(చిత్రం)	గురువారం	ఈటీవీ విన్
అక్యూజ్డ్(చిత్రం)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్
రోస్లిన్ (సిరీస్)	శుక్రవారం	జియోహాట్‌స్టార్
నీలి హక్కీ(చిత్రం)	శుక్రవారం	సన్‌నెక్స్ట్
బుగోనియా(చిత్రం)	శనివారం	జియోహాట్‌స్టార్

వెంటాడే 'హనీ'



సైన్స్ కొత్త పుంతలు తొక్కుతున్న ఈ కాలంలోనూ.. క్షుద్ర పూజల దారుల్లో పయనిస్తూ సొంత కుటుంబాల్నే బలి తీసుకుంటున్నారు. ఆ కోవకు చెందినదే 'హనీ' చిత్రం. నవీన్ చంద్ర, దివ్య పిళ్లై జంటగా నటించిన చిత్రమిది. కరుణ కుమార్ దర్శకత్వం వహించారు. ఇటీవలే విడుదలైన ఈ డార్క్ సైకలాజికల్ థ్రిల్లర్ ప్రేక్షకుల్ని అలరించింది. ఇందులో క్షుద్ర పూజలు చేసే వ్యక్తిగా కనిపించి ఆకట్టుకున్నారు నవీన్ చంద్ర. ఇప్పుడీ సినిమా శుక్రవారం నుంచి సన్‌నెక్స్ట్ వేదికగా అలరించడానికి సిద్ధమైంది. మరి "కొన్ని భయాలు తగ్గవు.. వెంటాడుతూనే ఉంటాయి" అంటూ సినీప్రియుల దృష్టిని ఆకర్షిస్తున్న ఈ 'హనీ' కథేంటో మీరూ చూసేయ్యండి.

బంగారం కన్నా విలువైంది నా కోరిక



"నేను కోరుకునే వరం.. బంగారం కంటే ఎక్కువ విలువైంది" అంటూ ఇటీవలే 'ది బ్లఫ్' ప్రపంచాన్ని పరిచయం చేసింది కథానాయిక ప్రియాంక చోప్రా. ఆమె ప్రధాన పాత్రలో నటించిన హాలీవుడ్ చిత్రమిది. ఫ్రాంక్ ఇ. ఫ్లవర్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం బుధవారం నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా ప్రేక్షకుల ముందుకు రానుంది. 'సముద్రానికి కూడా నియమాలు ఉంటాయి.. కానీ వాటిని ఆమె ఉల్లంఘించింది" అంటూ విడుదలైన ట్రైలర్ సినీప్రియుల్ని ఆకట్టుకుంది. ఇందులో మేరి అనే సముద్రపు దొంగ పాత్రలో కనిపించనుంది ప్రియాంక.

'మా' డైరీ ఆవిష్కరణ


శివ బాలాజీ, భట్టి విక్రమార్క, విష్ణు, మాదాల రవి

సభ్యులైన నటుల సంక్షేమం కోసం మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) కార్యవర్గం చేపడుతున్న కార్యక్రమాలు చాలా బాగున్నాయని అభినందించారు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. ఆరోగ్య పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమైనవని ఆయన అన్నారు. సోమవారం ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క 'మా' కొత్త డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 'మా' చేపడుతున్న కార్యక్రమాల గురించి అధ్యక్షుడు మంచు విష్ణుని అడిగి తెలుసుకుని అభినందించారు. ఈ కార్యక్రమంలో 'మా' ఉపాధ్యక్షుడు మాదాల రవి, కోశాధికారి శివ బాలాజీతో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పవునుతాయి హంగామా ఆరంభం


రాధికా శరత్‌కుమార్

ఊర్లో రుణాలిచ్చే పవునుతాయి అనే వృద్ధురాలు.. తన ఆస్తిని తన పిల్లలకు ఇవ్వడానికి ఒప్పుకోవట్లేదు. ఆస్తులు మాకు పంచిచ్చి.. ఒక్కొక్కరి ఇంట్లో ఆరు నెలలు ఉంటూ వృద్ధాప్య జీవితం గడపమని కొడుకులు ఆమెతో పంతానికి దిగారు. అయినా ఎక్కడా తగ్గకుండా మరణించే వరకూ ఆ సంపదనంతా తానే ఉపయోగించుకుంటానని శపథం చేస్తుంది పవునుతాయి. ఇంతకీ ఆమె ఎవరు? మరణానికి చేరువలో ఉన్న ఆమెకు ఆస్తిపై అంత మమకారం ఎందుకు? అనేది తెలుసుకోవాలంటే 'తాయి కిళవి' సినిమా చూడాల్సిందే. రాధికా శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రమిది. శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహించారు. హీరో శివకార్తికేయన్ సొంత నిర్మాణ సంస్థలో రూపొందిందీ చిత్రం. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను 'పవునుతాయి హంగామా ఆరంభం' అనే వ్యాఖ్యతో విడుదల చేసింది చిత్ర బృందం. ఇందులో పవునుతాయి అనే వృద్ధురాలిగా సరికొత్తగా కనిపిస్తూ ఆకట్టుకుంటోంది రాధిక. ఈ నెల 27న విడుదల కానుందీ చిత్రం.

రాజకీయాలు వద్దు.. వినోదమే కావాలన్నారు!


హరీశ్‌శంకర్

ఏ ఒక్కరినీ కించపరిచే సంభాషణలు కానీ, చిన్నబుచ్చుకునేలా చేసే సన్నివేశాలు కానీ 'ఉస్తాద్ భగత్‌సింగ్'లో ఉండవన్నారు ఆ చిత్ర దర్శకుడు హరీశ్‌శంకర్. సినిమాలు వేరు, రాజకీయాలు వేరని పవన్‌కల్యాణ్ నమ్మడంతోపాటు, అదే మార్గాన్నే అనుసరిస్తుంటారని అందుకు తగ్గట్టే సినిమా ఉంటుందన్నారు. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా హరీశ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమే... 'ఉస్తాద్ భగత్‌సింగ్. మార్చి 26న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఆదివారం ఇందులోని ఆరా ఆఫ్ ఉస్తాద్... పాట విడుదలైంది. ఈ సందర్భంగా హరీశ్ సోమవారం ఓ ప్రత్యేకమైన వీడియోను విడుదల చేశారు. "పవన్‌కల్యాణ్ వ్యక్తిత్వానికి, ఆయన నడవడికకు దగ్గరగా ఉండే ఈ పాటకి లభిస్తున్న స్పందన ఎంతో ఆనందాన్నిచ్చింది. అయితే కొంతమంది 'ఇందులో రాజకీయ పరమైన సంభాషణలు ఉంటాయా?' అని అడుగుతున్నారు. వాళ్లని ఉద్దేశించే ఈ వీడియో చేస్తున్నా. ఈ సినిమా మొదలుపెట్టిన రోజే కథానాయకుడు పవన్‌కల్యాణ్ 'వినోదం పంచడమే అంతిమలక్ష్యం కావాలి. ఆ ఉద్దేశం దెబ్బతినేలా సినిమా ఉండకూడద'ని స్పష్టంగా చెప్పారు. సైద్ధాంతిక విభేదాలు ఉన్నా వాటిని పక్కనపెట్టి ప్రకాశ్‌రాజ్‌తో కలిసి నటించారు పవన్‌కల్యాణ్. సిద్ధాంతాలపై పోరాటమే తప్ప, వ్యక్తిగతంగా ఆయన ఎవ్వరినీ లక్ష్యంగా చేసుకోరు. ఇందులోని సంభాషణలు హీరోయిజాన్ని ఆవిష్కరించేలా ఉంటాయే తప్ప, ఎవ్వరినీ తక్కువ చేసేలా ఉండవు. పవన్‌కల్యాణ్‌కు అన్ని పార్టీల్లోనూ అభిమానులు ఉన్నారు. ఓట్లు ఎవరికి వేసినా సినిమా అంటే ఈయన దగ్గరికే వస్తారు. అభిమానులు కూడా చాలా మంది ఆయన వ్యక్తిత్వాన్నే అనుసరిస్తూ 'మాకు సినిమాలో రాజకీయాలు వద్దు, మాకు వినోదమే కావాలి' అన్నారు. అభిమానులు పవన్‌కల్యాణ్ స్టైల్‌ని, ఆయన స్వాగ్‌ని మాత్రమే కాదు, ఆయన సిద్ధాంతాల్నీ అనుసరిస్తున్నందుకు వాళ్లకు హ్యాట్సాఫ్ చెప్పాలి. ఇందులో ఒక్క వ్యక్తిని, వర్గాన్ని, పార్టీని కానీ తక్కువ చేసేలా సంభాషణలు ఉండవు. ప్రతి ఒక్కరూ ఆస్వాదించేలా సినిమా ఉంటుంది" అన్నారు హరీష్‌శంకర్.

అర్జిత్ రిటైర్మెంట్ బాధాకరం - ఆమిర్ ఖాన్


అర్జిత్ సింగ్, ఆమిర్ ఖాన్

అగ్రహీరో ఆమిర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్, అందాల తార సాయిపల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'ఏక్ దిన్'. సునీల్ పాండే దర్శకత్వం వహిస్తున్నారు. ఆమిర్ ఖాన్ నిర్మాత. ఇటీవలే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. తాజాగా టైటిల్ ట్రాక్‌ను పంచుకుంది చిత్రబృందం. దీన్ని అర్జిత్ సింగ్ ఆలపించారు. ఇందులో భాగంగానే.. ఈ పాట తెరవెనుక జరిగిన ఓ వీడియోను పంచుకున్నారు ఆమిర్. దీని గురించి ఆయన మాట్లాడుతూ.. 'నేను కొన్ని రోజులు క్రితం ముర్షిదాబాద్‌కి వెళ్లాను. పాడటం మానేయవద్దని అర్జిత్‌ను ఒప్పించడానికి నేను అక్కడకి వెళ్లలేదు. కానీ మళ్లీ ఆలోచించమని ఒప్పించడానికి నా వంతు ప్రయత్నం చేశాను. అది ఫలించలేదు. అర్జిత్ తన రిటైర్మెంట్‌కు ముందే 'ఏక్ దిన్' టైటిల్ ట్రాక్‌ను పాడటానికి అంగీకరించారు. అర్జిత్ చాలా ప్రతిభావంతుడు. నేను అతనితో, ఆయన కుటుంబంతో కలిసి మంచి సమయాన్ని గడిపాను. ఆయన రిటైర్మెంట్ చాలా బాధాకరం" అని అన్నారు. ఈ రొమాంటిక్ డ్రామా మే 1న థియేటర్లలోకి రానుంది.

ప్రేమలో డెకాయిట్

ఇప్పుడంటే అందరి దృష్టిలో అతనొక డెకాయిట్. కానీ అంతకుముందు అతనొక భగ్న ప్రేమికుడు. ఆ క్షణాల్లో అతని భావాలు ఎలా ఉండేవో, ఆ తర్వాత అతనికి ఏం జరిగిందో తెలియాలంటే 'రుబారూ...' పాట వినాల్సిందే అంటున్నారు అడివి శేష్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న ద్విభాషా చిత్రం... 'డెకాయిట్'. మృణాల్ ఠాకూర్ కథానాయిక. అనురాగ్ కశ్యప్ కీలక పాత్రని పోషిస్తున్నారు. షానియల్ డియో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని 'రుబారూ...' అంటూ సాగే పాటని ఈ నెల 27న విడుదల చేయనున్నారు. "భావోద్వేగ ప్రధానమైన పాట ఇది. అపాయకరమైన అంశాలు, యాక్షన్ నేపథ్యంతో కథ సాగినా... ఈ పాట మాత్రం మంచి కెమిస్ట్రీతో, నాయకానాయికల జంట ప్రయాణాన్ని ఆవిష్కరిస్తుంది. తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేస్తామ"ని సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.



అడివి శేష్, మృణాల్ ఠాకూర్

చిరునవ్వుతో బయటకొస్తారు


సుమంత్, సుబ్రహ్మణ్యం

"కుటుంబ సమేతంగా చూడదగ్గ వినోదాత్మక చిత్రం 'విష్ణు విన్యాసం'. ఈ కథ విన్నప్పుడు మేమెంత ఎంజాయ్ చేశామో.. చూస్తున్నప్పుడు ప్రేక్షకులు అంతకు మించి ఆస్వాదిస్తారు" అన్నారు నిర్మాత జి.సుమంత్ నాయుడు. ఆయన సుబ్రహ్మణ్యం నాయుడుతో కలిసి శ్రీవిష్ణు హీరోగా నిర్మించిన చిత్రమిది. యదునాథ్ మారుతీరావు తెరకెక్కించారు. నయన్ సారిక కథానాయిక. ఈ సినిమా ఈనెల 27న విడుదల కానున్న నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ.. 'సినిమా చాలా బాగా వచ్చింది. దీంట్లో శ్రీవిష్ణు పాత్రని తీర్చిదిద్దిన తీరు ఆసక్తి రేకెత్తిస్తుంది. ఆయన పంచే వినోదం, చెప్పే డైలాగ్స్‌ని ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తార'న్నారు. "హీరో పాత్రపై నడిచే కథ ఇది. దీంట్లో శ్రీవిష్ణు పాత్రకి న్యూమరాలజీ అంటే నమ్మకం. హీరోయిన్ ట్రాక్ కొత్తగా ఉంటుంది. అలాగే వీళ్లిద్దరి కుటుంబాలు ఆసక్తి రేకెత్తించేలా ఉంటాయి. ఈ సినిమాలో పూర్తిగా కథతో పాటు ప్రయాణమయ్యే కామెడీనే ఎక్కువ కనిపిస్తుంది. ఎక్కడా ఏదీ బలవంతంగా ఇరికించినట్లు ఉండదు. ఒక మంచి సినిమా ఇస్తే ప్రేక్షకులు థియేటర్లకు వస్తారని నేను నమ్ముతా. మా 'విష్ణు విన్యాసం' కచ్చితంగా వాళ్లని థియేటర్లకు రప్పిస్తుందని నమ్మకం. ఈ సినిమా చూసిన ప్రతిఒక్కరూ ఓ చిరునవ్వుతోనే థియేటర్స్ నుంచి బయటకొస్తారు. ఇది శ్రీవిష్ణు కెరీర్‌లో టాప్-5 సినిమాల్లో ఒకటిగా నిలుస్తుంది" అన్నారు నిర్మాత సుమంత్ నాయుడు.

చేదు నిజాన్ని చూపించే 'కాక్రోచ్'


బాపిరాజు, సునీల్ కుమార్

"మనకు తెలియని ఒక ప్రపంచాన్ని పరిచయం చేసే సినిమా 'కాక్రోచ్'. సమాజంలో ఉన్న చేదు నిజాన్ని చూడాలనుకునే వారికి ఈ చిత్రం తప్పకుండా నచ్చుతుంది" అన్నారు దర్శకుడు పి.సునీల్ కుమార్ రెడ్డి. ఆయన దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అభిలాష్ సుంకర, ప్రేమసన్, నవీన్, తీర్థ ప్రధాన పాత్రలు పోషించారు. బి.బాపిరాజు, ముత్తుకి నాగసత్యనారాయణ నిర్మించారు. ఇది మార్చి 6న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. "విశాఖ.. గాజువాక ప్రాంతంలోని కొందరు నేరస్థుల నిజ జీవిత ఘటనల ఆధారంగా ఓ హింసాత్మక ప్రేమకథా చిత్రంగా దీన్ని రూపొందించాం. అడ్డు రోడ్డు మీద ఉండే వేశ్యకు.. ఒక నేరస్థుడికి మధ్య జరిగే ప్రేమకథను దీంట్లో చాలా రియలిస్టిక్‌గా చూపించాం. నేను చూసిన సమాజాన్ని ఇందులో ఉన్నది ఉన్నట్లుగా చూపించే ప్రయత్నం చేశా. కేవలం వినోదం కోసం సినిమాలు చూసే వారికి ఇది నచ్చకపోవచ్చు. అలాగే చిన్నపిల్లలు, సున్నిత మనస్కులు ఈ సినిమాకి దూరంగా ఉండమని కోరుతున్నా" అన్నారు.

హైదరాబాద్‌లో చాలెట్ లగ్జరీ హోటల్

రూ.633 కోట్ల పెట్టుబడి

ఈనాడు, హైదరాబాద్: చాలెట్ హోటల్స్ లిమిటెడ్.. హైదరాబాద్ మాదాపూర్‌లో రూ.633 కోట్లతో లగ్జరీ హోటల్ నిర్మించనున్నట్లు ప్రకటించింది. ఇందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపిందని స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. ఈ హోటల్‌లో 330 గదులు, 36,225 చ.అడుగుల వాణిజ్య రిటెయిల్ స్థలం ఉంటుంది. అంతర్గత నిధులు, రుణాల ద్వారా నిధులు సమీకరించి, 2029 ఆర్థిక సంవత్సరం ముగింపుకు ఈ హోటల్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని. ఇప్పటికే వెస్టిన్ పేరుతో హైటెక్ సిటీ, మాదాపూర్‌లలో ఈ సంస్థకు హోటళ్లున్నాయి.

గుజరాత్‌లో విటెరో టైల్స్ ప్లాంట్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన అపర్ణా ఎంటర్‌ప్రైజెస్ అనుబంధ సంస్థ విటెరో టైల్స్ గుజరాత్‌లోని మోర్బీలో రూ.150 కోట్లతో, కొత్త ఉత్పత్తి ప్లాంటును ప్రారంభించింది. ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 72 లక్షల చదరపు మీటర్లు. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో ఉన్న ప్లాంట్ సామర్థ్యంతో కలిపితే, విటెరో టైల్స్ మొత్తం వార్షిక సామర్థ్యం 1.8 కోట్ల చదరపు మీటర్లకు చేరుకుంటుందని సంస్థ తెలిపింది. దేశీయంగా సరఫరా మెరుగుపర్చడంతో పాటు, అంతర్జాతీయ మార్కెట్‌కూ విస్తరిస్తామని అపర్ణా ఎంటర్‌ప్రైజెస్ ఎండీ అశ్విన్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అపర్ణా రెడ్డి పేర్కొన్నారు.

2% పెరిగిన బంగారం, వెండి ధరలు

ఈనాడు వాణిజ్య విభాగం: అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమైన నేపథ్యంలో, సోమవారం అంతర్జాతీయ విపణిలో బంగారం, వెండి ధరలు 2 శాతానికి పైగా పెరిగాయి. భారత కాలమానం ప్రకారం రాత్రి 11.55 గంటల సమయానికి ఔన్సు (31.10 గ్రాముల) మేలిమి బంగారం ధర 102 డాలర్లు (2.00%) పెరిగి రూ.5205 డాలర్లకు చేరింది. ఔన్సు వెండి ధర 2.25 డాలర్లు (2.67%) అధికమై 86 డాలర్లకు చేరింది. ఫలితంగా హైదరాబాద్ బులియన్ విపణిలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,65,000కి, కిలో వెండి ధర రూ.2,72,400కు చేరింది.

కోడి గుడ్లు
24న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	465	తూ/ప గోదావరి	475
వరంగల్	467	విశాఖపట్నం	480
విజయవాడ	500	చిత్తూరు	533

బ్యాంకులు మిస్-సెల్లింగ్‌కు దూరంగా ఉండాలి



ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

దిల్లీ: వినియోగదారులకు బీమా వంటి ఆర్థిక ఉత్పత్తులను తప్పుడు వివరాలతో బ్యాంకుల్లోనే విక్రయించడం (మిస్-సెల్లింగ్)పై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బ్యాంకులు తమ ప్రధాన వ్యాపారంపై దృష్టి పెట్టాలి. అవసరం లేకపోయినా బీమా ఉత్పత్తులు విక్రయించడానికే బ్యాంకులు ఎక్కువ సమయం కేటాయిస్తున్నాయి. బ్యాంకు నియంత్రణ సంస్థ ఆర్‌బీఐ, బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ మధ్య ఉన్న నిర్వహణ పరమైన దూరం వల్ల ఎవరికీ జవాబుదారీతనం లేకుండా పోయింది' అని పేర్కొన్నారు. బడ్జెట్ తర్వాత నిర్వహించిన రిజర్వ్‌బ్యాంక్ (ఆర్‌బీఐ) సెంట్రల్ బోర్డ్ సమావేశం అనంతరం ఆర్థిక మంత్రి విలేకరులతో మాట్లాడారు. మిస్-సెల్లింగ్‌ను ఉపేక్షించేది లేదంటూ ఆర్‌బీఐ ఇచ్చిన ముసాయిదా మార్గదర్శకాలపై సంతోషంగా ఉందన్నారు. 'ఇక్కడ అలాంటి పనులు చేయబోరు అనే సందేశం బ్యాంకులకు వెళ్లాలి' అని మంత్రి పేర్కొన్నారు. బ్యాంకులు డిపాజిట్లు, రుణాలపైన దృష్టి సారించాలని ఆమె సూచించారు. గృహరుణం తీసుకునేందుకు ఇల్లు/స్థలం తాకట్టు పెడుతుండగా, మళ్లీ బీమా తీసుకోమని బ్యాంకులు ఒత్తిడి చేస్తుండటాన్ని మంత్రి ప్రశ్నించారు.

పీఎస్‌బీల విలీన ప్రణాళిక ప్రస్తుతం లేదు

ప్రభుత్వరంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల విలీనం కోసం ప్రభుత్వం వద్ద ప్రస్తుతానికి ప్రణాళికేమీ లేదని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. వికసిత్ భారత్ కోసం బ్యాంకింగ్‌పై నియమించిన ఉన్నతస్థాయి కమిటీ నివేదిక ఇచ్చాక, ఈ రంగాన్ని మరింత పటిష్ఠం చేసే చర్యలు తీసుకుంటామని వివరించారు.

పసిడి దిగుమతులను నిశితంగా గమనిస్తున్నాం

ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు భారీగా కొనుగోళ్లు చేస్తుండటం వల్లే పసిడి, వెండి ధరలు పెరుగుతున్నాయని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. విలువైన లోహాల దిగుమతులను ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నిశితంగా గమనిస్తున్నాయని, ప్రస్తుతం ఇవి 'ఆందోళనకర స్థాయి'లో ఏమీ లేవని అన్నారు. ఆభరణాల రూపంలో లేదా ఇతరత్రా భారతీయ కుటుంబాలకు బంగారం ఎప్పుడూ ఇష్టమైన పెట్టుబడి అని, దేశీయ అవసరాల కోసం మన దేశం పసిడిని దిగుమతి చేసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. పండగల సీజన్, అక్షయ తృతీయ వంటి సమయాల్లో దేశీయంగా పసిడికి గిరాకీ పెరుగుతుందన్నారు.

అయిదేళ్లలో రూ.10 లక్షల కోట్ల ఆస్తుల నగదీకరణ

రాబోయే అయిదేళ్లలో ప్రభుత్వ ఆస్తుల నగదీకరణ (ఎన్ఎంపీ) ద్వారా రూ.10 లక్షల కోట్లు సమీకరించాలని నిర్ణయించినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. ఎన్ఎంపీ -2ను ఆమె ప్రకటించారు. 2021లో ప్రకటించిన ఎన్ఎంపీ-1 కింద 2022-25లో రూ.6 లక్షల కోట్లు సమీకరించాలని నిర్ణయించగా, అందులో 89 శాతానికి సమానంగా రూ.5.3 లక్షల కోట్లు ఖజానాకు చేరాయన్నారు.

ఆందోళన అవసరం లేదు: మల్హోత్రా



గత ఏడాది ఏప్రిల్- డిసెంబరు మధ్య మన దేశ పసిడి దిగుమతుల విలువ దాదాపు 1 బిలియన్ డాలర్లు (రూ.9,000 కోట్లు) పెరిగి 50 బిలియన్ డాలర్ల (రూ.4.50 లక్షల కోట్ల)కు చేరింది. ఈ ఏడాది జనవరిలో పసిడి దిగుమతుల విలువ, పరిమాణం.. రెండింటిలోనూ అకస్మాత్తుగా పెరుగుదల కనిపించిందని, ఈ గణాంకాలను ఆర్‌బీఐ విశ్లేషిస్తోందని గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. 2025 ఏప్రిల్- డిసెంబరులో ధరలు పెరిగిన ప్రభావం, పసిడి దిగుమతుల పరిమాణం తగ్గడంతో సమానమైందని వివరించారు. ఈ ఏడాది జనవరిలో మాత్రమే గిరాకీలో హెచ్చుతగ్గులు, సీజనల్ మార్పులు కనిపించాయని వెల్లడించారు. మన దేశ విదేశీ వాణిజ్యం బలంగా ఉన్నందున, దీనిపై ఆందోళన చెందడం లేదని స్పష్టం చేశారు. తమ అంచనాల ప్రకారం కరెంట్ ఖాతా లోటు నియంత్రణలోనే ఉందని, జీడీపీలో 1 శాతంగా నమోదైనట్లు పేర్కొన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థలో డిపాజిట్ల వృద్ధి 12.5%, రుణాలు 14.5% వృద్ధి చెందాయన్నారు. వృద్ధిరేటు, ద్రవ్యోల్బణం ఆధారంగా కీలక రేట్ల కోతలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఈనాడు బిజినెస్

ఎయిర్‌టెల్ మనీ కోసం రూ.20,000 కోట్ల మూలధనం

అందించనున్న ఎయిర్‌టెల్



ఈనాడు, హైదరాబాద్: తన బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ) ఎయిర్‌టెల్ మనీకి, రానున్న కొన్నేళ్లలో రూ.20,000 కోట్ల మూలధనం సమకూర్చనున్నట్లు టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ సోమవారం వెల్లడించింది. దేశంలో రుణాల లభ్యతలో ఉన్న అంతరాన్ని తగ్గించే లక్ష్యంతోనే ఈ నిధులు అందించనున్నట్లు తెలిపింది. ఎయిర్‌టెల్ మనీకి ఈనెల 13న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నుంచి ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్సు లభించింది. ఈ రూ.20,000 కోట్ల మూలధనంలో 70% నిధులను ఎయిర్‌టెల్, మిగిలిన 30 శాతాన్ని ప్రమోటర్ గ్రూప్.. భారతీ ఎంటర్‌ప్రైజెస్ సమకూర్చనున్నాయి. 500 మందికి పైగా డేటా సైంటిస్టులు, బలమైన డిజిటల్ ఆస్తుల సాయంతో దేశవ్యాప్తంగా సురక్షిత, విస్తృత డిజిటల్ ఆర్థిక సేవలు అందించాలని ఎయిర్‌టెల్ మనీ లక్ష్యంగా పెట్టుకుంది. గత రెండేళ్లలో లెండింగ్ సర్వీస్ ప్రొవైడర్ ప్లాట్‌ఫామ్ ద్వారా రూ.9,000 కోట్లకు పైగా రుణాలను పంపిణీ చేసినట్లు కంపెనీ వెల్లడించింది. ఈ సేవల్లోకి భారతీ ఎయిర్‌టెల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ గోపాల్ విత్తల్ మాట్లాడుతూ.. సాంకేతికత, డేటా, వినియోగదారు నమ్మకాన్ని మేళవించి, జాతీయ స్థాయిలో అత్యంత విశ్వసనీయ డిజిటల్ క్రెడిట్ ఇంజిన్‌ను నిర్మించనున్నట్లు వెల్లడించారు.

విలాస గృహ విక్రయాల్లో గురుగ్రామ్ హవా

ముంబయిని వెనక్కి నెట్టి అగ్రస్థానానికి: నివేదిక

దిల్లీ: విలువ రూపేణా విలాసవంత గృహ విక్రయాల్లో ముంబయి నగరాన్ని గురుగ్రామ్ వెనక్కి నెట్టింది. గతేడాది (2025) గురుగ్రామ్‌లో రూ.10 కోట్లు, ఆ పైన ధర ఉన్న విలాసవంత గృహాల విక్రయాలు 80% పెరిగి రూ.24,120 కోట్లకు చేరినట్లు ఓ నివేదిక తెలిపింది. ఇదే సమయంలో ముంబయిలో ఈ తరహా గృహాల విక్రయాల విలువ రూ.21,902 కోట్లుగా నమోదైనట్లు వెల్లడించింది. గురుగ్రామ్‌లో విలాసవంత గృహ విపణిపై స్థిరాస్తి కన్సల్టెంట్ సంస్థ ఇండియా సోథెబైస్ ఇంటర్నేషనల్ రియాల్టీ, డేటా విశ్లేషణ సంస్థ సీఆర్ఈ మ్యాట్రిక్స్ సంయుక్తంగా ఈ నివేదికను రూపొందించాయి. దీని ప్రకారం.. గురుగ్రామ్‌లో రూ.10 కోట్లు, ఆపైన ధర ఉన్న విలాసవంత ఇళ్లు 2024లో 519 విక్రయం కాగా.. 2025లో ఈ సంఖ్య 3 రెట్లు పెరిగి 1,494 యూనిట్లకు చేరింది. విలువ రూపేణా విక్రయాలు 2024లోని రూ.13,384 కోట్ల నుంచి 2025 లో రూ.24,120 కోట్లకు పెరిగాయి.

నోయిడా విమానాశ్రయంలో టెలికాం సంస్థలకు అవకాశమివ్వాలి

టెలికాం విభాగం లేఖ

దిల్లీ: ప్రైవేటు టెలికాం సంస్థలు తమ మౌలిక వసతులు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతించాలని కోరుతూ, నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయ నిర్వహణ సంస్థకు టెలికాం విభాగం లేఖ రాసింది. టెలికాం చట్టం ప్రకారం విమానాశ్రయం అనేది ప్రజా సంస్థ కనుక, తప్పనిసరిగా టెలికాం సేవలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అనుమతులు ఇవ్వాలని స్పష్టం చేసింది. అంతరాయం లేని టెలికాం, డిజిటల్ సేవలకు ప్రాధాన్యమిస్తున్నామని, ఇందుకోసం కామన్ యూజ్ టెలికాం మౌలిక వసతులు సిద్ధంగా ఉన్నాయని నోయిడా విమానాశ్రయం తెలిపింది. బీఎస్ఎన్ఎల్ ఇప్పటికే ఈ సదుపాయాలను వినియోగించుకుని, సేవలందిస్తున్నట్లు వెల్లడించింది.

టీజీఎస్ఆర్‌టీసీ నుంచి ఒలెక్ట్రాకు రూ.1,800 కోట్ల ఆర్డర్

1,085 విద్యుత్తు బస్సుల సరఫరా కోసం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్‌టీసీ) నుంచి విద్యుత్తు బస్సుల తయారీ కంపెనీ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్‌కు రూ.1,800 కోట్ల విలువైన ఆర్డర్ లభించింది. పీఎం ఇ-డ్రైవ్‌లో భాగంగా.. హైదరాబాద్ నగర పరిధిలో నడిపేందుకు వీలుగా 1,085 విద్యుత్తు బస్సుల సరఫరా, నిర్వహణ కోసం తన అనుబంధ సంస్థ ఈవీ ట్రాన్స్ లిమిటెడ్ ద్వారా రెండు కాంట్రాక్టులు (ఎల్ఓఏ) దక్కించుకున్నట్లు ఒలెక్ట్రా సోమవారం ప్రకటించింది. 12 సంవత్సరాల కాలపరిమితికి ఈ ఆర్డర్ సొంతం చేసుకున్నట్లు తెలిపింది. 12 మీటర్ల పొడవుండే 1,085 లో ఫ్లోర్ బస్సుల్లో.. 1,025 నాన్-ఏసీ, 60 బస్సులు ఏసీవి ఉండనున్నాయి. ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ నుంచి ఈవీ ట్రాన్స్ సంస్థ ఈ బస్సులను కొనుగోలు చేసి, 20 నెలల్లో టీజీఎస్ఆర్‌టీసీకి అందించనుంది. 12 ఏళ్ల కాంట్రాక్ట్ వ్యవధిలో బస్సుల పూర్తి నిర్వహణ బాధ్యత వహిస్తుంది.



'ప్రపంచ స్థాయి విద్యుత్తు బస్సులను ఇక్కడ తయారు చేయాలన్న మా నిబద్ధతకు, ఈ ఆర్డరు బలం చేకూర్చింది' అని ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఎండీ మహేష్ బాబు పేర్కొన్నారు.

స్వదేశీ పరిజ్ఞానంతో..: దేశీయ పరిస్థితులకు అనుగుణంగా, స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ బస్సులకు అత్యాధునిక ఎయిర్ సస్పెన్షన్ వ్యవస్థలుంటాయని, దివ్యాంగుల కోసం వీల్‌ఛైర్‌లకూ చోటు ఉంటుందని ఒలెక్ట్రా తెలిపింది. ఈ బస్సుల్లోని లిథియం-అయాన్ బ్యాటరీని ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 250 కిలోమీటర్లు ప్రయాణించగలవని, 45 నిమిషాల్లోనే ఛార్జింగ్ చేయొచ్చని వివరించింది.

ఎగుమతిదార్లకు షాక్

- సుంకం ప్రయోజనాల్లో కోత
- పునః పరిశీలించాలన్న ఫియో

దిల్లీ: ఎగుమతిదార్లకు మద్దతునిచ్చే పథకం కింద పన్ను ప్రయోజనాలను కేంద్రం సగానికి తగ్గించింది. అయిదేళ్ల కిందట తీసుకొచ్చిన ద రెమిషన్ ఆఫ్ డ్యూటీస్ అండ్ టాక్సెస్ ఆన్ ఎక్స్‌పోర్టెడ్ ప్రోడక్ట్స్(ఆర్‌ఓడీటీఈపీ) పథకం కింద వస్తువుల తయారీ, పంపిణీ ప్రక్రియలో ఎగుమతిదార్లు కట్టే సుంకాలను రిఫండ్ చేస్తున్నారు. ఈ పథకం కింద వర్తించే రేట్లను తక్షణం అమల్లోకి వచ్చేలా 50 శాతానికి పరిమితం చేస్తున్నట్లు సోమవారం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్(డీజీఎఫ్‌టీ) ప్రకటించింది. ఈ పథకం కింద రిఫండ్‌లు 0.3-3.9 శాతంగా ఉన్నాయి. అంతర్జాతీయ అనిశ్చితులు, గిరాకీ మందగమనం వంటి సవాళ్ల నడుమ ప్రకటించిన ఈ రేట్ల కోతను పునః పరిశీలించాలని భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య(ఫియో) ప్రెసిడెంట్ ఎస్.సి. రల్హాన్ పేర్కొన్నారు. జనవరిలో దేశ ఎగుమతులు 0.61 శాతమే పెరిగి 36.56 బి. డాలర్లు(దాదాపు రూ.3.26 లక్షల కోట్లు)గా నమోదవడంతో వాణిజ్య లోటు మూడు నెలల గరిష్ఠమైన 34.68 బి. డాలర్లకు చేరింది.

దగ్గు మందు కంపెనీల ఆడిట్ 90% పూర్తి

డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా



ముంబయి: దేశంలోని 90% దగ్గు మందు (సిరప్) తయారీ కంపెనీల్లో ఆడిట్ పూర్తయినట్లు డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా రాజీవ్ సింగ్ రఘువంశీ తెలిపారు. సోమవారమిక్కడ జరిగిన గ్లోబల్ ఫార్మాస్యూటికల్ క్వాలిటీ సమిట్ 11వ ఎడిషన్‌లో మాట్లాడుతూ 'సవరించిన నిబంధనల విషయంలో రాష్ట్ర, కేంద్ర నియంత్రణ సంస్థలు కలిసి ఈ ఆడిట్ నిర్వహిస్తున్నాయి. దేశంలో 1,300కు పైగా దగ్గు మందు కంపెనీలుండగా, ఇప్పటిదాకా 1,250 సంస్థల్లో ఆడిట్ పూర్తయింది. నిబంధనలను పాటించని వాటిపై తీవ్ర చర్యలూ తీసుకున్నామ'ని తెలిపారు. వచ్చే సీజనుకు దగ్గు మందు తయారీలో ఎటువంటి సమస్యలూ ఉండవని ఆయన అభిప్రాయపడ్డారు. సవరించిన 'రూల్ ఎమ్' అమలు వల్ల దేశీయ ఫార్మా పరిశ్రమపై, ఔషధాల నాణ్యతపై దీర్ఘకాలంలో సానుకూల ప్రభావం ఉంటుందని అన్నారు. దేశీయ ఫార్మా పరిశ్రమ కేవలం పరిమాణం పరంగానే కాకుండా నాణ్యత, విశ్వసనీయత, వినూత్నతపరంగా పోటీనివ్వాలని ఇదే కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా పేర్కొన్నారు. ముందస్తుగా రోగ గుర్తింపు, ప్రిడిక్టివ్ డయాగ్నొస్టిక్స్, అందరికీ ఆరోగ్య సేవలను అందించడం వంటి సేవలకు కృత్రిమ మేధ(ఏఐ)ను వినియోగించడంపై భారత్ దృష్టి సారిస్తోందన్నారు.

అనిల్ అంబానీకి మరో ఎదురుదెబ్బ

అనిల్ అంబానీ, రిలయన్స్ కమ్యూనికేషన్స్‌ల బ్యాంకు ఖాతాలను 'మోసపూరితం' అని వర్గీకరించకుండా స్టే విధిస్తూ ఏకసభ్య బెంచ్ జారీ చేసిన మధ్యంతర ఆదేశాలను బాంబే హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసింది. మూడు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆడిటర్ సంస్థ బీడీఓ ఇండియా ఎల్ఎల్‌పీ దాఖలు చేసిన పిటిషన్‌పై డివిజన్ బెంచ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఏకసభ్య బెంచ్ ఇచ్చిన ఆదేశాలు చట్టవిరుద్ధమని కోర్టు పేర్కొంది.

సంక్షిప్తంగా

✦ ఓయో మాతృసంస్థ **ప్రిజమ్** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తరణకు సిద్ధమైంది. ఇందులో భాగంగా 300 కంపెనీ సర్వీస్డ్ హోటళ్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మంతో పాటు, యాదాద్రి, భద్రాచలంవంటి ఆధ్యాత్మిక క్షేత్రాల్లోనూ వీటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది.

✦ **ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్** తెలంగాణలోని భూపాలపల్లి, ఖమ్మం, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మూడు కొత్త శాఖలను ప్రారంభించింది. దీంతో రాష్ట్రంలో మొత్తం శాఖల సంఖ్య 56కు చేరింది.

✦ మహీంద్రా గ్రూపులో భాగమైన **స్వరాజ్ ట్రాక్టర్స్** తమ ప్రచారకర్తగా మాజీ క్రికెటర్ ఎంఎస్ ధోనీని కొనసాగించాలని నిర్ణయించింది. భారతీయ రైతుల అవసరాలకు తగ్గట్టుగా బ్రాండ్ తీసుకురాబోతున్న సరికొత్త ఉత్పత్తుల ప్రచారంలో ఆయన ప్రధాన పాత్ర పోషించనున్నట్లు స్వరాజ్ పేర్కొంది.

✦ **స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్** 9 రాష్ట్రాల్లో 32 ఆరోగ్య సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించింది. పిరమిల్ స్వాస్థ్య భాగస్వామ్యంతో.. నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్, మహబూబ్‌నగర్, కర్నూలు, విశాఖపట్నంతో పాటు ఇతర నగరాల్లో ఈ ఉచిత వైద్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఇందులో డాక్టర్ సంప్రదింపులతో పాటు, కొన్ని ప్రాథమిక వైద్య సేవలను అందిస్తున్నట్లు పేర్కొంది.

✦ తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇచ్చినందుకు దిల్లీకి చెందిన కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ **వాజీరావు అండ్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్‌**పై రూ.15 లక్షల జరిమానాను సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) విధించింది. సంస్థ తాము నిర్వహిస్తున్న వివిధ కోర్సుల్లో కోచింగ్ తీసుకున్న విద్యార్థులు ఈ ర్యాంకులు సాధించారంటూ మరోచోట ప్రకటించడాన్ని సీసీపీఏ గుర్తించింది.

రూ.3 లక్షల కోట్ల ఎగుమతులకు సుంకం వర్తించదా?



అత్యధికం ఔషధ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లోనే

ప్రతీకార సుంకాలను రద్దు చేస్తూ అమెరికా సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినా, వెనక్కి తగ్గని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాల ఉత్పత్తులపై 15% సుంకం విధిస్తున్నానని, భారత్‌కూ ఇదే వర్తిస్తుందని తెలిపారు. వాణిజ్య చట్టం- 1974లోని సెక్షన్ 122 కింద ప్రతిపాదించిన టారిఫ్ చర్యల ప్రకారం.. 150 రోజుల వరకు 15% దాకా సుంకాలను అమెరికా అధ్యక్షుడు విధించొచ్చు. అయితే సుమారు 34 బి.డాలర్ల (సుమారు రూ.3 లక్షల కోట్ల)కు పైగా విలువైన భారత ఎగుమతులకు ఈ సుంకం నుంచి మినహాయింపు ఉంటుందని ఆంగ్ల పత్రికలు అంచనా వేశాయి. సుంకాల నుంచి మినహాయింపు ఉండే వాటిల్లో ఔషధాలు, ఎలక్ట్రానిక్స్‌తో పాటు పౌర విమానయాన రంగానికి సంబంధించినవి ఉండొచ్చని సమాచారం. ఇంతకుముందు జపాన్, ఐరోపా కూటమి, యునైటెడ్ కింగ్‌డమ్‌కు కూడా ఈ తరహా మినహాయింపులను అమెరికా పొడిగించింది. 2024లో అమెరికాకు మనదేశ మొత్తం ఎగుమతులు 87.7 బిలియన్ డాలర్లు (సుమారు రూ.8 లక్షల కోట్లు)గా ఉన్నాయి.

ఏయే రంగానికి ఎంతెంత?

తాజా అమెరికా సుంకాల నుంచి మినహాయింపు ఉండే భారత ఎగుమతుల్లో.. ఔషధ రంగం ముందు వరసలో ఉండనుంది. ఈ రంగానికి సంబంధించి 10.6 బిలియన్ డాలర్ల (రూ.95,400 కోట్ల) విలువైన ఎగుమతులకు సుంకం వర్తించకపోవచ్చు. యాంటీబయోటిక్ ఫార్ములేషన్లు, హార్మోన్ల ఆధారిత ఔషధాలు, ఇమ్యునోలాజికల్ ఉత్పత్తుల వంటివి ఇందులో ఉంటాయి.

✦ తదుపరి వాటా ఎలక్ట్రానిక్స్‌దే. అమెరికాకు మనదేశం నుంచి స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు సుమారు 6.8 బిలియన్ డాలర్లు (రూ.61,200 కోట్లు) కాగా.. కమ్యూనికేషన్ ట్రాన్స్‌మిషన్ సామగ్రి ఎగుమతుల విలువ 1.8 బిలియన్ డాలర్ల (రూ.16,200 కోట్ల) వరకు ఉంటుంది.

✦ పౌర విమానయాన రంగానికి సంబంధించి 5.77 బిలియన్ డాలర్ల (రూ.52,000 కోట్ల) ఎగుమతులు సుంకం మినహాయింపు పరిధిలో ఉండొచ్చని ఆ కథనం పేర్కొంది.

✦ వాహన ఇంధనాలు, విమాన ఇంధనం సహా శుద్ధిచేసిన పెట్రోలియం ఎగుమతులు, స్టాటిక్ కన్వర్టర్లు, ఇంజిన్ విడిభాగాలు, పంపులు, కంప్రెషర్లు, ఇతర యంత్రపరికరాలు లాంటి పారిశ్రామిక వస్తువులు కూడా సుంకం మినహాయింపు జాబితాలో ఉండొచ్చు.

అమెరికా తాజా సుంకంపై ఇంకా అస్పష్టతే: ఎగుమతిదార్లు

భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే ఉత్పత్తులకు ఎంత మేర సుంకం వర్తిస్తుందనే విషయంపై ఇప్పటికీ అస్పష్టతే ఉందని ఎగుమతిదార్లు చెబుతున్నారు. ఈనెల 24తో ప్రారంభించి 150 రోజుల వరకు అన్ని దేశాల ఉత్పత్తులపై 15% సుంకం విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించినా, అధికారిక ఉత్తర్వులను జారీ చేయలేదు. అందువల్ల అంతకుముందటి ఉత్తర్వుల్లోని 10% సుంకమే భారత ఎగుమతులకు వర్తిస్తుందని అనుకోవాలని ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఫియో) డైరెక్టరు జనరల్ అజయ్ సహాయ్ తెలిపారు.

సుంకాల్లో మార్పుల ప్రభావంపై ఇప్పుడే ఏం మాట్లాడలేం..

మంత్రి నిర్మలా సీతారామన్

అమెరికా సుంకాల్లో మార్పులతో భారత ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం పడనుందో ఇప్పుడే చెప్పలేమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇప్పుడే దీనిపై మాట్లాడటం తొందరపాటే అవుతుందని అన్నారు. అయితే పరిస్థితిని వాణిజ్య శాఖ సమీక్షిస్తోందని స్పష్టం చేశారు. తదుపరి చర్చలు ఎప్పుడు అనేది ఇరు దేశాల ప్రతినిధులు నిర్ణయిస్తారని తెలిపారు.

హరియాణా ప్రభుత్వ లావాదేవీలకు ఐడీఎఫ్‌సీ, ఏయూస్మాల్ ఫైనాన్స్ దూరం

రూ.590 కోట్ల మోసం ప్రభావం



దిల్లీ: కొందరు బయటి వ్యక్తులతో కలిసి తమ ఉద్యోగులు హరియాణా ప్రభుత్వ ఖాతాల్లో రూ.590 కోట్ల మోసానికి పాల్పడ్డారని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టరు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) వి.వైద్యనాథన్ తెలిపారు. చండీగఢ్ శాఖలో ఈ సంఘటన జరిగిందని, హరియాణా ప్రభుత్వానికి సంబంధించి కొన్ని ఖాతాలకే ఈ మోసం పరిమితమైందని వెల్లడించారు. శాఖలోని మిగతా వినియోగదార్ల ఖాతాలకు ఎలాంటి ఇబ్బంది లేదని అన్నారు. ఈ మోసపూరిత ఘటన ఫలితంగా, కొంత మేర కేటాయింపులు చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల తమ లాభాలపై పెద్దగా ప్రభావం ఉండబోదని.. నికర వడ్డీ మార్జిన్ పెరగడం తమకు కలిసి వస్తుందని తెలిపారు. స్టాండలోన్ ప్రాతిపదికన జనవరి- మార్చి త్రైమాసికంలో బలమైన ఫలితాలు నమోదు చేస్తామనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

✦ మోసపూరితంగా ఖాతాలు తెరిచారనే ఆరోపణలపై ప్రభుత్వ వ్యాపారాలకు సంబంధించి ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించకుండా ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లను హరియాణా ప్రభుత్వం దూరం పెట్టింది. ఈ మోసంలో తమకు ఎలాంటి సంబంధం లేదని ఏయూ ఫైనాన్స్ బ్యాంక్ స్పష్టం చేసింది.

వ్యవస్థాగత వైఫల్యం లేదు: ఆర్‌బీఐ గవర్నర్

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.590 కోట్ల మోసం ఘటనపై పరిశీలన చేస్తున్నామని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ఒక శాఖలోనే ఈ సంఘటన జరిగిందని, బ్యాంకు మొత్తానికి సంబంధించి కాదని పేర్కొన్నారు. వ్యవస్థాగత వైఫల్యం లేదని వివరించారు.

షేరు 16% కుదేలు..: తాజా పరిణామాల నేపథ్యంలో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేరు సోమవారం బీఎస్ఈలో 16.18% కుదేలై రూ.70.04 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ.66.85 వద్ద లోయర్ సర్క్యూట్‌నూ తాకింది.

✦ ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ షేరు 5.3% నష్టపోయి 974.45 వద్ద స్థిరపడింది.

మార్కెట్లకు సుంకాల తీర్పు జోష్

ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.3,484 కోట్లు
డీఐఐ విక్రయాలు: రూ.1,292 కోట్లు

సెన్సెక్స్ ▲ 480 | 83295
నిఫ్టీ ▲ 142 | 25713

ప్రపంచ దేశాల ఉత్పత్తులపై ట్రంప్ ప్రభుత్వం విధించిన సుంకాలను అమెరికా సుప్రీం కోర్టు తోసిపుచ్చిన నేపథ్యంలో, దేశీయ సూచీలు సోమవారం లాభాల్లో ముగిశాయి. మదుపర్ల సెంటిమెంట్ మెరుగుపడటంతో పీఎస్‌యూ బ్యాంక్, వాహన, ఫైనాన్స్ షేర్లు కళకళలాడాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 5 పైసలు పెరిగి 90.89 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు ధర 0.38% తగ్గి 71.49 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో హాంకాంగ్, కొరియా లాభపడ్డాయి. ఐరోపా సూచీలు మిశ్రమంగా ముగిశాయి.

✦ **మహీంద్రా అండ్ మహీంద్రా, మ్యానులైఫ్** సంస్థల ప్రతిపాదిత ఉమ్మడి (50:50 భాగస్వామ్యం) జీవిత బీమా సంస్థకు ఎండీ, సీఈఓగా సురేష్ అగర్వాల్ నియమితులయ్యారు. గతేడాది నవంబరులోనే ఈ భాగస్వామ్యాన్ని ఈ సంస్థలు ప్రకటించాయి. ప్రస్తుతం ఈయన మహీంద్రా ఇన్సూరెన్స్ బ్రోకర్స్ ఎండీగా కొనసాగుతున్నారు. నియంత్రణ సంస్థ ఆమోదం తర్వాత మే 1న కొత్త బాధ్యతలు స్వీకరించనున్నారు.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.08 లక్షల కోట్లు పెరిగి రూ.469.19 లక్షల కోట్ల (5.17 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ సెన్సెక్స్ ఉదయం 92 పాయింట్ల (క్రితం ముగింపు 82,814.71) లాభంతో 82,906.83 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 83,486.15 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ, చివరకు 479.95 పాయింట్లు పెరిగి 83,294.66 వద్ద ముగిసింది. నిఫ్టీ 141.75 పాయింట్ల లాభంతో 25,713 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,609.35- 25,771.45 పాయింట్ల మధ్య కదలాడింది.



✦ సెన్సెక్స్ 30 షేర్లలో 20 లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్ 2.98%, కోటక్ బ్యాంక్ 2.22%, అల్ట్రాటెక్ 1.65%, పవర్‌గ్రిడ్ 1.49%, యాక్సిస్ బ్యాంక్ 1.34%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.31%, హెచ్‌యూఎల్ 1.29% రాణించాయి. ఇన్ఫోసిస్ 1.80%, టెక్ మహీంద్రా 1.06%, ట్రెంట్ 0.86% నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. పీఎస్‌యూ బ్యాంక్ 1.4%, సేవలు 0.97%, హాస్పిటల్స్ 0.89%, ఆరోగ్య సంరక్షణ 0.76%, విద్యుత్ 0.72%, వాహన 0.71% పెరిగాయి.

ఐపీఓ సమాచారం

✦ వ్యాపార విస్తరణలో భాగంగా 15 కొత్త రిటెయిల్ స్టోర్‌లు ఏర్పాటు చేసేందుకు రూ.287 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు పీఎన్‌జీఎస్ రెవా డైమండ్ జువెలరీ ప్రకటించింది. సంస్థ ఐపీఓ ఈ నెల 24న ప్రారంభమై 26న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.367- 386 నిర్ణయించారు.

✦ గాడియమ్ ఐవీఎఫ్ అండ్ ఉమెన్ హెల్త్ ఐపీఓ రెండో రోజుకు 3 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 1,46,20,340 షేర్లను ఆఫర్ చేయగా, 4,38,24,186 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటెయిల్ విభాగంలో 2.81 శాతం స్పందన దక్కింది.

✦ డెన్మార్క్ మద్యం సంస్థ కార్ల్‌బర్గ్, తమ భారత విభాగాన్ని ఐపీఓకు తెచ్చేందుకు సిద్ధమవుతోంది. ఐపీఓ ద్వారా 700 మి.డాలర్లు (దాదాపు రూ.6300 కోట్లు) సమీకరించాలని కంపెనీ భావిస్తోంది.

డయాగ్నొస్టిక్స్ విభాగంలోకి టొరెంట్ గ్రూప్

డయాగ్నొస్టిక్స్ విభాగంలోకి అడుగుపెట్టినట్లు టొరెంట్ గ్రూప్ వెల్లడించింది. నవీ ముంబయిలో అతిపెద్ద నేషనల్ రిఫరెన్స్ లేబొరేటరీని కంపెనీ ప్రారంభించింది. రిఫరెన్స్ ఆధారిత మోడల్ ద్వారా డయగ్నొస్టిక్ సేవలు అందించనున్నట్లు తెలిపింది.

జనరల్ నాలెడ్జ్



◆ స్వతంత్ర్య భారతదేశ మొదటి రక్షణ మంత్రిగా ఎవరు సేవలు అందించారు?
జ: సర్దార్ బల్‌దేవ్‌సింగ్ (1942 క్రిప్స్ మిషన్, 1946 క్యాబినెట్ మిషన్‌ల సమయంలో సిక్కు సమాజానికి ప్రాతినిధ్యం వహించిన ప్రతినిధుల్లో ఈయన ఒకరిగా ఉన్నారు. 1947, ఆగస్టు 15 నుంచి 1952, మే 13 వరకు భారత మొదటి రక్షణమంత్రిగా సేవలందించారు).

◆ రీసెర్చ్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా (భారతదేశ పరిశోధన రాజధాని)గా పేరు పొందిన నగరం ఏది?

మాదిరి ప్రశ్నలు

జ: కోల్‌కతా (కోల్‌కతా అనేక ప్రతిష్ఠాత్మక, చారిత్రక పరిశోధనా సంస్థలకు కేంద్రంగా ఉంది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, లైఫ్ సైన్సెస్, మ్యాథమెటిక్స్, ఎర్త్ సైన్సెస్ వంటి కోర్ సైన్స్‌ల్లో ఈ నగరం అద్భుత ప్రతిభను కనబరుస్తోంది. నేచర్ ఇండెక్స్ ర్యాంకింగ్స్ ప్రకారం శాస్త్రీయ పరిశోధనల నాణ్యత, ఉత్పాదకతలో కోల్‌కతా దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది.)

◆ 'గుర్రాల భూమి' (ల్యాండ్ ఆఫ్ హార్సెస్)గా పేరు పొందిన దేశం ఏది?

జ: మంగోలియా (మంగోలియాలో మనుషుల కంటే (దాదాపు 3.5 మిలియన్ల జనాభా) గుర్రాల సంఖ్య (దాదాపు 4 మిలియన్లు) ఎక్కువగా ఉంటుంది. మంగోలియాలో సుమారు 30% ప్రజలు సంచార (నోమాడిక్) జీవనాన్ని గడుపుతున్నారు. వీరి దైనందిన పనులకు, రవాణాకు గుర్రాలు అత్యంత కీలకంగా ఉన్నాయి).

మరింత సమాచారం

◆ భారతదేశ యాలకుల నగరం (కార్డమామ్ సిటీ ఆఫ్ ఇండియా) అని ఏ నగరాన్ని పిలుస్తారు? జ: బోడినాయకనూర్

సహజమైనా.. మానవ కారకమైనా.. విధ్వంసమే!



విపత్తులంటే భూకంపం, సునామీ మొదలైన తీవ్రత ఎక్కువగా ఉండే ప్రమాదాలే కాదు. వాతావరణం కాలానుగుణంగా మారడం వల్ల ఒక్కసారిగా ముంచుకొచ్చే విపరీత పరిస్థితులూ వాటి కిందకే వస్తాయి. సాధారణ పరిణామాలుగా కనిపించే వడ గాలులు, చలిగాలులు కూడా ఒక్కోసారి ప్రాణాంతకమవుతాయి. గాలివాన, వడగళ్లు లాంటివి అధిక ప్రాణ, ఆస్తి నష్టాలను మిగులుస్తాయి. వాటితోపాటు మానవ నిర్లక్ష్యం, ఆధిపత్య భావజాలం, అలజడులు సృష్టించే లక్ష్యంతో జరిగే అతివాద, తీవ్రవాద సంఘటనలు పెను విధ్వంసాలకు మూలాలుగా మిగులుతున్నాయి. ఇలాంటి విపత్తులు, వాటి సామూహిక ప్రభావాల గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. దేశంలో అలాంటి పరిస్థితులు ఉన్న ప్రాంతాలు, వివిధ రకాల మానవ కారక విపత్తులకు సంబంధించిన ఉదాహరణలను గుర్తుంచుకోవాలి.

జనరల్ స్టడీస్ - విపత్తు నిర్వహణ

వేడి గాలులు

వేసవి కాలంలో వాతావరణ అననుకూల పరిస్థితులతో ఎక్కువ వేడితో కూడిన గాలులు వీస్తాయి. ఈ పరిస్థితి వర్షాకాలం కంటే ముందుగానే వచ్చి జూన్ వరకు కొనసాగుతుంది. అసాధారణ స్థితుల్లో జులై వరకూ ఉండవచ్చు. దేశంలో వేడిగాలులు ఎక్కువగా తూర్పు, పశ్చిమ మధ్య ప్రాంతాల్లో సంభవిస్తాయి. ఇటీవలి కాలంలో వేడి గాలుల తీవ్రత పెరుగుతుండటం మరణాల రేటును ప్రభావితం చేస్తోంది. ◆ దేశం మొత్తం 2002, ఏప్రిల్‌లో అసాధారణ హెచ్చు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 2002, మే 10న అత్యంత హెచ్చు ఉష్ణోగ్రత విజయవాడ వద్ద గన్నవరంలో 49 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ◆ డ్యూర్నల్ టెంపరేచర్ రేంజ్ (డీటీఆర్) తగ్గడం వల్ల పట్టణ ప్రాంతాల్లో మానవ మరణాల రేటు పెరుగుతోంది. వేసవిలో ఉష్ణోగ్రత పెరిగినప్పుడు, రాత్రి పూట చల్లదనం తగ్గి, వేడిగాలుల తాకిడితో ఉష్ణోగ్రత మరింత పెరుగుతుంది.

చలిగాలులు, పొగమంచు

ఉపఖండంలోకి ఉత్తరం వైపు నుంచి అత్యల్ప ఉష్ణోగ్రతతో గాలులు వీయడాన్ని చలిగాలులుగా పరిగణిస్తారు. ఈ స్థితితో తూర్పు ప్రాంతంలో అకస్మాత్తుగా చల్లని పవనాలు వీస్తాయి, పశ్చిమ ప్రాంతాల్లో గందరగోళ పరిస్థితులు ఏర్పడతాయి. చలిగాలులు ప్రధానంగా 20 డిగ్రీల ఉత్తర-తూర్పు ప్రాంతంలో మొదలై, విస్తార పవనాలుగా మారతాయి. మహారాష్ట్ర, కర్ణాటకలోనూ వీటి ఉనికి ఉంది. ఇటీవలి కాలంలో పట్టణ ప్రాంతాలతో పాటు ఉత్తర్‌ప్రదేశ్, బిహార్‌లో ఇళ్లు లేని పేదలు చలిగాలుల తాకిడికి మరణిస్తున్నారు.



ఉరుములతో కూడిన గాలివాన, వడగళ్లవాన, ధూళి తుపాను

శీతాకాలంలో దక్షిణ ప్రాంతంలో ఉరుములతో కూడిన గాలివాన, ధూళి తుపానులు, వడగళ్ల వాన ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇలాంటి ప్రమాదకర వాతావరణమే మధ్య, ఈశాన్య, ఉత్తర, వాయవ్య ప్రాంతాల్లో తలెత్తుతోంది. వడగళ్ల ప్రభావం అస్సాం లోయలో తీవ్రంగా ఉంది. ఉత్తరాఖండ్, ఝార్ఖండ్, మహారాష్ట్రలోని విదర్భలోనూ ఉంటుంది. ఉరుములతో కూడిన గాలివానలు కోల్‌కతా, దిల్లీ, జైపుర్, అహ్మదాబాద్‌లోనూ సంభవించాయి. ◆ సాధారణంగా పెను తుపానుతో కూడిన గాలివాన దేశంలో అరుదు. అవి వచ్చినప్పుడు మాత్రం విధ్వంసం ఎక్కువగా జరుగుతుంది.



సామూహిక విధ్వంసక ఆయుధాలు

అణు, రసాయన, పారిశ్రామిక, జీవ ఆయుధాలను ఉపయోగించి ఎక్కువ సంఖ్యలో ప్రాణనష్టాన్ని కలిగించే ఆయుధ సంపత్తినే 'సామూహిక విధ్వంసక ఆయుధాలు' అంటారు. ఈ మాట 2003 నుంచి బాగా వాడుకలోకి వచ్చింది. న్యూక్లియర్, రసాయన, బయోలాజికల్, రేడియోలాజికల్ ఆయుధాలు ఈ కోవలోకి వస్తాయి.

అణ్వాయుధాలు: కేంద్రక విచ్ఛిత్తి, సంలీన చర్యల ద్వారా విధ్వంసక శక్తిని పొందే విస్ఫోట ఆయుధాన్నే అణ్వాయుధం అంటారు. తక్కువ సామర్థ్యం ఉన్న అణుబాంబు సైతం అతిపెద్ద సంప్రదాయ ఆయుధాల కంటే శక్తిమంతమైనది. అణుబాంబుల కంటే హైడ్రోజన్ బాంబులు వెయ్యి రెట్లు ఎక్కువ విధ్వంసం సృష్టిస్తాయి.

మానవకారక విపత్తులు

మానవ నిర్లక్ష్యం, అశ్రద్ధ, స్వార్థపూరిత చర్యలతో మానవకారక వైపరీత్యాలు సంభవిస్తాయి. దేశ ఆర్థిక వ్యవస్థ, ఉత్పాదక సామర్థ్యాలకు దీర్ఘకాల నష్టాన్ని కలిగిస్తాయి. సహజ విపత్తులతో పోల్చుకుంటే వీటి వల్లే ప్రమాదం ఎక్కువగా జరుగుతోంది. మానవ కారక విపత్తులు సామాజిక పరమైనవి, సాంకేతిక పరమైనవి అని రెండు రకాలుగా ఉంటాయి.

సామాజికపరమైన మానవ కారక విపత్తులు: సమాజంలో ప్రజల మానసిక ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడం, రాజకీయ అలజడి, పౌర తిరుగుబాట్లు, పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, ఉగ్రవాదం, తీవ్రవాద చర్యలు, తొక్కిసలాటలు.

సాంకేతికపరమైన మానవ కారక విపత్తులు: రోడ్డు,



హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లో బాంబు పేలుళ్లు (2013)

రైల్వే ప్రమాదాలు; అగ్ని ప్రమాదాలు, వివిధ ప్రయోగాల సమయంలో విషవాయువులు విడుదల కావడం, న్యూక్లియర్ రియాక్టర్లు దెబ్బతినడం, పెద్ద పెద్ద నిర్మాణాలు కూలిపోవడం. మనిషి బాధ్యతారాహిత్యం వల్ల జరిగేవే 'మానవ కారక విపత్తులు'.

ఉదా: భోపాల్ గ్యాస్ దుర్ఘటన (1984), దిల్లీలో ఉపహార్ సినిమా హాల్ అగ్ని ప్రమాదం (1997), రాజధాని ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడం (2002), తమిళనాడులోని కుంభకోణం పాఠశాలలో అగ్ని ప్రమాదం (2003), హైదరాబాద్‌లో దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్లు (2013).

తీవ్రవాదం/ఉగ్రవాదం

ఆయుధాలతో దాడులు, ఆత్మాహుతి దాడులు, విమానాలు/ రైళ్లను హైజాక్ చేయడం, ప్రాణ, ఆస్తి నష్టం సృష్టించి రాజకీయ, మతపరమైన లక్ష్యాల సాధన కోసం అవలంబించే హింసాత్మక విధానాలను తీవ్రవాదం అంటారు. **ఉదా:** 2001లో న్యూయార్క్‌లో హైజాక్ చేసిన విమానాలతో భవనాలను ఢీకొట్టారు.

రసాయన విపత్తులు

◆ 1984, డిసెంబరు 3న భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ ఇండియా లిమిటెడ్ అనే పురుగు మందుల తయారీ ప్లాంటులో జరిగిన విస్ఫోటంతో వేల మంది మరణించారు. మిథైల్ ఐసోసైనేట్ అనే విషవాయువు విడుదలతో ఊపిరాడక దాదాపు 3000 మంది మరణించారు. ◆ 2020, మే 2న వైజాగ్‌లోని పాలిమర్స్ పరిశ్రమ నుంచి స్టైరిన్ గ్యాస్ విడుదలై 12 మంది మరణించారు.

బయోలాజికల్ విపత్తులు

రోగకారక సూక్ష్మజీవులను ఒక ప్రదేశంలో వ్యాప్తి చెందించడం వల్ల ఏర్పడే విపత్తులను బయోలాజికల్ విపత్తులు అంటారు. వీటిని సంఘ విద్రోహులు లేదా తీవ్రవాదులు జరిపితే 'బయో టెర్రరిజం'గా పిలుస్తారు. జీవాయుధాలను తయారుచేయడం, ప్రయోగించడం సులువు.

రేడియోధార్మిక విపత్తులు

రేడియోధార్మిక పదార్థంతో ప్రాణ, ఆస్తి నష్టాలతో పాటు పర్యావరణానికి హాని కలిగించే వాటిని రేడియోధార్మిక విపత్తులు అంటారు.



రచయిత: సక్కరి జయకర్

సీనియర్ ఇంటర్ రసాయనశాస్త్రం

లోహ నిష్కర్షణలో ప్రాథమిక సూత్రాలు



ఫైనల్ పరీక్షలు 2026 — ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

2 మార్కులు

1. ప్లవన ప్రక్రియలో నిమ్నకారుల పాత్ర ఏమిటి?

జ: ప్లవన ప్రక్రియలో నిమ్నకారులను ఉపయోగించడం ద్వారా రెండు సల్ఫైడ్ ధాతువులను వేరుచేయడం సాధ్యమవుతుంది.

ఉదా: ZnS, PbS కలిగిన ధాతువులో NaCN ను నిమ్నకారిణిగా వాడతారు. ఇది ZnS ను నురుగలోనికి రాకుండా అడ్డుకొని PbSను నురుగలోకి వచ్చేటట్లు చేస్తుంది.

2. కాపర్ లోహ నిష్కర్షణంలో సిలికా పాత్రను తెలపండి.

జ: కాపర్ లోహ నిష్కర్షణలో సిలికా ఆమ్లాన్ని ద్రావకారిగా ఉపయోగిస్తారు. ఐరన్‌లోని మలినాలతో సిలికా చర్యజరిపి లోహ మలాన్ని ఏర్పరుస్తుంది.

$$FeO + SiO_2 \longrightarrow FeSiO_3$$

గాంగ్ ద్రావకారి లోహమలం

3. 'పోలింగ్'ను విశదీకరించండి.

జ: లోహాలతో ఆయాలోహాల ఆక్సైడ్లు మలినాలుగా ఉన్న సందర్భాల్లో ఈ పద్ధతిని ఉపయోగిస్తారు. మలిన లోహాన్ని ద్రవస్థితిలోకి మార్చి కార్బన్ పొడితో కప్పి, పచ్చి కర్రలతో కలుపుతారు. పచ్చి కర్రలు, కార్బన్ నుంచి వెలువడిన క్షయకరణ వాయువులు లోహ ఆక్సైడ్‌ను తిరిగి శుద్ధ లోహంగా మారుస్తాయి.

ఉదా: Cu, Sn లోహాలను ఈ పద్ధతిలో శోధనం చేస్తారు.

4. ఖనిజం, ముడిఖనిజాల(ధాతువు) మధ్య తేడా ఏమిటి?

జ: ఖనిజం: భూమి పైపొరల్లో సహజసిద్ధంగా లభించేది ఖనిజం. లోహం రసాయన సమ్మేళనాలను ఖనిజాలు అంటారు.

ముడిఖనిజాలు: ఖనిజాల్లో కొన్నింటిని మాత్రమే రసాయనికంగా, వాణిజ్యపరంగా లోహ నిష్కర్షణకు ఉపయోగిస్తారు. ఈ ఖనిజాలను ధాతువులు అంటారు.

4 మార్కులు

1. మండల శోధనను వివరించండి.

జ: మలినాలు ఘనస్థితిలో ఉన్న లోహంలో కంటే గలనస్థితిలో ఉండే లోహంలో ఎక్కువ కరిగి ఉంటాయనే నియమం మీద ఈ పద్ధతి ఆధారపడి ఉంది. అపరిశుద్ధ లోహపు కడ్డీకి ఒక చివర తిరిగే వృత్తాకార తాపకం బిగించి ఉంటుంది. ముందుకు తిరిగే తాపకంతో పాటు గలన మండలం తిరుగుతుంది. తాపకం ముందుకు జరుగుతున్న కొద్దీ, గలనం నుంచి శుద్ధలోహం స్ఫటికీకరణం చెందుతుంది. మలినాలు పక్కనున్న గలన మండలంలోకి వెళతాయి. ఈ ప్రక్రియను అనేకసార్లు పునరావృతం చేస్తారు. తాపకం ఒకేదిశలో ఒక చివర నుంచి ఇంకొక చివరకు తిరుగుతూ ప్రయాణిస్తుంది. ఒక చివరన మలినాలు సాంద్రీకరణం చెందుతాయి. ఈ చివరే సరిహద్దు. (cut off). చాలా ఎక్కువ స్వచ్ఛత ఉన్న అర్ధవాహక శ్రేణి లోహాలను పొందడానికి ఈ పద్ధతి చాలా ఉపయోగకరం.


ఉదా: జెర్మేనియం, సిలికాన్, బోరాన్, గాలియం, ఇండియం.

మరికొన్ని ప్రశ్నలు-జవాబులు



రచయిత: డాక్టర్ పి. త్రినాథరాజా

తేనెటీగ కుట్టినా.. దూలగొండి గుచ్చుకున్నా!



చాలామంది ఉదయాన్నే తాగే నిమ్మరసం పుల్లగా ఉంటుంది. స్నానం చేసేటప్పుడు పొరబాటున నోట్లోకి వెళ్లే సబ్బు నీరు చేదుగా ఉంటుంది. వీటికి పూర్తి భిన్నంగా కూరల్లో వేసే ఉప్పు ఉప్పగా ఉంటుంది. అవన్నీ అలా ఎందుకు ఉన్నాయని ఆలోచిస్తే రసాయనశాస్త్రంలో సమాధానాలు దొరుకుతాయి. వంటగదిలోని చింతపండు నుంచి ప్రయోగశాలలోని గంధకామ్లం వరకు, దుస్తులు ఉతికే సోడా నుంచి పొట్టలోని గ్యాస్ట్రిక్ రసాల వరకు అన్నీ ఆమ్లాలు లేదా క్షారాలు లేదా లవణాల పరిధిలోకి వస్తాయి. అవి జీవక్రియలను నడిపించే చైతన్య శక్తులు. ఒకదానితో ఒకటి కలిసినప్పుడు రసాయన అద్భుతాలను సృష్టిస్తాయి. పదార్థాల రుచుల వెనుక ఉండే రహస్యాలను కనుక్కోవాలంటే పోటీ పరీక్షార్థులు ఆమ్లాలు, క్షారాలు, లవణాల గురించి తెలుసుకోవాలి. దాంతోపాటు వాటి స్వభావాలను, నిత్య జీవితంలో ఉపయోగాలను ఉదాహరణలతో అర్థం చేసుకోవాలి.

ఆమ్లాలు - క్షారాలు, లవణాలు

1. కిందివాటిని జతపరచండి.

పదార్థం	ఆమ్లం
ఎ) ఉసిరి	1) టార్టారిక్ ఆమ్లం
బి) చింతపండు	2) ఆగ్జాలిక్ ఆమ్లం
సి) టమాటా	3) ఆస్కార్బిక్ ఆమ్లం
డి) ఆపిల్	4) మాలిక్ ఆమ్లం

1) ఎ-4, బి-2, సి-1, డి-3
2) ఎ-4, బి-1, సి-2, డి-3
3) ఎ-3, బి-1, సి-2, డి-4
4) ఎ-2, బి-1, సి-3, డి-4

2. కిందివాటిలో కర్బన ఆమ్లం ఏది?
1) నత్రికామ్లం 2) సల్ఫ్యూరిక్ ఆమ్లం
3) హైడ్రోక్లోరిక్ ఆమ్లం 4) మిథనోయిక్ ఆమ్లం

3. కిందివాటిలో అలోహపు ఆక్సైడ్ కానిది?
1) MgO 2) CO_2 3) SiO_2 4) SO_2

4. ద్రాక్ష పండ్లలో ఉన్న ఆమ్లం?



1) స్టియరిక్ ఆమ్లం
2) ఆగ్జాలిక్ ఆమ్లం
3) ఎసిటిక్ ఆమ్లం
4) టార్టారిక్ ఆమ్లం

5. కిందివాటిలో ఆమ్ల ఆక్సైడ్ ఏర్పరిచేది?
1) మెగ్నీషియం 2) అల్యూమినియం
3) సోడియం 4) ఫాస్ఫరస్

6. సిరా మరకలు తొలగించడానికి వాడే పదార్థం?
1) ఆగ్జాలిక్ ఆమ్లం 2) అమ్మోనియా ద్రావణం
3) హైపో 4) ఎసిటిక్ ఆమ్లం

7. గ్రీజు మరకలు తొలగించడానికి వాడే పదార్థం?
1) అల్యూమినియం హైడ్రాక్సైడ్
2) అమ్మోనియం హైడ్రాక్సైడ్
3) సోడియం హైడ్రాక్సైడ్
4) క్యాల్షియం హైడ్రాక్సైడ్

8. వాక్యం (ఎ): అలోహాలు ఆక్సిజన్‌తో కలిసి అలోహపు ఆక్సైడ్‌లను ఏర్పరుస్తాయి.
వాక్యం (బి): అలోహపు ఆక్సైడ్‌లు ఆమ్ల స్వభావాన్ని ప్రదర్శిస్తాయి.
1) ఎ, బి లు రెండూ సత్యం
2) ఎ సత్యం, బి అసత్యం
3) ఎ అసత్యం, బి సత్యం
4) ఎ, బి లు రెండూ అసత్యం

9. ఆమ్ల స్వభావం ఉన్న పదార్థాలు?
1) ఎరుపు లిట్మస్ పేపర్‌ను నీలి రంగుకు మారుస్తాయి.
2) నీలి లిట్మస్ పేపర్‌ను ఎరుపు రంగులోకి మారుస్తాయి.
3) మిథైల్ ఆరెంజ్ సూచికను నీలి రంగుకు మారుస్తాయి.
4) ఫినాప్తలిన్‌ను పసుపురంగుకు మారుస్తాయి.

10. దూలగొండి మొక్క ఆకులపై ఉండే ముళ్లు గుచ్చుకున్నప్పుడు అవి మన శరీరంలోకి ప్రవేశపెట్టే ఆమ్లం?
1) ఎసిటిక్ ఆమ్లం
2) ఫార్మిక్ (మిథనోయిక్) ఆమ్లం
3) నత్రికామ్లం 4) టార్టారిక్ ఆమ్లం

11. వాక్యం (ఎ): ఆమ్లాలు నీటిలో H_2O^+, H^+ అయాన్‌లను ఇస్తాయి.
వాక్యం (బి): క్షారాలు నీటిలో OH^- అయాన్‌లను ఇస్తాయి.
1) ఎ, బి లు రెండూ సత్యం
2) ఎ సత్యం, బి అసత్యం
3) ఎ అసత్యం, బి సత్యం
4) ఎ, బి లు రెండూ అసత్యం

12. క్షార ద్రావణంలో ఫినాప్తలిన్ సూచిక రంగు?



1) పసుపు
2) పింక్
3) ఆకుపచ్చ
4) ఆరెంజ్

13. నీటిలో కరిగే క్షారాలను .....అంటారు?
1) తటస్థం 2) ఆమ్లయుతాలు
3) క్షారయుతాలు (ఆల్కలీ) 4) పైవేవీకావు


14. లోహాలు ఆమ్లాలతో చర్య జరిపినప్పుడు విడుదలయ్యే వాయువు?
1) ఆక్సిజన్ 2) కార్బన్‌డయాక్సైడ్
3) నైట్రోజన్ 4) హైడ్రోజన్

15. ఒక ద్రావణం పగిలిన కోడిగుడ్డు పొట్టుతో చర్య జరిపినప్పుడు విడుదలయ్యే వాయువు సున్నపుతేటను పాలలా మార్చింది. ఆ ద్రావణాన్ని గుర్తించండి.
1) NaCl 2) KCl 3) LiCl 4) HCl

16. జీర్ణాశయం ఉత్పత్తి చేసే ఆమ్లం?
1) హైడ్రోక్లోరిక్ ఆమ్లం 2) సల్ఫ్యూరిక్ ఆమ్లం
3) నత్రికామ్లం 4) కార్బోనిక్ ఆమ్లం

17. తేనెటీగ కుట్టినచోట నొప్పి తీవ్రత తగ్గడానికి కింది వాటిలో దేనితో రుద్దుతాం?
1) వాషింగ్ సోడా 2) వంటసోడా
3) కాస్టిక్ సోడా 4) కాస్టిక్ పొటాష్

18. దూలగొండి మొక్క ముళ్లు గుచ్చుకున్నప్పుడు ఉపశమనం కోసం కింది ఏ ఆకులతో రుద్దుతారు?



1) వేప ఆకు
2) తులసి ఆకు
3) దుష్టిపాకు
4) ఉసిరి ఆకు

19. కిందివాటిలో సరికాని సమీకరణాన్ని కనుక్కోండి.
1) ఆమ్లం + లోహం → లవణం + హైడ్రోజన్ వాయువు
2) లోహ కార్బోనేట్ + ఆమ్లం → లవణం + కార్బన్‌డయాక్సైడ్ + నీరు
3) లోహ ఆక్సైడ్ + ఆమ్లం → లవణం + నీరు
4) లోహహైడ్రోజన్ కార్బోనేట్ + ఆమ్లం → లవణం + నీరు

20. మందారపువ్వు ఆమ్లంతో ఇచ్చే రంగు ఎరుపు అయితే, క్షారంతో ఇచ్చే రంగు ఏది?
1) పింక్ 2) పసుపు 3) నీలి 4) ఆకుపచ్చ

జనరల్ స్టడీస్ - రసాయనశాస్త్రం

21. కిందివాటిలో ఎరుపు లిట్మస్‌ను నీలి లిట్మస్‌గా మార్చని పదార్థం ఏది?
1) అమ్మోనియం హైడ్రాక్సైడ్
2) పొటాషియం హైడ్రాక్సైడ్
3) క్యాల్షియం హైడ్రాక్సైడ్ 4) వెనిగర్

22. కిందివాటిలో లోహ ఆక్సైడ్ కానిది ఏది?
1) కార్బన్‌డయాక్సైడ్ 2) క్యాల్షియం ఆక్సైడ్
3) సోడియం ఆక్సైడ్ 4) మెగ్నీషియం ఆక్సైడ్

23. నిశ్చయం (ఎ): అన్ని క్షారాలు ఆల్కలీ కావు.
కారణం (ఆర్): నీటిలో కరిగే క్షారాలను మాత్రమే ఆల్కలీ అంటారు.
1) ఎ, ఆర్ రెండూ సరైనవి, ఆర్ అనేది ఎ కు సరైన వివరణ
2) ఎ, ఆర్ రెండూ సరైనవి, కాని ఆర్ అనేది ఎ కు సరైన వివరణ కాదు.
3) ఎ సరైంది, ఆర్ సరికాదు.
4) ఎ సరికాదు, ఆర్ సరైంది.

24. కిందివాటిని జతపరచండి.

ఎ) సోడియం హైడ్రాక్సైడ్	1) బ్యాటరీల్లో ఉపయోగిస్తారు
బి) సల్ఫ్యూరిక్ ఆమ్లం	2) సబ్బు తయారీ
సి) క్యాల్షియం హైడ్రాక్సైడ్	3) తెల్లసున్నం
డి) అమ్మోనియం	4) క్లీనింగ్ ఏజెంట్

1) ఎ-2, బి-1, సి-3, డి-4
2) ఎ-1, బి-2, సి-3, డి-4
3) ఎ-2, బి-1, సి-4, డి-3
4) ఎ-1, బి-3, సి-2, డి-4

25. ఎరుపు లిట్మస్‌ను నీలిరంగుగా మార్చే పదార్థం.



1) ద్రాక్ష రసం 2) నిమ్మరసం
3) ఆలివ్ ఆయిల్ 4) సబ్బునీరు

26. బ్రైన్ ద్రావణం అంటే?
1) NaCl జల ద్రావణం
2) CH_3COOH ద్రావణం
3) KOH ద్రావణం 4) NaOH ద్రావణం

27. pH మానం ప్రవేశపెట్టిన శాస్త్రవేత్త?
1) అర్హీనియస్ 2) సోరెన్‌సన్
3) బ్రాన్‌స్టెడ్ - లౌరి 4) లూయిస్

28. pH 7 కంటే ఎక్కువ ఉన్న ద్రవం?



1) గ్యాస్ట్రిక్ ద్రవం
2) వెనిగర్
3) పాలు
4) రక్తం

29. pH విలువ 2గా ఉన్న ద్రావణం?
1) బలమైన ఆమ్లం 2) బలమైన క్షారం
3) బలహీనమైన ఆమ్లం
4) బలహీనమైన క్షారం

30. pH విలువ 12 కంటే ఎక్కువ ఉన్న ద్రావణం?
1) బలమైన ఆమ్లం 2) బలహీనమైన ఆమ్లం
3) బలమైన క్షారం 4) బలహీనమైన క్షారం

31. కిందివాటిని జతపరచండి.

ఎ) చాకలిసోడా	1) $CaOCl_2$
బి) వంటసోడా (బేకింగ్‌సోడా)	2) $CaSO_4.2H_2O$
సి) జిప్సం	3) $Na_2CO_3.10H_2O$
డి) బ్లీచింగ్ పౌడర్	4) $NaHCO_3$

1) ఎ-3, బి-1, సి-2, డి-4
2) ఎ-3, బి-4, సి-2, డి-1
3) ఎ-3, బి-4, సి-1, డి-2
4) ఎ-4, బి-3, సి-2, డి-1

32. కిందివాటిని జతపరచండి.

ఎ) pH = 7	1) తటస్థ ద్రావణం
బి) pH < 7	2) బలమైన క్షారం
సి) pH > 7	3) ఆమ్ల ద్రావణం
డి) pH = 14	4) క్షార ద్రావణం

1) ఎ-2, బి-3, సి-4, డి-1
2) ఎ-1, బి-3, సి-2, డి-4
3) ఎ-1, బి-2, సి-4, డి-3
4) ఎ-1, బి-3, సి-4, డి-2

33. నిశ్చయం (ఎ): గాఢ ఆమ్లాన్ని నీటితో కలుపుతున్నప్పుడు, ఎప్పుడూ ఆమ్లానికి నీటిని కలపకూడదు.
కారణం (ఆర్): ఆమ్లానికి నీటిని కలపడం అనేది అత్యంత ఉష్ణమోచకచర్య, ఇది ప్రమాదకరం.
1) ఎ, ఆర్ రెండూ సరైనవి, ఆర్ అనేది ఎ కు సరైన వివరణ.
2) ఎ, ఆర్ రెండూ సరైనవి, కాని ఆర్ అనేది ఎ కు సరైన వివరణ కాదు.
3) ఎ సరైంది, ఆర్ సరికాదు.
4) ఎ సరికాదు, ఆర్ సరైంది.

34. బలమైన ఆమ్లం, బలమైనక్షారం మధ్య చర్య వల్ల ఏర్పడిన లవణం pH విలువ?
1) 0 2) 7
3) 7 కంటే తక్కువ 4) 7 కంటే ఎక్కువ

35. బలమైన ఆమ్లం, బలహీనమైన క్షారం వల్ల ఏర్పడే లవణం?



1) KCl
2) CH_3COONa
3) H-COOK
4) NH_4Cl

36. ప్లాస్టర్ ఆఫ్ పారిస్: $CaSO_4.\frac{1}{2}H_2O$ :: ఆర్ద్ర కాపర్ సల్ఫేట్ : ....
1) $CuSO_4.7H_2O$ 2) $CuSO_4$
3) $CuSO_4.5H_2O$ 4) $MgSO_4.7H_2O$

37. ఎముకలు అతికించడానికి వేసే కట్టులో వాడేది?
1) సిమెంట్ 2) ప్లాస్టర్ ఆఫ్ పారిస్
3) జిప్సం 4) సున్నం

38. రసాయనాలకు రాజు అని దేనికి పేరు?
1) HNO_3 2) H_2SO_4
3) HCl 4) CH_3COOH

39. క్లోరో ఆల్కలీ ప్రక్రియలో ఏర్పడే ఉత్పన్నాలు?
1) క్లోరిన్ 2) సోడియం హైడ్రాక్సైడ్
3) హైడ్రోజన్ 4) పైవన్నీ

40. క్లోరోఫాం తయారీలో వాడేది?
1) వంట సోడా 2) బేకింగ్ సోడా
3) బ్లీచింగ్ పౌడర్ 4) కాస్టిక్ సోడా



రచయిత: ఎస్. రామకృష్ణ

సమాధానాలు

1-3, 2-4, 3-1, 4-4, 5-4, 6-1, 7-2, 8-1, 9-2, 10-2, 11-1, 12-2, 13-3, 14-4, 15-4, 16-1, 17-2, 18-3, 19-4, 20-4, 21-4, 22-1, 23-1, 24-1, 25-4, 26-1, 27-2, 28-4, 29-1, 30-3, 31-2, 32-4, 33-1, 34-2, 35-4, 36-3, 37-2, 38-2, 39-4, 40-3.

విచక్షణతో ఉపయోగిస్తే మేలు..
నియంత్రణ కోల్పోతే చేటు!

కేంద్రక శక్తి

న్యూట్రాన్లు, ప్రోటాన్లను కలిపి సంయుక్తంగా న్యూక్లియన్లు అంటారు. న్యూక్లియన్ల సంఖ్యనే ద్రవ్యరాశి సంఖ్య అని పిలుస్తారు. ప్రోటాన్ల సంఖ్యను పరమాణు సంఖ్యగా పేర్కొంటారు. ఒకే పరమాణు సంఖ్యను, వేర్వేరు పరమాణు భారం సంఖ్య విలువలను కలిగిన న్యూక్లైడ్‌లను ఐసోటోపులు అంటారు. ఒకే పరమాణు భారం, వేర్వేరు పరమాణు సంఖ్యను కలిగిన కేంద్రకాలను ఐసోబార్‌లుగా పేర్కొంటారు. కేంద్రకంలోని న్యూక్లియన్లు పట్టి ఉంచే బలాలను కేంద్రక బలాలు అంటారు.

పరమాణు సంఖ్య 83 కంటే ఎక్కువ ఉండే మూలకాల కేంద్రకాలు అస్థిరంగా ఉంటాయి. ఇలాంటి కేంద్రకాల నుంచి α, β, γ వికిరణాలు విడుదలవుతాయి. సహజంగా లభించే యురేనియం $^{235}_{92}U$ లేదా $^{238}_{92}U$ మూలకాలు రేడియోధార్మికతను కలిగి ఉండి అస్థిరంగా ఉంటాయి. ఇవి శక్తిమంతమైన వికిరణాలను విడుదల చేస్తూ చివరికి స్థిరంగా ఉండే సీసం ($_{82}Pb$) ఐసోటోపుగా పరివర్తనం చెందుతాయి. ఇలా సహజంగా జరిగే విఘటనంలో 1 MeV నుంచి 5 MeV (మిలియన్ ఎలక్ట్రాన్ వోల్ట్) శక్తి విడుదలవుతుంది. అయితే ఈ శక్తిని మానవాళికి ఉపయోగపడేలా చేయవచ్చా అనే ఆలోచన నుంచి ఉద్భవించిందే అణుశక్తి లేదా కేంద్రక శక్తి అనే భావన.

▼ అస్థిర కేంద్రకాన్ని రెండు, అంతకంటే ఎక్కువ భాగాలుగా విడగొడితే ద్రవ్యరాశి, శక్తి స్థాయిలో మార్పు జరిగి ఎక్కువ శక్తి విడుదలయ్యే అవకాశం ఉంటుంది. ఈ దృగ్విషయాన్ని ఆధారంగా చేసుకుని 1939లో జర్మన్‌కు చెందిన శాస్త్రవేత్త ఓట్టోహాన్, ఆయన అనుచరులు లీస్ మెయిట్‌నెర్, ఫ్రిట్జ్ స్ట్రాస్‌మన్‌లు ఒక ఆవిష్కరణ చేశారు.

▼ $^{235}_{92}U$ (యురేనియం) కేంద్రకాన్ని ముందుగా రెండు భాగాలుగా విడగొడితే దాదాపు 200 MeV శక్తి విడుదలవుతుందని కనుక్కున్నారు. ఇది సహజంగా విడుదలయ్యే 5 MeV కంటే చాలా ఎక్కువ. ప్రతి యురేనియం కేంద్రకం నుంచి 200 MeV శక్తి విడుదలైతే ఎక్కువ మొత్తంలో శక్తి వస్తుందని ఈ పరిశోధన ద్వారా తెలియజేశారు.

భారత్‌లో అణురియాక్టర్లు - విద్యుదుత్పత్తి

భారత్‌లో విద్యుత్ అవసరాలు తీర్చేందుకు అణుశక్తి ఒక ముఖ్యమైన వనరు. ప్రస్తుతం 7 అణు విద్యుత్ ప్లాంట్లు, 22 పైగా అణురియాక్టర్లతో దాదాపు 7000 మెగావాట్ విద్యుత్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. కీలకమైన అణు విద్యుత్ ప్లాంట్లను దేశ శాంతియుత అవసరాలు, సామాన్య ప్రజల శక్తి అవసరాల కోసం ఏర్పాటు చేశారు.

కుడంకుళం	–	తమిళనాడు
తారాపూర్	–	మహారాష్ట్ర
రావత్‌భట	–	రాజస్థాన్
కాక్రాపర్	–	గుజరాత్
కైగా	–	కర్ణాటక
నరోరా	–	ఉత్తర్‌ప్రదేశ్
కల్పక్కం	–	తమిళనాడు

❒ భవిష్యత్‌లో ఈ రంగం ద్వారా మరింత విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు చిన్న మాడ్యులర్ రియాక్టర్లను (SMR) 2033 నాటికి కనీసం అయిదింటిని తయారుచేయాలని భారత్ సంకల్పించింది. అదేవిధంగా ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్లు మరింత సామర్థ్యంతో ప్లూటోనియం ఇంధనంగా కల్పక్కంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 2047 నాటికి 100 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని కేంద్రక శక్తి ద్వారా సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది.

కేంద్రక విచ్ఛిత్తి

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఫిజిక్స్

^{235}U కేంద్రకాలను న్యూట్రాన్‌తో తాడనం చేసినప్పుడు మొదట యురేనియం న్యూట్రాన్‌ను శోషించుకుంటుంది. అనంతరం ఈ సంయుక్త కేంద్రకం అస్థిరంగా మారి రెండు సమభాగాలుగా విడిపోతుంది. ఈ ప్రక్రియనే 'కేంద్రక విచ్ఛిత్తి' అంటారు.

◆ ఒక భార కేంద్రకాన్ని న్యూట్రాన్లతో తాడనం చేసి, రెండు దాదాపు సమభారాలున్న కేంద్రకాలుగా విడదీసే ప్రక్రియను కేంద్రక విచ్ఛిత్తి అంటారు. ఈ ప్రక్రియలో అధిక మొత్తంలో శక్తి విడుదలవుతుంది.

$$^{235}_{92}U + ^{1}_{0}n \longrightarrow [^{236}_{92}U] \longrightarrow ^{141}_{56}Ba + ^{92}_{36}Kr + 3\,^{1}_{0}n + 200\ MeV$$


(యురేనియం) (న్యూట్రాన్) (బేరియం) (క్రిప్టాన్) (శక్తి)

◆ ప్రతి యురేనియం కేంద్రకం నుంచి దాదాపు 200 MeV శక్తి చొప్పున ఒక చిన్న నమూనా యురేనియం తీసుకుంటే అధిక మొత్తంలో శక్తి విడుదలవుతుంది.

◆ పై చర్యలో ఒక న్యూట్రాన్‌ను ఉపయోగించి తాడనం చేయగా, చర్య చివరలో మళ్లీ మూడు న్యూట్రాన్‌లు ఉత్పత్తి అవుతాయి. ఈ మూడు న్యూట్రాన్లు పక్కన ఉన్న మరో మూడు యురేనియం కేంద్రకాలతో $^{235}_{92}U$ చర్య జరిపి మిగతా వాటితోపాటు $3 \times 3 = 9$ న్యూట్రాన్లను ఉత్పత్తి చేస్తాయి. ఈ 9 న్యూట్రాన్లు మరొక 9 $^{235}_{92}U$ లతో చర్య జరిపి $9 \times 3 = 27$ న్యూట్రాన్లను, శక్తిని ఉత్పత్తి చేస్తాయి. ఇలా ఒక గొలుసు మాదిరి ఈ చర్య కొనసాగుతూనే ఉంటుంది. కాబట్టి దీన్ని శృంఖల చర్య (Chain Reaction) అంటారు.

◆ శృంఖల చర్యలో జరిగే కేంద్రక విచ్ఛిత్తులు సెకన్‌లో లక్ష వంతు కాలంలో జరుగుతాయి. కాబట్టి వీటిని అనియంత్రిత శృంఖల చర్యలు అంటారు. ◆ కేంద్రక చర్యలను నియంత్రించగలిగితే మానవాళికి ఉపయోగకరంగా మార్చవచ్చు. లేదంటే పెను ప్రమాదానికి దారితీస్తాయి.

అణు రియాక్టర్



❖ ప్రతి కేంద్రక చర్యలో వెలువడే 3 న్యూట్రాన్లకు బదులుగా 1 న్యూట్రాన్‌ను మాత్రమే తిరిగి చర్యలో పాల్గొనేలా చేస్తే శక్తిని నియంత్రించవచ్చని శాస్త్రవేత్తలు గుర్తించారు.

❖ నియంత్రిత శృంఖల చర్య అనే నియమం ఆధారంగా అణు రియాక్టర్ లేదా న్యూక్లియర్ రియాక్టర్ అనే పరికరాన్ని రూపొందించారు. దీనిద్వారా విద్యుత్ శక్తిని ఉత్పత్తి చేయవచ్చు.

❖ అణు రియాక్టర్‌లో ప్రధానంగా మూడు భాగాలుంటాయి.

ఇంధన మూలకాలు: కేంద్రక చర్యలు జరగడానికి మూలం అవి రేడియోధార్మిక పదార్థాలుగా ఉండటమే. $^{235}_{92}U$ లేదా $^{238}_{92}U$ లాంటి పదార్థాన్ని కడ్డీల రూపంలో తయారు చేస్తారు. వీటిని వేల సంఖ్యలో అణు రియాక్టర్‌లో ప్రధాన భాగమైన రియాక్టర్ కోర్‌లో ఉంచుతారు.

మితకారి: $^{235}_{92}U$లో కేంద్రక చర్యను ప్రారంభించాలంటే న్యూట్రాన్లు తక్కువ శక్తిని కలిగి ఉండాలి. ఇది సుమారు 0.04 eV కంటే తక్కువ. వీటిని థర్మల్ న్యూట్రాన్లు అంటారు.

❖ కేంద్రక చర్యలతో ఏర్పడే న్యూట్రాన్లు ఆ శక్తిని గ్రహించి అధిక వేగంతో చలిస్తుంటాయి. ఫలితంగా అవి కేంద్రక విచ్ఛిత్తికి అనుకూలంగా ఉండవు. కాబట్టి న్యూక్లియర్ రియాక్టర్‌లో న్యూట్రాన్ల వేగాన్ని తగ్గించేందుకు లేదా మితంగా ఉంచడానికి వినియోగించే పదార్థాన్నే మితకారి అంటారు.

❖ సాధారణంగా నీరు (H_2O) లేదా భారజలాన్ని మితకారిగా ఉపయోగిస్తారు. అధిక వేగంతో కదిలే న్యూట్రాన్లు మితకారి (నీటి)లోకి ప్రవేశించి అణువులను ఢీ కొట్టడం ద్వారా శక్తిని కోల్పోయి నెమ్మదిగా చలిస్తాయి. ఈ న్యూట్రాన్లు తిరిగి కేంద్రక విచ్ఛిత్తిని ప్రారంభించడానికి ఉపయోగపడతాయి. ఒక పంప్ సహాయంతో మితకారిని నిరంతరాయంగా రియాక్టర్ కోర్ చుట్టూ ప్రవహించేలా చేస్తారు.

నియంత్రణ కడ్డీలు: ఒక కేంద్రక విచ్ఛిత్తి చర్య తిరిగి ఒకేఒక కేంద్రక విచ్ఛిత్తి చర్యగా జరిగితేనే రియాక్టర్ నుంచి శక్తి నిలకడగా ఉత్పత్తి అవుతుంది. లేదంటే అనియంత్రిత శృంఖల చర్య జరిగే ప్రమాదం ఉంటుంది. కాబట్టి న్యూట్రాన్ల సంఖ్యను నియంత్రించాలి. ఇందుకోసం ఏర్పాటు చేసిన వాటినే నియంత్రణ కడ్డీలు అంటారు.

❖ వీటిని సాధారణంగా బోరాన్ (B), కాడ్మియం (Cd) లాంటి మూలకాలతో తయారుచేస్తారు. ఇవి న్యూట్రాన్లను శోషించుకుని అధిక కేంద్రక విచ్ఛిత్తి చర్యలు జరగకుండా నియంత్రిస్తాయి. ❖ ఈ నియంత్రణ కడ్డీలను కోర్ లోపలికి ప్రవేశపెట్టినప్పుడు న్యూట్రాన్లను శోషించుకుంటాయి. బయటకు లాగినప్పుడు కేంద్రక విచ్ఛిత్తి అధికమవుతుంది. ఈ విధంగా శక్తిని నిలకడగా ఉత్పత్తి చేస్తారు.

ఉపయోగాలు – పర్యవసానాలు:

✦ రియాక్టర్ లోపలి కోర్‌లో ఉత్పత్తి అయిన శక్తి ఉష్ణ, గతిశక్తి రూపంలో వెలువడుతుంది. దీనిద్వారా రియాక్టర్ చుట్టూ నింపిన నీటిని వేడి చేస్తారు. వేడెక్కిన నీరు నీటిఆవిరిగా మారి సన్నటి గొట్టాల ద్వారా ప్రవహిస్తూ సమీపంలోని టర్బైన్లను తిప్పుతుంది. ఈ టర్బైన్లకు అనుసంధానంగా అయస్కాంత క్షేత్రంలో కదిలేలా రాగి తీగ చుట్టను ఏర్పాటు చేస్తారు. ఆ తీగ చుట్టలో విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.

✦ ఇలా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను తీగల ద్వారా ఏ ప్రాంతానికైనా సరఫరా చేయవచ్చు. పరిశ్రమల్లో యంత్రాలు, వాహనాలు, గృహ విద్యుత్ మొదలైన అవసరాలకు దీన్ని వినియోగించుకోవచ్చు.

✦ శృంఖల చర్య నియంత్రణ కోల్పోతే అనియంత్రిత శృంఖల చర్య అంటారు. సెకన్‌లో లక్షో వంతు సమయంలో ఉత్పన్నమైన న్యూట్రాన్లు గుణశ్రేణిలో వాటి సంఖ్యను పెంచుకుని అపరిమిత సంఖ్యలో కేంద్రక విచ్ఛిత్తి చర్యలు జరిగే ప్రమాదం ఉంటుంది. ఫలితంగా అతి తక్కువ సమయంలోనే అపరిమితమైన శక్తి విడుదలవుతుంది. ఇలాంటి చర్యల కారణంగా ఒక్కొక్కసారి అణురియాక్టర్లు పేలిపోయి మానవ వినాశనానికి దారితీసే ప్రమాదముంది.

✦ కేంద్రక శక్తిని విచక్షణతో కేవలం శాంతియుత అవసరాలు, మానవ శ్రేయస్సు కోసం మాత్రమే ఉపయోగించుకోవాలి.



రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

Word of the Day

931

Fidelity

Telugu meaning: విశ్వసనీయత, నమ్మకం

English meaning: The word fidelity (ఫిడెలిటీ) is a noun that refers to faithfulness, loyalty, or devotion to a person, cause, or duty.

Synonyms: Loyalty, Faithfulness

Antonyms: Betrayal, Treachery

Usage: **1.** The soldier's fidelity to his country was evident in his willingness to sacrifice his life for national security.

2. Mutual fidelity and trust are essential for maintaining strong and lasting personal relationships.

Current Affairs



Prime Minister Narendra Modi flagged off the Meerut Metro and Namo Bharat Train at Shatabdi Nagar Namo Bharat Station in Meerut, Uttar Pradesh on 22 February 2026. He dedicated to the Nation entire 82 Km Delhi-Meerut Namo Bharat Corridor and inaugurated the remaining sections of India's first Namo Bharat Regional Rapid Transit System (RRTS).



India women's cricket team captain Harmanpreet Kaur created history after she became the most-capped international player in women's cricket. She made her 356th appearance for India in Twenty20 match against Australia on 20 February 2026, surpassing New Zealand great Suzie Bates.

☛ Australia's Ellyse Perry is third in the list with 349 international matches to her name.



The National Organ and Tissue Transplant Organisation (NOTTO) has recorded unprecedented progress in organ donation, allocation, and transplantation across the country. The number of transplants in the country has increased from fewer than 5,000 in 2013 to nearly 20,000 in 2025, marking a remarkable fourfold rise.

The Commerce Ministry said the base year of India's merchandise trade Indices has been revised from 2012-13 to 2022-23 to reflect structural changes in the economy, shifts in commodity composition, evolving trade patterns and better alignment with current macroeconomic indicators.

For more Current Affairs: Scan QR code

సెంట్రల్ ఎక్సైజ్ డే

ఫిబ్రవరి 24
చరిత్రలో ఈనాడు

దేశంలో వస్తు ఉత్పత్తుల తయారీ, పంపిణీ, అమ్మకం కోసం విధించే పన్నును ఎక్సైజ్ సుంకం అంటారు. ఇది వస్తువుల తయారీదారులు భారత ప్రభుత్వానికి చెల్లించే పరోక్ష పన్ను. దేశంలో తయారైన వస్తువులకు మాత్రమే ఇది వర్తిస్తుంది. వస్తుసేవల పన్ను (జీఎస్టీ) అమల్లోకి వచ్చాక విస్తృత శ్రేణి ఎక్సైజ్ పన్నులు విలీనమయ్యాయి. అయితే పొగాకు, పెట్రోలియం ఉత్పత్తులు లాంటి కొన్నింటిపై మాత్రమే ఇది కొనసాగుతోంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ) ఈ పన్నుల నిర్వహణకు బాధ్యత వహిస్తుంది. సకాలంలో పన్ను చెల్లించాల్సిన ఆవశ్యకతను, దేశ ఆర్థిక వృద్ధిలో సీబీఐసీ పాత్రను తెలియజేసే లక్ష్యంతో ఏటా ఫిబ్రవరి 24న 'సెంట్రల్ ఎక్సైజ్ డే'గా నిర్వహిస్తారు. పన్నుల దాఖలు ప్రాముఖ్యతతోపాటు సుంకాల ఎగవేత వల్ల జరిగే పరిణామాల గురించి ప్రజలను చైతన్యపరచడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

▼ వస్తువు అమ్మకంతో సంబంధం లేకుండా వస్తువు ఉత్పత్తిపై కేంద్ర ఎక్సైజ్ సుంకం విధిస్తారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాలను గణనీయంగా పెంచేందుకు 2025లో సవరణ బిల్లు చేశారు.

చారిత్రక నేపథ్యం

దేశంలో ఉప్పు సహా ఇతర తయారీ వస్తువులపై ఎక్సైజ్ సుంకాలను ఏకీకృతం చేసే ఉద్దేశంతో నాటి బ్రిటిష్ ప్రభుత్వం 1944, ఫిబ్రవరి 24న సెంట్రల్ ఎక్సైజ్ అండ్ సాల్ట్ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ఎక్సైజ్ పన్నులకు సంబంధించి అప్పటి వరకు ఉన్న 11 చట్టాలను ఏకీకృతం చేసి దీన్ని అమలు చేశారు. 1966లో దీని పేరును సెంట్రల్ ఎక్సైజ్ చట్టం, 1944గా మార్చారు. దేశంలో సక్రమ పన్ను విధింపు, సేకరించడంలో ఈ చట్టం ఎంతగానో తోడ్పడింది. పరిశ్రమల లైసెన్సింగ్, వస్తువుల అధిక ఉత్పత్తి నియంత్రణకు, పరిశ్రమల్లో అవినీతిని అరికట్టడానికి ఇది ఉపయోగపడింది. అంతేకాక దీని అమలు వల్ల ప్రభుత్వానికి పన్ను రూపంలో అధిక ఆదాయం సమకూరుతోంది. ఈ చట్టం అమలుకు గుర్తుగా ఏటా ఫిబ్రవరి 24న 'సెంట్రల్ ఎక్సైజ్ డే'గా నిర్వహిస్తున్నారు.




కేంద్ర ఎక్సైజ్ సుంకం, గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ

కేంద్ర ప్రభుత్వ రుణాలు

ఒక దేశం తన పౌరులు లేదా సంస్థలు లేదా ఇతర దేశాల నుంచి తీసుకున్న రుణాన్ని 'ప్రభుత్వ రుణం' అంటారు. కేంద్ర ప్రభుత్వం వ్యయానికి/ ఖర్చుకి సేకరించిన ఆదాయ వనరులు చాలనప్పుడు రుణాల ద్వారా వనరులను సమకూర్చుకుంటుంది. అది బ్యాంకులు, వ్యాపార సంస్థలు, కార్పొరేట్ రంగం, వ్యక్తుల నుంచి రుణం తీసుకుంటుంది. ఇక్కడ ప్రభుత్వం అంటే కేంద్రం, రాష్ట్రం, స్థానిక ప్రభుత్వాలు. సాధారణంగా ప్రభుత్వ రుణాలు బాండ్లు, ట్రెజరీ బిల్లుల రూపంలో ఉంటాయి. వీటిని కొనుగోలు చేసినవారికి నిర్దిష్ట/ నిశ్చిత వడ్డీతో సహా చెల్లింపులకు ప్రభుత్వం హామీ ఇస్తుంది.



ప్రభుత్వ రుణాలు – రకాలు

- ▼ అంతర్గత రుణం/ దేశీయ రుణం
- ▼ బహిర్గత రుణం/ విదేశీ రుణం
- ▼ స్వల్ప - మధ్య - దీర్ఘకాలిక రుణాలు
- ▼ ఉత్పాదక రుణం
- ▼ అనుత్పాదక రుణం
- ▼ విమోచిత రుణం
- ▼ అవిమోచిత రుణం
- ▼ నిధీకృత రుణం
- ▼ అనిధీకృత రుణం
- ▼ నిర్బంధ రుణం
- ▼ స్వచ్ఛంద రుణం

కేంద్ర ప్రభుత్వ రుణ బాధ్యతలు

☛ కేంద్ర ప్రభుత్వ రుణ బాధ్యతలను మూడు రకాలుగా వర్గీకరించారు. అవి:
ఎ) అంతర్గత రుణం
బి) బహిర్గత రుణం (విదేశీ రుణం)
సి) ఇతర రుణాలు (ఇతర రుణాలను అంతర్గత రుణాల్లో చేర్చారు)

ప్రభుత్వ రుణానికి ఆధారాలు

ప్రభుత్వ రుణానికి ప్రధాన ఆధారాలు నాలుగు. అవి:
1. వ్యక్తుల నుంచి రుణ సేకరణ
2. బ్యాంకేతర విత్త సంస్థల నుంచి రుణ సేకరణ
3. వాణిజ్య బ్యాంకుల నుంచి రుణ సేకరణ
4. బహిర్గత ఆధారాలు

రుణ భార అంచనా పద్ధతులు, రుణ విమోచన పద్ధతులు, ప్రభుత్వ రుణం ప్రాముఖ్యత, రాష్ట్ర ప్రభుత్వాల రుణ బాధ్యతలు, అనుకూలతలు - ప్రతికూలతలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Senior Technical Officer Posts

Central Institute of Petrochemicals Engineering and Technology (CIPET) is inviting online applications for the recruitment of Manager, Senior Technical Officer, and Manager posts on a contract basis. The total number of posts is 11. Eligible candidates can apply online before 3 March 2026.

Executive Trainee Jobs

Nuclear Power Corporation of India Limited (NPCIL), Mumbai, is inviting applications for the recruitment of Executive Trainee posts. The total no. of posts is 30. The application fee is Rs.500. The last date for online applications is 4 March 2026.

Apprentice Posts

Yantra India Limited (YIL) is inviting applications to fill apprentice posts in various departments. The total number of posts is 3,979. The application fee is Rs. 500. The last date for submission of online applications is 3 March 2026.

Did You Apply..?

Today (February 24) is the last date for the following Jobs

☛ UPSC Civil Services Examination (CSE), IFS 2026 - 1013 Posts. ***Eligibility:*** Bachelor's Degree.

☛ 22 Senior Resident posts in JIPMER. ***Eligibility:*** MD, MS, DNB.

☛ 40 Teaching Faculty Posts in ESIC Ranchi.

For more information and other notifications - scan QR code

Races & Games of Skill

1. Arun can run 40 m while Bharath runs 50 m. In a kilometer race Bharath beats Arun by:
A) 185 m B) $166\frac{1}{3}$ m C) 200 m
D) $167\frac{2}{3}$ m E) 210 m

2. In a 100 m race, A can beat B by 30 m and B can beat C by 10 m. In the same race A can beat 'C' by:
A) $33\frac{1}{2}$ m B) 37 m C) 40 m
D) $35\frac{2}{3}$ m E) 22 m

3. At a game of billiards P can give Q, 20 points in 100 and P can give R, 25 points in 100. How many points can Q give R in a game of 160?
A) 5 points B) 12 points
C) 11 points D) 10 points
E) 13 points

4. Ramya runs $1\frac{3}{4}$ times as fast as Karuna. If Ramya gives Karuna a start of 90 m. How far must the winning post be so that Ramya and Karuna might reach it at the same time?
A) 210 m B) 200 m C) 240 m
D) 180 m E) 178 m

5. In a 1500 m race Anitha reaches the finish point in $1\frac{1}{3}$ min, while Akhila reaches the finish point in $1\frac{2}{3}$ min. By how much distance does Anitha beats Akhila?
A) 400 m B) 280 m C) 250 m
D) 300 m E) None of the above

6. Vijay runs $1\frac{3}{4}$ times as fast as Rajesh. In a race, if Vijay gives a lead of 75 m to Rajesh, find the distance from the starting point, where both of them will meet?
A) 175 m B) 300 m C) 200 m
D) 150 m E) 119 m

7. In a race of 1500 m, P can beat Q by 150 m and in a race of 1200 m, Q can beat R by 100 m. In a race of 800 m by how many meters can P beat R?
A) 150 m B) 80 m C) 140 m
D) 100 m E) 120 m

8. Aparna and Vimala are running a circular track in opposite directions from the same point and at the same time with speeds 12 m/sec and 18 m/sec respectively. If the length of the circular track is 1260 m, how many times they will meet by the time, they meet at starting point.
A) 7 times B) 5 times C) 6 times
D) 8 times E) 2 times

Bank Exams

Quantitative Aptitude

9. Vinay and Abhiram start from the same position and at the same time in a 1000 m circular race, with speed 36 kmph and 50 kmph respectively. Find how much time they will meet again on the track for the first time, when they are both running in the same direction.
A) $4\frac{6}{7}$ min B) $4\frac{2}{7}$ min
C) $4\frac{3}{7}$ min D) $4\frac{5}{7}$ min
E) $4\frac{1}{3}$ min

10. A, B and C start at the same point and at the same time in the same direction to run around a circular track. A completing a round in $4\frac{1}{2}$ minutes, B in 5 minutes and C in 6 minutes. After what time, will they meet again at the starting point?
A) $1\frac{1}{2}$ hr B) 75 mins
C) $1\frac{1}{3}$ hr D) $1\frac{2}{3}$ hr
E) 11 min

11. Vikram go around circular path 7 times in 42 minutes. If the diameter of the circular path is increased 12 times, the time requires by Vikram to go round the new path once, travelling at the same speed as before is?
A) $1\frac{2}{5}$ hr B) $1\frac{4}{5}$ hr
C) $1\frac{1}{5}$ hr D) $1\frac{3}{5}$ hr
E) None of the above

12. A can give B start 25 m in 250 metre race and C a start 40 metre in the same race. If B can give C a start of $\frac{16}{5}$ sec in the race, how long does C take complete 250 metre race?
A) $48\frac{1}{3}$ sec B) $45\frac{2}{3}$ sec
C) 60 sec D) 48 sec E) 52 sec

13. In the race of three horses, the first beat the second by 15 meters and the third by 85 meters. If the second beat the third by 75 meters, what was the length in meters of the race course?
A) 250 m B) 225 m
C) 200 m D) 240 m
E) 310 m

Scan the QR code for Key

These model questions were prepared by
Dr.Vangala Srinivas, Subject Expert

ఈఎస్ఐసీలో

ఎంప్లాయీస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ), నోయిడా ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
✦ ప్రొఫెసర్: 08
✦ అసోసియేట్ ప్రొఫెసర్: 10
విభాగాలు: అనాటమీ, ఫిజియాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కార్డియాలజీ, ఎండోక్రైనాలజీ అండ్ మెటబాలిజం, గ్యాస్ట్రోఎంటరాలజీ, మెడికల్ ఆంకాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, యూరాలజీ.. మొదలైనవి.
అర్హత: సంబంధిత విభాగంలో ఎమ్మెస్సీ/ ఎండీ/ ఎంఎస్/ డీఎన్‌బీ/ డీఎం/ ఎంసీహెచ్/ పీహెచ్‌డీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
వేతనం: నెలకు ప్రొఫెసర్‌కు రూ.2,22,543. అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,47,986. **ఎంపిక:** ఇంటర్వ్యూతో.
ఇంటర్వ్యూ తేదీ: ఫిబ్రవరి 25.
వేదిక: కాన్ఫరెన్స్ హాల్, గ్రౌండ్ ఫ్లోర్, ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్ హాస్పిటల్, సెక్టార్-24, నోయిడా.
వెబ్‌సైట్: https://esic.gov.in/recruitments

హోమీ భాభా క్యాన్సర్ హాస్పిటల్‌లో

హోమీ భాభా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రిసెర్చ్ సెంటర్, విశాఖపట్నం పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
✦ కన్సల్టెంట్(డీ/ఈ/ఎఫ్): 09
✦ సైంటిఫిక్ ఆఫీసర్-సీ: 01
✦ సైంటిఫిక్ అసిస్టెంట్(బీ/సీ): 03
✦ మెడికల్ ఫిజిసిస్ట్-డీ: 01
అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, పీజీ, ఎండీ, డీఎన్‌బీ, డీఎంతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: పోస్టు ప్రకారం 30 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: పరీక్ష/ఇంటర్వ్యూతో
దరఖాస్తు ఫీజు: రూ.300. ఎస్సీ, ఎస్టీ, మహిళలు, దివ్యాంగులకు ఫీజు ఉండదు.
ఆన్‌లైన్ దరఖాస్తులు: మార్చి 20, 2026 సాయంత్రం 5:30 గంటల వరకు స్వీకరిస్తారు.
వెబ్‌సైట్: https://tmc.gov.in/



ఎంబీఏ ఫైనాన్స్‌తో ఎలాంటి అవకాశాలు?

బీబీఏ చదువుతున్నాను. ఎంబీఏ ఫైనాన్స్‌తో ఎలాంటి అవకాశాలు ఉంటాయి, ఈ కోర్సు ఎక్కడ చదివితే బాగు. - సుధీర్

■ బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బీబీఏ) పూర్తి చేసుకున్న తర్వాత మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ) ఫైనాన్స్ స్పెషలైజేషన్ అద్భుతమైన కెరియర్ అందిస్తుంది. ప్రతి వ్యాపార సంస్థకూ ఆర్థిక వ్యవహారాలు కీలకం. అందువల్ల ఫైనాన్స్ నిపుణులకు డిమాండ్ ఎప్పుడూ ఉంటుంది. బ్యాంకులు, ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు, మల్టీ నేషనల్ కంపెనీలు, స్టాక్ మార్కెట్ సంస్థలు, ఫిన్‌టెక్.. లాంటి అనేక సంస్థల్లో ఎంబీఏ ఫైనాన్స్ పూర్తిచేసిన వారికి వివిధ ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ముఖ్యంగా ఫైనాన్షియల్ అనలిస్ట్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్, రిస్క్ మేనేజర్, పోర్ట్‌ఫోలియో మేనేజర్, క్రెడిట్ అనలిస్ట్, కార్పొరేట్ ఫైనాన్స్ మేనేజర్ లాంటి ఉద్యోగాలు అందుబాటులో ఉంటాయి.

బీబీఏ చదువుతున్నప్పుడే కొన్ని ముఖ్యమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుంది. అకౌంటింగ్ ఎంఎస్ ఎక్సెల్, ఫైనాన్షియల్ మోడలింగ్, డేటా అనాలిసిస్, స్టాక్ మార్కెట్‌లపై అవగాహన మొదలైన విషయాల్లో దృష్టి పెట్టాలి. అలాగే ఇంటర్న్‌షిప్పుల ద్వారా ప్రాక్టికల్ అనుభవం పొందడం కూడా చాలా అవసరం. అదనంగా సీఎఫ్ఏ, ఎఫ్ఆర్ఎం, సీఎంఏ లాంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో ఏదైనా పూర్తి చేస్తే కెరియర్‌లో మరింత ప్రగతి సాధించవచ్చు.

✦ ఎంబీఏ ఫైనాన్స్ చేసినవారికి వేతనాలూ ఆకర్షణీయంగానే ఉంటాయి. ఒక మోస్తరు బిజినెస్ స్కూళ్లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఉద్యోగం పొందినవారికి సాధారణంగా సంవత్సరానికి ఆరు నుంచి ఎనిమిది లక్షల రూపాయల వరకు ప్రారంభ వేతనం లభిస్తుంది. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, కన్సల్టింగ్ లాంటి రంగాల్లో పనిచేస్తే ఇంకా అధిక జీతాలు పొందగలరు. తక్కువ వ్యవధిలోనే కెరియర్‌లో పై స్థాయికి చేరుకోవచ్చు. ప్రారంభంలో ఫైనాన్షియల్ అనలిస్ట్‌గా చేరి, కొన్నేళ్ల అనుభవంతో మేనేజర్‌గా ఎదగవచ్చు. ఉద్యోగ ప్రతిభను బట్టి భవిష్యత్తులో చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ స్థాయికి చేరుకోవచ్చు.

✦ ఎంబీఏ చదవడానికి విద్యా సంస్థ ఎంపిక చాలా ముఖ్యమైంది. భారతదేశంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లు, ఎక్స్‌ఎల్ఆర్ఐ, ఎఫ్ఎంఎస్ దిల్లీ లాంటి విద్యా సంస్థల్లో అత్యుత్తమ మేనేజ్‌మెంట్ విద్యను, ప్లేస్‌మెంట్ అవకాశాలను పొందవచ్చు. వీటిలో ప్రవేశం కోసం క్యాట్, ఎక్స్ఏటీ లాంటి వాటిలో ప్రతిభ చూపాలి. ఆ తర్వాత గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల్లోనూ రాణించాలి. వివిధ ఐఐటీలు, ఎన్ఐటీలు, ప్రైవేటు బిజినెస్ స్కూళ్లు కూడా ఎంబీఏ ఫైనాన్స్ కోర్సు అందిస్తున్నాయి. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ లాంటి కేంద్రీయ విశ్వవిద్యాలయాలతో పాటు రాష్ట్ర స్థాయిలో ఉస్మానియా, ఆంధ్ర, జేఎన్‌టీయూ, శ్రీవెంకటేశ్వర, యోగి వేమన యూనివర్సిటీ.. మొదలైన ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు కూడా ఎంబీఏను తక్కువ ఖర్చుతో అందిస్తున్నాయి. నార్సీమోంజీ సింబయాసిస్, ఇక్ఫాయ్.. తదితర ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు కూడా అత్యుత్తమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పరిశ్రమల అనుసంధానంతో మేనేజ్‌మెంట్ విద్యను అందిస్తున్నాయి.

మ్యాథ్స్, అకౌంటింగ్, ఆర్థిక వ్యవహారాలు, బ్యాంకింగ్, స్టాక్ మార్కెట్ మీద ఆసక్తి ఉన్నవారికి ఎంబీఏ ఫైనాన్స్ ఉత్తమ ఎంపిక అవుతుంది. సరైన విద్యా సంస్థలో చేరి, నైపుణ్యాభివృద్ధి, ప్రాక్టికల్ అనుభవం పొందితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

పరీక్షల కోసం పాఠాలు మాత్రమే చదివితే సరిపోదు. పోటీ పరీక్షలు, అకడమిక్ పరీక్షలు, ప్రవేశ పరీక్షలు వీటిలో ఎందులోనైనా విజయానికి.. ఆలోచన, విశ్లేషణ, సమయపాలన, ఒత్తిడి నిర్వహణ లాంటి నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. ఇవన్నీ మొదటి పరీక్షతోనే సాధ్యం కాకపోవచ్చు. అందువల్ల దిగులు చెందకుండా తర్వాతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రదర్శన చేయడానికి సిద్ధపడాలి.



వైఫల్య పాఠం విజయ సోపానం

చాలా మంది మొదటి ప్రయత్నంలోనే పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని నిరుత్సాహపడుతుంటారు. కుటుంబ సభ్యులు, బంధువులు ఏమంటారా అని బాధ పడుతుంటారు. ఇలాంటి సమస్య దాదాపు అందరికీ ఎదురయ్యేదే. కానీ ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి. తప్పులు చేయడం, ఓటమిని అంగీకరించడం కూడా అభ్యాసంలో భాగమే. దీన్నే విద్యావిధానంలో "ప్రొడక్టివ్ ఫెయిల్యూర్" అంటారు.

ప్రొడక్టివ్ ఫెయిల్యూర్ అంటే..

నేర్చుకునే ప్రక్రియలో ఒక పద్ధతి. ఇందులో విద్యార్థులు ముందుగా కష్టమైన ప్రశ్నలను పరిష్కరించడానికి ప్రయత్నించి విఫలమవుతారు. తర్వాత వాటికి సంబంధించిన సరైన సమాధానాలు తెలుసుకుని, వాటిని విశ్లేషిస్తారు. వైఫల్యాల కారణంగా తార్కిక ఆలోచన, లోతైన అవగాహన, నేర్చుకునే సామర్థ్యం పెరుగుతాయి. ఉదాహరణకు యూపీఎస్సీ, గ్రూప్స్, ఎస్ఎస్‌సీ లాంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతూ మాక్ టెస్టులు రాస్తారు. ఇక్కడ మొదటి ప్రయత్నంలోనే తక్కువ మార్కులు రావచ్చు. కానీ వారు ఏ అంశంలో బలహీనంగా ఉన్నారో గ్రహించగలుగుతారు. టైమ్ మేనేజ్‌మెంట్‌లో పొరపాటు ఎక్కడ జరిగిందో గుర్తించగలుగుతారు. ప్రశ్నలు అడిగే విధానాన్ని అర్థం చేసుకుంటారు. ఇలా చేయడం వల్ల తర్వాతి పరీక్ష మెరుగ్గా రాయగలుగుతారు. తప్పుల నుంచి నేర్చుకోవడంతో పాటు అందులోని కీలక అంశాలను కూడా అర్థం చేసుకుంటారు.

పోటీ పరీక్షల్లో కఠినమైన లాజిక్ ప్రశ్నలు ఉంటాయి. ముందుగా పద్ధతి తెలియకపోయినా, సమస్యను సొంతంగా విశ్లేషించడం ప్రారంభిస్తారు. దీని కోసం మెదడు వివిధ మార్గాల్లో శోధిస్తుంది. తర్వాత సరైన పద్ధతి ఎంచుకుని నేర్చుకోవాలి. తప్పు ఎక్కడ జరిగిందో అర్థం చేసుకొని దాన్ని అధిగమించడానికి ఉపయోగపడేలా సన్నద్ధత ప్రారంభించాలి. ఇలా చేయడం వల్ల సమస్య పరిష్కార నైపుణ్యం, విశ్లేషణాత్మక ఆలోచన, ఒత్తిడిని ఎదుర్కొనే శక్తి, స్థిరత్వం లాంటివి పెరుగుతాయి.

వైఫల్యాలు సాధారణమే


అభ్యర్థులు ఇంటర్వ్యూల్లో తడబడటం, భయపడటం అనేది సాధారణమైన విషయమే కానీ ఒకసారి అనుభవం వల్ల కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగవుతాయి. దీంతో ఆత్మవిశ్వాసమూ పెరుగుతుంది. భయం కూడా తగ్గిపోతుంది. ఆ తర్వాతి ఇంటర్వ్యూను సులభంగా అధిగమిస్తారు. నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రొడక్టివ్ ఫెయిల్యూర్‌ను స్వీకరించాలి. ఓటమికి భయపడకుండా, దాన్ని విశ్లేషించి, మెరుగుపరచుకుంటూ ముందుకు వెళ్తే తప్పకుండా విజయం సాధిస్తారు. ఇలాచేస్తే జిజ్ఞాస పెరిగి, విజయానికి అవసరమైన వ్యూహాలు అభివృద్ధి చెందుతాయి.

ప్రస్తుత పోటీ పరీక్షల విజేతల్లో ఎక్కువ మంది గతంలో వైఫల్యం చెందినవారేనని గుర్తుంచుకోవాలి. తప్పులను సమీక్షించుకుని, సన్నద్ధతను మెరుగుపరచుకోవడం వల్లే వారు విజయవంతమయ్యారని తెలుసుకోవాలి. అందువల్ల మొదటి ప్రయత్నంలో విఫలమైతే మీ వల్ల కాదనుకుని నిరుత్సాహపడకూడదు. గత ఓటముల నుంచి విలువైన పాఠాలు నేర్చుకున్నవారే గెలుపు గీతాన్ని ఆలపించగలరు.

కొత్త ఉద్యోగాలకు మీరెంత సిద్ధం?

అన్ని వృత్తుల వారికీ..

ఇటీవలి కాలంలో ఉద్యోగ ప్రపంచం ముఖచిత్రం పూర్తిగా మార్చుకుంది. డిగ్రీ ఉందా లేదా అనే దానికంటే మీ నైపుణ్యాలు ఏమిటి? మీరు ఏం చేయగలరు? ఎంత వేగంగా కొత్తవి నేర్చుకోగలరు? వీటినే పరిశీలిస్తున్నారు. అందువల్ల ఉద్యోగాలు ఆశించేవారు డిగ్రీలతో పాటు నైపుణ్యాలూ పెంచుకుంటేనే పోటీలో ముందుంటారు.





కాలేజీల్లో చెప్పే సిలబస్‌కీ, సంస్థలు/పరిశ్రమలకు కావలసిన నైపుణ్యాలకూ మధ్య పెద్ద అంతరం ఉంది. ఆ ఖాళీని పూడ్చాల్సింది విద్యా సంస్థలు కాదు, విద్యార్థే. డిజిటల్ యుగంలో 'లెర్నింగ్ ఎజిలిటీ' అంటే నేర్చుకుంటూ ముందుకెళ్లే సామర్థ్యం, మీ డిగ్రీ కంటే విలువైన ఆస్తి. రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్ లాంటి టెక్నాలజీలతో ఉద్యోగాలు పోతాయన్న భయం చాలా మందిలో ఉంది. కానీ కొన్ని ఉద్యోగాలు మాయమవుతున్నా, కొత్త తరహా కొలువులూ పుట్టుకొస్తున్నాయి. ఐటీ మాత్రమే కాదు.. హెల్త్‌కేర్, ఫైనాన్స్, మార్కెటింగ్, ఎనర్జీ, అగ్రికల్చర్ ప్రతి రంగంలోనూ టెక్నాలజీ కలవడం వల్ల కొత్త ఉద్యోగాలు తయారవుతున్నాయి. ఉదాహరణకు ఏఐ టూల్స్‌ను అర్థం చేసుకునే హెచ్ఆర్ ప్రొఫెషనల్స్, క్లైమేట్ రిస్క్ అనలిస్టులు, డిజిటల్ కన్సల్టెంట్లు ప్రస్తుతం డిమాండ్‌లో ఉన్న ఉద్యోగాలు.

కోడింగ్ కథ ముగిసినట్లేనా?

ఇప్పుడు చాలా మంది విద్యార్థుల్లో ఉన్న సందేహం.. 'చాట్‌జీపీటీ లాంటి లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ కోడ్ కూడా రాస్తున్నాయి కదా, ప్రోగ్రామింగ్ ఉద్యోగాలు ఉంటాయా?' ఈ భయం సహజమే. రొటీన్‌గా చేసే కోడ్ రాయడం, టెంప్లేట్‌లపై ఆధారపడే పనులు చాలా వరకు ఆటోమేట్ అవుతున్నాయి. ఒకప్పుడు జూనియర్ డెవలపర్లు కొన్ని రోజుల పాటు చేసే పనిని ఇప్పుడు కొన్ని సెకన్లలో ఏఐ చేస్తోంది. కానీ దీని అర్థం కోడింగ్ అవసరం ఉండదని కాదు. 'ఎలా కోడ్ టైప్ చేయాలి' అన్న దానికంటే 'ఏ సమస్యకు ఏ కోడ్ అవసరం' అన్న ఆలోచనకే ఇప్పుడు విలువ పెరిగింది.

ఆలోచనలదే పైచేయి

ఎల్ఎల్ఎంలు మీరు చెప్పినదాన్ని అనుసరిస్తాయి, కానీ ఏ సమస్య ముఖ్యమో, దానికి సరైన పరిష్కారం ఏదో నిర్ణయించలేవు. ఒక సిస్టమ్ డిజైన్ చేయడం, డేటా అర్థం చేసుకోవడం, తప్పు జరిగితే కారణం గుర్తించడం, రియల్ వరల్డ్ పరిమితులను కోడ్‌లోకి తీసుకురావడం ఇవన్నీ ఇంకా మానవ ఆలోచన మీదే ఆధారపడి ఉన్నాయి. హెల్త్‌కేర్, ఫైనాన్స్, గవర్నెన్స్ లాంటి రంగాల్లో ఒక చిన్న కోడ్ తప్పిదం పెద్ద నష్టానికి దారి తీస్తుంది. అక్కడ 'కోడ్ రాసింది ఎవరు' కంటే 'కోడ్‌ని అర్థం చేసుకున్నది ఎవరు' అన్నదే కీలకం. అందుకే కోడ్ రాయగలవాళ్ల కంటే కోడ్‌ను ఆలోచించి, రూపొందించ గలవాళ్లకు డిమాండ్ పెరుగుతోంది.

సస్టైనబిలిటీ

ఈ మాట ఇప్పుడు కేవలం ట్రెండ్ కాదు, అవసరం. రెన్యూవబుల్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, స్మార్ట్ సిటీస్, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెడుతోంది. ఈ ప్రభావంతో పర్యావరణ ఇంజినీర్లు, సస్టైనబిలిటీ మేనేజర్లు, సోలార్ టెక్నీషియన్లకు అవకాశాలు పెరుగుతున్నాయి. అలాగే హెల్త్‌టెక్ రంగం వేగంగా విస్తరిస్తోంది. టెలి మెడిసిన్, హెల్త్ ఇన్ఫర్మేటిక్స్, మెడికల్ డేటా అనాలిసిస్, ఫార్మా రిసెర్చ్ లాంటి విభాగాల్లో కొత్త ఉద్యోగాలూ వస్తున్నాయి. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మరో కీలక రంగం. క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ లాంటి నైపుణ్యాలున్నవారికి డిమాండ్ తగ్గడం లేదు. భారత్‌లోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్(జీసీసీ)లు డిజిటల్ మార్కెటింగ్, డేటా అనలిటిక్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ రంగాల్లో పెద్ద ఎత్తున నియామకాలు చేస్తున్నాయి. కానీ ఇవన్నీ మన సంప్రదాయ సిలబస్‌లో పూర్తిగా ఉండవు. అందుకే మీ కెరియర్ మ్యాప్ మీరే రూపొందించుకోవాలి.

ఈ రోజుల్లో బేసిక్ కోడింగ్ ప్రతి ఒక్కరికీ అవసరమైన జీవన నైపుణ్యంగా మారింది. కోడింగ్ నేర్చుకోవడం అంటే అందరూ సాఫ్ట్‌వేర్ డెవలపర్లు కావాలని కాదు. సమస్యను చిన్న భాగాలు చేయడం, తర్కబద్ధంగా ఆలోచించడం, సాంకేతికత ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకోవడం ఇదంతా కోడింగ్ ద్వారా వస్తుంది. ఎక్సెల్‌లో ఆటోమేషన్ చేయడం, డేటాను విశ్లేషించడం, ఏఐ టూల్స్‌ని సరిగా ఉపయోగించడం ఇవన్నీ బేసిక్ కోడింగ్ అవగాహనతోనే సాధ్యం. రేపటి ప్రపంచంలో కోడ్ రాయనివాళ్లు కూడా కోడ్ అర్థం చేసుకునే వారిగా మారాలి. అదే కెరియర్ భద్రతకు నిజమైన పునాది.

కాలేజీలో ఎలా సిద్ధపడాలి?

మొదటి, రెండో సంవత్సరాలు మీ పునాది ఏర్పరచుకునే కాలం. పాఠ్యపుస్తకాలకే పరిమితం కావద్దు. కోర్సెరా, ఎడ్ఎక్స్, స్వయం లాంటి వేదికల్లో ఉచిత కోర్సులు నేర్చుకోండి. ప్రాథమిక డేటా అనలిటిక్స్, ఏఐ టూల్స్ ఎలా పనిచేస్తాయో అర్థం చేసుకోండి.

✧ లింక్డ్‌ఇన్‌లో ఒక మంచి ప్రొఫెషనల్ ప్రొఫైల్ తయారుచేసుకుని, ఆసక్తి ఉన్న రంగాలను ఫాలో అవ్వండి.

✧ మూడో, నాలుగో సంవత్సరాలకు వచ్చేసరికి సిద్ధాంతం (థియరీ) నుంచి ఆచరణకు వెళ్లాలి. ఇంటర్న్‌షిప్పులు, లైవ్ ప్రాజెక్టులు అందిపుచ్చుకోవడానికి ప్రయత్నించండి.

✧ మీ పని పటిమను చూపించేలా ఒక 'పోర్ట్‌ఫోలియో ఆఫ్ ప్రూఫ్' తయారు చేసుకోండి. మీరు చేసిన ప్రాజెక్టులు, బ్లాగ్ పోస్టులు, కేస్ స్టడీలు, ఫ్రీలాన్స్ పనులు ఏవైనా సరే ఇందులో చేర్చండి.

✧ హ్యాకథాన్లు, బిజినెస్ ప్లాన్ పోటీలు మీ సమస్యా పరిష్కార సామర్థ్యాన్ని పెంచుతాయి.

✧ సర్టిఫికేషన్లు, నానో డిగ్రీల ద్వారా నిరంతరం స్కిల్స్ అప్‌డేట్ చేసుకుంటూ ఉండండి. ఇంజినీరింగ్ విద్యార్థులకే కాదు. బీకామ్, బీఏ, బీఎస్సీ, ఎంబీఏ లాంటి కోర్సులు చదువుతున్నవారికీ ఇదే వర్తిస్తుంది.

✧ బీకామ్, ఎంబీఏ విద్యార్థులు ఎక్సెల్, పవర్ బీఐ, ఫిన్‌టెక్, జీఎస్టీ టూల్స్ నేర్చుకోవాలి.

✧ ఆర్ట్స్ విద్యార్థులు డిజిటల్ కంటెంట్, యూఎక్స్ రిసెర్చ్, డేటా ఆధారిత స్టోరీ టెల్లింగ్ వైపు చూడవచ్చు.

✧ అగ్రికల్చర్ విద్యార్థులు అగ్రి-టెక్, ప్రెసిషన్ ఫార్మింగ్, ఫుడ్ టెక్నాలజీని కలపాలి.

✧ మెడికల్ నేపథ్యం ఉన్నవారు హెల్త్ ఇన్ఫర్మేటిక్స్, పబ్లిక్ హెల్త్ అనాలిసిస్ లాంటి రంగాల్లోకి వెళ్లవచ్చు.


✧ ఏ స్ట్రీమ్ అయినా సరే, డిజిటల్ సాధనాలపై ప్రాథమిక అవగాహన మాత్రం తప్పనిసరి అని గుర్తుంచుకోవాలి.



- రహ్మాన్

టాప్ స్కోరుకు స్మార్ట్ రైటింగ్!

పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయి. వీటికోసం బాగా చదవడం ఒక ఎత్తయితే నేర్చుకున్న అంశాలను పరీక్షాపత్రంలో ఎలా ప్రదర్శించామన్నది మార్కులను నిర్ణయిస్తుంది. మీ జవాబు పత్రం మూల్యాంకనం చేసే వారిని మెప్పించాలి. ఇందుకోసం కొన్ని మెలకువలు పాటించాలి. దీంతో ఆశించిన మార్కులు సొంతమవుతాయి.



తెలిసిన ప్రశ్నలతోనే బోణీ?

పరీక్షా పత్రం చేతికి రాగానే కంగారు పడకూడదు. ఎలాంటి నిబంధనలూ లేకపోతే మీకు బాగా తెలిసిన ప్రశ్నతోనే సమాధానాలు రాయడం ప్రారంభించండి. దీనివల్ల మీలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది, సమయమూ ఆదా అవుతుంది. అలాగే మీ పేపర్ మూల్యాంకనం చేసేవారికి మీపై మంచి అభిప్రాయం ఏర్పడుతుంది.

సూటిగా, సుత్తి లేకుండా

అనవసరమైన పొడవాటి సమాధానాలు, పేరాగ్రాఫ్‌లు రాయొద్దు. దిద్దేవారు అయోమయానికి గురికాకూడదు. జవాబును సూటిగా, పాయింట్ల వారీగా రాయండి. ప్రశ్నలో అడిగిన దానికి తగినట్లుగా సమాధానం ఉండాలి. మార్కుల వెయిటేజీని (2, 3, 5, 10 మార్కులు) బట్టి మీ సమాధానం నిడివిని సరిచూసుకోండి. లఘు ప్రశ్నలకు వ్యాసరూపంలో సమాధానం రాస్తే సమయం వృథా తప్ప, ప్రయోజనం ఉండదు. వాక్యాలు దీర్ఘంగా వద్దు. తక్కువ పదాలతో పొందికగా రాయాలి.

కీ వర్డ్స్ ముఖ్యం

జవాబులో ముఖ్యమైన పదాలు (కీవర్డ్స్), తేదీలు, సూత్రాలు లేదా శీర్షికల కింద పెన్సిల్‌తో గీత గీయండి. దీంతో మీరు చెప్పాలనుకున్న ప్రధానాంశం తేలికగా అర్థమవుతుంది. సరైన పదజాలం ఉపయోగిస్తే పూర్తి మార్కులకూ అవకాశం ఉంది. అక్షర దోషాలు లేకుండా చూసుకోవాలి. ముఖ్యంగా భాషల పేపర్లు రాసేటప్పుడు ఈ విషయంలో మరింత జాగ్రత్త వహించాలి. ప్రతి సబ్జెక్టులోనూ నిర్దేశిత బ్లూ ప్రింట్ ప్రకారం మీ సమాధానాలు ఉంటే పూర్తి మార్కులు తెచ్చుకోవచ్చు.

బుల్లెట్ పాయింట్లు, హెడ్డింగులు!

పెద్ద పెద్ద సమాధానాలను పేరాగ్రాఫ్ రూపంలో కాకుండా, చిన్న చిన్న సబ్-హెడ్డింగులు, బుల్లెట్ పాయింట్లుగా విభజించండి. సమాచారాన్ని ఇలా అమర్చడం వల్ల మీ పేపర్ చూసేందుకు స్పష్టంగా, ఒక పద్ధతిగా ఉన్నట్లు కనిపిస్తుంది.

బొమ్మలు తప్పనిసరి

సైన్స్, జాగ్రఫీ, ఎకనామిక్స్ లాంటి సబ్జెక్టుల్లో వీలైన చోటల్లా చిత్రపటాలు గీయండి. బొమ్మలను పెన్సిల్‌తోనే గీసి భాగాలను స్పష్టంగా గుర్తించాలి. కచ్చితత్వంతో, ఆకర్షణీయంగా ఉండే డయాగ్రామ్స్ పూర్తి మార్కులు పొందేలా చేస్తాయి.

ఖాళీ వదలండి

జవాబు పత్రం గందరగోళంగా ఉండకూడదు. సమాధానాల మధ్య కొంచెం ఖాళీ వదలండి. బాగా కుదించి రాయొద్దు. సరైన సమాధానాన్ని సులువుగా అర్థమయ్యేలా రాస్తే ఆ ప్రశ్నలకు కేటాయించిన పూర్తి మార్కులు మీ సొంతమవుతాయి.

చివరి పది నిమిషాలు

పరీక్ష ముగియడానికి 10 నిమిషాల ముందే ప్రశ్నాపత్రం పూర్తయ్యేలా చూసుకోండి. చివరలో.. రోల్ నంబర్ సరిగా రాశారో లేదో చూసుకోండి. ఏవైనా అక్షరదోషాలుంటే సరిదిద్దండి. పక్కనే ఆ పదాన్ని అర్థమయ్యేలా రాయండి. తెలియక వదిలేసిన ప్రశ్నలు ఏవైనా ఉంటే పూర్తి చేయడానికి ప్రయత్నించండి. ప్రశ్న సంఖ్య, సెక్షన్ మొదలైనవి సరిగా రాశారో లేదో పరిశీలించుకోండి.

– చెవుల పూజిత

హెచ్‌పీసీఎల్‌లో

హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్).. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రెయినీ (ఇంజినీరింగ్)ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
✦ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రెయినీ: 608 ఖాళీలు. ఆంధ్రప్రదేశ్‌లో 62, తెలంగాణలో 22 అందుబాటులో ఉన్నాయి.
విభాగాలు: సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్.
అర్హత: సంబంధిత విభాగాల్లో 60 (ఎస్సీ, ఎస్టీలైతే 50) శాతం మార్కులతో ఇంజినీరింగ్ డిగ్రీ ఉండాలి. 01-04-2023 తర్వాత ఉత్తీర్ణులైన వారే అర్హులు.
వయసు: 02-03-2026 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. గరిష్ఠ వయసులో ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ-ఎన్‌సీఎల్‌లకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
స్టైపెండ్: నెలకు రూ.25,000.
ఎంపిక: అభ్యర్థుల మెరిట్ మార్కుల ఆధారంగా స్క్రీనింగ్ చేసి, డాక్యుమెంట్ వెరిఫికేషన్ కోసం 1:5 నిష్పత్తిలో పిలుస్తారు. తుది ఎంపిక మెరిట్ జాబితా, మెడికల్ ఫిట్‌నెస్‌లతో ఉంటుంది.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 02-03-2026.
వెబ్‌సైట్: https://www.hindustanpetroleum.com/job-openings

నాన్ టీచింగ్ పోస్టులు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ (ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్) నాన్-టీచింగ్ (గ్రూప్-బీ, సీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
✦ సీనియర్ సైంటిఫిక్ అసిస్టెంట్: 01
✦ ఈఈజీ టెక్నీషియన్: 03
✦ లైబ్రరీ అసిస్టెంట్: 03 ✦ ఆర్టిస్ట్: 03 ✦ ఫొటోగ్రాఫర్: 02
✦ స్టెనోగ్రాఫర్ గ్రేడ్-II: 09 ✦ అసిస్టెంట్ ఇన్‌స్ట్రక్టర్: 04
✦ మెడికల్ రికార్డ్స్ టెక్నీషియన్: 03
✦ జూనియర్ సెక్రటేరియల్ అసిస్టెంట్: 22
✦ హాస్పిటల్ అసిస్టెంట్: 02 ✦ బార్బర్: 02
అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా, మాస్టర్స్ డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: సీనియర్ సైంటిఫిక్ అసిస్టెంట్‌కు 35 ఏళ్లు; ఈఈజీ టెక్నీషియన్, లైబ్రరీ అసిస్టెంట్‌కు 30 ఏళ్లు; ఇతర పోస్టులకు 27 ఏళ్లు మించకూడదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 04-03-2026.
దరఖాస్తు ఫీజు: యూఆర్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్‌లకు గ్రూప్-బీ పోస్టులకు రూ.1180, గ్రూప్-సీ రూ.885; ఎస్సీ/ ఎస్టీలకు గ్రూప్-బీ పోస్టులకు రూ.885, గ్రూప్-సీ పోస్టులకు రూ.590. దివ్యాంగులకు ఫీజు ఉండదు.
వెబ్‌సైట్: https://nimhans.ac.in/

రాష్ట్ర ఎన్నికల సంఘాలతో ఈసీ రౌండ్ టేబుల్ భేటీ నేడు

దిల్లీ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం), ఓటర్ల జాబితాలు, ఇతర సాంకేతికతల అంశాలపై రాష్ట్ర ఎన్నికల సంఘాలతో కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) చర్చించనుంది. దిల్లీలో మంగళవారం నుంచి ప్రారంభం కానున్న రౌండ్ టేబుల్ సమావేశంలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఎన్నికల అధికారులతో పాటు వారి న్యాయ, సాంకేతిక నిపుణులు కూడా పాల్గొంటారు. 27 ఏళ్ల క్రితం 1999లో ఈ తరహా సమావేశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించింది. ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేయడంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు ఉచిత వైద్యం పథకం పేరు 'పీఎం-రాహత్'

ఈనాడు, దిల్లీ: రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందించే పథకానికి కేంద్ర ప్రభుత్వం పీఎం-రాహత్ (ప్రైమ్‌మినిస్టర్-రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్ హాస్పిటలైజేషన్ అండ్ అస్యూర్డ్ ట్రీట్‌మెంట్)గా నామకరణం చేసింది. ఈమేరకు రహదారి, రవాణాశాఖ సోమవారం నోటిఫికేషన్ జారీచేసింది. రాహత్ అన్నది హిందీ పదం. ఉపశమనం అని దానర్థం. ఈ పథకం కింద రోడ్డు ప్రమాదానికి గురైన నాటినుంచి ఏడురోజులవరకు గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు వైద్యసేవలను ఉచితంగా అందిస్తారు.

ఉత్తర కొరియా అధికార పార్టీ అత్యున్నత పదవికి మళ్లీ కిమ్

సియోల్: ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్(42) అధికార వర్కర్స్ పార్టీ అత్యున్నత పదవికి తిరిగి ఎన్నికయ్యారు. దేశ అణ్వాయుధ సామగ్రిని బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారంటూ పార్టీ ప్రతినిధులు కొనియాడినట్లు అక్కడి మీడియా సోమవారం నివేదించింది.



రాబోయే ఐదు సంవత్సరాల్లో కిమ్ తన రాజకీయ, సైనిక లక్ష్యాలను ఈ సమావేశంలో వివరించినట్లు తెలుస్తోంది. అమెరికా, దాని మిత్ర దేశాలకు హెచ్చరికలు జారీ చేసేలా అణ్వాయుధ వ్యవస్థను కిమ్ రెట్టింపు చేసే అవకాశమున్నట్లు సమాచారం. పార్టీ తన శక్తిమంతమైన కేంద్ర కమిటీ కోసం ఒక కొత్త జాబితాను కూడా విడుదల చేసింది. కొత్త సైనిక లక్ష్యాలను ఆవిష్కరించడానికి కిమ్ ఈ సమావేశాన్ని ఉపయోగించుకుంటారని నిపుణులు పేర్కొన్నారు. ఈ ఎన్నిక కిమ్ నాయకత్వాన్ని మరింత బలపరిచిందని దక్షిణ కొరియా ఏకీకరణ మంత్రిత్వశాఖ ప్రతినిధి యూన్ మిన్ హో పేర్కొన్నారు.

భవనం శ్లాబ్ కూలి ముగ్గురు కార్మికుల మృతి

కోళికోడ్: భవనం స్లాబ్ కూలడంతో ముగ్గురు కార్మికులు మృతి చెందిన ఘటన సోమవారం కేరళలోని కోళికోడ్‌లో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు గాయపడినట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం వేళ పనులు ముగించుకుని కార్మికులు భవనం కింద విశ్రాంతి తీసుకుంటుండగా ఒక్కసారిగా శ్లాబ్ కూలి వారిపై పడింది. స్థానికులు వెంటనే బాధితులను ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే వారిలో ముగ్గురు మరణించినట్లు వైద్యులు తెలిపారు.

జనగణనలో మైనారిటీల జనాభాను పూర్తిగా నమోదు చేయాలి

- మాజీ బ్యూరోక్రాట్ల డిమాండ్

దిల్లీ: వచ్చే సంవత్సరం నిర్వహించనున్న జనగణనలో దేశంలోని వివిధ మైనారిటీ వర్గాల జనాభాను సమగ్రంగా నమోదు చేసేలా జాగ్రత్తలు తీసుకోవాలని 90 మంది విశ్రాంత ఉన్నత స్థాయి మాజీ బ్యూరోక్రాట్ల బృందం సోమవారం డిమాండ్ చేసింది. ఈ మేరకు వారు రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్‌కు లేఖ రాశారు. జనగణనలో మత విషయం ప్రస్తుత జనగణనలోనే కాక గతంలో జరిగిన గణనల్లోనూ అతి సున్నిత అంశమని వారు తమ లేఖలో పేర్కొన్నారు. రీసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్ (రా) మాజీ చీఫ్ ఎ.ఎస్.దులత్, మాజీ ప్రధాన సమాచార కమిషనర్ వజాహత్ హబీబుల్లా, దిల్లీ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ నజీబ్ జంగ్, ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ అశోక్ లవాసా, కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి జి.కె.పిళ్లై, విదేశీ వ్యవహారాల శాఖ మాజీ కార్యదర్శి కె.రఘునాథ్, పంజాబ్ మాజీ డీజీపీ జూలియో రిబీరో తదితరులు ఈ లేఖపై సంతకం చేసిన వారిలో ఉన్నారు. 'జనగణనలో ఓబీసీల వర్గీకరణ ఇంకా జరగలేదు. కులగణన ఎలా చేస్తారో ఇంకా స్పష్టంచేయలేదు. కులాల జాబితా ఒకటి తయారు చేసి అందులో ప్రజలు ఏది ఎంచుకుంటారో వారే తేల్చుకునేలా చేయడం ఒక పద్ధతి. జనగణన పత్రంలో ఈ అంశాన్ని ప్రజలే ఎంచుకునేలా చూడటం ఉత్తమం' అని వారు పేర్కొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందూ మహిళపై సామూహిక అత్యాచారం

ఇంటర్నెట్ డెస్క్: బంగ్లాదేశ్‌లో మరో దారుణం చోటుచేసుకుంది. చాంద్‌పుర్ జిల్లాలో ఓ హిందూ మహిళపై ముగ్గురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి ఒంటరిగా ఉన్న దివ్యాంగురాలైన మహిళను బలవంతంగా ఎత్తుకెళ్లి దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. నిర్మానుష్య ప్రాంతంలో స్పృహ కోల్పోయి ఉన్న మహిళను గుర్తించిన స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. స్థానికంగా నివాసం ఉండే రకీబ్, సోహేల్, రస్సెల్ అనే ముగ్గురు వ్యక్తులు తనపై అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు పేర్కొంది. ఆమె తనను తీవ్రంగా హింసించి గాయపరిచినట్లు తెలిపింది. ఇప్పటి వరకు పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకోలేదని సమాచారం. మైనారిటీలపై వరుసగా జరుగుతున్న దాడులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హిందూ సంఘాలు, మానవ హక్కుల కార్యకర్తలు నిరసనలకు దిగారు.

నైజీరియాలో 38 మంది హత్య

- పలువురు ప్రజల అపహరణ

అబుజా: పశ్చిమ ఆఫ్రికా దేశమైన నైజీరియాలోని వాయవ్య ప్రాంత జాంఫారాలో 38 మంది ప్రజలను సాయుధ ముఠాలు హత్య చేశాయని, పలువురు మహిళలు, పిల్లలను అపహరించుకుపోయాయని పోలీసులు తెలిపారు. వివిధ సాయుధ ముఠాలు దాడులకు పాల్పడుతున్నందువల్లే నైజీరియా శాంతిభద్రతల సమస్య తలెత్తుతోంది.

రాహుల్ సారథ్యంపై ఇండియా కూటమిలో భిన్నస్వరాలు

- స్టాలిన్ నేతృత్వం వహించాలంటున్న ఉదయనిధి, మణిశంకర్ అయ్యర్
- మమతా బెనర్జీ ఉత్తమమంటున్న సమాజ్‌వాదీ, శివసేన(యూబీటీ) పార్టీలు

దిల్లీ: విపక్ష 'ఇండియా' కూటమి నాయకత్వ మార్పుపై ఆ కూటమిలోని వివిధ భాగస్వామ్య పక్షాల నుంచి వినిపిస్తున్న భిన్న స్వరాలు క్రమంగా బలం పుంజుకుంటున్నాయి. రాహుల్ గాంధీ నేతృత్వంలో 2029 సార్వత్రిక ఎన్నికల్లో భాజపాను విజయవంతంగా ఎదుర్కోలేమనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. తాజాగా డీఎంకే నేత ఉదయనిధి, కాంగ్రెస్ పార్టీ మాజీ నేత మణిశంకర్ అయ్యర్ మరో కొత్త వాదనను అందుకున్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత స్టాలిన్ ఇండియా కూటమిని సమర్థంగా నడిపించగలరని పేర్కొన్నారు. లౌకికవాద నేతగా తిరుగులేని విశ్వసనీయత స్టాలిన్‌కు ఉందని తెలిపారు. భాజపా విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టడంలోనూ స్టాలిన్ సఫలమయ్యారని, ఆయన సేవలను దేశవ్యాప్తంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని ఉదయనిధి, మణిశంకర్ అయ్యర్ అభిప్రాయపడ్డారు. చైనాతో 1962 యుద్ధం తర్వాత జవహర్‌లాల్ నెహ్రూ వ్యూహాత్మకంగా తమిళ నేత కె.కామరాజ్‌ను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా చేశారని గుర్తుచేశారు. స్టాలిన్‌ను 21వ శతాబ్దపు కామరాజ్‌గా పేర్కొంటూ.. ఇండియా కూటమి సారథ్య బాధ్యతలను డీఎంకే అధినేతకు అప్పగించడం కాంగ్రెస్ పార్టీకి కూడా మేలు చేస్తుందని అయ్యర్ సూచించారు. తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ఓ సమావేశంలో మాట్లాడుతూ రాజకీయాలు, పరిపాలన వంటి విషయాల్లో తన తండ్రి, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ఇతర నేతలు ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారు. ఇండియా కూటమికి నాయకత్వం వహించాలని పలు రాష్ట్రాల ప్రతిపక్ష నేతలు ఆయనను కోరుతున్నారని పేర్కొన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్-డీఎంకే మధ్య సీట్ల పంపకాలపై చర్చలు జరుగుతున్న వేళ ఉదయనిధి కూటమి నాయకత్వ మార్పు అంశాన్ని లేవనెత్తడం గమనార్హం. మరోవైపు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మాత్రమే ఇండియా కూటమిని సమర్థంగా నడిపించగలరంటూ ఇప్పటికే సమాజ్‌వాదీ పార్టీ, ఎన్సీపీ (ఎస్పీ), శివసేన (యూబీటీ), ఆర్జేడీ తదితర పార్టీల నేతలు తమ అభిప్రాయాలను వివిధ సందర్భాల్లో వెల్లడించారు. జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా మాత్రం ఇండియా కూటమికి రాహుల్ సారథ్యాన్ని సమర్థించారు. విపక్ష నేతగా రాహుల్ గాంధీ తన విధులను చక్కగా నిర్వహిస్తున్నారంటూ కితాబిచ్చారు. ఇంకా ఆయన ఏమి చేయాలో చెప్పాలని ప్రశ్నించారు. కూటమి నాయకత్వ మార్పుపై భాగస్వామ్య పక్షాల నేతలు వ్యక్తం చేస్తున్నవన్నీ వ్యక్తిగత అభిప్రాయాలేనని పేర్కొన్నారు. ఈ అంశంపై కూటమి నేతల మధ్య భేటీ ఏమీ జరగలేదన్నారు.



ఉత్తర్‌ప్రదేశ్‌లోని సుల్తాన్‌పుర్‌లో చెప్పులు కుట్టే రామ్‌చెట్ మోచి కుటుంబసభ్యులతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

భాజపా ఎంపీకి బెంగాల్ పురస్కారం

- దీదీ ఎన్నికల ఎత్తుగడ?

ఇంటర్నెట్‌డెస్క్: పశ్చిమ బెంగాల్‌లో మరికొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇటీవల ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. భాజపా ఎంపీ నాగేన్ రాయ్ సహా పలువురికి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాష్ట్ర పౌర పురస్కారం 'బంగ విభూషణ్' అందజేశారు. టీఎంసీ, భాజపాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్న వేళ ఈ అంశం రాజకీయంగా చర్చనీయాంశమైంది. నాగేన్‌ది రాజ్‌భాంగ్షీ సామాజిక వర్గం. ఉత్తర, మధ్య బెంగాల్‌లో ఈ వర్గం ప్రజలు పెద్దసంఖ్యలో విస్తరించి ఉన్నారు. గత ఎన్నికల్లో ఈ ప్రాంతాల్లో టీఎంసీకి సవాళ్లు ఎదురయ్యాయి. భాజపా మాత్రం మంచి ఫలితాలు సాధించింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల వేళ ఆయన్ను తమవైపు ఆకర్షించేందుకు అధికార పార్టీ వ్యూహరచన చేసిందనే ఊహాగానాలు వెల్లువెత్తాయి. నాగేన్ 2023లో భాజపా ద్వారా రాజ్యసభ ఎంపీగా నామినేట్ అయ్యారు. 2011 జనాభా లెక్కల ప్రకారం.. బెంగాల్‌లో ఈ వర్గం జనాభా సుమారు 33 లక్షలు. ఈ వర్గంలో ఆయనకు మంచి పలుకుబడి ఉంది. నాగేన్‌ను 'అనంత్ మహారాజ్' అని పిలుచుకుంటారు. ఈ పరిణామాల వేళ పురస్కారాన్ని ప్రదానం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. మొదట్లో 'బంగ విభూషణ్' జాబితాలో ఆయన పేరు లేదని, అనంతరం చేర్చారనే వాదనలూ ఉన్నాయి. తనకు ఈ అవార్డు వస్తుందని కలలో కూడా ఊహించలేదంటూ నాగేన్ పేర్కొనడం గమనార్హం.

దిల్లీ ఖలిస్థాన్‌గా మారుతుంది

- దేశ రాజధానికి బాంబు బెదిరింపులు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. అసెంబ్లీ, దిల్లీ సచివాలయం, ఎర్రకోటతో పాటు ఆర్మీ స్కూల్, ఎయిర్ ఫోర్స్ బాలభారతి పాఠశాలలకు సోమవారం ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు సందేశాలు వచ్చాయి. దీంతో ఆయా ప్రాంగణాల్లో భద్రతా దళాలు తనిఖీలు నిర్వహించగా, ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. దీంతో అవి నకిలీ బెదిరింపులని అధికారులు తేల్చారు. 'దిల్లీ ఖలిస్థాన్‌గా మారుతుంది' అని ఈ-మెయిల్స్‌లో హెచ్చరికలు జారీ చేసినట్లు వారు చెప్పారు. రానున్న మూడు రోజుల్లో దిల్లీ ఆర్మీ పాఠశాల, ఎర్రకోట, మెట్రోస్టేషన్లలో పేలుళ్లకు పాల్పడతామని హెచ్చరించినట్లు తెలిపారు. దీంతో అన్ని మెట్రోస్టేషన్ల వద్ద భద్రతను పెంచామన్నారు.

విద్యా ప్రమాణాలు దెబ్బ తింటాయా?

- నీట్ పీజీ కటాఫ్ తగ్గింపుపై సుప్రీం ప్రశ్న

దిల్లీ: నీట్ (పీజీ) 2025-26లో ఉత్తీర్ణత మార్కుల్ని గణనీయంగా తగ్గించడం స్నాతకోత్తర వైద్య విద్య ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందా అన్న అంశంపై విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టం చేసింది. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి కటాఫ్ పర్సంటైల్‌ను తగ్గించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "విద్యా ప్రమాణాలు దెబ్బతింటాయా అన్నదే మా ప్రధాన ఆందోళన. ఇది విద్య నాణ్యతకు సంబంధించిన అంశం. కటాఫ్ మార్కుల్ని గణనీయంగా తగ్గించడం విద్య నాణ్యతా ప్రమాణాలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపబోదని మాకు సంతృప్తి కలిగే విధంగా సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత మీది. ఇది ఎంబీబీఎస్‌లో ప్రవేశం వంటిది కాదని, దీనికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇప్పటికే డాక్టర్లని మీరు



అనడం సబబే. దీన్ని మేం పరిశీలిస్తాం" అని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. పీజీ సీట్ల ఖాళీల నేపథ్యంలో కటాఫ్ మార్కుల్ని తగ్గించాలని నిర్ణయించినట్టు అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి కోర్టుకు తెలిపారు. 'ఈ పరీక్ష ఉద్దేశం కనీస చికిత్సా పరిజ్ఞానాన్ని అంచనా వేయడం కాదు. ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఇప్పటికే డాక్టర్లు. సీట్లు పరిమితంగా ఉన్న కారణంగా అభ్యర్థుల్ని వడపోయడమే దీని ఉద్దేశం' అని ఆమె కోర్టుకు విన్నవించారు. ఈ కేసుపై తదుపరి విచారణను కోర్టు వచ్చేనెల 24కు వాయిదా వేసింది. నీట్ పీజీ కటాఫ్ మార్కుల్ని తగ్గించడం రాజ్యాంగంలోని 14వ, 21వ అధికరణాలను ఉల్లంఘించడమేనని సామాజిక కార్యకర్త హరిశరణ్ దేవగణ్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు విచారణ జరుపుతోంది.

నీట్-పీజీకి దరఖాస్తు చేసుకునేవారు గుర్తింపు పొందిన ఎంబీబీఎస్ డిగ్రీ కలిగి ఉండటంతోపాటు ఇంటర్న్‌షిప్ కూడా పూర్తిచేసి ఉండాలని కేంద్రం కోర్టుకు తెలిపింది. 2025-26 సంవత్సరానికి గాను సుమారు 70 వేల పీజీ సీట్లు ఉన్నాయని, ఈ సీట్ల కోసం 2,24,029 మంది అభ్యర్థులు పోటీ పడ్డారని వివరించింది. ఇందులో 31,742 సీట్లు ఆలిండియా కోటా కింద ఉండగా రెండో రౌండు కౌన్సెలింగ్ పూర్తయ్యే నాటికి 9,621 సీట్లు మిగిలిపోయాయని తెలిపింది. ఖాళీగా ఉన్న సీట్లలో 5,213 ప్రభుత్వ వైద్య కళాశాలలకు చెందినవేనని ప్రభుత్వం తెలిపింది. ప్రైవేటు వైద్య కళాశాలలకు ప్రయోజనం కలిగించడానికికాక సీట్ల ఖాళీలను భర్తీచేసే ఉద్దేశంతో కటాఫ్ తగ్గించామని ప్రభుత్వం వివరించింది.



భారత్ ట్యాక్సీతో డ్రైవర్లకు కనీస ఆదాయం: అమిత్ షా

ఈటీవీ భారత్: యాప్ ఆధారిత క్యాబ్ సేవల్లో డ్రైవర్లు తక్కువ ఆదాయం, ఎక్కువ కమిషన్ భారంతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సహకార క్యాబ్ సర్వీస్ 'భారత్ ట్యాక్సీ' వారికి భరోసా కల్పించనుంది. డ్రైవర్లకు కనీస ఆదాయం ఉండేలా ప్రతి కిలోమీటర్‌కు కనీస ధర ఖరారు చేస్తామని కేంద్ర సహకార మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. దిల్లీ-ఎన్సీఆర్, గుజరాత్ ప్రాంతాలకు చెందిన క్యాబ్, ఆటో డ్రైవర్లతో జరిగిన టౌన్ హాల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ప్రైవేట్ క్యాబ్ కంపెనీలు తమ లాభాల కోసం డ్రైవర్ల కనీస రేటును నిర్ణయించకుండా ఉంచాయని విమర్శించారు. భారత్ ట్యాక్సీని దేశంలో విజయవంతమైన సహకార సంస్థ అమూల్ నమూనాలో తీసుకొస్తున్నామని షా వివరించారు. రైతులు కలిసి అమూల్‌ను భారీ సంస్థగా తీర్చిదిద్దినట్లే, డ్రైవర్లు సంయుక్తంగా ఈ వేదికను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రైవేట్ సంస్థల్లో లాభాలు యజమానులకు వెళ్లిపోతే, ఇక్కడ మాత్రం సభ్యులకే చేరుతాయని ఆయన అన్నారు.

దిల్లీలో జరిగిన కార్యక్రమంలో భారత్ ట్యాక్సీ సారథులతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా

గృహిణి శ్రమను గుర్తించకపోవడం అన్యాయం


- ఇల్లాలి కష్టంతోనే భర్త సమర్థంగా పనిచేయగలడు
- ఆమె ఏనాడూ ఖాళీగా ఉండదు: దిల్లీ హైకోర్టు

దిల్లీ: గృహిణి చేసే శ్రమ కారణంగానే భర్త సమర్థంగా పనిచేయగలుగుతాడని దిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ఇల్లాలిగా ఆమె చేసే పనిని పరిగణనలోకి తీసుకోకపోవడం అన్యాయమని పేర్కొంది. పోషణ వ్యయాన్ని నిర్ణయించే సమయంలో భార్య ఉద్యోగం చేయకపోవడాన్ని పనిలేనితనంగానో, ఉద్దేశ పూర్వకంగా భర్తపై ఆధారపడటంగానో వాదించడానికి వీల్లేదని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణ కాంత శర్మ అన్నారు. గృహిణి ఆర్జించే మొత్తాన్నే కాకుండా సంసార జీవన సౌందర్యానికి ఆమె పడే పాట్లను, వైవాహిక జీవనంలో అనుబంధాల కొనసాగింపునకు ఆమె చేసే కృషిని కూడా చట్టం పరిగణనలోకి తీసుకోవాలని న్యాయమూర్తి అన్నారు. డబ్బు సంపాదించని భార్యను ఖాళీగా కూర్చున్న వ్యక్తిగా భావించడమంటే.. సంసారం సజావుగా సాగడానికి ఆమె చేసే కృషిని సరిగా అర్థం చేసుకోకపోవడమేనని న్యాయమూర్తి అన్నారు. 'ఉద్యోగం లేకపోవడాన్ని పనిచేయకపోవడంగా పేర్కొనడం తేలికే. సంసార సాఫల్యానికి ఆమె చేసే కృషిని గుర్తించడం చాలా కష్టం' అని కోర్టు ఇటీవల వెలువరించిన తీర్పులో పేర్కొంది. "ఒక గృహిణి పనిలేకుండా ఎప్పుడూ కూర్చోదు. భర్త జీవనం సజావుగా సాగేందుకు ఆమె ఎప్పుడూ ఇంటిపనిలోనే ఉంటుంది. పోషణ వ్యయాన్ని నిర్ణయించే సమయంలో ఆమె కృషిని గుర్తించకపోవడం హేతుబద్ధం కాదు" అని కోర్టు అభిప్రాయపడింది. గృహిణి ఉద్యోగం చేయకపోవడాన్ని ఉద్దేశపూర్వకంగా భర్తపై ఆధారపడటంగా అభివర్ణించే ఏ వాదనతోనూ ఏకీభవించడం లేదని తెలిపింది. పనిచేసే సామర్థ్యం, విద్యార్హతలు ఉన్నా భార్య సోమరిగా బతుకుతూ ఉద్దేశపూర్వకంగా భర్తపై ఆధారపడిందన్న కారణం చూపుతూ ఒక మేజిస్ట్రేటు ఆమెకు పోషణ వ్యయాన్ని నిరాకరించారు. కక్షిదారులైన భార్యాభర్త 2012లో వివాహం చేసుకున్నారు. భర్త తన భార్యను, మైనర్ కుమారుణ్ని 2020లో వదిలేశారు. మైనర్ కుమారుడి విద్యకు ఖర్చు తానే భరిస్తున్నాననీ, భార్యకు సంపాదించే సామర్థ్యం ఉన్నా ఖాళీగా ఉంటూ పోషణ వ్యయం కోరుతోందని భర్త కోర్టుకు విన్నవించాడు.

మా పోరాటం స్వాతంత్ర్యం కోసం: పుతిన్

మాస్కో: ఉక్రెయిన్‌పై రష్యా ప్రారంభించిన యుద్ధం మంగళవారం నాటితో నాలుగేళ్లు పూర్తి చేసుకొని ఐదో పడిలోకి ప్రవేశిస్తుంది. ఈ సందర్భంగా ఇరుదేశాల అధినేతలు భిన్న వాదనలు వినిపించారు. "భవితవ్యం కోసం, స్వాతంత్ర్యం కోసం, సత్యం, న్యాయం కోసం రష్యా పోరాడుతోంది. ఈ పోరాటానికి ధీశాలురు, బలాఢ్యులు, నిస్వార్థపరులు అయిన ప్రజలు, సైనికులు, సైనిక దళాల అధికారులు, నేషనల్ గార్డ్ సభ్యులు, అంతర్గత వ్యవహారాల శాఖ ఉద్యోగులు, ప్రత్యేక విభాగాల అధికారులు నాయకత్వం వహిస్తున్నారు" అని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ సందర్భంగా అన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మరోలా వ్యాఖ్యానించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇప్పటికే మూడో ప్రపంచ యుద్ధాన్ని ప్రారంభించినట్లు తాను భావిస్తున్నానని వెల్లడించారు. కానీ ఈ వివాదం పెరగకుండా ఉండేందుకు తాము ఎంతో కృషి చేస్తున్నామని వివరించారు. మరోవైపు సోమవారం సమావేశమైన ఐరోపా సమాఖ్య.. హంగరీ లేవనెత్తిన అభ్యంతరాల కారణంగా రష్యాపై కొత్త ఆంక్షలు విధించేలా నిర్ణయం తీసుకోలేకపోయింది.

సాంబార్ తయారీకీ ఏఐ!



దిల్లీ: ఆహార నాణ్యత, అందులోని పోషక విలువలను పర్యవేక్షించే కృత్రిమ మేధ (ఏఐ) వ్యవస్థను ఉద్యోగ్ యంత్ర.ఏఐ అనే అంకుర సంస్థ ఏఐ సమిట్‌లో ప్రదర్శించింది. తమ సాంకేతికత రైతుల ఆదాయాలను పెంచడానికి తోడ్పడుతుందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు అంకుర్ జైన్ వివరించారు. ముడి దినుసుల నాణ్యత మొదలుకొని వాటితో ఎలా వంట చేస్తున్నారో ఏఐ సెన్సర్లు, కెమెరాలతో తమ వ్యవస్థ పరిశీలిస్తుందని చెప్పారు. ఉదాహరణకు సాంబారు తయారీని తీసుకుంటే అందులో ఎంత కందిపప్పు, ఎన్ని టమాటాలు, ఇతర కూరగాయలు, ఎంత నూనె వాడుతున్నదీ తమ ఏఐ వ్యవస్థ గణిస్తుందని, సాంబారు తయారయ్యాక దాని బరువు, ఉష్ణోగ్రత, క్యాలరీలు, మాంసకృత్తులు, పిండి పదార్థాలు, కొవ్వు, ఖనిజ లవణాల సమాచారాన్ని తెరపై ప్రదర్శిస్తుందని జైన్ వివరించారు.

ఏఐ సమిట్‌ను ప్రపంచం ప్రశంసించింది: మోదీ

దిల్లీ: భారత ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిన ఏఐ సమిట్‌ను ప్రపంచం హృదయపూర్వకంగా ప్రశంసించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సాంకేతికతలో దేశ యువతకున్న ప్రతిభ.. సమస్త మానవాళికి అనేక ప్రయోజనాలు చేకూర్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈమేరకు మోదీ ఎక్స్ వేదికగా సోమవారం పేర్కొన్నారు. దిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన ఈ 'ఏఐ ఇంపాక్ట్ సమిట్-2026' సదస్సుకు వివిధ దేశాల ప్రతినిధులు హాజరైన విషయం తెలిసిందే.

ఇరాక్, కువైట్‌ల మధ్య మళ్లీ వివాదం

బాగ్దాద్: సముద్ర సరిహద్దులపై ఇరాక్, కువైట్‌ల మధ్య పాత వివాదం మళ్లీ రాజుకుంది. పర్షియన్ సింధుశాఖలోని ఫష్త్ అల్ ఖైద్, ఫష్త్ అల్ ఐజ్ ఇసుక దిబ్బలు తనవేనంటూ ఇరాక్ ఇటీవల ఐక్యరాజ్య సమితికి సమర్పించిన మ్యాప్‌తో కువైట్ విభేదించింది. ఈ వివాదంలో యూఏఈ, ఖతార్, ఒమన్ లు సోమవారం కువైట్‌ను సమర్థించాయి. సౌదీ అరేబియా దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఇరాక్ మ్యాప్.. సౌదీ-కువైట్ ఉమ్మడి మండలంలోని భాగాలనూ అతిక్రమిస్తోందని ఫిర్యాదు చేసింది.

'జాతకాల సాకుతో పెళ్లి వద్దంటే కుదరదు'

దిల్లీ: పెళ్లి చేసుకుంటానని చెప్పి, శారీరకంగా కలిసి, తీరా పెళ్లి చేసుకోవాల్సి వచ్చేసరికి జాతక దోషం పేరుతో నిరాకరించడం భారతీయ న్యాయ సంహితలోని 69వ సెక్షన్ కింద నేరమవుతుందని దిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. మోసపూరిత వాగ్దానాలతో శారీరక సంబంధం పెట్టుకోవడం నేరమని ఈ సెక్షన్ చెబుతోంది. తమకు ఎనిమిదేళ్లుగా పరిచయం ఉందని, తాము పరస్పరాంగీకారంతోనే శారీరకంగా కలిశామని అంటూ నిందితుడు బెయిలు కోసం పెట్టుకున్న దరఖాస్తును హైకోర్టు తోసిపుచ్చింది. బాధితురాలు గత నవంబరులోనే కేసు పెట్టినా నిందితుడు, అతడి కుటుంబం పెళ్లికి ఒప్పుకోవడంతో తన ఫిర్యాదును ఉపసంహరించుకున్నారు. తర్వాత జాతకాలు కలవలేదంటూ నిందితుడు పెళ్లికి నిరాకరించాడు. దాంతో బాధితురాలు ఐపీసీ 376 (అత్యాచారం) సెక్షన్ కింద, బీఎన్ఎస్ 69వ సెక్షన్ కింద కేసు పెట్టారు. ఈ కేసులో మళ్లీ కొత్తగా ఛార్జిషీటు దాఖలు కావాల్సి ఉంది.

లింగ వివక్షకు తొలి అడుగు అదే...

- భ్రూణహత్యలపై సుప్రీంకోర్టు వ్యాఖ్య

దిల్లీ: మహిళలపై, ముఖ్యంగా బాలికలపై వివక్ష ఇప్పటికీ దేశవ్యాప్తంగా నెలకొందని, ఆగని భ్రూణహత్యలు ఈ సామాజిక దురంతానికి నిదర్శనమని సుప్రీంకోర్టు సోమవారం పేర్కొంది. 1994 నాటి లింగ నిర్ధరణ నిరోధక (పీఎన్‌డీటీ) చట్టం కింద గురుగ్రాంకు చెందిన ఒక రేడియాలజిస్టుకు వ్యతిరేకంగా కేసును కొట్టివేసేందుకు నిరాకరిస్తూ జస్టిస్ మనోజ్ మిశ్ర, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. నిందితుడైన రేడియాలజిస్టుపై కేసును మొగ్గ దశలోనే తుంచివేయలేమని ధర్మాసనం స్పష్టం చేసింది.

'2018కి ముందు భూసేకరణ కేసులను తిరిగి తెరవలేం'

భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) చట్టం కింద సేకరించిన రైతుల భూములకు సంబంధించి.. 2018కి ముందునాటి భూసేకరణ కేసులను వడ్డీతో కూడిన పరిహారం కోసం తిరిగి తెరవబోమని సుప్రీంకోర్టు సోమవారం మౌఖికంగా స్పష్టం చేసింది. 2019లో వెలువరించిన సర్వోన్నత న్యాయస్థానం తీర్పును సమీక్షించాలన్న ఎన్‌హెచ్ఏఐ అభ్యర్థనపై విచారణను ప్రారంభిస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఈ విషయం తెలిపింది.

ముస్లింలలోని ఇతర ఓబీసీల పరిస్థితేమిటి?

వెనుకబాటు..ఒక సామాజిక హోదా కాదని, దానిలో ఆర్థికాంశం కూడా ఇమిడి ఉంటుందని సుప్రీంకోర్టు పేర్కొంది. ముస్లింలలోని ఇతర ఓబీసీల పరిస్థితి ఏమిటని పిటిషనర్‌ను ఆదేశించింది. పస్మాందా ముస్లింలకు ఓబీసీ రిజర్వేషన్లలో 10శాతం ఉపవాటా కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం సోమవారం కీలక ప్రశ్నను సంధించింది. ముస్లింలలో పస్మాందా సామాజిక వర్గీయులు మాత్రమే వెనుకబడి ఉన్నారా? ఇతర వర్గాల పరిస్థితినీ తెలియజేయాలని పిటిషనర్‌కు సూచించింది.

పౌర విమాన సంస్థల 'ఇష్టారాజ్యం'పై పిల్

దేశంలో ప్రైవేటు రంగంలోని పౌర విమాన సంస్థలు ఛార్జీలను ఇష్టారాజ్యంగా, అనూహ్యంగా పెంచేయడంతోపాటు ఎడాపెడా అదనపు రుసుములు పిండుతున్నాయని, వాటిని నియంత్రించేందుకు మార్గదర్శకాలు రూపొందించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. వ్యాజ్యంలోని అంశాలను పౌరవిమానయాన శాఖ పరిశీలిస్తోందని కేంద్రం సోమవారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. వ్యాజ్యంలో విషయాలు చాలా తీవ్రమైనవని జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం అభివర్ణించింది. సంప్రదింపులు పూర్తిచేసి ఒక నిర్ణయానికి వచ్చేందుకు కేంద్రానికి నాలుగు వారాల గడువును విధించింది.

సాగులో స్మార్ట్.. ఆదాయంలో బెస్ట్!

నేటి యువత ఏసీ గదుల్లో పని చేస్తూ అధికంగా సంపాదించే ఉద్యోగాలనే ఎంచుకుంటున్నారు. కానీ అందుకు భిన్నంగా ఎంబీఏ చదివిన ఆకాశ్ హింగడ్ మాత్రం అలాంటి ఉద్యోగాన్ని కాదని వ్యవసాయంవైపు మళ్లారు. స్మార్ట్‌గా వ్యవసాయం చేస్తూ అధిక ఆదాయాన్ని గడిస్తున్నారు. రాజస్థాన్‌లోని రాజ్‌సమంద్‌కు చెందిన ఆకాశ్.. గ్రామీణాభివృద్ధి సబ్జెక్టులో ఎంబీఏ చేశారు. ముంబయిలో కొంతకాలంపాటు ఓ బ్యాంకు ఉద్యోగం చేశారు. వేతనం ఏడాదికి రూ.24 లక్షల నుంచి రూ.25 లక్షలదాకా వచ్చేది. అయినా ఆయన మనసు సొంత ఊరువైపే లాగేది. దీంతో ఉద్యోగాన్ని వదిలేసి ఊరికి వచ్చి వ్యవసాయాన్ని వృత్తిగా ఎంచుకున్నారు. జాగ్రత్తగా ప్లాన్ చేసుకోవడం, వాతావరణాన్ని అర్థం చేసుకోవడం, ఆధునిక సాంకేతికతలను వినియోగించుకోవడం, మార్కెట్ డిమాండుపై అవగాహన పెంచుకోవడం ద్వారా అధిక ఆదాయాన్ని గడించవచ్చని ఆయన నిరూపించారు. ఏటా రూ.60 లక్షల ఆదాయం సంపాదిస్తున్నారు. 15 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. వాస్తవానికి రాజాసమంద్ పట్టణానికి చెందిన ఆకాశ్ తల్లిదండ్రులకు మార్బుల్, స్థిరాస్తి వ్యాపారాలున్నాయి. అయితే ఆయన వాటిని కాదని, తన పూర్వీకులకు చెందిన కురజ్ గ్రామంలో ఉన్న 32 ఎకరాల్లో సాగు చేపట్టారు. ప్రస్తుతం ఆయన.. దోసకాయలు, టమాటా, మిర్చి, ఆలుగడ్డలు, బఠానీలు, పుచ్చకాయలను పండిస్తున్నారు. త్వరలో ఆదాయాన్ని రూ.కోటికి చేర్చాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు.





సభా సమయం

యనమదుర్రు డ్రెయిన్ 10 ఇన్‌లెట్ల పునర్నిర్మాణం

- రూ.3.02 కోట్లు మంజూరు
- జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

ఈనాడు, అమరావతి: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కీలకమైన యనమదుర్రు డ్రెయిన్‌కు 10 ఇన్‌లెట్ల పునర్నిర్మాణానికి రూ.3.02 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, ఈ ఏడాది టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి పనులు చేపడతామని మంత్రి రామానాయుడు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న మరో 36 ఇన్‌లెట్ల పునర్నిర్మాణానికి వ్యయ అంచనాలు రూపొందించి పూర్తిచేసేందుకు త్వరలో ముందుకెళ్తామని వివరించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యుడు పులపర్తి రామాంజనేయులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. 'యనమదుర్రు డ్రెయిన్ సామర్థ్యం 23వేల క్యూసెక్కులు. వరదల సమయంలో 35వేల క్యూసెక్కుల వరకు ప్రవహిస్తోంది. డ్రెయిన్‌కు 54 ఇన్‌లెట్లు ఉంటే ఇందులో 46 శిథిలావస్థలో ఉన్నాయి. ఫలితంగా వరదలొచ్చినప్పుడు డ్రెయిన్ వెంబడి భీమవరం పట్టణంలోని కొన్ని వార్డులు, పొలాలు ముంపునకు గురవుతున్నాయి. వైకాపా ప్రభుత్వం వీటిని బాగు చేయించడానికి రూపాయి కూడా కేటాయించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక అంచనాలు రూపొందించి నిధులు మంజూరుచేసింది. త్వరలో వీటన్నింటినీ బాగు చేస్తాం' అని వివరించారు.

సార్వత్రిక ఆరోగ్య బీమాతో 1.63 కోట్ల మందికి ప్రయోజనం

- మండలిలో మంత్రి సత్యకుమార్ వెల్లడి
- ప్రశ్నోత్తరాలకు అడ్డుతగిలిన వైకాపా సభ్యులు
- సమాధానం ఇచ్చినట్లుగా భావించాలని ప్రకటించిన ఛైర్మన్



ఈనాడు, అమరావతి: వైకాపా సభ్యుల నిరసన కారణంగా మండలిలో సోమవారం ప్రశ్నోత్తరాలపై చర్చించడం సాధ్యం కాలేదు. ఉదయం 10.10 గంటలకు సభ వాయిదా పడిన తర్వాత తిరిగి సమావేశమైన అనంతరం సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చినట్లుగా భావించాలని మండలి ఛైర్మన్ మోషేను రాజు ప్రకటించారు. కేవలం ఒక్క ప్రశ్నకు మాత్రమే మంత్రి సభలో సమాధానం ఇవ్వడం సాధ్యమైంది. ఉద్యోగుల ఆరోగ్య పథకం, వర్కింగ్ జర్నలిస్టుల ఆరోగ్య పథకం వర్తించే వారు మినహా మిగిలిన అందరికీ హైబ్రిడ్ విధానంలో సార్వత్రిక ఆరోగ్య బీమా పథకం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ మండలిలో వెల్లడించారు. 'ఈ పథకంతో 1.63 కోట్ల మందికి ప్రయోజనం చేకూరుతుంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబానికి ఏడాదికి రూ.25 లక్షల బీమా కవరేజీ ఉంటుంది. దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న కుటుంబానికి ఏడాదికి రూ.2.5 లక్షల బీమా ప్రయోజనం లభిస్తుంది' అని సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి పేర్కొన్నారు.

సమాధానం ఇచ్చినట్లుగా పేర్కొన్న అంశాలు

- రాష్ట్రంలో 2,309 గ్రామ ఆరోగ్య క్లినిక్ భవనాల నిర్మాణంలో ఉన్నాయి. వాటిని రూ.217.10 కోట్లతో చేపట్టాం.
- రాష్ట్రంలో అక్రమ మద్యం నియంత్రణకు 2024 జూన్ నుంచి 10 చోట్ల దాడులు నిర్వహించి, కేసులు నమోదు చేసి 137 మందిని అరెస్టు చేశాం. ఎక్సైజ్ శాఖ జరిపిన దాడుల్లో 5,686 లీటర్ల నకిలీ మద్యం, 4,635 లీటర్ల స్పిరిట్ స్వాధీనం చేసుకున్నాం.
- కావలి మున్సిపాలిటీ పరిధిలోని కలువ, చెరువు పోరంబోకు కలిపి 21.65 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు సర్వేలో గుర్తించాం.
- ఉభయ గోదావరి జిల్లాల్లోని కొబ్బరి పంటపై తెల్ల ఈగ ఉద్ధృతిపై రైతులకు అవగాహన కల్పించేందుకు వీలుగా కార్యక్రమాలు చేపట్టాం. కొబ్బరి అభివృద్ధి బోర్డు సాయంతో గోదావరి జిల్లాల్లో కొత్త మొక్కలు నాటడంతో పాటు పునరుజ్జీవ కార్యక్రమాలు నిర్వహించాం.
- ఏపీ, కర్ణాటక మధ్య ప్రజా రవాణా కోసం అంతర్రాష్ట్ర ఒప్పందంపై ప్రాథమిక నోటిఫికేషన్‌ను జారీ చేశాం. దీనిపై ప్రైవేట్ బస్సు నిర్వాహకుల నుంచి కొన్ని వినతిపత్రాలు ప్రభుత్వానికి అందాయి. వాటిని పరిశీలించి తుది నోటిఫికేషన్‌ను త్వరలో జారీ చేస్తాం.
- రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దేవాదాయ శాఖ సాధారణ సంక్షేమ నిధి, తితిదే శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రంలోని ఆలయాల పునర్నిర్మాణం, నవీకరణ, పునరుద్ధరణ పనులు చేపడతాం.
- రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు 2024 జూన్ నుంచి ప్రోత్సాహకాల కింద రూ.264.57 కోట్లు చెల్లించాం. వాటి ద్వారా ఎస్సీలకు చెందిన 9,105 యూనిట్లు, ఎస్టీలకు సంబంధించి 1,546 యూనిట్లకు లబ్ధి చేకూరింది.
- వైఎస్సార్ కడప జిల్లాలో యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) నిర్వహించే యురేనియం తవ్వకాలతో పర్యావరణానికి ఇబ్బందులపై ఎలాంటి నివేదికలు అందలేదు. యురేనియం తవ్వకాల వల్ల భూగర్భ జలాల కాలుష్యం, ఆరోగ్య సమస్యలు, పంట నష్టంపై 2019-2021 మధ్య ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అధ్యయనం చేసింది. ఆ నివేదికను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) మద్రాస్, తిరుపతి స్విమ్స్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐసీఏఆర్)-నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఫర్ బనానా(ఎన్ఆర్‌సీబీ-తిరుచ్చి) వంటి ప్రసిద్ధ సంస్థలకు పంపింది. టైలింగ్ పాండ్ వల్ల భూగర్భ జలాలు కలుషితమయ్యాయనడానికి ఎలాంటి ఆధారాలు లేవని ఐఐటీ మద్రాస్ తేల్చింది. దీనికి సమీపంలో ఉన్న గ్రామాల్లో సాధారణ వ్యాధుల అధ్యయనం, వ్యాధుల తీరు తెలుసుకోవడానికి తరచూ అధ్యయనాలు చేయాలని తిరుపతిలోని స్విమ్స్ సిఫార్సు చేసింది.

జగన్ రద్దు చేసిన కార్మిక సంక్షేమ పథకాల పునరుద్ధరణ

- కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో జగన్ రద్దుచేసిన కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించినట్లు కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఏపీ మెకానిక్‌లను భవన నిర్మాణ సంక్షేమ చట్టం పరిధిలోకి తీసుకొచ్చేందుకు కేంద్ర చట్టాన్ని సవరించాలని, ఆ మేరకు ప్రతిపాదనల్ని పంపామని వివరించారు. కొత్త లేబర్ కోడ్ ప్రకారం అసంఘటిత కార్మికుల సంక్షేమ చట్టం ద్వారా వీరికి సంక్షేమ పథకాలు అమలుచేస్తామని వివరించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు పార్థసారథి, బొలిశెట్టి శ్రీనివాస్, రెడ్డప్పగారి మాధవీరెడ్డి, కోళ్ల లలితకుమారి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. '2014-19 మధ్య కొత్తగా 8 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు నమోదైతే.. 2019-24 మధ్య ఆ సంఖ్య 2 లక్షలే ఉంది. ఇప్పుడు 30లక్షల మంది కొత్తగా నమోదు చేసుకుంటారని అంచనా వేస్తున్నాం. అసంఘటితరంగ కార్మికులకు ఉచిత వైద్యసేవలతో పాటు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. వివాహకానుక కింద రూ.40వేలు, ప్రసూతిసాయం కింద రూ.20వేలు, సాధారణ మరణం సంభవిస్తే రూ.60వేలు, అంత్యక్రియ ఖర్చులకు రూ.20వేలు ఇస్తున్నాం. కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలనూ అందిస్తున్నాం' అని పేర్కొన్నారు.

ఐదో రోజూ.. వైకాపాది అదే తీరు!

- నిరసనలు.. నినాదాలతో మండలి సమయం వృథా

ఈనాడు, అమరావతి: మండలిలో వరుసగా ఐదో రోజూ వైకాపా ఎమ్మెల్సీల తీరులో మార్పు లేదు. గత నాలుగు రోజుల్లాగే సోమవారం సభ ప్రారంభమైన వెంటనే వాయిదా తీర్మానంపై చర్చకు అనుమతించాలని డిమాండ్ చేస్తూ పోడియంలోకి చొచ్చుకుపోయి.. ఛైర్మన్ కుర్చీని చుట్టుముట్టారు. నినాదాలు చేస్తూ సభ నిర్వహణకు ఆటంకం కలిగించారు. ఉదయం 10.03 గంటలకు మండలి ప్రారంభమైన వెంటనే 'హెరిటేజ్ సంస్థకు అనుబంధంగా ఉన్న ఇందాపూర్ డెయిరీ.. తితిదేకు నెయ్యి సరఫరా చేయడం, తిరుపతి లడ్డూప్రసాద అంశంపై చర్చించాలి' అని కోరుతూ వైకాపా ఎమ్మెల్సీలు అరుణ్‌కుమార్, శివరామిరెడ్డి, పీవీవీ సూర్యనారాయణరాజు ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు ఛైర్మన్ మోషేనురాజు ప్రకటించారు. వెంటనే వైకాపా ఎమ్మెల్సీలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ పోడియంలోకి చొచ్చుకెళ్లి, నినాదాలు చేశారు. ఈ గందరగోళ పరిస్థితుల మధ్య ఛైర్మన్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. రోజూ ఇలా చేయడం సరికాదని ఛైర్మన్ ఎంతగా చెప్పినా వైకాపా ఎమ్మెల్సీలు లెక్కపెట్టలేదు. వారికి పోటీగా కూటమి ఎమ్మెల్సీలు కొద్దిసేపు పోడియం ముందుకు వెళ్లి నినాదాలు చేశారు. మంత్రులు కేశవ్, నాదెండ్ల మనోహర్ జోక్యం చేసుకొని కూటమి ఎమ్మెల్సీలను వెనక్కి పిలిచారు. వైకాపా సభ్యులు ఆ తర్వాతా నిరసనలు ఆపకపోవడంతో.. సభ కొనసాగించే పరిస్థితి లేక ఉదయం 10.10 గంటలకు ఛైర్మన్ సభను వాయిదా వేశారు. అనంతరం మధ్యాహ్నం 02.02 గంటలకు సభ తిరిగి ప్రారంభమైంది. సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు ప్రభుత్వం ఇచ్చినట్లుగా భావించాలని ఛైర్మన్ ప్రకటించారు. ప్రత్యేక ప్రస్తావనలకు అనుమతించారు. రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి నలుగురు మృతి చెందిన అంశంపై హోంమంత్రి అనిత సభలో ప్రకటన చేసేందుకు అనుమతించారు. అనంతరం ఛైర్మన్ సభను మంగళవారానికి వాయిదా వేశారు.

వైకాపా హయాంలో గిరిజన ప్రాంతాల్లో గంజాయి సాగు

- గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో గిరిజనులకు 16 సంక్షేమ పథకాల్ని నిలిపేశారని.. కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని పునరుద్ధరించామని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి చెప్పారు. వైకాపా హయాంలో వేల ఎకరాల్లో గంజాయి సాగు చేయిస్తే.. కూటమి ప్రభుత్వంలో కాఫీ తోటలు సాగు చేయించడం ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపామని చెప్పారు. అసెంబ్లీలో సోమవారం గిరిజన సంక్షేమ శాఖ గ్రాంట్లపై చర్చ అనంతరం మంత్రి మాట్లాడారు. 'కాఫీ తోటల పునరుద్ధరణ, విస్తరణ, ధ్రువీకరణ, మార్కెటింగ్‌కు రూ.16.88 కోట్లు కేటాయించాం. 9 ఐటీడీఏల నిర్వహణకు రూ.29 కోట్లు, ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు రూ.365 కోట్లు కేటాయించాం' అని వివరించారు.

విపత్తుల్లో పంట, ప్రాణనష్టాల్ని గణనీయంగా తగ్గిస్తున్నాం

- మొంథా తుపాను పంట నష్ట పరిహారాన్ని పెంచి ఇచ్చాం
- విపత్తు నిర్వహణశాఖ మంత్రి అనిత

ఈనాడు, అమరావతి: విపత్తుల్లో సాంకేతికతను వినియోగించుకుని పంట, ప్రాణనష్టాలను గణనీయంగా తగ్గించగలుగుతున్నామని విపత్తు నిర్వహణశాఖ మంత్రి అనిత పేర్కొన్నారు. మొంథా తుపాను సమయంలో ముందుజాగ్రత్తలు తీసుకుని రైతుల్ని, ప్రజల్ని అప్రమత్తం చేశామని వెల్లడించారు. అన్ని రకాల వ్యవసాయ, ఉద్యాన పంటలకు, పట్టు, చేనేత రంగాలకూ నష్టపరిహారాన్ని పెంచి ఇచ్చామని, నష్టం మదింపు పారదర్శకంగా చేపట్టామని వివరించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ, కాగిత కృష్ణప్రసాద్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 'గతంలో విపత్తులు వచ్చినప్పుడు పంట, ప్రాణనష్టాలు భారీగా జరిగేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక విపత్తు నిర్వహణపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకదృష్టి సారించారు. రైతుల్ని ప్రజల్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసేందుకు సాంకేతికతను వినియోగిస్తున్నాం. ఆర్టీజీఎస్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం' అని వివరించారు. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ 'విపత్తు నిర్వహణ నిధిని జిల్లాస్థాయిలో అందుబాటులో ఉంచాలి. తద్వారా తుపాను, వరదల సమయంలో వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది' అని పేర్కొన్నారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 'మొంథా తుపాను కారణంగా నష్టపోయిన నియోజకవర్గ పరిధిలోని రైతులకు పరిహారం ఇంతవరకు అందలేదు. వెంటనే అందించాలి' అని కోరారు.

అసెంబ్లీ భద్రతలో సిబ్బందిని 500కు తగ్గించాం

అసెంబ్లీ భద్రతకు నూతన సాంకేతికతను వినియోగిస్తున్నట్లు హోం మంత్రి అనిత తెలిపారు. గతంలో అసెంబ్లీ సమావేశాల సమయంలో భద్రత కోసం 2,500 మంది వరకు సిబ్బందిని వివిధ జిల్లాల నుంచి రప్పించేవారని, ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలకు ఆ సంఖ్యను 500కు తగ్గించామని చెప్పారు. రాబోయే రోజుల్లో సిబ్బందిని మరింత తగ్గించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సోమవారం ఆమె అసెంబ్లీలాబీల్లో విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాలను వివరించారు.

సాంఘిక సంక్షేమ వసతిగృహాలకు.. రూ.365 కోట్లు వెచ్చించాం: మంత్రి డీబీవీ స్వామి

ఈనాడు, అమరావతి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ లేనంతగా 2025-26 సంవత్సరంలో సాంఘిక సంక్షేమ వసతిగృహాలకు కూటమి ప్రభుత్వం రూ.365 కోట్లు ఖర్చుచేసిందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి చెప్పారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు జిల్లాకు ఒక వైద్యాధికారిని నియమించామని, అత్యుత్తమ వైద్యం అందిస్తున్నామని తెలిపారు. అసెంబ్లీలో సోమవారం గ్రాంట్ల కోసం అభ్యర్థనపై చర్చ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడారు. సాంఘిక సంక్షేమశాఖకు 2026-27 బడ్జెట్లో రూ.11,118 కోట్ల బడ్జెట్ కేటాయించామని, గతేడాది కంటే ఇది రూ.362.65 కోట్లు అధికమని చెప్పారు. '150 మంది నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాషపై శిక్షణ ఇస్తున్నాం. వారికి జర్మనీలో ఉపాధి కల్పిస్తాం. 340 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత సివిల్స్ శిక్షణ అందిస్తున్నాం. డీఎస్సీ ఉచిత కోచింగ్ వల్ల 300 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. 140 మందికి ఎస్సెస్సీ, ఆర్ఆర్‌బీ తదితర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నాం. ముఖ్యమంత్రి సూచన మేరకు ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ కేంద్రాలను పదికి పెంచాం. గతేడాది నీట్‌లో 57 మంది సీట్లు సాధించారు' అని వివరించారు. 'ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం యడవల్లి, కృష్ణా జిల్లా జి.కొండూరులో రూ.11.5 కోట్లతో ఫుట్‌వేర్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నాం. కోటక్ మహీంద్ర, తిరుపతి కలినరీ విశ్వవిద్యాలయ సహకారంతో అంబేడ్కర్ గురుకులాల్లో వంట మనుషులకు శిక్షణ ఇస్తున్నాం. ఎస్సీకాలనీల్లో రూ.600 కోట్లతో శ్మశాన వాటికలను దశలవారీగా ఏర్పాటు చేస్తామ'ని మంత్రి స్వామి వివరించారు.

'సాక్షి' విష ప్రచారానికి అడ్డుకట్ట వేయాల్సిందే

- పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

ఈనాడు, అమరావతి: సాక్షి పత్రిక, సాక్షి ఛానల్, వాటి తరహాలోనే విషం చిమ్మే మరికొన్ని పత్రికలు, ఛానళ్లు కొనసాగిస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఆపాలని, గాలి వార్తల్ని అదుపు చేయాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. సోమవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో సామాజిక మాధ్యమాల దుర్వినియోగంపై సభ్యులు గౌతు శిరీష, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రశ్నలు అడిగారు. ఈ సందర్భంగా గౌతు శిరీష మాట్లాడుతూ అసత్యాలు ప్రచారాలు చేసినప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. రశీదు ఇస్తున్నారే తప్ప కనీసం వారిని స్టేషన్‌కు పిలిచి విచారించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విషప్రచారాలు సమాజంలో ఆందోళనకు దారి తీస్తున్నాయని, భవిష్యత్తు తరాలను వీటి నుంచి కాపాడడానికి ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు.

నేనూ సామాజిక మాధ్యమాల బాధితుడినే: చిర్రి బాలరాజు

తానూ సామాజిక మాధ్యమాల బాధితుడినేనని పోలవరం శాసనసభ్యుడు చిర్రి బాలరాజు పేర్కొన్నారు. "నాపై అసత్యప్రచారం చేసినవారిని న్యాయస్థానం ద్వారా కటకటాలపాలు చేశా. సామాజిక మాధ్యమాల్ని కొంతమంది దుర్వినియోగం చేస్తున్నారు. భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో వ్యక్తుల జీవితాల్ని బజారున పడేస్తున్నారు. పైశాచిక ఆనందం, వేధింపులకు, అసత్య ఆరోపణలు చేసేందుకు వినియోగిస్తున్నారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. వ్యవస్థీకృత ముఠాలుగా తయారై వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడి సత్యదూరమైన అసభ్యకర పోస్టుల్ని పెడుతున్నారు. ఇలాంటి విష సంస్కృతిని అరికట్టడానికి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. దీని కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి. వాస్తవాలు తెలుసుకోకుండా వార్తల్ని షేర్ చేసే వారినీ బాధ్యుల్ని చేయాలి" అని చెప్పారు.

ప్రత్యేక చట్టం తీసుకురాబోతున్నాం: అనిత, హోం మంత్రి

సభ్యులు అడిగిన ప్రశ్నలకు హోం మంత్రి అనిత సమాధానమిచ్చారు. "సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు, వ్యక్తిత్వ హననాల నియంత్రణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురానున్నాం. ప్రస్తుత చట్టాన్ని సమీక్షించడానికి, తగిన చర్యల సిఫార్సుకు ఆరుగురు సభ్యులతో కూడిన మంత్రుల బృందాన్ని ప్రభుత్వం ఇప్పటికే ఏర్పాటుచేసింది. వారి సిఫార్సుల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటాం. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనేది పరిశీలిస్తున్నారు. సింగపూర్, మలేసియా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ దేశాల్లో 16 ఏళ్లలోపు చిన్నారులకు సామాజిక మాధ్యమాల వాడకాన్ని నిషేధించారు. అలాంటి విధానాన్ని అమలుచేస్తే మన చట్టం ఎంతవరకు అంగీకరిస్తుందనే విషయాలపైనా దృష్టి సారించాం. వివిధ సామాజిక మాధ్యమ విభాగాల అధికారులను సంప్రదించి సలహాలు, సూచనలు కోరబోతున్నాం. 20 నెలల్లో 1,384 కేసులు నమోదుచేశాం. 1,067 మందిని అరెస్ట్ చేశాం. సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారానికి కేసులు నమోదుచేసే అవకాశముంది" అని వెల్లడించారు.

చేనేత మహిళకు ప్రతిభా 'పురస్కారం'



కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ చేతులమీదుగా పురస్కారాన్ని స్వీకరిస్తున్న విజయలక్ష్మి

చౌటుప్పల్, న్యూస్‌టుడే: తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడేనికి చెందిన చేనేత మహిళ వర్కాల విజయలక్ష్మి అత్యున్నత ప్రతిభా పురస్కారాన్ని కేంద్ర టెక్స్‌టైల్ మంత్రి గిరిరాజ్‌సింగ్ చేతులమీదుగా సోమవారం దిల్లీలో అందుకున్నారు. దిల్లీలో జాతీయ చేనేత అభివృద్ధి కార్పొరేషన్(ఎన్‌హెచ్‌డీసీ) 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా.. రాష్ట్రం నుంచి విజయలక్ష్మికి పురస్కారం ప్రదానం చేశారు. ఈ సంస్థ నుంచి కొనుగోలు చేసిన నూలుతో ప్రత్యేకమైన 'ఇక్కత్' డిజైన్లతో మగ్గాలపై వస్త్రాల ఉత్పత్తి, ఉపాధి కల్పన, దేశ విదేశాల్లో విక్రయిస్తున్నందుకు ఈ పురస్కారానికి తనను ఎంపిక చేసినట్లు విజయలక్ష్మి తెలిపారు.

నిధులు ఖర్చు చేయడంలోనూ నిర్లక్ష్యమేనా?

- ఎస్టీపీల నిర్మాణంపై కలెక్టర్లు, పుర కమిషనర్లకు కొరవడిన శ్రద్ధ
- స్థలాలు కేటాయించడానికీ తీరిక లేదా?
- స్వచ్ఛాంధ్ర సంస్థలో మూలుగుతున్న రూ.1,300 కోట్లు

ఈనాడు-అమరావతి: కలెక్టర్లు, పుర కమిషనర్లలో చొరవ లోపించిన కారణంగా రూ.1,300 కోట్లకుపైగా స్వచ్ఛ భారత్ నిధులు మూలుగుతున్నాయి. వచ్చే నెలాఖరులోగా వీటిని ఖర్చు చేయకపోతే రాష్ట్రం నష్టపోనుంది. మురుగునీరు శుద్ధి చేసే ప్లాంట్ల (ఎస్టీపీ) ఏర్పాటుకు స్థలాలు సమకూర్చితే పనులు ప్రారంభించేందుకు గుత్తేదారులు సిద్ధంగా ఉన్నారు. అధికారులు ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరించడంతో టెండర్లు ఖరారు చేసినా పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. పట్టణాభివృద్ధికి సంబంధించి వివిధ దేశాల్లో ఉత్తమ విధానాలపై అధ్యయనం చేస్తున్న పురపాలక శాఖ మంత్రి నారాయణ.. ఎస్టీపీల నిర్మాణంపై తక్షణమే దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు ఖర్చు చేయకపోవడంపై ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో ఇటీవల నిర్వహించిన సమావేశంలో సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. స్వచ్ఛ భారత్-2లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.3 వేల కోట్లు కేటాయించింది. ఇందులో 50% నిధులు నగరాలు, పట్టణాల్లో మురుగునీరు శుద్ధి చేసే ప్లాంట్ల (ఎస్టీపీ) ఏర్పాటుకే ఖర్చు చేయాలని నిర్దేశించింది. రాష్ట్రంలో 66 పుర, నగరపాలక సంస్థల్లో 181 ఎస్టీపీల నిర్మాణానికి స్వచ్ఛాంధ్ర సంస్థ చర్యలు చేపట్టింది. ఇందుకోసం రూ.1,416 కోట్లతో అంచనాలు రూపొందించారు.

148 ప్లాంట్ల పనులు మొదలు కాలేదు..

- ఎస్టీపీ నిర్మాణానికి స్థలాల కొరత కారణంగా 148 ప్లాంట్ల పనులు ప్రారంభం కాలేదు. మొత్తం 181 ప్లాంట్లలో 33 చోట్ల పనులు మొదలై ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్నాయి. మిగిలిన ప్లాంట్ల పనులు మొదలు కాకపోవడంతో నిధులు బ్యాంకు ఖాతాలకు పరిమితమయ్యాయి.
- 148 ఎస్టీపీల నిర్మాణం కోసం 135 ఎకరాల భూమి అవసరమని అధికారులు గుర్తించారు. ప్రైవేట్ భూములు సేకరించి బాధితులకు పరిహారం చెల్లించడమంటే భారీగా ఖర్చుతో కూడిన వ్యవహారం కావడంతో పుర కమిషనర్లు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ భూములు కేటాయించాలంటే కలెక్టర్లు చొరవ తీసుకోవాలి. కొన్ని జిల్లాల్లో పుర కమిషనర్ల నుంచి విజ్ఞప్తులు వెళ్లినా కలెక్టర్లు దృష్టిసారించడం లేదు.
- ప్రతిపాదిత 181 ఎస్టీపీల నిర్మాణం పూర్తయితే 66 పుర, నగరపాలక సంస్థల్లో రోజూ 564 మిలియన్ లీటర్ల మురుగునీరు శుద్ధి చేసే అవకాశం వస్తుంది. ప్రస్తుతం ఈ నీటిని నేరుగా సముద్రం, నదులు, చెరువులు, పంట కాలువల్లో వదిలేయడంతో పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గత వైకాపా ప్రభుత్వంలో ఎస్టీపీల నిర్మాణ విషయాన్నే విస్మరించారు. దీంతో జాతీయ గ్రీన్ ట్రైబ్యునల్ సైతం రాష్ట్రానికి జరిమానా విధించింది.

వచ్చే నెలాఖరులోగా ఖర్చు చేయాలి

స్వచ్ఛభారత్-2 ఈ ఏడాది మార్చి నెలాఖరుతో ముగియనుంది. 2020-21లో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. రాష్ట్రానికి కేటాయించిన నిధులు ఐదేళ్లలోగా ఖర్చు చేయాల్సిందేనని కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలున్నాయి. నెలాఖరులోగా ఎస్టీపీల నిర్మాణ పనులు ప్రారంభించినా ఉపయోగం ఉంటుంది. లేకపోతే నిధులు నిరుపయోగం కానున్నాయి.

వర్కింగ్ ఉమెన్ హాస్టళ్ల నిర్మాణంలోనూ అదే దారి..

స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా విశాఖలో మూడు వర్కింగ్ ఉమెన్ హాస్టళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధుల వ్యయంలోనూ తీవ్రమైన జాప్యమవుతోంది. ఇప్పటికే నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించాల్సి ఉంది. పనులకు టెండర్లు పిలవడంలో అధికారులు ఏడాదిపాటు తాత్సారం చేశారు. మధురవాడలో రూ.63.15 కోట్లు, ముడసర్లోవలో రూ.26.13 కోట్లు, గాజువాకలో రూ.17.30 కోట్లతో హాస్టల్ భవన నిర్మాణానికి ఇంజినీర్లు అంచనాలు వేశారు. రెండు చోట్ల ప్రారంభించిన పనులు 25% కూడా పూర్తి కాలేదు. మధురవాడలో హాస్టల్ భవన నిర్మాణానికి తాజాగా శంకుస్థాపన జరిగింది. నగరపాలక సంస్థల ఆధ్వర్యంలో వర్కింగ్ ఉమెన్ హాస్టళ్ల నిర్మాణం, నిర్వహణ ఇదే మొదటిసారి కానుంది. ప్రయోగాత్మకంగా విశాఖను కేంద్రం ఎంపిక చేసినా అధికారుల ఉదాసీనతతో పనులు నత్తను తలపిస్తున్నాయి.

ఆర్టీసీ బస్సు బోల్తా... 12 మందికి తీవ్రగాయాలు

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం శ్యాంపూర్ సమీపంలో వంతెన వద్ద ఆసిఫాబాద్ డిపో ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. సోమవారం ఉదయం ఆదిలాబాద్ నుంచి ఆసిఫాబాద్‌కు వెళ్తున్న బస్సు శ్యాంపూర్ వాగుపై ఉన్న ఇరుకు వంతెన సమీపంలోకి రాగానే ఎదురుగా బొలెరో వాహనం దూసుకొచ్చింది. దాన్ని తప్పించబోయి వర్షం, మంచు కారణంగా బస్సు నియంత్రణ తప్పి పక్కనే ఉన్న వాగులో పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, కండక్టర్లతోపాటు 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. ఈ ప్రమాదంపై రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విచారం వ్యక్తంచేశారు. ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో మాట్లాడి సంబంధిత వివరాలు తెలుసుకున్నారు.

నల్లతామర నివారణకు సేంద్రియ పురుగు మందు

- ఆవిష్కర్తలకు కేంద్రం రూ.20 లక్షల సాయం

ఈనాడు, హైదరాబాద్: మిర్చి, పత్తి పంటలను అధికంగా ఆశించే నల్లతామర నివారణకు సేంద్రియ పురుగుమందు కనుగొన్న తెలంగాణ యువ శాస్త్రవేత్తలు గాజుల ప్రభాకర్, పాపతోటి నరేంద్రకుమార్‌లు స్థాపించిన శ్రీజీపీ అవెన్స్ లైఫ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అంకుర సంస్థకు.. కేంద్ర ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ(డీఎస్టీ) 'నిధి సీడ్ సపోర్ట్ ప్రోగ్రామ్' కింద రూ.20 లక్షలు విడుదల చేసింది. కేంద్ర బయోటెక్నాలజీ శాఖ దేశంలోనే నల్లతామర నివారణకు దోహదపడే తొలి సేంద్రియ పురుగుమందుగానూ దీన్ని గుర్తించింది. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరికి చెందిన ప్రభాకర్ బాటనీలో, డోర్నకల్‌కు చెందిన నరేంద్రకుమార్ మైక్రో బయాలజీలో ఉస్మానియా వర్సిటీలో పీహెచ్‌డీ పూర్తిచేశారు. నల్లతామర తెగులు కారణంగా తమ పొలాల్లోని మిర్చి పంటలకు భారీ నష్టం కలుగుతుండటాన్ని ప్రత్యక్షంగా తెలుసుకున్న వీరిద్దరూ, నివారణ మందును కనుగొనేందుకు 2021 నుంచి పరిశోధనలు ప్రారంభించారు. తెలంగాణ వ్యవసాయ వర్సిటీలోని అగ్రిహబ్‌లో అంకుర సంస్థను స్థాపించి ప్రయోగాలు చేశారు. నల్లతామర తెగులు వ్యాప్తికి కారణమయ్యే కీటకాలను సంహరించే మందును తయారుచేశారు. వివిధ ప్రాంతాల్లో ప్రయోగాలు విజయవంతం కావడంతో దానికి థ్రిప్ క్లియర్(తామర నాశిని) అని పేరుపెట్టారు. శ్రీజీపీ అవెన్స్ సాధించిన ఘనతపై అగ్రిహబ్ అధికారులు కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖకు నివేదిక పంపి.. 'నిధి సీడ్ సపోర్ట్ ప్రోగ్రామ్' కింద సాయం చేయాలని సిఫార్సు చేశారు. ఆ నివేదిక ఆధారంగా కేంద్రం ఆర్థిక సాయం నిధులు విడుదల చేసింది.

మే 12న తెలంగాణ ఎడ్‌సెట్

భీమారం, న్యూస్‌టుడే: టీజీ ఎడ్‌సెట్ షెడ్యూల్ ఖరారు చేసినట్లు ఎడ్‌సెట్ ఛైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి, కన్వీనర్ ఆచార్య వెంకట్రాంరెడ్డి తెలిపారు. సోమవారం వరంగల్‌లోని వర్సిటీ కామర్స్ విభాగ సెమినార్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో షెడ్యూల్ వివరాలను తెలియజేశారు. సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని.. ఏప్రిల్ 15 చివరి తేదీగా నిర్ణయించామని చెప్పారు. రూ.250 అపరాధ రుసుముతో ఏప్రిల్ 22 వరకు, రూ.1,000 అపరాధ రుసుముతో 30 వరకు స్వీకరిస్తామన్నారు. మే 8, 9 తేదీల్లో రూ.5 వేల అపరాధ రుసుముతో దరఖాస్తుకు ప్రత్యేక అవకాశాన్ని కల్పిస్తామన్నారు. 12న రెండు సెషన్లలో పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. మే 15న ప్రాథమిక కీ విడుదల చేస్తామని, 17 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. మే 30న ఫలితాలు ప్రకటిస్తామన్నారు. మరిన్ని వివరాలకు టీజీ ఎడ్‌సెట్-2026 వెబ్‌సైట్ చూడాలన్నారు.

ఈ పాఠశాలలో... రోజూ కొబ్బరి లడ్డూ ఘుమఘుమలు

తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఎల్కలపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు నిత్యం మధ్యాహ్న భోజనంతోపాటు ఒక కొబ్బరి లడ్డూను అందిస్తున్నారు. తక్కువ ఖర్చులో విద్యార్థులకు పోషకాహారం అందించాలనే లక్ష్యంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ ఈ ఆలోచన చేసి ఏడాదిన్నర నుంచి అమలు చేస్తున్నారు. ఇక్కడ ఎల్‌కేజీ నుంచి 7వ తరగతి వరకు 90 మంది విద్యార్థులు చదువుతున్నారు. రోజూ దాదాపు 90 లడ్డూల తయారీకి అవసరమైన కొబ్బరిని... రామగుండం ప్రాంతంలోని ఆలయాల నుంచి పాఠశాలకు వచ్చే సమయంలో ప్రధానోపాధ్యాయుడే సేకరించి తెస్తున్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు వాటితో లడ్డూలు తయారు చేస్తున్నారు. తయారీకి అవసరమైన బెల్లం, యాలకులు తదితరాలను ప్రధానోపాధ్యాయుడే సమకూరుస్తున్నారు. లడ్డూలు అందించలేని రోజుల్లో దాతలు, పాఠశాల ఉపాధ్యాయుల సహకారంతో అరటి పండ్లు అందిస్తున్నారు.

– న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం



క్రీడా అకాడమీలకు ప్రముఖుల పేర్లు

శాప్ బోర్డు సమావేశంలో నిర్ణయం



ఛైర్మన్ రవినాయుడు అధ్యక్షతన జరిగిన శాప్ బోర్డు సమావేశంలో ఎండీ భరణి, సభ్యులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటుచేస్తున్న క్రీడా అకాడమీలకు ప్రముఖుల పేర్లు పెట్టాలని శాప్ బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు విజయవాడ ఐజీఎంసీ స్టేడియంలోని శాప్ కార్యాలయంలో ఛైర్మన్ రవినాయుడు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. విశాఖలోని ఏపీ స్పోర్ట్స్ అకాడమీకి కోడి రామ్మూర్తి, కాకినాడలో అకాడమీకి నందమూరి తారకరామారావు, తిరుపతిలో అకాడమీకి కరణం మల్లీశ్వరి, గుంటూరులోని అకాడమీకి ఆచార్య నాగార్జున పేర్లు పెట్టనున్నారు. 2026 ఆసియా, కామన్వెల్త్ క్రీడలకు ఎంపికైన క్రీడాకారులకు ఉన్నతస్థాయి శిక్షణ, సహాయం అందించనున్నారు. రాష్ట్రంలోని కళాశాలల్లో పనిచేస్తున్న ఫిజియోథెరపిస్ట్‌ల సేవలను వాలంటరీ ప్రాతిపదిక జిల్లా క్రీడాప్రాధికార సంస్థల్లో వినియోగించుకోవాలని నిర్ణయించారు. సమావేశంలో శాప్ ఎండీ ఎస్.భరణి, సభ్యులు పాల్గొన్నారు.

వైకాపా మాజీ ఎమ్మెల్యే అండతో భూ కబ్జా

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: గత వైకాపా ప్రభుత్వంలో అప్పటి నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అండతో కొందరు వ్యక్తులు వారసత్వంగా తనకు సంక్రమించిన భూమిని ఆక్రమించారని ఏలూరు జిల్లా నూజివీడు మండలానికి చెందిన యండ్రపాటి రాంబాబు వాపోయారు. న్యాయం కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి మాజీ ఎంపీ, తెదేపా జాతీయ కార్యదర్శి కంభంపాటి రామ్మోహన్‌రావు వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. నకిలీ పత్రాలతో తన భూమిని కబ్జా చేయాలని చూస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలానికి చెందిన బిరిడి శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న వ్యక్తి తనను వేధిస్తూ.. కులం పేరుతో దూషిస్తున్నాడని కడప జిల్లా కొండాపురం మండలానికి చెందిన గొర్ల జయకర్ వాపోయారు.

రాజమహేంద్రవరం బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి: షర్మిల

ఈనాడు, అమరావతి: రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటనలో ఆసుపత్రుల్లో చేరిన ప్రజలకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. మృతుల కుటుంబాలను అన్నివిధాలా ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. 'కల్తీ పాల ఘటన తీవ్ర భయాందోళనలకు గురి చేసింది. పలువురు చనిపోవడం అత్యంత బాధాకరం. మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. ఘటనపై ఉన్నత స్థాయి కమిటీ నియమించి దర్యాప్తు చేయించాలి' అని షర్మిల డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీల డిమాండ్లను ప్రభుత్వం పరిశీలిస్తుంది


మహిళాశిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

ఈనాడు, అమరావతి: అంగన్‌వాడీ సంఘాల నేతలతో మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సోమవారం సచివాలయంలో భేటీ అయ్యారు. వారి సమస్యలను సావధానంగా విన్నారు. అంగన్‌వాడీల డిమాండ్లను ప్రభుత్వం సమగ్రంగా పరిశీలిస్తుందని తెలిపారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా మినీ నుంచి మెయిన్ అంగన్‌వాడీల పెంపు, 56 వేల మందికి ఉచితంగా మొబైల్ ఫోన్లు, ఎఫ్ఆర్ఎస్ సమస్య తగ్గింపు, ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లింపు తదితర హామీలను నెరవేర్చిందని ఆమె గుర్తుచేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు బేబీరాణి, ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ, వివిధ సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మార్చి 2న విజయవాడలో మహాధర్నాను విజయవంతం చేయాలి

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సంఘాల పిలుపు

ఈనాడు, అమరావతి: అంగన్‌వాడీల వేతనాల పెంపుపై ప్రభుత్వం నుంచి నిర్దిష్ట హామీ లభించనందున మార్చి 2న విజయవాడలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సంఘాలు పిలుపునిచ్చాయి. సోమవారం సచివాలయంలో మహిళాశిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సమక్షంలో జరిగిన చర్చల్లో నిర్దిష్టమైన హామీ లభించలేదని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు బేబీ రాణి, ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ, ఏఐటీయూసీ అనుబంధ సంఘం నేతలు లలిత, ప్రేమ ఓ ప్రకటనలో తెలిపారు.



బాగా నమిలి మింగితే ఎన్ని ప్రయోజనాలో

మనం తినే ఆహారం జీర్ణమయ్యే ప్రక్రియ నోటి నుంచే మొదలవుతుందని మీకు తెలుసా. అందుకే తినేటప్పుడు పదమందా ఆహారాన్ని బాగా నమిలి మింగాలి. ఇలా చేయడం వల్ల పలు ప్రయోజనాలు కూడా ఉన్నాయి. తిన్న ఆహారంలోని ఖనిజలవణాలను శరీరం బాగా శోషించుకుంటుంది. కడుపులో ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు తగ్గుతాయి. అంతేకాకుండా ఆకలి హార్మోన్ నియంత్రణకు దోహదపడుతుంది. పేగులపై ఒత్తిడి తగ్గుతుంది.

– రాబర్ట్ కెనడీ, కాలమిస్టు

ఇండో పసిఫిక్‌లో మన పాత్ర కీలకం

- తూర్పు నౌకాదళ ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ సంజయ్‌భల్లా



'డిఫెన్స్ ప్రొడక్షన్ పవరింగ్ ఇండస్ట్రియల్ గ్రోత్' నివేదికను విడుదల చేస్తున్న తూర్పు నౌకాదళ ప్రధానాధికారి (ఎఫ్ఓసీ–ఇన్–సీ ఈస్ట్) వైస్ అడ్మిరల్ సంజయ్‌భల్లా. చిత్రంలో రాజీవ్‌సింగ్, కమోడోర్ పి.ఆర్.హరి, జి.సతీష్‌రెడ్డి, కమాండర్ గౌతమ్‌నందా

విశాఖపట్నం (మధురవాడ, సాగర్‌నగర్), న్యూస్‌టుడే: దేశ భద్రతను సుస్థిరం చేసేందుకు ఇండో పసిఫిక్ ప్రాంతంలో మన శక్తి సామర్థ్యాల ప్రదర్శన ఎంతో ముఖ్యమని తూర్పు నౌకాదళ ప్రధానాధికారి (ఎఫ్ఓసీ-ఇన్-సీ ఈస్ట్) వైస్ అడ్మిరల్ సంజయ్‌భల్లా అన్నారు. సోమవారం విశాఖపట్నంలో ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'డిఫెన్స్ స్టార్టప్ అండ్ అటానమస్ సిస్టమ్స్ సమిట్'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వదేశీ ఉత్పత్తుల తయారీ.. రక్షణ రంగం ఆధునికీకరణకే కాకుండా దేశ వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తికి సైతం బాటలు వేస్తోంది. సాయుధ దళాలకు అవసరమైన సాంకేతికతను దేశీయంగా తయారు చేసుకోవడానికి ఇది సరైన సమయం. ఈ సదస్సు ద్వారా మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నా. నౌకాదళం అభివృద్ధిలో ఎంఎస్ఎంఈలు కీలకంగా మారాయి. ప్రస్తుతం మనం వినియోగిస్తున్న చాలా నౌకలు, ఇతర వ్యవస్థల రూపకల్పనలో ఎంఎస్ఎంఈలు పాలుపంచుకున్నాయి' అని వివరించారు. ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్, ఏపీ ప్రభుత్వ సలహాదారు, జాతీయ భద్రతా మండలి సభ్యుడు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ. . దేశ రక్షణ రంగ ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఏపీ ప్రభుత్వం నైపుణ్యతను వివరించారు. స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఐసీసీ డైరెక్టర్ జనరల్ రాజీవ్‌సింగ్ మాట్లాడుతూ.. 'ఆత్మనిర్భర్ భారత్' ద్వారా రక్షణ ఉత్పత్తుల తయారీ రంగంలో దేశీయ సామర్థ్యాన్ని పెంచడానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం 'డిఫెన్స్ ప్రొడక్షన్ పవరింగ్ ఇండస్ట్రియల్ గ్రోత్' పేరుతో రూపొందించిన నాలెడ్జ్ రిపోర్టును అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ లిమిటెడ్ (జీఆర్ఎస్ఈ) సీఎండీ, రక్షణ, ఏరోస్పేస్ అండ్ స్పేస్ ఐసీసీ నేషనల్ ఎక్స్‌పర్ట్ కమిటీ విశ్రాంత ఛైర్మన్ కమోడోర్ పి.ఆర్.హరి, రక్షణ, ఏరోస్పేస్ విభాగం ఐసీసీ జాతీయ కమిటీ కో-ఛైర్మన్ కమాండర్ గౌతమ్‌నందా తదితరులు పాల్గొన్నారు.

7.11 లక్షల నిస్తేజ ఖాతాల్లోని సొమ్ము వాపస్

- రూ.వెయ్యిలోపు నిల్వ ఉన్నవాటికే..
- ఈపీఎఫ్ఓ కీలక నిర్ణయం

దిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) తన వద్ద 7.11 లక్షల నిస్తేజ ఖాతాల్లో పోగుపడిన రూ.30.52 కోట్లను చందాదారులకు లేదా వారి వారసులకు తిరిగి ఇచ్చేయనుంది. చాలా కాలంగా నిర్వహణలో లేని ఈ ఖాతాల్లో సగటున రూ.వెయ్యి కన్నా తక్కువ మొత్తాల్లో నిల్వ ఉన్నాయి. ఈ మొత్తాలను ఖాతాదారులకు లేదా వారి వారసుల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయాలని సమీక్షా సమావేశంలో నిర్ణయించినట్లు కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించింది. చందాదారులు లేదా వారి వారసుల ఆధార్‌కు అనుసంధానమైన బ్యాంకు ఖాతాల్లో ఆయా మొత్తాలను జమ చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపింది. ఉద్యోగులు, యాజమాన్య సంస్థల నుంచి 36 నెలలకు పైగా విరాళాలు జమ కాని ఖాతాలను నిర్వహణలో లేనివిగా ఈపీఎఫ్ఓ పరిగణిస్తుంది. ఇలా నిస్తేజంగా 31.86 లక్షల ఖాతాలు ఉండగా వాటిలో పోగైన మొత్తం నిల్వలు రూ.10,903 కోట్లు. కాగా, వీటిల్లో 7.11 లక్షల నిస్తేజ ఖాతాల్లోని సొమ్మును ప్రస్తుతం బదిలీ చేయనుంది.

ఎస్సీ గురుకుల సొసైటీలో... కొత్తగా ఐదు ప్రొఫెషనల్ కళాశాలలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో కొత్తగా బీఈడీ, ఫార్మసీ కోర్సులతో ఐదు ప్రొఫెషనల్ కళాశాలలను ప్రారంభించే ప్రతిపాదనలు ఉన్నాయని ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. గురుకులాల కోసం టీజీ ఆన్‌లైన్ పేరిట సమగ్ర డిజిటల్ వేదికను అభివృద్ధి చేస్తున్నామన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగానే పాఠ్యపుస్తకాలు అందించేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. సొసైటీ పరిధిలోని 37 సీవోఈలు, 28 క్రీడా అకాడమీలు, మూడు ప్రత్యేక పాఠశాలల్ని బలోపేతం చేసి విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, ప్రత్యేక శిక్షణ వసతులు మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. "ఎస్సీ గురుకులాల్లో విద్యార్థుల అనారోగ్యం కారణంగా దీర్ఘకాల గైర్హాజరు తగ్గించేందుకు అవసరమైన వైద్య సహాయం అందిస్తాం. గురుకుల సెట్ ఫలితాలు మార్చి 9న విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాం. సొసైటీలో 268 గురుకులాలు ఉంటే 150 పాఠశాలలకు సొంత భవనాలున్నాయి. భవనాల్లో మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించనుంది" అని వివరించారు.

దళితులపై జరిగిన దాడులపై విచారణ కమిషన్ వేయాలి

తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో డాక్టర్ సుధాకర్‌ను వేధించి చంపడం మొదలు పులివెందులలో ఓ మహిళపై హత్యాచారం చేయడం వరకూ దళితుల మీద జరిగిన దమనకాండపై ఒక కమిషన్‌ను నియమించి విచారణ చేయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య కోరారు. వైకాపా అధినేత జగన్ మద్దతుతోనే ఆ పార్టీ ఎమ్మెల్సీ అనంతబాబు అరాచకాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యంను హత్య చేసి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన వ్యక్తికి మద్దతుగా నిలిచిన జగన్.. దళితులకు మేనమామ ఎలా అవుతారని ప్రశ్నించారు. ముమ్మాటికీ జగన్ దళిత ద్రోహినని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో వర్ల రామయ్య సోమవారం విలేకరులతో మాట్లాడారు. "సుబ్రహ్మణ్యం హత్య కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందని స్పష్టమవుతోంది. జగన్ హయాంలో దళితుల్ని ఊచకోత కోశారు.ఎస్సీ కమిషన్‌ను నిర్వీర్యం చేశారు'' అని వర్ల రామయ్య మండిపడ్డారు.

క్రీడల్లో డోపింగ్ కట్టడికి ఎన్ఎంసీ మార్గదర్శకాలు

ఈనాడు, అమరావతి: క్రీడల్లో డోపింగ్‌కు వీల్లేకుండా వైద్యులు అవగాహనతో ఉండాలని అన్ని వైద్య కళాశాలలు, బోధనాసుపత్రులకు జాతీయ వైద్యకమిషన్ (ఎన్ఎంసీ) సూచించింది. ఈ మేరకు దేశవ్యాప్తంగా వైద్యులకు కీలక సూచనలు చేస్తూ సోమవారం పబ్లిక్ నోటీసు జారీ చేసింది. వరల్డ్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (డబ్ల్యూఏడీఏ) నిషేధిత జాబితాపై అవగాహన పెంచేందుకు కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ రాసిన లేఖ ఆధారంగా ఈ మార్గదర్శకాలు ఇచ్చింది. నిషేధిత పదార్థాలున్న మందులను వైద్యపరంగా అత్యవసరమైతేనే ఇవ్వాలని, అలాంటి సందర్భాల్లో రికార్డులు పక్కాగా నిర్వహించాలని ఆదేశించింది. యాంటీ డోపింగ్ అంశాలపై వైద్యవిద్యలో ప్రాథమికంగా అవగాహన కల్పించాలని పేర్కొంది. క్రీడల్లో పారదర్శకత పెంపు, ఆటగాళ్ల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. వైద్యుల నిర్లక్ష్యం వల్ల డోపింగ్ కేసులు నమోదు కాకూడదని, డీన్లు, ప్రిన్సిపాళ్లు, రాష్ట్ర వైద్యమండలి రిజిస్ట్రార్లు ఈ మార్గదర్శకాలు పాటించాలని ఆదేశించింది.

ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా రెవెన్యూశాఖ పనిచేయాలి

మంత్రి అనగాని సత్యప్రసాద్

ఈనాడు, అమరావతి: ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా రెవెన్యూ శాఖ పనిచేయాలని ఆ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. సీసీఎల్ఏలో కొత్తగా నియమితులైన 31 మంది జూనియర్ అసిస్టెంట్లకు ఆయన నియామక పత్రాలు అందించారు. రెవెన్యూ వ్యవస్థ బలోపేతంలో భాగంగా సిబ్బంది లోటు లేకుండా చేస్తున్నామని 114 మంది డిప్యూటీ తహసీల్దార్ల నియామకం కూడా పూర్తిచేశామని వివరించారు. ఆర్థికంగా వెనకబడిన వారికి స్థలాల కేటాయింపు, పట్టాదారు పాసుపుస్తకాలు, ధ్రువీకరణ పత్రాల జారీ, ప్రాజెక్టులకు భూసేకరణ తదితర పనుల్లో నిజాయితీగా పనిచేయాలని కోరారు.

చట్టసభల సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్



జనసేన శాసనసభాపక్ష సమావేశంలో పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు సూచనలు చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

ఈనాడు, అమరావతి: 'క్షేత్రస్థాయి ప్రజా సమస్యలను మరింత బలంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేలా జనసేన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పని చేయాలి. సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ప్రసార మాధ్యమాల్లో మాట్లాడేటప్పుడు పూర్తి పరిజ్ఞానంతో మాట్లాడాలి' అని జనసేన రాజకీయ వ్యవహారాల (పీఏసీ) కమిటీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన జనసేన పార్టీ శాసనసభా పక్ష కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమయ్యారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తీరు, సభ్యులు అడుగుతున్న ప్రశ్నలు, పాల్గొంటున్న చర్చలు, చట్టసభల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. 'క్షేత్రస్థాయిలో అభివృద్ధిని, ప్రభుత్వ సంక్షేమాన్ని అందరికీ తెలియజేస్తూనే, కులాల మధ్య వైకాపా చిచ్చు పెడుతున్న కుట్రను కూడా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలి. విలువైన చట్టసభల సమయాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా ముందస్తు ప్రణాళికతో సభకు రావాలి' అని మనోహర్ పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలవుతుందని, ప్రతి ఒక్కరూ దీన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని, ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పార్టీ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని చెప్పారు.

పక్కా ప్రణాళికతో సభ్యత్వ నమోదు

జనసేన జెండా మోసే కార్యకర్తకు భరోసా కల్పించే ఉద్దేశంతో ఈ నెల 26 నుంచి ప్రారంభిస్తున్న జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి నియోజకవర్గంలో పక్కా ప్రణాళికతో చేపట్టాలని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. సభ్యత్వ నమోదు కోసం నియమించిన 25 పార్లమెంటు నియోజకవర్గాల సమన్వయకర్తలతో ఆయన సోమవారం సమావేశం అయ్యారు. పార్టీ సభ్యత్వం ఏటా పెరుగుతోందని, దిగువ మధ్యతరగతి యువత పార్టీ సభ్యత్వం తీసుకొని, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని చెప్పారు. గతం కంటే రెట్టింపు కొత్త సభ్యులను చేర్చాలని సూచించారు. శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ గతంలో ప్రతి నియోజకవర్గానికీ 25 మంది సాధక్‌లకే అవకాశం ఇచ్చేవాళ్లమని, ఈ సంఖ్యను 75 నుంచి 100 మందికి పెంచే ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. నాలుగో విడతలో 12.6 లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయని, ఇప్పుడు అంతకు మూడు రెట్లు పెరిగేలా అంతా కష్టపడాలని సూచించారు.

తెలంగాణలో ఆవిష్కరణలకు ఊతమిచ్చే సృజనాత్మక వ్యవస్థ

- ఆ రాష్ట్రమంత్రి శ్రీధర్‌బాబు



ది హార్ట్‌ఫోర్డ్ ఇండియా టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో సంస్థ ప్రతినిధులు

ఈనాడు, హైదరాబాద్: ఐటీ మాత్రమే కాకుండా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్, ఏరోస్పేస్, మాన్యుఫ్యాక్చరింగ్, ఫిన్‌టెక్, డీప్‌టెక్, రిటైల్ రంగాల్లోనూ హైదరాబాద్‌ను 'గ్లోబల్ వాల్యూ క్రియేషన్ హబ్'గా మార్చేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తెలంగాణ ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పునరుద్ఘాటించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతను 'రెడీ టూ వర్క్‌ఫోర్స్'గా తీర్చిదిద్దడం లక్ష్యంగా సర్కారు కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. తెలంగాణలో నూతన ఆవిష్కరణలకు ఊతమిచ్చే 'అంతర్జాతీయ సృజనాత్మక వ్యవస్థ' (గ్లోబల్ ఇన్నోవేషన్ ఎకోసిస్టం) అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో అంతర్జాతీయ బీమా దిగ్గజం 'ది హార్ట్‌ఫోర్డ్' సంస్థ 1.5 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో 1,200 మంది ఉద్యోగుల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన 'ది హార్ట్‌ఫోర్డ్ ఇండియా టెక్నాలజీ సెంటర్'ను మంత్రి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ''రెండు శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన హార్ట్‌ఫోర్డ్ సంస్థ అంతర్జాతీయ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌ను ఎంపిక చేసుకోవడం ఇక్కడి ప్రతిభకు, డిజిటల్ ఇంజినీరింగ్‌లో మన నాయకత్వానికి దక్కిన గుర్తింపుగా భావిస్తున్నాం. ఈ కేంద్రం ద్వారా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మరింత పెరుగుతుంది'' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో హార్ట్‌ఫోర్డ్ ప్రెసిడెంట్ మోరిస్ టూకర్, చీఫ్ మార్కెటింగ్ అండ్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ క్లైర్ బర్న్స్, సీఐవో శేఖర్ పన్నాల తదితరులు పాల్గొన్నారు.

రూ.550 కోట్ల సైబర్ మోసాల కేసులో కీలక నిందితుడు లొంగుబాటు?

సత్తుపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన భారీ సైబర్ మోసం కేసులో కీలక నిందితుడు సత్తుపల్లికి చెందిన ఉడతనేని వికాస్‌చౌదరి సోమవారం స్థానిక పోలీసులకు లొంగిపోయినట్లు తెలుస్తోంది. అతని కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో తప్పించుకు తిరుగుతున్న వికాస్‌చౌదరి ముందస్తు బెయిల్ కోసం చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో.. చివరకు లొంగిపోయినట్లు సమాచారం. వికాస్‌చౌదరి, సత్తుపల్లికే చెందిన మరో నలుగులు... అంతర్జాతీయ సైబర్ నేరస్థులతో చేతులు కలిపి మ్యాట్రిమోనీ, రివార్డు పాయింట్లు, షేర్ మార్కెట్లలో పెట్టుబడులు, బెట్టింగ్, గేమింగ్, క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ వంటి మోసాలకు పాల్పడి అమాయకుల నుంచి రూ.549.95 కోట్లు కొల్లగొట్టారు. దీనికి సంబంధించి గతంలో 24 మందిపై కేసు నమోదు కాగా 18 మందిని పోలీసులు పట్టుకుని రిమాండుకు తరలించారు. కీలక నిందితుడు వికాస్‌చౌదరి పోలీసుల కళ్లుగప్పి పరారీలో ఉండగా.. తాజాగా లొంగిపోయారు. ఈ అంశంపై కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ ఫోరేబి మాట్లాడుతూ.. దర్యాప్తు చేస్తున్నామని, త్వరలోనే పూర్తి వివరాలు మీడియాకు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

చిన్నారి శ్రీహర్షను ఆదుకుంటున్న దాతలు



రామకృష్ణకు నగదు అందిస్తున్న నాగబాబు

వైరా, న్యూస్‌టుడే: గుండె సమస్యతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఖమ్మం జిల్లా వైరా మండలానికి చెందిన మూడున్నరేళ్ల చిన్నారి శ్రీహర్షకు దాతలు చేయూతనిస్తున్నారు. 'చిన్నారికి పెద్ద కష్టం.. దాతలూ స్పందించండి' శీర్షికన ఈనాడులో శనివారం కథనం ప్రచురితం కాగా.. మూడు రోజుల్లో పలు ప్రాంతాలకు చెందిన దాతలు రూ.2.21 లక్షలను పంపించి మానవత్వం చాటుకున్నారు. బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బి.సాయి చిన్నారి తండ్రి కట్టా రామకృష్ణకు రూ.50 వేలు, ఇతరులు మరో రూ.30 వేలు పంపించారు.

రూ.లక్ష అందించిన ఎమ్మెల్సీ నాగబాబు: శ్రీహర్ష వైద్య ఖర్చులకు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఏపీ శాసనమండలి సభ్యుడు నాగబాబు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తన నివాసంలో చిన్నారి తండ్రి రామకృష్ణకు సోమవారం రూ.లక్ష అందించారు. వైద్య చికిత్సలపై ఆరా తీశారు. రామకృష్ణ జనసేన ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా ఉండటంతో పార్టీ తరఫున సాయం అందించారు.

సైబరాబాద్ ఇస్కాన్ ఆలయం ప్రారంభం మార్చి 8న

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లోని నల్లగండ్లలో ఇస్కాన్ సైబరాబాద్ దేవాలయాన్ని మార్చి 8న ప్రారంభిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. దీంతోపాటు లక్ష మందికి అన్నదానం చేసే మహా వంటశాలకు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాలకు హాజరు కావాలని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ప్రతినిధులు సోమవారం ఆహ్వాన పత్రిక అందజేశారు.

చివరి క్షణం వరకూ ప్రజాసేవలోనే ఎర్రన్నాయుడు

సీఎం చంద్రబాబు నివాళి

ఈనాడు, అమరావతి: చివరిక్షణం వరకూ ప్రజాసేవలోనే గడిపిన మహా నాయకుడు ఎర్రన్నాయుడని సీఎం చంద్రబాబు కొనియాడారు. ఎర్రన్నాయుడు జయంతి సందర్భంగా ఎక్స్ వేదికగా ఆయనకు నివాళి అర్పించారు. "నాకు అత్యంత ఆప్తుడు ఎర్రన్నాయుడు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, నాలుగుసార్లు ఎంపీగా, కేంద్రమంత్రిగా ఆయన చేసిన సేవలు మరువలేనివి" అని చంద్రబాబు పేర్కొన్నారు.

విలక్షణ నాయకుడు: మంత్రి నారా లోకేశ్

రాజకీయాల్లో విలక్షణ నాయకుడిగా ఎర్రన్నాయుడు పేరుగడించారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ఆయన అవిశ్రాంతంగా కృషిచేశారని ఎక్స్ వేదికగా కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా నివాళి అర్పించారు.

ఇరాన్‌లో ఉన్న ప్రవాసాంధ్రులు స్వస్థలాలకు చేరుకోవాలి

ఎన్ఆర్ఐ వ్యవహారాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఈనాడు, అమరావతి: ఇరాన్‌లో ప్రవాసాంధ్రులు ఎప్పటికప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీచేసే సూచనలను పాటించాలని ఎన్ఆర్ఐ వ్యవహారాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. అందుబాటులో ఉన్న ప్రయాణమార్గాల ద్వారా వీలైనంత త్వరగా ఇరాన్ నుంచి స్వస్థలాలకు చేరుకోవాలన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాస్‌పోర్టులు, ఐడీ కార్డులు, విలువైన ఇతర ఇమ్మిగ్రేషన్ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఇరాన్‌లో నిరసనలు జరిగే ప్రాంతాలకు దూరంగా ఉండాలని, అక్కడి భారత రాయబారి కార్యాలయంతో, ఏపీ ఎన్ఆర్‌టీతో సంప్రదింపులు చేయాలన్నారు. సాయం కోసం ఏపీఎన్ఆర్‌టీ సహాయ కేంద్రం నంబర్ +918500027678ను సంప్రదించాలన్నారు.

జీఎన్ఎం మెర్సీ ఛాన్స్ అభ్యర్థులకు.. మార్చి 9 నుంచి ఫైనల్ ఇయర్ పరీక్షలు

ఈనాడు, అమరావతి: జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ (జీఎన్ఎం) కోర్సులో మెర్సీ ఛాన్స్ అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మార్చి 9 నుంచి ఫైనల్ ఇయర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు జీఎన్ఎం బోర్డు ప్రకటించింది. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం ఈ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొంది. పరీక్ష రుసుము రూ.600 ఈ నెల 27లోగా చెల్లించాలి. రూ.100 అపరాధ రుసుముతో 28వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు. ప్రిన్సిపాళ్లు మార్చి 2 లోగా బోర్డుకు దరఖాస్తులు సమర్పించాలి. మార్చి 9న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మిడ్ వైఫరీ అండ్ గైనకాలజికల్ నర్సింగ్ పరీక్ష, 10న కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. 12 నుంచి 14వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు. పరీక్ష కేంద్రాలు, హాల్‌టికెట్ వివరాలను త్వరలో వెల్లడిస్తామని వైద్య విద్యా సంచాలకుడు డాక్టర్ జి.రఘునందన్ తెలిపారు.

వైకాపా ప్రయోజనాల కోసమే సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్

ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రయోజనాల కోసమే కల్తీనెయ్యి వ్యవహారంపై రాష్ట్రప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిటీకి వ్యతిరేకంగా మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి సుప్రీంకోర్టుకు వెళ్లారని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శించారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేయడం హర్షనీయమని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సిట్ నివేదిక ఆధారంగా వైకాపా ప్రభుత్వంలో నెయ్యి కొనుగోళ్లలో జరిగిన అవకతవకలు, అధికారుల బాధ్యతారాహిత్యాన్ని గుర్తించేందుకే ప్రభుత్వం ఏకసభ్య కమిటీని నియమించిందని స్పష్టం చేశారు.

గ్రామాల అభివృద్ధికి పట్టణాభివృద్ధి సంస్థల నిధులు

పురపాలకశాఖ నిర్ణయం

ఈనాడు, అమరావతి: పట్టణాభివృద్ధి సంస్థలు గ్రామాల్లో అనుమతుల కోసం వసూలుచేస్తున్న రుసుములు ఆయా గ్రామాల అభివృద్ధికి కేటాయించాలని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ నిర్ణయించింది. పంచాయతీలకు చెల్లించాల్సిన నిధులపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో అధికారులు చర్చించాక మరింత ముందుకెళ్లనున్నారు. పట్టణాభివృద్ధి సంస్థలు వసూలు చేస్తున్న రుసుములు గ్రామాల అభివృద్ధికి కేటాయింపుపై రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ ఆధ్వర్యంలో పురపాలక, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల అధికారులు సోమవారం సమావేశమయ్యారు. పట్టణాభివృద్ధి సంస్థలు గ్రామాల్లో లేఅట్లు, కొత్త నిర్మాణాలకు అనుమతుల కోసం ఏటా వసూలు చేస్తున్న రుసుములు ఎంత? వీటిని గ్రామాల అభివృద్ధికి కేటాయింపులు ఎలా? అనే దానిపై ప్రధానంగా పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్, కమిషనర్ సంపత్‌కుమార్, పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కృష్ణతేజ చర్చించారు. డిప్యూటీ సీఎంతో సమావేశం తరువాత దీనిపై మరింత స్పష్టత రానుంది.

ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలకు విద్యుత్ టారిఫ్ రాయితీ

మరో ఏడాది రాయితీల అమలుకు ప్రభుత్వం ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలకు విద్యుత్ టారిఫ్ ఛార్జీల (డిమాండ్ ఛార్జీలు) రాయితీ, విద్యుత్ సుంకంలో మినహాయింపును మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గతంలో అనుమతించినట్లు విద్యుత్ సుంకం యూనిట్‌కు 6 పైసలు, డిమాండ్ ఛార్జీల్లో 90% రాయితీ వెసులుబాటును మరో ఏడాది కొనసాగించాలని నిర్ణయించింది. గతంలో ఇచ్చిన ఉత్తర్వులు మేరకు రాయితీల వర్తింపు 2025 మార్చితో ముగిసింది. ఈ నేపథ్యంలో ఫెర్రో ఎల్లాయీస్ అసోసియేషన్ నుంచి అందిన వినతిపత్రాలను పరిశీలించి 2025-26 ఆర్థిక సంవత్సరానికీ అవే టారిఫ్ అమలుచేయాలని డిస్కంలను ప్రభుత్వం ఆదేశించింది.

'రైల్ పార్శిల్ యాప్'ను రూపొందించిన ద.మ.రైల్వే

ఈనాడు, హైదరాబాద్: వినియోగదారులకు సులభంగా ఇంటి వద్దకే పార్శిల్‌ను అందించడానికి దక్షిణ మధ్య రైల్వే 'రైల్ పార్శిల్ యాప్'ను రూపొందించింది. దేశ రైల్వేలో మొదటిసారి ఈ పైలట్ ప్రాజెక్టును హైదరాబాద్ డివిజన్‌లో అమలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ద.మ రైల్వే ఈ నెల 25న సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఆడిటోరియంలో 'రైల్ పార్శిల్ లాజిస్టిక్స్'పై ఒక సమావేశాన్ని నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి ద.మ. రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీ వాస్తవ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో 'రైల్ పార్శిల్ యాప్'ను అధికారికంగా ఆవిష్కరించనున్నారు. దీంతోపాటు ఫ్రైట్ లాజిస్టిక్స్ మార్కెట్‌ను అధ్యయనం చేయడానికి బెంగళూరు ఐఐఎంతో ఎంవోయూ చేసుకోనుంది.

గచ్చిబౌలిలో చదరపు గజం రూ.1.76 లక్షలు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో హౌసింగ్ బోర్డు భూములు మరోసారి అధిక ధరలు పలికాయి. గచ్చిబౌలి, బౌరంపేట, బాలాజీనగర్, చింతల్ తదితర ప్రాంతాల్లోని 14 భూములను విక్రయించడానికి ఈ నెల 9న నోటిఫికేషన్ విడుదల చేసిన అధికారులు.. సోమవారం కేపీహెచ్‌బీ హౌసింగ్ బోర్డు కమ్యూనిటీ హాల్‌లో వేలంపాట నిర్వహించారు. గచ్చిబౌలిలో 263 చదరపు గజాల విస్తీర్ణంలోని ప్లాటుకు చదరపు గజం రూ.50 వేల కనీస ధర నిర్ణయించగా.. రూ.1.76 లక్షలు పలికింది. కూకట్‌పల్లి బాలాజీనగర్‌లోని 266 చ.గజాల ప్లాటును రూ.1.64 లక్షలకు గజం చొప్పున కొనుగోలు చేశారు. చింతల్‌లో చ.గజం రూ.84 వేలు, రూ.74 వేల ధరలతో అమ్ముడుపోయినట్లు బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతం వెల్లడించారు. అలాగే నిజాంపేటలోని సిద్ధి ప్లాటుకు కనీస ధర రూ.15 లక్షలు నిర్ధారించగా వేలంలో రూ.17.7 లక్షలకు కొనుగోలు చేశారు. గచ్చిబౌలిలోని మరో ప్లాటు చ.గజం రూ.లక్ష పలికింది. బౌరంపేటలోని 2,600 చ.గజాల విస్తీర్ణంలోని భూమిని చ.గజం రూ.61 వేలతో అమ్ముడుపోయింది. మొత్తంగా ఈ వేలం ద్వారా రూ.34.27 కోట్ల మేర ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.